# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

## వార్షిక సంచిక-2007





ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామ యోధులకు జేజేలు

**1857**








**తెలంగాణా, నక్సల్బరి, శ్రీకాకుళం, తెభాగా, వర్లి**
**పోరాటాల వారసత్వాన్ని కొనసాగిద్దాం!**




# LIVING WITH NATURE

Dr M V Krishna Rao

# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

హిందుస్తాను మన దేశం
దీనికి మనమే విధాతలం
పవిత్రజాతి మా దేశం
స్వర్గం కంటే మహాప్రియం
సమస్త సంపద మాదేలే
హిందూస్తాను మనదేలే ||హిందూ||

దీని భాగ్యము శాంతి సౌఖ్యములు
వెలుగులు జిమ్మును జగమంతా
అతిప్రాచీనం ఎంతో ధాటి
దీనికి లేదుర ఇలలో సాటి ||హిందూ||

గంగా యమునలు పారు నిండుగ
మా నేలల్లో బంగరు పండగ
దిగువున పరుచుకు మైదానాలు
దిగ్గున ఎగిసే సంద్రపుటలలు
మంచు నిండిన ఎత్తు కొండలు
కావలి దండిగ మాకు అండగ ||హిందూ||

దూరం నుండి వచ్చిన దుష్టులు
చేసిరి కంతిరి మాయ చేష్టలు
జాతికి ఘనమౌ దేశాన్నంతా
దోచివేసిరి రెండు చేతులా ||హిందూ||

అమరవీరులు విసిరిన సవాలు
దేశవాసులు వినరండి
బానిస సంకెలు తెంపండి
నిప్పుల వానై కురవండి ||హిందూ||

హిందూ ముస్లిం సిక్కులందరం
ప్రియాతి ప్రియమౌ సోదరులం
ఇదిగిదిగో మన స్వతంత్ర జెండా
చేస్తాం సలాము గుండెలనిండా

**జాతీయ గీతం-1857**

– హిందీ,ఉర్దు మూలం: **అజీముల్లాఖాన్**

తెలుగు అనువాదం: **దివికుమార్**

(**1857** ప్రధమ భారత స్వతంత్ర సంగ్రామంలో ఒక ముఖ్య పాత్ర నిర్వహించిన నానాసాహెబ్ ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేసిన అజీముల్లాఖాన్(**1834–1859**) నడిపిన 'పయామ్ ఆజాది' అనే పత్రికలో ప్రచురించబడిన, అజీముల్లాఖాన్ రచించిన దేశభక్తి గీతం ఇది)

# వార్షిక సంచిక -2007

# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)
# వార్షిక సంచిక -2007

వెల: 30/-

ప్రతులకు:

**మైత్రి బుక్ హౌస్**

**జలీల్ వీధి**

**కార్ల్ మార్క్స్ రోడ్, విజయవాడ-2**

**రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)**

**ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్, కృష్ణలంక**

**విజయవాడ-10**



ప్రచురణ: కామ్రేడ్ ఎస్.ఝాన్సి, కామ్రేడ్ కె.కోటయ్య, అధ్యక్ష, కార్యదర్శులు, రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్), ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్, కృష్ణలంక, విజయవాడ-10

# విషయసూచిక


1. 2007 జనరల్ కౌన్సిల్ 7
   (1) రిపోర్టు
   (2) భూమి కేంద్రంగా రైతాంగ ఉద్యమాలు నిర్మించాలి. – కె.ఆర్.చౌదరి
   (3) గ్రామీణ పేదల కనుపాపలుగా నిర్దిష్ట కార్యాచరణ సాగాలి. – పి.జస్వంతరావు
   (4) 2005 జులై–2007 నవంబర్ కార్యక్రమాల సంక్షిప్త రిపోర్టు – ఎస్.ఝాన్సి
   (5) తీర్మానాలు
2. 2005 రాష్ట్ర జనరల్ కౌన్సిల్ రిపోర్టు 26
3. బ్రిటీష్ వలసవాద వ్యతిరేక పోరాటాలు – మేఘనాథ్ 27
4. వలస పాలన వ్యతిరేక పోరాటాలు–భూమి సమస్య – బి.డి.శర్మ 34
5. కోరన్న, మంగన్నలు అమరత్వం పొందిన 40 ఏళ్ళనాటి శ్రీకాకుళం – మేఘనాథ్ 37
6. కోరన్న, మంగన్నల 40వ వర్ధంతి సభ కరపత్రం 42
7. కోరన్న, మంగన్నల 40వ వర్ధంతి సభకు సందేశం – కానుసన్యాల్ 44
8. శ్రీకాకుళ పోరాటం గురించి రెండు పుస్తకాలు 45
9. అమరులకు నివాళులు 46
10. రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) ప్రచురణలు. 51
11. రైతుకూలీసంఘం కార్యక్రమాల ఫోటోలు 53
12. భూమి సమస్య:చారిత్రక ప్రాధాన్యతకల మూడు పోరాటాలు – ఎస్.ఝాన్సి 61
13. ఆహార సంక్షోభం–సామ్రాజ్యవాదుల కుతంత్రం – కె.ఆర్.చౌదరి 67
14. ఝార్ఖండ్ ఉనికి, సహజ సంపదలపై సామ్రాజ్యవాదుల దాడి – శంభూ మహతో 71
15. అమెరికా–భారతవ్యవసాయ విజ్ఞాన చౌరవ ఒప్పందం – పి.జస్వంతరావు 76
16. ప్రైవేటు రాజ్యాలుగా 'ప్రత్యేక ఆర్థిక మండళ్ళు' – జె.కిశోర్‌బాబు 79
17. దళితులపై పెచ్చుమీరుతున్న అగ్రకుల, భూస్వామ్య దాడులు – టి.రఘువీర్ 81
18. రైతుల భూములను కబళిస్తున్న కోస్తా కారిడార్ – జాలయ్య 86
19. రిటైల్ రంగంలో బహుళజాతి కంపెనీలు–రైతాంగ సంక్షోభం – బి.రఘు 89
20. చెరువులను మరమ్మత్తులు:ప్రపంచ బ్యాంకు షరతులు, రైతుల వెతలు – బి.సాంబశివరావు 91
21. 'సెజ్'లపై పంజాబ్‌లో రైతు సంపూర్ణ జాతీయ సదస్సు రిపోర్టు 95
22. పంచాయితీ ఎన్నికల సందర్భంగా రైతుకూలీసంఘం కరపత్రం 97
23. గల్ఫ్ బాధితుల సమస్యలపై కరపత్రం 100
24. విశాఖ ఏజన్సీలో బాక్సైట్ తవ్వకాలు, ఎందుకోసం? 103
25 గంగవరం మత్స్యకారుల ఆందోళన–రైతుకూలీసంఘం సంఘీభావం 105

# మా మాట

*గత మూడు సంవత్సరాల కాలంలో దేశంలో, రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలన్నింటిలోనూ-అభివృద్ధి పేరుతో పాలకుల వినాశకరమైన తిరోగమన విధానాలు వేగవంతమయ్యాయి.*

*ప్రత్యేక ఆర్థిక మండళ్ళ (సెజ్-2005) పేరుతో, వందలాది సెజ్‌లకు కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుమతులనిచ్చారు.*

*లక్షలాది ఎకరాల సాగుభూముల నుండి రైతులను గెంటివేసి, బహుళజాతి పరిశ్రమలకు, బడా పెట్టుబడిదార్లకు కట్టబెడుతున్నారు.*

*చిల్లర వర్తకంలోకి బడా ట్రాన్స్‌నేషనల్ సంస్థలను అనుమతించారు. చిల్లర వ్యాపారాన్ని, చిన్న వ్యాపారులను దివాళా తీయిస్తూ, కోట్లాదిమంది ఉపాధిని దెబ్బతీస్తున్నారు.*

*మొక్కజొన్న, చెరకు, వరి వంటి ఆహారపంటలనుపయోగించి 'జీవ ఇంధనం' తయారుచేస్తున్నారు.*

*సెజ్‌ల పేరుతో లక్షల ఎకరాల సేద్యపు భూములను లాక్కొని పడావు పెడ్తున్నారు.*

*ఆహార పంటల సాగును నిరుత్సాహపరుస్తూ, వాణిజ్య పంటలవైపు రైతాంగాన్ని బలవంతంగా మళ్ళిస్తున్నారు.*

*వాల్‌మార్ట్, రిలయన్స్ వంటి గుత్త వ్యాపారులు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ఆహారధాన్యాలన్నీ కొని నిల్వ చేసుకోవటానికి, కాంట్రాక్టు వ్యవసాయానికి, భవిష్య వాణిజ్యానికి అనుమతినిచ్చారు.*

*ప్రజావసరాల కోసం ఆహారధాన్యాలను కొని నిల్వచేసి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందజేయటాన్ని ఎత్తివేశారు. చీకటి బజారులను ప్రోత్సహిస్తున్నారు.*

*పెట్రోలు, డీజిల్ ధరలను అనూహ్యంగా పెంచుతూ తద్వారా రవాణా ఛార్జీల భారాన్ని ప్రజలపై పెద్ద ఎత్తున మోపుతున్నారు.*

*నిత్య జీవితావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నా, ఆహారకొరత పెనుసవాలుగా ముందుకొస్తున్నా తమ స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా ప్రజల ప్రయోజనాలను గాలికొదిలివేశారు.*

*దేశ సహజ సంపదల లూటీకి కావలసిన రవాణా మార్గాలను ప్రజాధనంతో అమర్చిపెడ్తున్నారు.*

*ఎనిమిది లైన్ల రహదారులు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, అధునాతన ఓడరేవులు నిర్మిస్తున్నారు. విదేశీదోపిడీకి రాస్తాగా, కోస్తా కారిడార్‌ను రూపొందించి, అమలు చేస్తూ ఇదంతా దేశాన్ని, ప్రజల్ని అభివృద్ధి చేయటానికేనని నిస్సిగ్గుగా చెప్తున్నారు.*

*విద్యుత్ అవసరాల ముసుగులో-మన దేశాన్ని అమెరికా యుద్ధ రథచక్రాలకు కట్టేసే అణు ఒప్పందానికై తహతహలాడుతున్నారు.*

*'వ్యవసాయ విజ్ఞాన చొరవ ఒప్పందం'తో అమెరికన్ అగ్రరాజ్యానికి వ్యవసాయరంగాన్ని దాసోహం చేస్తున్నారు.*

*గిరిజనుల చట్టాలను హక్కులన్నింటినీ కాలరాసి, విలువైన అటవీ సంపద, బాక్సైట్, ఇనుము వంటి ఖనిజ సంపదలను వెలికితీసి తరలించుకెళ్ళటానికి వరదగేట్లు తెరుస్తున్నారు.*

ప్రజాధనాన్ని పెట్టుబడిగా పెట్టి, పరిశోధన చేసి గ్యాస్, ఆయిల్ నిక్షేపాలు కనుగొన్నాక, ఆ ఫలితాలను కారుచౌకగా రిలయన్స్ వంటి సంస్థలకు కట్టబెడ్తున్నారు.
ప్రజాకర్షక పథకాలు, చిట్కాలతో, ప్రజలను జోకొట్టచూస్తున్నారు. ప్రజాస్వామిక సెక్షన్ల మధ్య తగువులు పెడుతూ పెంచుతున్నారు.
ఛిద్రమౌతున్న గ్రామీణ జీవనం, భూపరాయికరణ, వలసలు, రైతుల ఆత్మహత్యలు.... పెరుగుతున్న రైతాంగసంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

దేశాన్ని సామ్రాజ్యవాదులకు అమ్మివేస్తూ, దేశ ప్రయోజనాలన్నీ కాలరాస్తున్న దళారీ పాలకుల దుర్మార్గ విధానాలే ఈ సంక్షోభానికి కారణం. ఫలితంగా రైతాంగం, కార్మికులు, గిరిజనులు, దళితులు, మహిళలు, మైనారిటీలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులుసమస్త జీవన రంగాల ప్రజానీకం తమ జీవన సమస్యల పరిష్కారం కోసం, పాలకుల జిమ్మిక్కులను, విభజించి పాలించే కుట్రలను అధిగమించి ఆందోళన పోరాటాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ పోలీసు యంత్రాంగంతో తలపడ్తున్నారు. పోరాడుతున్న ప్రజలను అతి నిరంకుశంగా అణచివేసైనా, తమ దళారీ విధానాల్ని ముందుకు తీసుకుపోవాలనే నిర్ణయాన్ని గంగవరం, కళింగనగర్, నందిగ్రామ్, సింగూరు, నమూనాలతో ప్రభుత్వాలు తేల్చి చెప్పాయి.
ఈ నేపథ్యంలో-రైతాంగం, కార్మికవర్గం, ఇతర పీడిత వర్గాలతో కలిసి తమ పోరాటాన్ని మరింత సంఘటితంగా, సమరశీలంగా సాగించాలి.

భూమి సమస్య మరింత ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ నేపథ్యంలో సెజ్‌లకు, కారిడార్‌లకు వ్యతిరేకంగా సాగించే పోరాటాలను-సామ్రాజ్యవాదులకూ; సామ్రాజ్యవాదులకు సాంఘిక పునాదిగా వున్న భూస్వాములకూ; సామ్రాజ్యవాదులతో అంటకాగుతున్న బడాపెట్టుబడిదార్లకూ వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక విప్లవం దిశగా ఎక్కుపెట్టాలి. 150 సం॥ల ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామ స్ఫూర్తిని అందుకోవాలి. శ్రీకాకుళం, నగ్జల్బరి, వర్లి, తెభాగా, పోరాటాల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి.

xxx xxx xxx

2001, 2005లలో రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభల సావనీర్‌లుగానూ; 2002, 2003లలో వార్షిక సంచికలుగానూ తీసుకువచ్చాం. 2008 ప్రారంభంలో రావలసిన ఈ సంచిక తేవటంలో అనివార్యమైన జాప్యం జరిగింది. గత సంచికలవలెనే రైతాంగం, ప్రజానీకం మధ్య విస్తృత ప్రచారానికీ; సభ్యులు, కార్యకర్తలు, ప్రజాతంత్రవాదుల అధ్యయనానికి ఆచరణకు, ఈ సంచికను వినియోగించుకుంటారని రాష్ట్ర కార్యవర్గం ఆశిస్తున్నది.
ఈ సంచికకు విలువైన, విజ్ఞానదాయకమైన వ్యాసాలనందించినవారికి, డి.టి.పి., ముద్రణలలో తోడ్పడిన సహచరులకు, కార్మిక మిత్రులకు, రాష్ట్ర కార్యవర్గం కృతజ్ఞతలు తెలియచేస్తున్నది- ఈ వార్షిక సంచికలో అనేకమంది కవుల కవితలను; చిత్రకారుల కార్టూన్లను, చిత్రాలను, వివిధ మ్యాగజైన్‌లలోని ఫోటోలను ముద్రించాం. ఆ సాహితీ, కళాకారుల మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

**రాష్ట్ర కార్యవర్గం**

విజయవాడ

**20.7.2008**

**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**

# ప్రతిజ్ఞ

- శ్రీశ్రీ

పొలాలనన్నీ,
హలాల దున్నీ,
ఇలా తలంలో హేమం పిండగ-
జగానికంతా సౌఖ్యం నిండగ-
విరామమెరుగక పరిశ్రమించే,
బలం ధరిత్రికి బలికావించే,
కర్షకవీరుల కాయంనిండా
కాలువకట్టే ఘర్మజలానికి,
ఘర్మజలానికి,
ధర్మ జలానికి,
ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్!

నరాల బిగువూ,
కరాల సత్తువ
వరాలవర్షం కురిపించాలని,
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని-
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ,
పరిప్లవిస్తూ,
ధనికస్వామికి దాస్యం చేసే,
యంత్రభూతముల కోరలు తోమే
కార్మికధీరుల కన్నులనిండా
కణకణమండే,
గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్!
నిరపరాధులై దురదృష్టంచే
చెరసాలలలో చిక్కేవాళ్ళూ-
లోహ రాక్షసుల, పదఘట్టనచే
కొనప్రాణంతో కనలేవాళ్ళూ-
కష్టం చాలక కడుపుమంటచే
తెగించి సమ్మెలు కట్టేవాళ్ళూ-
శ్రమ నిష్ఫలమై, జని నిష్ఠురమై,
నూతిని గోతిని వెదకేవాళ్ళూ-
అనేకులింకా అభాగ్యులంతా,
అనాథులంతా,
అశాంతులంతా,
దీర్ఘశ్రుతిలో, తీవ్రధ్వనితో
విప్లవశంఖం వినిపిస్తారోయ్!

# విజయవంతంగా జరిగిన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర జనరల్ కౌన్సిల్

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ 20.11.07న ఏలూరులో విజయవంతంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 300 మంది ప్రతినిధులు హాజరైన జనరల్ కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ డి.వర్మ, మందా జార్జి, ఇల్లా రామిరెడ్డి అధ్యక్షత వహించారు.

జనరల్ కౌన్సిల్‌లో మొదటగా ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ (అ)విశ్రాంత ఆచార్యులు కె.ఆర్.చౌదరి ప్రారంభో పన్యాసం చేశారు.

తర్వాత 'జనశక్తి' ఎడిటర్ కామ్రేడ్ పి.జస్వంతరావు ఉపన్యసించారు. (ఈ రెండు ప్రసంగ పాఠాలను విడిగా అందిస్తున్నాం)

మార్పిడి మాత్రమే-స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యమనేదంతా దగా! 1991 నుండి గ్లోబలైజేషన్‌వల్ల అన్ని రాష్ట్రాల్లో రైతాంగం దారుణ పరిస్థితులలోకి నెట్టబడ్డారు. పైరుపచ్చ విప్లవంతో రైతాంగం అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకున్నారు -ఆధునిక యంత్రాలు కూలీల బతుకుల్ని దుర్భరం చేస్తున్నాయి. మహారాష్ట్రలో కూడా ప్రత్యేక ఆర్థికమండళ్ళ పేరుతో రైతుల భూములు లాక్కుంటున్నప్పుడు -వాటికి వ్యతిరేక ఆందోళన, ప్రచార కృషిసాగిస్తున్నాము- తెలంగాణా, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట అనుభవాలతో-తమ ప్రాంతంలో కూడా రైతాంగ ఉద్యమాల్ని నిర్మిస్తామంటూ కా॥బాబూరావు తన సందేశాన్ని ముగించారు.




వేదికపై ఎడమ నుంచి కామ్రేడ్స్ జె.కిశోర్‌బాబు, కె.కోటయ్య, పి.జస్వంతరావు, డి.వర్మ, ఇల్లా రామిరెడ్డి, మందా జార్జి, కె.ఆర్.చౌదరి, ఎస్.ఝాన్సి

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎస్.ఝాన్సి 2005 జూన్ రాష్ట్ర మహాసభల నుండి2007 నవంబర్ జనరల్ కౌన్సిల్ వరకు రాష్ట్ర వ్యాపితంగా నిర్వహించిన కార్య క్రమాల్ని సమీక్షించారు. (కార్య క్రమాల రిపోర్టు సారాంశాన్ని విడిగా అందిస్తున్నాం) ప్రతి నిధులు సూచనలతో- కార్యక్రమాల నివేదికను ఆమోదించారు.

ధర్మాబాద్ (మహారాష్ట్ర) నుండి జనరల్ కౌన్సిల్‌కు హాజరైన ప్రతినిధిబృందం తరఫున కా॥బాబూరావ్ మాట్లాడుతూ- తామంతా రైతుకూలీసంఘంగా పనిచేస్తున్నామని చెప్పారు. '1947 అధికార

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కన్వీనర్ కామ్రేడ్ జి.విజయకుమార్ 'కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ఆవశ్యకతను నొక్కి చెపుతూ- జనరల్ కౌన్సిల్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ పంపించిన సందేశాన్ని రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ కిషోర్‌బాబు చదివి వినిపించారు.

## రైతుకూలీలతో యువతరం భుజం భుజం కలపాలి:

ఎన్.వై.యస్. రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బాషా తన సందేశంలో-పాలకవర్గ విధానాల ఫలితంగా సంపదలు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం అవుతున్నాయన్నారు. పోరాటం మినహా


ఎస్.కె.బాషా

ప్రజలకు మరో మార్గం లేదనీ, పాలకవర్గాల భ్రమల నుండి బయటపడి అన్ని వర్గాల ప్రజలు పోరాటాలలోకి వస్తున్నారనీ, నవ యువ సమాఖ్య ఈ పోరాటాలలో భాగస్వామి అవుతుందనీ కా॥ బాషా అన్నారు. ప్రభుత్వం యువతరానికి పని కల్పించకుండా, వారిని ప్రక్కదోవ పట్టిస్తున్నదని, యువతను సరైన మార్గంలో నడిపేందుకు, సరైన యువజనోద్యమ నిర్మాణానికి యన్.వై.ఎస్. కృషి చేస్తుందని చెప్తూ–కామ్రేడ్ బాషా ముగించారు.

**గ్రామీణ ఉద్యమాలతో విద్యార్థులు మమేకం కావాలి:**

పి.డి.ఎస్.ఓ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె.అజిత తన సందేశంలో– విద్యారంగం కూడా సంక్షోభంలో వుందనీ, నేటి విద్యా వ్యవస్థ ఈనాటి దేశ, ప్రజల అవసరాలను తీర్చగలిగేదిగా లేదనీ, జీవ ఇంధన రంగంలో కోర్సులు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కనుగుణంగా రూపొందించబడ్తున్నాయని, ఈ విధమైన అస్వతంత్ర విద్య స్థానంలో, స్వతంత్ర, ప్రజాతంత్ర విద్యావిధానం కోసం పిడిఎస్ఓ పోరాడుతున్నదని చెప్పారు. సమాజంలో ప్రధాన ఉత్పత్తి రంగాలైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సంక్షోభం పరిష్కరింపబడితేనే విద్యారంగ సంక్షోభం కూడా పరిష్కారమౌతుందనే అవగాహనతో పి.డి.ఎస్.ఓ–రైతాంగ గ్రామీణ ఉద్యమాలతో భుజం భుజం కలిపి నడుస్తుందని కామ్రేడ్ అజిత పేర్కొన్నారు.


కె.అజిత

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె.కోటయ్య మాట్లాడుతూ, 'తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట పంథాను బి.టి.రణదివే పంథా దెబ్బకొట్టింది. శ్రీకాకుళం, నక్సల్బరీ, గోపివల్లభపూర్, ముషాహరి పోరాటాలను 'చారు' అతివాద పంథా దెబ్బతీసింది. ప్రజల్ని తక్షణ, దీర్ఘకాలిక సమస్యలపై ప్రజావిప్లవ పంథాలో కాకుండా అనేక అతి, మితవాదాలతో పని చేస్తున్న సంఘాలు మన మధ్యలో ఉన్నాయి. సమస్యల ప్రాతిపదికపై, కలిసి వచ్చే సంఘాలతో ఐక్యకార్యాచరణ సాగించుదాం– విద్యార్థి, యువజన, మహిళా, బాల సంఘాల నిర్మాణానికి దోహద పడదాం. గ్రామ స్థాయిలో గ్రామకమిటీల నుండి– మండల, జిల్లా కమిటీలు నిర్మాణమై, పనిచేయాలి. రాష్ట్ర కేంద్రం నుండి వెలువరించే సాహిత్యం– కరపత్రాలు, పత్రికలు, బుక్‌లెట్సు, సావనీర్లను– సమిష్టి అధ్యయనం చేయటం ద్వారా గ్రామకమిటీలు శక్తివంతంగా పనిచేయగల్గుతాయి– సంఘ ప్రణాళికను నిరంతరం దృష్టిలో ఉంచుకొని కర్తవ్యాలకు అంకితం కావాలని' కామ్రేడ్ కోటయ్య పిలుపు నిచ్చారు.



రైతుకూలీ సంఘం కార్యవర్గంలోకి ఆహ్వానితులుగా–కామ్రేడ్ ఊయక ముత్యాలు (విజయనగరం), కామ్రేడ్ తిమ్మారెడ్డి (అనంతపురం), కామ్రేడ్ ఎస్.లక్ష్మారెడ్డి (గుంటూరు), కామ్రేడ్ టి.అరుణ (శ్రీకాకుళం)లను జనరల్ కౌన్సిల్ హర్షధ్వానాలతో ఆమోదించింది.

రాష్ట్ర కార్యవర్గం తరఫున రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిధ రైతు, కూలీ, ప్రజా సమస్యలపై ప్రవేశపెట్టిన తీర్మానాలను జనరల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. (తీర్మానాల పూర్తి పాఠం విడిగా అందిస్తున్నాం).

జనరల్ కౌన్సిల్‌కు హాజరై విలువైన ఉపన్యాసాలనిచ్చిన ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, వి.జన్వంతరావులకు; సాంస్కృతిక బృందానికి, నిర్వహణ ఏర్పాట్ల బాధ్యత నిర్వహించిన ఉభయగోదావరి జిల్లాల కార్యవర్గాలకి, ప్రతినిధులకు–రాష్ట్ర కార్యవర్గం తరఫున కామ్రేడ్ జె.కిషోర్‌బాబు ధన్యవాదాలు తెలియజేసిన అనంతరం అంతర్జాతీయ శ్రామికగీతంతో జనరల్ కౌన్సిల్ సమావేశాలు ముగిశాయి.

"కొందరు మేమే నాయకులమని
ముందుకొస్తారు,
అదును చూసుకొని వెనక్కు మళ్ళి,
వెన్నుపోటు పొడుస్తారు.
మాటల చాటున దాగిన
మచ్చల చర్మాన్ని చూడ్డం నేర్చుకోండి,
నిజమైన ఒక నాయకుడు
నిరంతరం మనల్ని చెయివీడని వాడు
నిశ్చయంగా వస్తాడు,
రైలుపట్టాల లాగ తిన్నగా
అన్నంలాగ నిరాడంబరంగా
అన్నివేళలా కష్టానికీ సుఖానికీ
మనతోనే నిలిచేవాడు."

**- మయకోవ్‌స్కీ 'లెనిన్' కావ్యం నుండి**
**అనువాదం: శ్రీశ్రీ**

# భూమి కేంద్రంగా రైతాంగ ఉద్యమాలు నిర్మించాలి!

## (2007 నవంబర్ జనరల్ కౌన్సిల్‌లో ప్రసంగ సంక్షిప్త పాఠం)

ప్రొఫెసర్. కె.ఆర్.చౌదరి



గత 15, 16 సంవత్సరాల నుండి రైతుకూలీసంఘం సమావేశాల్లో పాల్గొంటు న్నాను. ఈ సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సంఘ నాయకత్వం నిర్వ హిస్తున్న కార్యక్రమాలు, ఉపన్యాసాలతో నేను కొత్త ఉత్తేజాన్ని పొందుతున్నాను. మీ నుండి కొత్త విషయాలు తెలుసుకోవడమే కాకుండా స్ఫూర్తిని పొందుతున్నాను.

జనరల్ కౌన్సిల్ సందర్భంగా వేసిన కరపత్రం సమగ్రంగా, విశ్లేషణాత్మకంగా ఉంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని నేను మాట్లాడుతాను.

ఈనాడు వరికి 1000 రూపాయలు గిట్టుబాటు ధర కావాలని వేరు వేరు ఉద్దే శాలతో డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ న్యాయమైంది. పంట మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం రైతుల ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయిస్తుంది. ఉత్పత్తి ఖర్చులు సేకరించటం లోనే లోపాలున్నాయి. కేవలం 400 మంది రైతుల ఖర్చులు మాత్రమే తీసు కొంటున్నారు. ఎకరాకు ఎంత ఖర్చు అవు తుంది? వ్యవసాయ యూనివర్శిటీ వాళ్ళ లెఖ్ఖలు ఎలా వున్నాయి? నేను 39 ఏళ్ళ క్రితం ఇక్కడ పనిచేశాను. రైతుల జమా ఖర్చులు ఏమిటి అనేది పరిశీలించాను. యూనివర్శిటీ లెఖ్ఖలు చాలా తప్పుగా ఉన్నాయి. రైతుకు 12 వేలు ఖర్చు అవుతుంటే వాళ్ళు 7, 8 వేలు మాత్రమే ఖర్చు చూపిస్తున్నారు.

దేశాన్ని ఒకే యూనిట్‌గా తీసుకొని మద్దతుధర నిర్ణయిస్తారు. ఖర్చులు, దిగుబడులు తేడాగా వున్నాయి. మన రాష్ట్రంలో ఉత్పత్తి ఖర్చులు చాలా ఎక్కువగా వున్నాయి. గత సంవత్సరం లెక్కల వివరాలు తీసుకొని రాబోయే సంవత్సరం మద్దతుధర నిర్ణయిస్తారు. ఇది శాస్త్రీయ బద్ధంకాదు.

రైతు నగదుగా పెట్టే ఖర్చు, కేటాయించే శ్రమ, కౌలు రేటు, వేతనాలు గణిస్తారు. కానీ కలపనివి వున్నాయి. అవి ఎరువులు, పురుగుమందులు, మేనేజిమెంట్‌కు కలపటం లేదు. ప్రకృతి వైపరీత్యాల నష్టాన్ని, రవాణా ఖర్చులని కూడా కలపాలని డిమాండ్ చేస్తున్నా పరిగణలోకి తీసుకోవటం లేదు. రూ.675 మద్దతు ధర ఏమాత్రం సరిపోదు. ఈ మధ్య విపరీతంగా ధరలు పెరిగి పోతున్నాయి. కనీస మద్దతు ధర మాత్రం పెరగటం లేదు.

గోధుమకు 1000/- ఇస్తే మనకు అభ్యంతరం ఏమీ లేదు. వరిలో తరుగు ఎక్కువగా వుంది అంటున్నారు. అది సరికాదు. వరి నుండి వచ్చే తవుడు, నూనె మొదలగు వాటిని పరిగణలోకి తీసుకోవటం లేదు. వరికి ఎక్కువ ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు. వరికీ, గోధుమకూ పోలిక సరికాదు.

బియ్యం రేటు పెరుగుతుంది కాబట్టి మద్దతు ధర పెంచవద్దు అనేది మరొక వాదన. ఇప్పుడు వరిధాన్యం రేటుకు బియ్యం ధరకు పొంతనేలేదు. ధాన్యం మద్దతు ధర పెరిగితే, 5 రూ. వరకు బియ్యం ధర పెరగవచ్చు. కానీ మద్దతు ధర పెంచకపోతే కిలో బియ్యం 70, 80 రూపాయలు అవుతుంది. మద్దతు ధర లభించనప్పుడు పంట గిట్టుబాటు కాక క్రమంగా ప్రస్తుతం వున్న వరి పంట విస్తీర్ణం, ఉత్పత్తి తగ్గుతుంది. అప్పుడు రేటు మరింతగా పెరుగుతుంది.

1) మీరు వరికి ఎందుకు మద్దతు ధర సాధించుకోలేరు?
2) కేంద్ర ప్రభుత్వ ధరకు మించి రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా సబ్సిడీ ఇస్తు న్నాయి. మీరు ఎందుకు చేయరు?
3) వ్యవసాయ ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు ఎందుకు చేయలేదు?' అని సిఎంను కలిసి మేము ఈ ప్రశ్నలు వేశాము. సరైన సమాధానం లేదు.

ఒక కేజి వరి ఉత్పత్తి ఖర్చు 8.54 పై. అయితే, మద్దతు ధర 5.80 ఇస్తే రైతుకు నికరంగా వచ్చేది రూ.4.00 మాత్రమే. మొక్క జొన్న ఉత్పత్తి ఖర్చు 4.94 పై కాగా, రైతుకు 4.00 అందు తుంది.

అనేక పంటలకు మద్దతు ధర తక్కువగా ఉంది. కనీస మద్దతు ధర ప్రకటించినంత మాత్రాన ఉపయోగంలేదు. దానిని అమలు లోకి తేవాలి. మార్కెట్ దోపిడీ సాగుతున్నది. మధ్య దళారులకు పాలకులు వత్తాసు పలుకు తున్నారు. 40 శాతం మిల్లర్లు, రిటైలర్లు, హోల్ సేలర్లు, దళార్లు తింటున్నారు. 82 శాతం సన్నకారు, చిన్నకారు రైతులు వున్నారు. కోతలు అయిన వెంటనే అమ్ము కొంటే 20-75% నష్టపోతున్నారు.

రైతుబంధు పథకం ఉన్నది గదా అని ప్రభుత్వం అంటున్నది. దీన్నుండి ఎక్కడా ఉపయోగం లేదు. అనేక కారణాల వల్ల అప్పుల ఊబిలో (82.5%) మునిగి పోయారు. ఆంధ్ర రైతులు అప్పుల్లో (నేషనల్ శాంపుల్ సర్వే) ముందున్నారు. ఎకరాకు ఆంధ్రప్రదేశ్ రైతు 12 వేలు ఖర్చు పెడ్తున్నాడు. దీన్నుండి 9 వేల రూపాయలు మాత్రమే తిరిగి పొందుతున్నాడు. 3 వేల రూపాయలు ప్రతి రైతు ఒక్కో ఎకరాకు నష్ట పోతున్నాడు.

(ఒక కుటుంబానికి 28,600 ఖర్చు అవుతుంది. ఆదాయం -19,600 ఉంది. ప్రతి కుటుంబం 9 వేల రూపాయలు పైగా లోటులో నడుస్తున్నది.)

మన రైతాంగం మెరుగైన జీవితాన్ని ఏ విధంగా పొందగలుగుతారు? ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, డీలర్ల నుండి 75% రుణం తీసుకొంటున్నారు. ప్రభుత్వ రుణాలు 25% మాత్రమే పొందుతున్నారు. వడ్డీలు-చక్రవడ్డీలను 100-120% వడ్డీ వ్యాపారులు గుంజుతున్నారు. ముందుగా పెట్టుబడిపెట్టి, దిగుబడి వచ్చిన తర్వాత తక్కువ రేటుకు కొంటున్నారు.

భీమవరం-గింటి సత్యనారాయణ (రైతు) వడ్డీ వ్యాపారి నుండి 2 లక్షల 10 వేల రూపాయలు అప్పు చేశాడు. వడ్డీ క్రింద 1,17,500 చెల్లించాల్సిందేనని ఆ వ్యాపారి పట్టుబట్టాడు.

అడపా సత్యనారాయణ అనే మరో రైతు 10 వేలు అప్పు తీసుకున్నందుకు వెట్టి చేస్తున్నాడు. హెల్ప్‌లైన్, హెల్ప్‌లెస్‌గా మారింది. సంస్థాగత రుణాలు 15 వేల కోట్లు ఇస్తున్నట్లుగా చెప్తున్నారు. కానీ కనీసంగా 45 వేల కోట్లు రుణాలు ఇవ్వాల్సి వుంది. సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యతలో అప్పులివ్వాలి.

రైతు రుణవిముక్తికి ప్రభుత్వం చేపట్టే చర్యలు ఏమిటి అని ముఖ్యమంత్రిని అడిగాము. దానికీ ఆయన సమాధానం ఇవ్వలేదు.

నాసిరకం విత్తనాలు కారణంగా 60 శాతం రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. విత్తనాల పై ప్రభుత్వానికి ఏమాత్రం నియంత్రణ లేదు. వ్యవసాయం కార్పోరేట్ కంపెనీల చేతుల్లోకి పోయింది. అన్నీ కొనాల్సిందే. అంతా మార్కెట్ శక్తులపైనే ఆధారపడింది.

అడవులు, నీరు, భూమి స్థానికులకే చెందాలి. కానీ ఇవన్నీ బహుళజాతి కంపెనీల చేతుల్లోకి పోతున్నాయి. జీవ ఇంధనాలు తీయాలనేది అమెరికా, ప్రపంచ బ్యాంకు ఆదేశం. తృతీయ ప్రపంచ దేశాల్లో ప్రయోగాలు చేస్తున్నారు.

ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో రైతాంగాన్ని దివాళా తీయిస్తున్నారు. సెజ్‌ల వలన చాలా చాలా ఉపయోగాలున్నాయి అని మోసం చేస్తున్నారు. ఉపాధి సౌకర్యాలు పెరగవు. 25, 30 వేల ఎకరాలు ఒక్కో సెజ్ పేర సేకరిస్తున్నారు. దీంతో రైతుల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. కాకినాడలో సెజ్ కోసం సేకరిస్తున్నదంతా వ్యవసాయ భూమే. వ్యవసాయ భూములను పరిశ్రమలకు అప్పగిస్తున్నారు. ఇది ఆహార కొరతకు దారితీస్తుందని స్వామినాథన్ చెప్పారు. పేద ప్రజలు ఆకలికి మలమలమాడిపోవలసి వస్తుంది. సెజ్‌లు పారిశ్రామికవేత్తల కొరకు మాత్రమే. పన్నుల మినహాయింపు ఇస్తున్నారు వీరికి. ఎవరైతే పన్నులు కట్టగలరో వారికి 22 రకాల మినహాయింపు ఇచ్చారు. 2010 నాటికి ఒక లక్షా 85 వేల కోట్ల పన్ను మినహాయింపు అవుతుంది. ఈ ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో కార్మిక చట్టాలు అమలు కావు. పర్యావరణ చట్టాలు కూడా అక్కడ అమలులోకి రావు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో 25 శాతం పరిశ్రమకోసం, 75 శాతం రియల్ ఎస్టేట్‌గా ఉపయోగించుకోవటానికి కేటాయిస్తున్నారు. సెజ్‌ల వలన అంతరాలు పెరుగుతున్నాయి. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు మూతపడతాయి. ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు పెరుగుతాయి. దేశ సంపదను బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి కంపెనీలకు కట్టబెడుతున్నారు. రెండున్నర ఎకరాలకు 50 వేలు రైతుకు ఇచ్చి 10 కోట్లు దీనిపై పొందారు. ప్రభుత్వమే బడా బ్రోకర్‌గా మారి పోయింది.

భూమి చాలా ముఖ్యమైంది. మిగులు, బంజరు భూముల పంపకం జరగాలి. భూకేంద్రంగా పోరాటాలు నడవాలి. కా॥ తరిమెల నాగిరెడ్డి ఆ విధమైన ఉద్యమాలు నిర్వహించాడు. నూతన ప్రజాస్వామిక విప్లవానికనుగుణంగా 'దున్నేవానికే భూమి' పై కేంద్రీ కరించాలని ఆకాంక్షిస్తున్నాను.

---

"మేం ప్రజలకిలా చెబుతాం: "పెద్దగా మారుమోగే కార్యక్రమాలు వేటినీ నమ్మకండి. బూర్జువా, భూస్వామ్య నాయకులూ, వారి ప్రభుత్వము చేసే ఏ భూసంస్కరణ చట్టాల్లోనూ, వాటి అమల్లోనూ నమ్మకం పెట్టుకోకండి. భూస్వాములకీ వారి ప్రభుత్వానికీ వ్యతిరేకంగా స్వయంగా మీ ప్రజా వెల్లువ కార్యాచరణ మీద ఆధారపడండి." అలాంటి కార్యాచరణ సాగించడానికి వారికి మేము వివరించి చెబుతాం, సహాయపడతాం. అంతర్యుద్ధం లేకుండా భూస్వామ్య విధానం నుంచి తప్పించుకొనే మార్గం లేదు. అభివృద్ధికి వేరే మార్గం లేదు."

**-కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి**

# గ్రామీణ పేదల కనుపాపలుగా నిర్దిష్ట కార్యాచరణ సాగాలి!

## (2007 నవంబర్ జనరల్ కౌన్సిల్‌లో ప్రసంగ సంక్షిప్త పాఠం)

డా॥ పి.జస్వంతరావు



"గ్రామసీమల్లో వర్గ పోరాటాన్ని ఎలా నిర్మించాలి అనేది ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవాలి. వస్తున్న మార్పుల వెనుకవున్న శక్తులు ఏమిటి? అనేది తెలుసుకోవాలి. మైదాన ప్రాంతాల్లో రైతు 10 వేల అప్పుకు 7 వేల చెల్లింపు తర్వాత కూడా 30 వేలు డిమాండ్ చేయబడుతూ పిల్లలను వెట్టి చేయించుకుంటున్నాడంటే ఎంతటి నిస్సహాయ స్థితిలోకి రైతు నెట్టబడ్డాడో అర్థమౌతుంది. అభివృద్ధి చెందిందిగా చెప్పబడిన పశ్చిమగోదావరిజిల్లా రైతు పరిస్థితి ఇలా వుంది. ఈ స్థితికి రైతును నెట్టివేసిన పరిస్థితి ఏమిటి?

ప్రొ॥ నాగరాజు -రైతాంగం అప్పుల గురించి అధ్యయనం విడుదల చేశారు. రైతాంగం ఆత్మహత్యల సమస్య తీవ్రంగా ఉంది. ఎందుకు అప్పులబారిన పడ్డారు?

42 నిముషాలకు ఒక రైతు ఆత్మహత్య చేసుకొంటున్నాడు. సస్యవిప్లవం - వ్యవసాయ ఆధునీకరణ పేరిట సొంత వ్యవసాయం నుండి మళ్ళించిన ప్రాంతంలోనే ఆత్మహత్యలు జరుగుతున్నాయి.

గంగానదీ తీర ప్రాంతంలో ఆత్మహత్యలు తక్కువగా వున్నాయి. నీరు సమృద్ధిగా వుంది, సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం వుందని ప్రొఫెసర్ చెప్పారు. హర్యానా, పంజాబ్‌లలో- సస్యవిప్లవం ఎక్కడ సాగించబడిందో అక్కడే ఆత్మహత్యలు ఎక్కువగా వున్నాయి.

కా॥ టి.ఎన్. 'తాకట్టులో భారతదేశం'లో ప్రభుత్వం సస్యవిప్లవం పేరిట కొత్త మార్పు తీసుకువస్తున్నది. రైతాంగం మీద దోపిడీ తీవ్రమౌతుంది. దీనిని ఆర్గనైజ్ చేసి పోరాడాలన్నారు. అధిక దిగుబడి కోసం, విత్తనాలు, ఎరువులు కొనాలి. సామ్రాజ్యవాదుల పెట్టుబడి-ఎరువులు, చీడపురుగుల మందులు ఇప్పుడు విత్తనాల రూపంలో ప్రవేశించింది. రైతులు తమ పంటను ఏ రేటుకి అమ్మాలో కూడా నిర్ణయిస్తున్నది. నెహ్రూ నాటి నుండి కొనసాగుతున్న విధానాల కారణంగానే వాటి కొనసాగింపుగానే రైతు ఈ దుస్థితికి నెట్టబడ్డాడు. ఆహార పంటల భూమి విస్తీర్ణం తగ్గిపోతున్నది. 70 లక్షల ఎకరాలు తగ్గింది. పామాయిల్, యూకలిప్టస్ వంటివి వేస్తున్నారు. మొక్కజొన్న వాణిజ్య ప్రయోజనాలకోసమే వేస్తున్నారు. రైతాంగాన్ని మెల్లగా వాణిజ్య పంటలవైపు మళ్లిస్తున్నారు. వర్గశత్రువు వెనక్కువెళ్ళి రాజ్యయంత్రాంగాన్ని ముందు పెడ్తున్న పరిస్థితి వుంది.

16 వేల కోట్లతో కృష్ణాడెల్టాను ఆధునీకరిస్తామని చెప్తున్నారు. కాల్వలను శుభ్రంచేసి వినియోగదారులకు పంపులు పెట్టి, నీటి తీరువా వసూలుచేసే అధికారాలు కట్టబెడ్తున్నారు. భూస్వామ్య పద్ధతులు కొత్త రూపాల్లోకి మారాయి.

'గ్రామాల్లో భూస్వాములు లేరు. దున్నేవానికే భూమి ఎలా అమలు అవుతుంది' అంటున్నారు. వ్యవసాయం గిట్టుబాటు కానప్పుడు భూమి పేదలకు ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు.

సాగుపద్ధతుల్లో సంక్షోభం వలన దిగుబడులు తగ్గుతున్నాయి. ఆధునిక పద్ధతులు, వంగడాలు, నీరు, ఎరువు, పురుగుమందులు వాడాలి అని చెపుతున్నారు. ఈ స్థితి, రైతులు భూముల నుండి తొలగే క్రమాన్ని మరింత వేగవంతం చేస్తుంది.

భూసంస్కరణలు ఏ విధంగా సమస్యను పరిష్కరిస్తాయో రైతాంగానికి వివరించి చెప్పాలి. భూ సంస్కరణలు అమలుజరిగితే కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుందో గమనించాలి. భూమి పంపకం మాత్రమే సమస్యను తీర్చదు. దేశ జనాభాకు 30, 40 కోట్ల టన్నుల ధాన్యాలు కావాలి. మన ఉత్పత్తి 20 కోట్ల టన్నులకు మించ లేదు. భూపంపకంతోపాటు వ్యవసాయానికి అన్ని రంగాల మద్దతు కూడా కావాలి. సమిష్టి తత్వాన్ని పెంచటం చేయగలగాలి. గ్రామీణ ప్రాంతాల్లో వస్తున్న మార్పులను పరిశీలించాలి. విశ్లేషించాలి. ఒక ప్రక్క వ్యవసాయ కూలీలు వలసలుపోతున్నారు. గ్రామీణ నిరుద్యోగ ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేయటంతో పాటు దాని బూటకత్వాన్ని ఎండగట్టాలి.

రైతుబంధు పథకం ఏ విధంగా దుర్వినియోగపడిందో మనకు గుంటూరు మిర్చియార్డు అనుభవం ద్వారా అర్థమౌతుంది. ప్రైవేట్ మిర్చియార్డుకు కూడా ప్రభుత్వం అనుమతినిచ్చింది. పాలకుల నినాదాలు, విధానాల అసలు రూపాన్ని మనం బయటపెట్టాలి. రాజ్యాధికారం సాధించుకుంటే తప్ప ఈ సమస్యలు మౌలికంగా పరిష్కారం కావు. మనం రైతాంగాన్ని ఉద్యమాలకు నడిపించటం ద్వారా మాత్రమే గ్రామాల్లో వర్గ పోరాటాలు మరింత తీవ్రమౌతుంది. కార్యాచరణ నిర్దిష్ట రూపంలో నిర్మించగలిగినవారు మీరు. గ్రామీణ ప్రాంతాల్లో జులుం, దౌర్జన్యాలను ఎదుర్కొనగలం. వారి కనుపాపలుగా మెలగగలుగుతాం. రైతాంగ జీవితంలో చిన్నపాటి మార్పులైనా తీసుకురాగలిగే డిమాండ్‌నైనాసరే ముందుకు తెచ్చి, దానిని కూడా అమలు జరపని పాలకుల విధానాల అసలు రూపాన్ని బయటపెట్టి రాజ్యాధికార సాధనతోతప్ప ఈ సమస్యలు పరిష్కారం కావని రైతాంగానికి వివరించి ఉద్యమ బాట పట్టించటం ద్వారా గ్రామాల్లో వర్గ పోరాటం తీవ్రమౌతుంది. అందుకు నిర్దిష్ట పరిశీలన, కార్యాచరణను రైతుకూలీ సంఘం రూపొందించుకుంటుందని ఆశిస్తున్నాను.

# రైతుకూలీ సంఘం [ఆంధ్రప్రదేశ్] జనరల్ కౌన్సిల్ 2007 నవంబర్ 20, ఏలూరు

## (2005 జులైనుండి 2007 నవంబరు వరకు కార్యక్రమాల సంక్షిప్త రిపోర్టు)

కామ్రేడ్. ఎస్.ఝాన్సి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు



**మిత్రులారా!**

గత తెలుగుదేశం పాలనలో రైతాంగం –వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొనేందుకు ఆనాడు ప్రతిపక్షనాయకుడుగా ఉన్న వై.ఎస్.రాజశేఖరరెడ్డి పాదయాత్ర జరిపాడు. సాగునీరు లేక, వర్షాలు కురవక పంటలు పండక అప్పులపాలై ఆత్మ హత్యలు చేసుకొంటున్న రైతుల హృదయ విదారక పరిస్థితులు, పనులులేక ఉపాధి కరువై సుదీర్ఘ ప్రాంతాలకు వలసపోతున్న పరిస్థితులు, ప్రాజెక్టులు నిర్మాణం జరగక వేలాది టి.యం.సి.ల నీరు వృధాగా సముద్రం పాలౌతున్న పరిస్థితి, పంట రుణాలు అందక, వడ్డీ వ్యాపారుల కంబంధ హస్తాల్లో చిక్కుకొని బయటపడలేక కొట్టుమిట్టాడుతున్న రైతుల పరిస్థితి, పంటలకు గిట్టుబాటు ధరలేక, అమ్ముడుపోక పెట్టుబడి కూడా రాక నష్టపోతున్న రైతులు – ఈ విధంగా గ్రామీణ సమస్త ప్రజానీకం సమస్యల విషవలయంలో చిక్కుకున్న పరిస్థితి చూసి చలించిపోయానని రాజశేఖర రెడ్డి చెప్పుకొన్నాడు.

తాను జరిపిన పాదయాత్రలో రైతాంగం, వ్యవసాయకూలీలు ఎదుర్కొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 2004లో జరిగిన ఎన్నికల సందర్భంగా రైతు మోటార్లకు ఉచిత కరెంటు యిస్తామని, భూసంస్కరణలు అమలు జరుపుతామని, నీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని, ఉపాధి పనులు కల్పించి వలసలు నివారిస్తామని, రైతులందరికీ బ్యాంక్ రుణాలు అందచేసి వడ్డీవ్యాపారుల కబంధ హస్తాలనుండి కాపాడతామని, రైతుల ఆత్మహత్యల నివారణకు అన్ని చర్యలు తీసుకొంటామని, పంటలకు గిట్టుబాటుధర–మార్కెట్ సౌకర్యం కల్పిస్తామనే వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 9/77 అసైన్డ్ చట్టసవరణ చేసి అన్యాక్రాంతమైన భూములను పేదలకే పంచాలనే నిబంధననుండి మినహాయింపు పొందింది. తన యిష్టమొచ్చిన రీతిలో భూములు కేటాయించే అధికారం ప్రభుత్వం పొంది, కాంపౌండ్ రుసుముతో భూస్వాముల, సంపన్నవర్గాల ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించి చట్టబద్ధం చేస్తున్నది. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ప్రత్యేక ఆర్థికమండళ్ళు ఏర్పాటుచేసి అందుకోసం రైతుల భూములను బలవంతంగా గుంజుకొని బడాపారిశ్రామికవేత్తలకు బహుళజాతి సంస్థలకు కట్టబెట్టే విధానాలు చేపట్టింది. ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్రాజెక్టుల నిర్మాణంకోసం 46వేల కోట్లతో జలయజ్ఞం ప్రారంభిస్తున్నామని రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. 30 సంవత్సరాలనుండి పెండింగ్‌లో వున్న జంఝావతి ప్రాజెక్టు అంచనాలకంటే ఎన్నో రెట్ల వ్యయంతో ఎట్టకేలకు పూర్తిచేసింది. ప్రధాన ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు జలరవాణా కోసం, కరెంటు ఉత్పత్తికోసం నిర్మించబడుతున్న ప్రాజెక్టు. వీటివలన రైతులకు నీటి సౌకర్యం ఏర్పడదు. రైతులకోసమే ప్రాజెక్టుల నిర్మాణమని చెప్పే పాలకులు, వరిపంటను తగ్గించి, కూరగాయలు, పండ్లతోటలు, మొక్కజొన్న పండించమని వత్తిడిచేస్తున్నారు. సాగునీటిని ప్రవేటుపరం చేస్తున్నారు. ఇదంతా ప్రపంచబ్యాంక్ సూచనలమేరకే అమలు జరుగుతున్నది. వ్యవసాయ రంగంలో సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి, బహుళజాతి సంస్థల దోపిడీకి ద్వారాలు తెరిచిపెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో మన సంఘం రాష్ట్ర మహాసభలు 2005 జూన్ 6,7,8 తేదీల్లో అనకాపల్లిలో విజయవంతంగా జరుపుకొని కర్తవ్యాలను రూపొందించుకున్నాము.

1/70 చట్టాన్ని సమగ్రంగా అమలు జరపాలని, సమగ్ర భూసంస్కరణలకోసం పోరాడాలని, భారతదేశం ప్రపంచ వాణిజ్య సంస్థనుండి బయటకు రావాలని, చింతపల్లి బాక్సైట్‌కోసం ఏజన్సీ భూములు కేటాయించే ప్రతిపాదనలు ఉపసంహరించాలని, వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు యివ్వాలని, ప్రాజెక్టుల క్రింద నష్టపోతున్న ప్రజలకు సమగ్ర శాస్త్రీయ పునరావాసం కల్పించాలని, నీటి ప్రైవేటీకరణ నిలిపివేయాలని, పేదలకే దేవాదాయ భూములు పంచాలని, జయతీఘోష్ కమీషన్ సిఫార్సులు అమలు జరపాలని, కేంద్ర ప్రభుత్వ ఆదివాసీ ముసాయిదాలలో భూమి, నీరు, అడవిపై గిరిజనుల హక్కును గుర్తించాలని, రైతాంగాన్ని రుణభారంనుండి విముక్తిచేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ఇంకా ఇతర సమస్యలపై ప్రణాళిక వెలుగులో తీర్మానాలు మహాసభలో చేశాము. ఈ తీర్మానాలకు అనుగుణంగా 2005 జులైనుండి నేటి జనరల్ కౌన్సిల్ వరకు రాష్ట్రవ్యాపితంగా జరిగిన మన సంఘ

కార్యక్రమాల రిపోర్టును మీముందు ఉంచు తున్నాను.

**జయతీఘోష్ కమీషన్ సిఫార్సుల అమలు కోసం :**

వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవటానికి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం జయతీఘోష్ అధ్యక్షులుగా ఇంకా అనేకమంది మేధావుల, వ్యవసాయ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పర్య టించి రైతులు, రైతు-రైతుకూలీ సంఘాలను, వ్యవసాయ నిపుణులను కలసి చర్చించి రైతుల ఆత్మహత్యల నివారణకు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి ఈ క్రింది సూచనలు చేసింది. భూసంస్కరణలు అమలు జరిపి పేదలకు భూములు పంచాలని, రైతులందరికీ ప్రభుత్వమే పంట రుణాలు తక్కువవడ్డీకి యివ్వాలని, అప్పులు రద్దుచేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు యిచ్చి మార్కెట్ సౌకర్యం కల్పించాలని ఉపాధి అవకాశాలు కల్పించి వలసలు నివారించాలని మొదలైన సూచనలతో ప్రభు త్వానికి నివేదిక అందచేసింది. ప్రభుత్వం ఈ సిఫార్సులు వేటినీ ఇంతవరకు అమలు జరపటానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వ్యవసాయరంగ సంక్షోభం, రైతుల ఆత్మ హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో -రాష్ట్ర మహాసభల వెనువెంటనే జయతీఘోష్ కమీషన్ ముఖ్య సిఫార్సులు అమలు జరపమని డిమాండ్ చేస్తూ **2005 జూలైలో** రాష్ట్ర వ్యాపిత ఆందోళనకు రాష్ట్ర కార్యవర్గం పిలుపు యిచ్చింది. ఈ పిలుపు నందుకొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సదస్సులు, ధర్నాలు, ఊరేగింపులు స్వతంత్రంగానూ, ఐక్యకార్యాచరణగానూ జరిగాయి. జయతీఘోష్ కమీషన్ సిఫార్సు లను వివరిస్తూ ఒక బుక్‌లెట్‌ని ప్రచురించి, విస్తృత ప్రచారం, ఆందోళన చేపట్టడం ద్వారా-తామే నియమించిన కమీషన్ సూచనలను కూడా అమలు చేయని ప్రభుత్వ వంచనాత్మక విధానాలను వెల్లడి చేయగలిగాం.

**డబ్ల్యుటిఓ నుండి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేస్తూ:**

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ), సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు ప్రధాన చోదకవ్యవస్థగా ఉంది. భారత్‌తో సహా 149 సభ్యదేశాలున్న ఈ డబ్ల్యుటిఓ సమావేశాలు -2005 డిసెంబర్‌లో- హాంకాంగ్‌లో జరగనున్న నేపథ్యంలో, భారత ప్రజానీకాన్ని, రైతాంగాన్ని, సామ్రాజ్యవాద రథచక్రాలకు మరింతగా బంధించనున్న పెనుప్రమాదాన్ని గుర్తెరిగి, హెచ్చరిస్తూ, రైతుకూలీసంఘం రాష్ట్ర వ్యాపిత కార్యక్రమాన్ని రూపొందిం చింది. దీనిలో భాగంగా **2005 నవంబర్ 23న** హైద్రాబాద్‌లో 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, ప్రపంచ బ్యాంక్ పెత్తనాన్ని' వ్యతిరేకిస్తూ ఏపిఎఫ్‌టియుతో కలిసి రాష్ట్ర సదస్సు నిర్వహించి, రైతుకూలీ సంఘ సభ్యులు, కార్యకర్తలకు ఒక స్పష్టమైన అవగాహనను అందించాం.

ఈ సదస్సులో ప్రముఖ పాత్రికేయులు శ్రీ.వి.హనుమంతరావు ప్రారంభోపన్యాసం చేశారు. 'వ్యవసాయరంగంపై డబ్ల్యుటిఓ దుష్ఫలితాలు' అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎస్.ఝాన్సి; 'డబ్ల్యుటిఓ ఏర్పడిన తరువాత మూడవ ప్రపంచ దేశాల సంక్షోభం, అంశంపై ముంబాయి యూని వర్సిటీ ప్రొఫెసర్ అఫ్సర్ హెచ్. జాఫ్రీ; 'డబ్ల్యుటిఓ-వ్యవసాయరంగం' అంశంపై డా॥ కె.ఆర్.చౌదరి; 'ప్రాజెక్టులు-పునరావాసం' అంశంపై ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి సి.భాస్కరరావు; 'పారిశ్రామిక రంగం-కార్మికులు' అంశంపై కా॥ జి.విజయ్‌కుమార్; 'సామ్రాజ్యవాద ప్రపం చీకరణ- ఆర్థిక, రాజకీయ పర్యవసానాలపై కా॥ పి.జస్వంతరావు, ఇంకా రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య-లు ఉపన్యసించారు.

అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఊరేగింపు జరిగింది. ప్రపంచ వాణిజ్య సంస్థనుండి భారత్ వైదొల గాలని, హాంకాంగ్ సదస్సుకి వ్యతిరేకంగా డిసెంబర్ 13నుండి గ్రామీణ-పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచార క్యాంపెయిన్ జరపాలని సదస్సు పిలుపు యిచ్చింది. సదస్సు ప్రసంగాలతో వెనువెంటనే బుక్ లెట్‌ను ప్రచురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశాము.

ఈ నిర్మాణాత్మక కృషి ఫలితంగా **డిసెంబర్ 13-18** తేదీలలో రైతుకూలీ సంఘం స్వతంత్రంగానూ, వివిధ సోదర ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాపితంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో వివిధ రూపాలలో-ప్రదర్శన, దిష్టిబొమ్మ దగ్ధం, సదస్సు, సైకిల్ ర్యాలీ, రాస్తారోకో-తదితర నిరసన ఆందోళన కార్యక్రమాలను చైతన్య యుతంగా నిర్వహించారు. సామ్రాజ్య వాద వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించారు.

**కళింగనగర్ ఆదివాసీ ప్రజలకు సంఘీభావంగా**

**2006 జనవరి 2న** ఒరిస్సా రాష్ట్రంలోని కళింగనగర్‌లో జరిగిన మారణ కాండ ప్రజలందరికీ తెలిసిందే. కళింగనగర్ ప్రాంతంలోని ఆదివాసీ భూములను టాటా స్టీలు కంపెనీకి ఒరిస్సా ప్రభుత్వం బలవంతంగా కట్టబెట్టింది. టాటా కంపెనీ ఆదివాసీ భూములను స్వాధీనం చేసుకొని చదును చేస్తున్న సందర్భంలో తమ భూములకు పరిహారం అడగటానికి భూముల దగ్గరకు వెళుతున్న ఆదివాసులపై టాటా కంపెనీకి అండగా నిలిచిన పోలీసు అధికారులు భాష్పవాయువు ప్రయోగించారు. విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 12మంది ప్రాణాలు కోల్పోయారు.

కళింగనగర్‌లో పోలీసు కాల్పులు జరిగిన వెంటనే రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కా॥ఎస్.ఝాన్సి, కా॥ కె.కోటయ్య ఇతర ప్రజాసంఘాలను కలుపుకొని కళింగనగర్ ప్రాంతంలో పర్యటించి పోలీసు కాల్పులను ఖండించి ఆదివాసీ ప్రజలకు సంఘీభావం తెలిపారు.

అనంతరం భువనేశ్వర్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి ఆదివాసుల కాళ్ళు నరికివేయడం, మర్మావయవాలు, మహిళల స్తనాలు కోసివేయటంలాంటి అనేక దుర్మార్గ

సంఘటనలను, అప్పటివరకు వెలుగులోకి రాని అనేక విషయాలను ప్రజలకు బహిర్గత పరిచారు.

**మండల/పంచాయతిఎన్నికల సందర్భంగా:**

**2006 జూన్-జులైలలో** జరగనున్న గ్రామ-మండల-పంచాయితీ ఎన్నికల్లో పాలకులు, తమ ప్రయోజనాలు కాపాడే అభ్యర్థులను గెలిపించుకోవటానికి, కులాల పేరుతో ప్రజలను చీల్చి, వారి మధ్య చిచ్చు పెట్టి, వారి ఐక్యతను దెబ్బతీయటానికి అన్ని రకాల కుట్రలు చేస్తారని, వీరి కుట్రలకు బలికావద్దంటూ ముందుగానే ప్రజలకు రైతుకూలీసంఘం పిలుపు నిచ్చింది.

ప్రజలను మారణహోమానికి గురి చేసే భూస్వామ్య, పెత్తందారీశక్తుల కుట్రలకు బలికాకుండా కష్టజీవులు ఐక్యతను సాధించు కోవాలని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) పిలుపు యిచ్చింది. భూస్వాముల మిగులు భూములు, బంజరు-దేవాలయ- ఫారెస్టు భూములు పేదలకు పంచాలని, పంటలకు గిట్టుబాటు ధర యివ్వాలని, నాలుగు శాతం వడ్డీ మాత్రమే వసూలుచేసి రైతులందరికీ పంట రుణాలు యివ్వాలని, నీటి ప్రైవేటీ కరణ నిలిపివేయాలని, కార్పో రేట్ వ్యవసాయాన్ని రద్దుచేయాలనే డిమాండ్ల పై రైతుకూలీలు ఉద్యమించాలని కరపత్రం ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయటం జరిగింది. గ్రామీణ పేదలను ఐక్య పర్చే దిశగా ఉద్యమ నిర్మాణ ప్రయోజనాల కనుగుణంగా వ్యవహరించాలని పిలుపు నిచ్చింది.

**కనీసవేతన చట్టం అమలు కోసం:**

నేటికీ వ్యవసాయ కూలీలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. భూస్వామ్య-పెత్తందారుల భూముల్లో రెక్కలు ముక్కలు చేసుకొన్నా వచ్చే కూలి డబ్బులు కుటుంబ అవసరాలకు ఏమాత్రం చాలక, తినీ తినక, ఫలితంగా వచ్చే రోగాలకు వైద్య సహాయం అందక నికృష్టమైన జీవితాన్ని వెళ్లబుచ్చు తున్నారు. వ్యవసాయకూలీలను శ్రమదోపిడీ నుండి కాపాడటమే ధ్యేయంగా తెచ్చిన కనీస వేతన చట్టం కూలీల ప్రయోజనాలను కాపాడలేకపోయింది. ఉన్న చట్టాన్ని కూడా పాలకులు సక్రమంగా అమలు జరపలేదు. పోరాటాల ద్వారానే వ్యవసాయ కూలీలు కొంతమేరకైనా హెచ్చు కూలీని సాధించు కొన్నారు. అనేక ప్రాంతాల్లో రోజువారి కూలిస్థానంలో వచ్చిన కాంట్రాక్టు కూలి విధానం భూస్వాములకు లాభకరంగా మారింది. వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్ల వాడకంతో సంవత్సరంలో 100 రోజులకు మించి పనులు దొరకకపోవటంతో ఉపాధి కోసం వ్యవసాయ కూలీలు వలసబాట పడుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో కనీసవేతన చట్టాన్ని పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించి ప్రభుత్వం అమలు జరపాలని, కాంట్రాక్టు కూలివిధానం రద్దుచేయాలని, ఉపాధి పనులు కల్పించాలని, కూలీలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కరపత్రాన్ని తెచ్చి ప్రచారం సాగించాము. కొన్ని ప్రాంతాలలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాము.

**ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా:**

**2006-జూన్-ఆగస్టు** నెలల్లో వచ్చిన వాయుగుండం, రుతుపవనాలు కలసి సృష్టించిన వరదల వలన ఉత్తరకోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ; ఉభయగోదావరి జిల్లాలతోపాటు ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలు, క్రిష్ణా-గుంటూరు జిల్లాల్లో లంకగ్రామాలు అతలా కుతలమైయ్యాయి. వాగులు, చెరువులు, కాల్వగట్లు తెగి 6వేల గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకొని, వేలాది ఇండ్లు కూలి పోయాయి. వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయి, యాభైలక్షల మంది నిరాశ్రయు లైనారు. 20 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయి కోట్లాది రూపాయల నష్టం జరిగింది. ప్రాణాలు కాపాడుకోవటానికి తమంతట తామే ఇండ్లను వదిలి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోకపోతే ప్రాణ నష్టం పెద్దఎత్తున జరిగేది. వరదల్లో చిక్కు కున్న ప్రజలు ఆహారం, నీరులేక రోజుల తరబడి ఉన్నారు. విషసర్పాల మధ్య భయంకర రాత్రులు గడిపారు. బాధితులను ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం హెలికాప్టర్లనుండి జారవిడిచిన ఆహారపొట్లాలు కుళ్లికంపు కొడుతున్నా వాటికోసం ప్రజలు పరుగులు తీసారంటే సహాయం అందక ప్రజలు ఎంతటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారో అర్థమౌతుంది. సహాయక చర్యలు చేపట్ట వలసిన బాధ్యత ఉన్న ప్రభుత్వం ప్రజలను బిక్షగాళ్ళుగా మార్చేవిధానాలు అమలు జరుపుతున్నది. వరదల్లో చిక్కుకుపోయిన ప్రజలకు తోటి గ్రామస్థులు (మునగనివారు) అందించిన సహాయం గొప్పది. సహాయం అందక అల్లాడుతున్న ప్రజలను ఆదు కోవాలనే సంకల్పంతో రాజమండ్రి కేంద్రంగా కా॥ఝాన్సి కన్వీనర్‌గా 15మంది సభ్యులతో వరద బాధిత సహాయక కమిటీని రైతుకూలీ సంఘం ఏర్పాటుచేసింది. సర్వం కోల్పోయి సహాయం అందక బాధపడుతున్న ప్రజలను ఆదుకోవాల్సిందిగా అన్నివర్గాల ప్రజలకు కమిటీ విజ్ఞప్తిచేసింది. కరపత్రం ద్వారా రాష్ట్రమంతటా విస్తృతంగా ప్రచారం చేసింది.

కమిటీ పిలుపు మేరకు అనంతపురం, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుండి హైదరాబాదు సిటీ నుండి బియ్యం, బట్టలు, ప్లేట్లు, గ్లాసులు, మందులు కమిటీకి అందాయి. ఈ వచ్చిన సహాయాన్ని కన్వీనర్ కా॥ఎస్.ఝాన్సి, సభ్యులు కామ్రేడ్స్ కె.కోటయ్య, జె.కిషోర్‌బాబు, సి.పెద్దన్న, యం.యస్.నాగరాజుల ఆధ్వర్యములో తూర్పు-పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాల్లోని, సహాయం ఏ మేరకు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న 45 లోతట్టు గ్రామాలకు క్రమశిక్షణాయుతంగా, గ్రామ సభల ఏర్పాటుద్వారా పంపిణీ చేయటం జరిగింది.

వరద పీడిత ప్రాంతాల్లో ఒకవైపు కనీస సహాయం అందిస్తూనే మరోవైపు ప్రభుత్వం నుండి హక్కుగా అందాల్సిన సహకారాన్ని రాబట్టేందుకు రైతుకూలీసంఘం వివిధ ప్రాంతాలలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టింది. దేవీపట్నం మండలం కొండ మొదలులో నాలుగు రోజులుగా వరదల్లో

చిక్కుకున్న బాధితుల వద్దకు తీరికగా వచ్చిన గిరిజనాభివృద్ధి సంస్థ అధికారిని గిరిజనులు కదలనీయకుండా నిలవేశారు. ఆ అధికారి క్షమాణలు కోరుకొని తదనంతరం తక్షణ ప్రభుత్వ సహాయం అందచేశాడు.

వరదల కారణంగా పశ్చిమగోదావరి జిల్లా మంటూరు ప్రాంతంలో మునిగి పోయిన గిరిజన గ్రామాలకు సహాయం అందని స్థితిలో గిరిజన సంఘ కార్యకర్తలు వరదనీళ్లలో ఈదుకుంటూ వెళ్ళి మంటూరులో అధికారులను నిలదీసి తక్షణ సహాయం పొందారు.

తూర్పుగోదావరిజిల్లాలో వరదలు వచ్చిన 5 నెలల తరువాత కూడా పంట కోల్పోయిన రైతులకు కనీస నష్టపరిహారం అందించని కారణంగా, కరెంటు స్థంభాలు, కల్వర్టులు, చెక్‌డ్యాంలు పునరుద్ధరించని కారణంగా దేవీపట్నం ఎమ్మార్వో కార్యాలయం వద్దకు గిరిజన సంఘ నాయకత్వాన స్పష్టమైన హామీలు పొందే వరకు మిలిటెంట్ ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు.

వంశధార వరదల మూలంగా సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని వరదల నివారణకు కరకట్ట పనులు చేపట్టాలని శ్రీకాకుళం, నరసన్నపేటల్లో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

ఓగ్ని తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు, ప్రజానీకానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని, కృష్ణాజిల్లా కంకిపాడు, మచిలీపట్నం, నందిగామల్లో; గుంటూరుజిల్లా రేపల్లె ప్రాంతంలో; ప్రకాశం జిల్లా కొత్తపట్నం ప్రాంతంలో; నెల్లూరుజిల్లా వెంకటగిరి ప్రాంతాలలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించి తక్షణ సహాయాన్ని హక్కుగా పొందాలని ప్రజలను బిక్షగాళ్ళుగా మార్చే ప్రభుత్వ విధానాలను నిరసించాలనే చైతన్యాన్ని అందించారు.

కొండమొదలు గ్రామంలో అగ్ని ప్రమాదం సందర్భంగాను, విజయనగరం జిల్లా అనావృష్టి, కరువు పరిస్థితుల్లోనూ ప్రజల తక్షణ డిమాండ్స్‌పై ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు.

## సెజ్‌ల ఏర్పాటుకి వ్యతిరేకంగా , 9/77 అసైన్డ్ చట్ట సవరణ రద్దు కోసం:

సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే భారత ప్రభుత్వ విధానాలకు పరాకాష్టగా దేశంలోని వనరులను, సహజసంపదలను, విదేశీ బహుళజాతి కంపెనీలకు సామ్రాజ్య వాదులకు దోచిపెట్టేందుకు 'ప్రత్యేక ఆర్థిక మండళ్ళ' పేరిట 'ప్రైవేట్ రాజ్యాల'ను నెలకొల్పే విధంగా సెజ్-2005 చట్టాన్ని చేసింది. ఈ చట్టం అమలులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలలోను, ప్రత్యేకించి మన రాష్ట్రంలోను అనేక ఆర్థిక మండళ్ళకు ప్రభుత్వం అనుమతులనిచ్చింది. మరిన్ని ఆర్థిక మండళ్ళకు అనుమతి నివ్వటానికి సిద్ధంగా ఉంది. సెజ్‌ల ఏర్పాటు కోసం వందల, వేల ఎకరాల భూములను రైతాంగం నుండి బలవంతంగా గుంజుకొని బహుళ జాతి పరిశ్రమలకు, బడా కంపెనీలకు కట్ట బెట్టేందుకు ప్రభుత్వం పూనుకొంది. సెజ్- 2005 చట్టం ఫలితంగా వ్యవసాయ రంగంలో ఏర్పడ నున్న విపత్తులను, అభివృద్ధి పేరుతో పాలకులు సాగిస్తున్న రైతాంగ కార్మిక విధానాలను వివరిస్తూ రైతుకూలీ సంఘం తరఫున 2006 అక్టోబరులో బుక్‌లెట్ తీసుకువచ్చి, రాష్ట్ర వ్యాపితంగా విస్తృత ప్రచారం చేశాము.

అసైన్డ్ భూములు పేదల నుండి అన్యాక్రాంతం కాకూడదని చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర పాలకులు 9/77 అసైన్డ్ చట్టాన్ని చేశారు. ఈ చట్టం ద్వారా అసైన్డ్ భూముల అమ్మకం- కొను గోళ్ళు నిషేధించ బడ్డాయి. ప్రజలకు భూములు యిచ్చిన ప్రభుత్వం, వాటిని సాగుచేయటానికి కావాల్సిన ఆర్థిక సహాయం, పరికరాలు అందచేయకపోవటం వలన బీడులుగా ఉన్న భూములను సాగుచేయలేని స్థితిలో భూస్వాములు, సంపన్న వర్గాలు, పెత్తం దారులు ఆ భూములను స్వాహా చేశారు. 20 లక్షల ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమైనట్లు కోనేరు రంగారావు కమిటీ ప్రకటించింది. భూములు అన్యాక్రాంతం అవుతుండటం ప్రభుత్వానికి, రెవెన్యూ అధికారులకు తెలిసినా దాన్ని నివారించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదు.

అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతుంటే ఎటువంటి స్పందన చూపని పాలకులు, ఇప్పుడు భూములు అన్యాక్రాంత మైనాయని వాటిని స్వాధీనం చేసుకోవటానికి 9/77 చట్టానికి సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చి శాసనసభలో ఆమోదం పొందారు. ప్రభుత్వం చట్టాన్ని సవరించటానికి చెప్పిన కారణాలు వంచనతో కూడినవి తప్ప మరొకటికాదు. అసైన్డ్ చట్టంలోనే ఉన్న ఆ అన్యాక్రాంత భూములు స్వాధీనం చేసుకొని లబ్దిదారులకు గాని లేక మరో లబ్ధిదారునికిగాని ఇవ్వాలనే క్లాజును తొలగించారు. ప్రస్తుత సవరణ ప్రకారం స్వాధీనం చేసుకొన్న భూములను తన ఇష్టానుసారం వినియోగించే హక్కును ప్రభుత్వం పొందింది. ఇది, భూములను- భూస్వాములకు, బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడానికి చేయబడినదే. ఈ అధి కారంతో భూస్వాముల ఆక్రమణలో ఉన్న భూములకు చట్టబద్ధతతోపాటు, స్వాధీనం చేసుకొన్న భూములను ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకున్నది.

ఈ నేపథ్యంలో సెజ్ 2005 చట్టాన్ని రద్దు చేయాలని, 9/77 అసైన్డ్ చట్టసవరణ రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్స్‌తో 2006 నవంబర్ 6న రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నా కార్యక్రమాలను నిర్వహించాలనే రాష్ట్ర కార్యవర్గం పిలుపునుసరించి సంఘ నిర్మాణం వున్న అన్ని జిల్లాలోనూ విస్తృత రాజకీయ ప్రచారం జిల్లా కేంద్రాలలో సంఘం ఆధ్వర్యంలో, ధర్నా, ప్రదర్శన, సదస్సుల రూపంలో చైతన్యయుతంగా కార్యక్రమాలు జరిగాయి. దీని కొనసాగింపుగా వివిధ జిల్లాల్లో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ వ్యతిరేక ఆందోళనలు కొన సాగాయి.

మంగళగిరి ప్రాంతంలో పెదవడ్లపూడి హై లెవల్ ఛానల్ క్రింద 3వేల ఎకరాల్లో మంచి పంటలు పండే ప్రాంతాన్ని నాలెడ్జ్

పార్కు పేరిట ప్రభుత్వం సేకరించి రైతాంగాన్ని భూముల నుండి గెంటివేయ పూనుకుంది. సుక్షేత్రమైన భూములను కబళించటానికి వ్యతిరేకంగా పార్టీల కతీతంగా రైతాంగం అంతా ఐక్య కార్యా చరణలోకి వచ్చారు. రైతుకూలీ సంఘంగా నాలెడ్జీ పార్కు పేరుతో వ్యవసాయాన్ని దెబ్బతీసే ప్రమాదాన్ని వివరిస్తూ కరపత్రం వేసి, పరిసర గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారంతోపాటు, ఐక్యకార్యా చరణలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. గ్రామ గ్రామాన ప్రచారం, సభలు నిర్వహించటం మండల స్థాయిలో ధర్నాలు, నిరసనలు; మంత్రులకు, ముఖ్యమంత్రికి విజ్ఞప్తులు; జిల్లా స్థాయిలో ఆందోళనలే కాక విజయవాడ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యా లయానికి పెద్ద ఎత్తున రైతాంగం కదలివచ్చి మిలిటెంట్‌గా నిరసన కార్యక్రమం నిర్వ హించటం, సమన్యను వదలకుండా నిరంతర కార్యక్రమాలను చేపట్టిన ఫలితంగా ప్రభుత్వం ఒక అడుగు వెనక్కు వేయక తప్ప లేదు. భూముల స్వాధీనానికి నోటీసు లిచ్చినప్పటికీ బలవంతపు సేకరణకు పూను కోకుండా తాత్కాలికంగా ఆగింది.

అదే విధంగా గుంటూరుజిల్లా, నిజాంపట్నం మండలం దిండి ప్రాంతంలో 12 గ్రామాల ప్రజలు రసాయన కర్మాగారాల సముదాయం కోసమని, వందలాది ఎకరాల తీర ప్రాంత భూములను సేకరించే ప్రభుత్వ ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ, తీరప్రాంత మత్స్యకారుల, ప్రజల జీవనానికి రానున్న ప్రమాదాన్ని వివరిస్తూ సంఘ నాయ కత్వంలో విస్తృత ప్రచార క్యాంపెయిన్ జరిగింది. దిండి గ్రామానికి ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం వచ్చిన అధికార యంత్రాంగానికి కూర్చొనే వసతి కూడా లేకుండా చేసి సీనియర్ నాయకులు, కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు కూడా పాల్గొని, రసాయన కర్మాగార నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజాగ్రహాన్ని చాటిచెప్పారు. ఈ ప్రతిపాదన తాత్కాలికంగా ఆగింది.

గుంటూరు, చిలకలూరిపేట మధ్యన టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం పేరిట మూడువేల ఎకరాల భూములను సేకరించేందుకుగాను ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని పార్టీల కతీతంగా స్థానిక రైతాంగం ఎదుర్కొని అడ్డు కున్నారు.

కృష్ణాజిల్లా కంచికచర్ల ప్రాంతంలో 1602 ఎకరాల భూములను అపెరల్ పార్కు పేరిట విదేశీ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను నిరసిస్తూ రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో గ్రామాల స్థాయిలో విస్తృత ప్రచారం, నిరసన ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. భూముల స్వాధీనానికి సర్వే కోసం వచ్చిన కంచికచర్ల ఎమ్మార్వోను, సిబ్బందిని రెండు సార్లు ప్రజలు అడ్డుకొని తిప్పి పంపారు. ప్రభుత్వం తన ప్రయత్నాలను ఇంకా అమలు చేసే ప్రయత్నాన్ని నిరసిస్తూ విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద తీవ్ర నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వ హించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు వ్యతి రేకంగా కృష్ణాజిల్లా సదస్సు నందిగామలో జరిపారు. రాష్ట్ర నాయకత్వం పాల్గొన్న ఈ సదస్సు ద్వారా అనేకమంది మేధావులు, ప్రజాతంత్రవాదుల, మద్దతును సమీ కరించారు. కంచికచర్ల అపెరల్ పార్కుకు వ్యతిరేకంగా నిరంతరాయంగా, ముఖ్యంగా రైతుకూలీసంఘం ఆధ్వర్యాన సాగిన ప్రచార ఆందోళనా కార్యక్రమాల ఫలితంగా భూ సేకరణ ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలి కంగా ఆపివేయక తప్పలేదు.

నెల్లూరుజిల్లా చింతవరంలో ప్రత్యేక ఆర్థికమండలి పేరున శ్రీలంక మాస్ హోల్డింగ్ కంపెనీకి వందల ఎకరాల భూములు ఇవ్వాలని ప్రభుత్వం పూనుకొని భూముల సర్వేకి వచ్చిన సందర్భంలో రైతులు ప్రభుత్వ యంత్రాంగాన్ని అడ్డు కున్నారు. రైతుల ఆగ్రహాన్ని చవిచూసిన అధికార యంత్రాంగం ఒక అడుగు వెనక్కు వేసి స్థానిక పెత్తందార్ల ద్వారా కుట్రలు సాగించారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంతం అభివృద్ధి చెందు తుందని నేదురమల్లి జనార్ధనరెడ్డి పూనుకొని ముందుగా పెద్ద రైతులను కూడగట్టాడు. పట్టా పొలాలను ముందు స్వాధీనం చేసు కున్నారు. అసైన్‌మెంట్ పట్టాలున్న రైతులను విడగొట్టి బెదిరించారు. పట్టాలు లేకుండా బంజరు భూములను సాగు చేసుకుంటున్న రైతులు చివరకు మిగిలారు.

మొదటి నుండీ ఈ గ్రామంలో ప్రత్యేక ఆర్థికమండళ్ళకు భూములు వదులు కోవడానికి వ్యతిరేకంగా వున్న రైతులను ఆశ చూపి, బెదిరించి, విడగొట్టి లోబరుచు కున్నారు. చివరకు పట్టాలులేని సాగుదార్లు రైతుకూలీసంఘం నాయకత్వంలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు జరపడమేకాక పోలీసు హెచ్చరికలకు లొంగకుండా భూములు వదలకుండా భూముల్లో పైర్లు వేసేందుకు పూనుకోవడంతో ప్రభుత్వ యంత్రాంగం దిగివచ్చి వారికి కూడా నష్ట పరిహారం ఇచ్చేందుకు అంగీకరించక తప్పలేదు.

## సద్దాం హుస్సేన్‌ను ఉరితీయడాన్ని నిరసిస్తూ:

అమెరికన్ అగ్రరాజ్య సామ్రాజ్యవాదం ఇరాక్‌లోని ఆయిల్ వనరులను కబళించేం దుకు ఇరాక్‌లో జీవరసాయన ఆయుధాలు న్నాయనే సాకుతో ఏకపక్షంగా ఇరాక్‌పై యుద్ధానికి దిగింది. ప్రపంచవ్యాపిత తీవ్ర నిరసనను ఖాతరు చేయకుండా ఇరాక్‌లో సర్వవిధ్వంసాన్ని సృష్టించింది. అంతిమంగా అమెరికన్ అగ్రరాజ్య అధికారానికి తలొగ్గని ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను పట్టి బంధించి నిర్బంధించింది. ఇరాక్‌లో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచింది. అమెరికా కనుసన్నలలో అమెరికన్ తొత్తు లయిన 'న్యాయాధిపతులు' ఎదుట సద్దాంపై బూటకపు విచారణ తంతును ముగించి సద్దాం హుస్సేన్‌కు మరణశిక్షను విధించింది.

అమెరికన్ అగ్రరాజ్య కండకావరాన్ని, సద్దాంకు ఉరిశిక్ష విధించడాన్ని నిరసిస్తూ **–2006 డిసెంబరు 2వ వారంలో** రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఇతర ప్రజా సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహించాము. ప్రపంచ దేశాల నిరసనను బేఖాతరు చేస్తూ **2006 డిసెంబర్ 30న** సద్దాంకు ఉరిశిక్ష అమలు చేసినదానికి నిరసనగా పెల్లుబుకిన ఆగ్రహావేశాల్లో ఆందోళనా కార్యక్రమాల్లో రైతుకూలీసంఘం క్రియాశీలకంగా పాల్గొన్నది.

**ప్రత్తిరైతుల సమస్యలపై:**

పత్తిరైతుల సమస్యలు, సాధక బాధకాలపై పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకరరెడ్డి ఛైర్మన్‌గా ఉన్న పార్లమెంటరీ కార్మిక సంప్రదింపుల కమిటీ యొక్క స్టాండింగ్ కమిటీ వివిధ రైతు సంఘాలతో చర్చించటానికి **11.2.07న** వచ్చిన సందర్భములో మనసంఘం రాష్ట్రకార్యదర్శి కా॥ కోటయ్య పాల్గొని పత్తిరైతుల సమస్యల పరిష్కారానికి వివిధ ప్రతిపాదనలు సూచిస్తూ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి మెమోరాండం యిచ్చి చర్చించారు.

**సింగూర్, నందిగ్రామ్ ఘటనలను ఖండిస్తూ:**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సింగూరు, నందిగ్రామ్ ప్రాంతాల్లో ప్రత్యేక ఆర్థిక మండళ్ళకోసం సారవంతమైన పంట భూములను స్వాధీనం చేసుకునే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రయత్నాలను అక్కడి రైతులు అడ్డుకొన్నారు. తమ భూములకోసం పోరాడుతున్న సింగూర్, నందిగ్రామ్ రైతులపై లాఠీఛార్జి, అరెస్టులతోపాటు కాల్పులు జరిపి పోలీసులు రైతుల ప్రాణాలు బలిగొన్నారు. నందిగ్రామ్‌లో పదుల సంఖ్యలో పేద రైతుకూలీలు చనిపోయారు. ఈ హత్యాకాండను ఖండిస్తూ నందిగ్రామ్ రైతులకు మద్దతు తెలపటానికి జాతీయ వాస్తవ సేకరణ బృందంలో రైతుకూలీ సంఘం తరఫున మన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అక్కడ జరిగిన సంఘటనలను పుస్తక రూపంలో సోదర సంస్థ ప్రచురించింది. విజయవాడలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) తరఫున సభ నిర్వహించి నందిగ్రామ్, సింగూర్‌లలో జరిగిన వాస్తవాలను బయటి ప్రపంచానికి వెల్లడిచేశాము.

**ముదిగొండ కాల్పులను నిరసిస్తూ:**

వై.ఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక తాను వాగ్దానం చేసిన పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు, భూమి సమస్యలు గాలికి వదిలేశాడు. చారెడు నేల కోసం, కుంట భూమి కోసం ప్రజలలో ఆందోళన తీవ్రమైంది. సామ్రాజ్యవాదులకు, బడాపెట్టుబడిదారులకు, వేల ఎకరాల భూములను కారుచౌకగా కట్టబెడుతున్న ప్రభుత్వం నిరుపేదలు తలదాచుకోను నీడ కోసం ఉద్యమిస్తే సహించలేకపోయింది. 2007 జులై 27న వివిధ జిల్లా కలెక్టరేట్ల వద్ద జరిగిన ధర్నా, పికెటింగ్ కార్యక్రమాలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. లాఠీఛార్జీ, వాటర్‌కానన్‌లు, గుర్రాలను ప్రయోగించారు. ప్రభుత్వ ఈ దమనకాండను ఖండిస్తూ, ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ **జులై 28న** జరిగిన రాష్ట్ర బంద్ సందర్భంగా వివిధ మండలాలు, జిల్లా కేంద్రాల్లో రైతుకూలీ సంఘం, ఇతర సంఘాలు, పార్టీలతో కలిసి పాల్గొంది.

ఈ బంద్ సందర్భంగా ఖమ్మంజిల్లా ముదిగొండలో జులై 28న నిరాహారదీక్షా శిబిరంపై పోలీసు మూకలు సాగించిన పాశవిక హత్యాకాండలో మొత్తం 7గురు నిరుపేదలు ప్రాణాలు కోల్పోయారు. జులై28 మారణకాండను ఖండిస్తూ మరునాడే జులై 29న రాష్ట్ర వ్యాపితంగా పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక ప్రజా నిరసన వ్యక్తమైంది. ఇతర సంఘాలతో కలిసి రైతుకూలీసంఘం ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నది.

ముదిగొండ కాల్పుల్లో మరణించిన మృతులకు జోహార్లు చెపుతూ, మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య ఆధ్వర్యాన ప్రతినిధి బృందం ముదిగొండ వెళ్ళి మృతుల అంతిమ యాత్రలో, అంత్యక్రియల్లో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

**కోరన్న-మంగన్నల వర్ధంతి సందర్భంగా:**

శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న-మంగన్నలు అమరులై 40సంవత్సరాలు పూర్తిఅయ్యాయి. ఆ అమరవీరుల ఆశయాలను స్మరించుకుంటూ గిరిజనోద్యమాన్ని ముందుకు తీసుకుపోతామని ప్రతినబూనుతూ సభలు జరపాలని రైతు కూలీసంఘం రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా పార్వతీపురం, మచిలీపట్నం, అనంతపురం ప్రాంతాల్లో వర్ధంతి సభలు జరిగాయి.

కోరన్న-మంగన్నలు ఏ ఆశయం కొరకు ప్రాణాలు అర్పించారో ఆ ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడం, అర్ధఫ్యూడల్ వ్యవస్థను రద్దుచేసి పేదలకు భూములు పంచే కార్యక్రమం పరిపూర్తి చేయవలసి ఉంది. ఆ కర్తవ్యాన్ని పూర్తి చేస్తామని దీక్ష బూనటానికి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) **31-10-07న** పార్వతీపురంలో బహిరంగ సభ, ఊరేగింపుకి పిలుపు యిచ్చింది. చివరిరోజు వరకు పోలీసులు పర్మిషన్ యిస్తామని చెప్పి, చివరిలో పర్మిషన్ నిరాకరించారు. పార్వతీపురంలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి సభకు వస్తున్న 5వేల మందికి పైగా గిరిజనులను కూనేరు రైల్వేస్టేషన్‌వద్ద, ఆంధ్ర, ఒరిస్సా చెక్‌పోస్టు వద్ద, యంఆర్‌నగర్ సెంటర్ మొదలైన చోట్ల అడ్డుకొన్నారు. ఈ నిషేధాజ్ఞల మధ్యనే 1000మంది ప్రజలు కాలినడకన సభాస్థలికి చేరుకొన్నారు. తీవ్రమైన నిర్బంధం మధ్య బహిరంగ సభను విజయవంతంగా జరుపుకొన్నాము. శ్రీకాకుళ గిరిజనోద్యమ పోరాటాల దృశ్యాలను వివరిస్తూ భూపాల్ గారు రాసిన "పోరుదారి" బ్యాలే ప్రదర్శించబడింది. సభలో బి.డి.శర్మగారు, కామ్రేడ్స్ పి.జస్వంతరావు, సి.భాస్కరరావు, గుర్రం విజయకుమార్, ఎస్.ఝాన్సీ, కె.కోటయ్యలు ఉపన్యసించారు. సభ అనంతరం పార్వతీపురం పట్టణంలో 1500మందితో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించాం.

శ్రీకాకుళం గిరిజనోద్యమ తొలి అమరవీరుల వర్ధంతి సభలు అక్టోబరు నాల్గవ తేదీనుండి విజయనగరం జిల్లాలోని అనేక మండలాల్లో జరిగాయి. కొమరాడ మండలం పెదశాఖ పంచాయితీ "జల" గ్రామం, రాజ్యలక్ష్మి పురం, పార్వతీపురం మండలం కోరీ, కురుపాం మండలం కిచ్చాడ, మక్కువ మండలం దుగ్గేరు-గ్రామాల్లో బహిరంగ సభలు జరిగాయి. ఈ సభలకు వందల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

**పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా :**

దశాబ్దాల తరబడి సేద్యపు నీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన పాలకుల విధానాల మూలంగా రాష్ట్రంలో కరువు-వరదలు విలయతాండవం చేస్తున్నాయి. 2004లో తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు-త్రాగునీరు అందించేందుకు 46వేల కోట్ల రూపాయలతో జలయజ్ఞం ప్రారంభిస్తున్నట్లు ఎంతో ఆర్భాటంగా ప్రకటించి, అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసింది. అందులో భాగంగా 7,981 కోట్ల రూపాయలతో పోలవరం ప్రాజెక్టుని బహుళార్థ సాధక ప్రాజెక్టుగా నిర్మిస్తున్నట్లు ప్రకటించింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణంవలన 276 గ్రామాలు ముంపుకి గురై, లక్షా 20వేల మందికిపైగా ప్రజలు నిరాశ్రయులు అవుతారు. వీరిలో అత్యధిక శాతం ఆదివాసులే. ఫలితంగా తరతరాలుగా కొనసాగుతున్న ఆదివాసుల భాష-సంస్కృతి తీవ్రంగా దెబ్బతింటుంది.

వేల కోట్ల రూపాయల ఖర్చుతో, వందలాది గ్రామాలు ముంపుకి గురై, లక్షలాదిమంది ప్రజలను నిరాశ్రయులను చేసే ఈ ప్రాజెక్టు సాగునీటికోసం కాదని, బహుళజాతి సంస్థల సరుకుల జలరవాణ కోసం, జలవిద్యుత్‌కోసమని దీని డిజైన్లు, కుడి, ఎడమ కాల్వల నిర్మాణం తెలియ చేస్తున్నది. కాల్వల నిర్మాణంకోసం 250 మీటర్ల వెడల్పున భూమి సేకరణ చేస్తున్నారు. 20 మీటర్లలోతు కాల్వలు త్రవ్వుతున్నారు. ఎడమకాలువను విశాఖపట్నం వరకే కుదించటంవలన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు నీరు అందదు. తూర్పుగోదావరి మెట్టప్రాంతాలన్ని 40 నుండి 100 మీటర్ల ఎత్తులో ఉన్నాయి కనుక ఆ గ్రామాల భూములకు చుక్క నీరు అందదు.

2004 డిసెంబర్‌లో ఢిల్లీ దగ్గర నోయిడాలో జలరవాణా బోర్డు సమావేశం జరిగింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున అప్పటి క్రిష్ణా-డెల్టా ఎస్.ఇ.ఎ.ఎస్.ఎన్.రాజు హాజరయ్యారు. విశాఖనుండి మద్రాస్ వరకు జల రవాణా మార్గంకోసం ఆయన చేసిన ప్రతిపాదనను బోర్డు ఆమోదించింది. దీని ప్రకారం మద్రాస్ నుండి విజయవాడవరకు బకింగ్‌హామ్ కెనాల్ వెడల్పు చేస్తారు. ప్రకాశం, ధవళేశ్వరం నుండి వచ్చే కాల్వలను, ధవళేశ్వరం నుండి కాకినాడ వరకు గల కాల్వను జలరవాణాకోసం వెడల్పు చేస్తారు. పోలవరం కాల్వ విశాఖపట్నాన్ని కలుపుతుంది. సరుకుల ఎగుమతి-దిగుమతి కోసం కాకినాడ, రాజమండ్రి, పోలవరం, భద్రాచలం, ముక్తాల, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, పెదగంజాం, నెల్లూరులలో టన్నెల్స్ నిర్మిస్తారు. 10వేలు అయ్యే రవాణా ఛార్జి, జలమార్గం ద్వారా రెండువేలు మాత్రమే అవుతుంది. ఫలితంగా బడా వ్యాపారసంస్థలు, బహుళజాతి సంస్థలు దీనివలన ఎంతో లాభం పొందుతాయి. ప్రపంచబ్యాంక్ అప్పు కాల్వల నిర్మాణం కోసం మాత్రమేనని గ్రహించాలి.

పై విషయాల దృష్ట్యా పోలవరం ప్రాజెక్టు సాగునీటి ప్రాజెక్టుకాదు. ప్రాజెక్టు వలన అదనంగా ఒక్క ఎకరం కూడా సాగు కాదు. పోలవరం ప్రాజెక్టు ఎవరికోసం? ఎందుకోసం? అంటూ రాష్ట్ర సెంటర్ సమగ్ర సమాచారంతో బుక్‌లెట్ తెచ్చి, ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రజలకు సరైన అవగాహన అందిస్తూ విస్తృత ప్రచారం చేపట్టాం.

నిరుపయోగమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వద్దని, శాస్త్రీయమైన పునరావాసం కల్పించకుండా భూములు, గ్రామాలు ఖాళీ చేయబోమని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గిరిజన-గిరిజనేతర ప్రజలు రైతుకూలీసంఘం(ఆం.ప్ర.),ఏజన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో పెద్ద ఎత్తున మిలిటెంట్ ఆందోళనకు పూనుకున్నారు.

పోలవరం కాలువల భూమి పూజ కొరకు 2004 సెప్టెంబర్ 25న ముఖ్యమంత్రి పోలవరం మండలం కొవ్వాడకు వచ్చిన సందర్భంగా సమగ్ర పునరావాస విధానం గురించి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.), ఏజన్సీ గిరిజన సంఘాల నాయకత్వంలో గిరిజనులు మెమోరాండం యిచ్చారు. 2004 నవంబర్ 8న సమగ్ర పునరావాస సాధన కోసం కమిటీని ఏర్పాటు చేసుకొన్నారు. 2వేల మంది గిరిజన-గిరిజనేతర ప్రజలు ప్రదర్శనగా వెళ్లి ముఖ్యమంత్రికి మెమోరాండం యిచ్చారు. భూమికి భూమి, అడవికి అడవి, ముందు పునరావాసం-తర్వాత పని అని నినదించారు. కలెక్టరు గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని హామీ యిచ్చారు. ముఖ్యమంత్రి హామీని అమలు జరపకుండా అధికారులు పనులు ప్రారంభించడంతో వందలాది మంది గిరిజనులు 2005, ఏప్రియల్ 27న పోలవరం ఎంఆర్ఓ కార్యాలయాన్ని ముట్టడించి కలెక్టర్ రావాలని డిమాండ్ చేశారు. సమగ్ర పునరావాసం అమలు జరగాలని 2005 మే 13న దేవీపట్నంలో సదస్సు జరిపారు. పునరావాస విధానాన్ని ప్రభుత్వం జి.వో. నెం.68/2005 ఏప్రియల్ 8న ప్రకటిం చింది. పశ్చిమ గోదావరిలో గిరిజనులు ప్రాజెక్టు పనులను నిలిపివేయించి, ప్రొక్లెయిన్‌లు వెనక్కి పంపే కార్యక్రమం ఏప్రియల్ 26 నుండి ప్రారంభించారు.

పోలవరం ప్రాజెక్టు పేరుతో గిరిజన రైతాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాలకు నిరసనగా పోలవరంలో ప్రదర్శన-బహిరంగ సభకు 17.1.2006న గిరిజన సంఘం పిలుపు యిచ్చింది. ఈ సభలో భారత జన ఆందోళన్ నాయకులు డా॥ బి.డి.శర్మ పాల్గొననున్నారు. ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ప్రాజెక్టు నిర్వాసిత ఆందోళన నాయకులను వేధిస్తూ, వెంటాడుతున్న పోలీసుల చర్యలను నిరసిస్తూ రాష్ట్ర గవర్నర్, ముఖ్య మంత్రి, హోంమంత్రి, మానవహక్కుల కమీషన్‌కు, కేంద్ర, రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమీషనర్లకు, కేంద్ర-రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రులకు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఫ్యాక్స్ మెసేజ్‌లు పంపింది.

డా॥ బి.డి.శర్మ గారి సభకు అనుమతి యివ్వకుండా 144 సెక్షన్ విధించటాన్ని, పోలీసుల అణచివేత విధానాలను ఖండిస్తూ

24.2.06న ఏజెన్సీ గిరిజన సంఘం 5 వేల కరపత్రాలు వేసి ప్రచారం చేసింది.

సభకు అనుమతి ఇవ్వకపోయినా బి.డి.శర్మ, రైతుకూలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్స్ యస్.ఝాన్సి, కె.కోటయ్య, ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.భాస్కరరావు, ప్రొఫెసర్ జయప్రకాష్‌లు వెంకటరెడ్డిగూడెంలో 1000 మంది ప్రజలతో మాట్లాడారు.

**మార్చి 24న బంద్:** తక్కువ ఖర్చుతో, అతి తక్కువ ముంపుతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి మాజీ చీఫ్ ఇంజనీరు ఎం.ధర్మారావు ప్రతిపాదనలను పరిశీలించాలని, 1/70 చట్టాన్ని ఖచ్చితంగా అమలుపర్చి, భూస్వాముల, గిరిజనేతరుల చేతుల్లో ఉన్న భూములను గిరిజనులకు అప్పగించాలని, పునరావాస పనులు సక్రమంగా అమలుజరపాలని 24-3-06న పోలవరం మండలం దొండపూడి, దేవీపట్నం మండ లాల్లో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)ల నాయకత్వంలో బంద్ జరిగింది. ఈ బంద్‌లో వందలాది మంది కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టుని వెంటనే ఆపి వేయాలని విద్య-వైద్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం, గిరిజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, జీవించే హక్కుకోసం, గిరిజన చట్టాల అమలుకోసం, గిరిజన-గిరిజనేతర పేదలు ఐక్యంకావాలని 21.6.2006న ఐ.టి.డి.ఏ. ఆఫీసు వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం ఆందోళన చేసింది. ఈ సందర్భంగా 5 వేల కరపత్రాలు ముద్రించి ప్రచారం చేసింది.

సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ స్పిల్‌వే వద్ద పనులు నిలిపి వేయాలని ఫిబ్రవరి 2006న ప్రకటించినా, సుప్రీంకోర్టుని తప్పు దారి పట్టిస్తూ, పనులను వేగవంతం చేసిన కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, రెవిన్యూ అధికారుల చర్యలను నిరసిస్తూ 24.6.06న పోలవరం స్పిల్‌వే వద్ద పనులు నిలిపివేశారు.

ప్రజా వ్యతిరేక పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకించండి, ప్రత్యామ్నాయ పథకాలకై ఉద్యమించండని రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఏజెన్సీ గిరిజన సంఘం నాలుగు పేజీల కరపత్రాన్ని వేసి విస్తృతంగా పంపిణీ చేశారు.

సుప్రీంకోర్టు నియమించిన సాధికారిక కమిటీ పోలవరం ప్రాజెక్టుని, త్రవ్వకాలను పరిశీలించేందుకు 29.7.06న పోలవరం వస్తున్న సందర్భముగా ప్రాజెక్టు ఆందోళనను తీవ్రతరం చేయమని, సాధికారిక కమిటీకి గుండె చప్పుళ్లు వినిపించమని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) కరపత్రంవేసి విస్తృతంగా ప్రచారం చేసింది. ప్రజలు సాధికారిక కమిటీని కలవకుండా అధికారులు చేసిన ప్రయత్నాలను రైతుకూలీ సంఘం అడ్డుకొని వందలాది గిరిజనులతో ప్రదర్శన జరిపి సమగ్రమైన వివరణలతో కమిటీకి మెమోరాండం ఇచ్చారు.

పునరావాస ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొనటానికి పోలవరం వద్దకు చేరుకునే క్రమంలో తూటిగుంటవద్ద రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ ఆందోళన చేస్తున్న రైతుకూలీ సంఘ కామ్రేడ్స్‌పై అక్రమకేసులు బనాయించి జైళ్ళ పాలు చేశారు.

పోలవరం ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో కేసు తేలకుండానే బాంబు విస్ఫోటనాలతో కొండలు పేల్చివేస్తున్నారు. పక్కనేవున్న రామయ్యపేట, పైడిపాకలలో ఇళ్ళు బీటలు వారుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) పోలవరం ప్రాజెక్టువద్ద పోలవరంలో రాస్తారోకోచేసి, 4.8.07న తాసీల్దారు ఆఫీసు వద్ద ధర్నా చేశారు. బ్లాస్టింగ్ పనులు వెంటనే ఆపివేయాలని, బీటలు వారిన ఇండ్లకు నష్ట పరిహారం ఇవ్వాలని, మట్టిపోసిన పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పునరావాసం సాకుతో గిరిజనులను, గిరిజనేతర పేదలను సాగుభూముల నుంచి గెంటివేసే రెవిన్యూ ఉన్నతాధికారుల చర్యలను ఖండించండి. హక్కులు కోరుతున్న పేద ప్రజలపై అధికార యంత్రాంగం కవ్వింపు చర్యలు విడనాడాలి, గిరిజన, గిరిజనేతరుల మధ్య వైషమ్యాలు పెంచే అధికారుల చర్యలను ఖండిస్తూ 23.9.2007న ఏజెన్సీ గిరిజన సంఘం కరపత్రాలు ముద్రించి విస్తృత ప్రచారం చేసింది.

ఏజెన్సీలోని భూవివాదాలు పరిష్కరించాలని, నకిలీ పట్టాలు, పాస్ పుస్తకాలు రద్దు చేయాలని, గిరిజనేతర భూస్వాముల చేతుల్లో ఉన్న గిరిజన భూములను గిరిజనులకు అప్పగించాలని, జస్టిస్ బి.ఎస్.ఐ. స్వామి తీర్పుకు అనుగుణంగా అన్ని సెటిల్‌మెంట్ ఆర్డర్లు రద్దుచేసి గ్రామసభల సమక్షంలో భూ వివాదాలు పరిష్కరించాలని, భూవివాదాలు పరిష్కరించకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టరాదని, రాజ్యాంగంలోని 5వ షెడ్యూలుకు భిన్నంగా అటవీ భూములు స్వాధీనం చేసుకోరాదని, గిరిజనులపై మోపుతున్న అక్రమ కేసులు రద్దు చేయాలని 19.11.07న ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో ఉదయం 10 గం. ప్రారంభమైన ధర్నా సాయంత్రం 4 గం. వరకు సాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజన, గిరిజనేతర రైతుకూలీలు 1500 మంది ఈ ధర్నాలో మిలిటెంట్‌గా పాల్గొని ప్రభుత్వం, రెవిన్యూ అధికారుల విధానాలను నిరసించారు. వేలాది ఎకరాల గిరిజన భూములను ఆక్రమించిన భూస్వాములు హెూతా శ్రీరామచంద్రమూర్తి చేతుల్లో ఉన్న భూములను గిరిజనులకు అప్పగించాలని 1/70 అమలు పరచాలని రైతుకూలీసంఘం నిరంతర ఆందోళన సాగిస్తూ ఉండగానే పోలవరం ప్రాజెక్టు మునక భూముల క్రింద హెూతా శ్రీరామచంద్రమూర్తి ఆక్రమించుకొని వున్న గిరిజన భూములను ఇచ్చి పెద్ద ఎత్తున ప్రభుత్వం నుండి పరిహారాన్ని పొందాడు. ఆ భూములు గిరిజనులకే దక్కాలని డిమాండ్ చేస్తూ భూస్వాములకు ఊడిగం చేసే ప్రభుత్వ విధానాలను ధర్నా సందర్భంగా వక్తలు తీవ్రంగా నిరసించారు.

**సాహిత్యం:**

రాష్ట్ర సెంటర్ వివిధ సమస్యలపైన పుస్తకాలు ప్రచురించింది. హాంకాంగ్ సదస్సును వ్యతిరేకిస్తూ 2005-నవంబర్ 23న హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రసదస్సు పత్రాలను 'మన వ్యవసాయానికి ఉరితాడు-ప్రపంచ వాణిజ్యసంస్థ' పుస్తకం; జయతీ ఘోష్ సిఫార్సులు అమలు చేయాలని; పోలవరం ప్రాజెక్టు లక్ష్యాలు, పునరావాస సమస్యలపై; జలయజ్ఞంలో ప్రజలు సమిధలు కారాదని; ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టులు; సెజ్ చట్టం-2005; ఉత్తరాంధ్ర -జనం పాటల సంకలనం 'మన పాట'; గిరిజనుల భాషలో జనంపాటలు 'లోకు ఖత్తాజ' మొదలైన పుస్తకాలు ప్రచురించాము. 2005 రాష్ట్ర మహాసభల సావనీరుని తీసుకొచ్చాము. ఈ సావనీరును వివిధ ప్రాంతాల్లో ఆవిష్కరించారు.

రైతుకూలీ సంఘంగా మనం తీసుకుంటున్న అప్రోచ్ వలన ప్రజాతంత్ర వాదులను, మేథావులను మన ఉద్యమం ఇన్వాల్వ్ చేసుకుంటున్నది. డా॥ బి.డి.శర్మ, ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి వంటివారు మన ఉద్యమానికి చిరకాల మిత్రులుగా వున్నారు. వార్షిక సంచికల ద్వారా గతంలో జరిగిన ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను, వాటి అనుభవాలను ప్రచురించి, ఆ పోరాటాలకు వారసులుగా మనం నిలవాలనే స్ఫూర్తిని అందిస్తున్నాము.

మొత్తం మన కార్యక్రమాల విస్తృతిని పరిశీలిస్తే వ్యవసాయరంగ సంక్షోభంపైన స్పష్టమైన రాజకీయ అవగాహన కలిగి వున్నాము. పేద, మధ్యతరగతి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సకాలంలోనే స్పందించగలుగుతున్నాం. అయితే నేడు భూ అమరికలోనూ, వ్యవసాయరంగం లోనూ అనేక మార్పులు వస్తున్నాయి. ఈ మార్పులను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. గ్రామీణ జీవితం అనేక విధాలుగా సంక్లిష్టంగా మారిపోయింది. యువతరానికి సరైన ఉపాధి అవకాశాలు లేవు. భూములు పేదల చేతుల్లో నుండి పోయి కొద్దిమంది చేతుల్లో వందలాది ఎకరాలు కేంద్రీకరించ బడుతున్నాయి. ఫలితంగా వ్యవసాయ పని దినాలు తగ్గిపోవడంతో పొట్టచేత పట్టుకుని గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వలసపోతున్నారు. దుర్భరమైన జీవితాన్ని నగరాల్లో వెళ్ళదీస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం తన రెవిన్యూకోసం సారా, మద్యం బెల్టు షాపులను విపరీతంగా పెంచి వేస్తున్నది. ప్రధాన సమస్య అయిన 'భూమి సమస్య' డిమాండ్ నుండి ప్రజల దృష్టి మళ్ళించటానికి అనేక సంస్కరణలు, పథకాల భ్రమలలో ముంచెత్తుతుంది.

కరెంటు వున్న ప్రతి గ్రామంలోకి ఈ రోజు టి.వి. ప్రవేశించి గ్రామీణ సంస్కృతిని నాశనం చేస్తున్నది. టి.వీ.ల ద్వారా చొప్పిస్తున్న విష సంస్కృతి గ్రామీణ ప్రజానీకం యొక్క ప్రధానంగా యువతరం యొక్క జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నది.

నేడు గ్రామీణ ప్రాంతాల్లో 'కనపడని శత్రువు' ప్రజల మూపులపై నాట్యం చేస్తున్నాడు. తామెదుర్కొంటున్న విత్తనాల సమస్యకు కారణం ఎవరో, పెట్టుబడుల సమస్యకు కారణం ఎవరో, మార్కెట్ మాయాజాలం వెనుక శక్తులేంటో ప్రత్యక్షంగా అర్థంకాని పరిస్థితికి రైతునెట్టబడుతున్నాడు. రైతాంగం ఎదుర్కొంటున్న విత్తనాల సమస్యగానీ, ఎరువులు, పురుగుమందుల సమస్యగానీ, పెట్టుబడుల సమస్య, ఋణాలు, మార్కెట్‌శక్తుల దోపిడీ సమస్య మొదలైనవన్నీ వ్యవసాయరంగ సంక్షోభానికి సంబంధించిన సమస్యలే. మన పాలకులు వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు ధారాదత్తం చేసిన ఫలితంగా ఏర్పడుతున్న సమస్యలే. కార్పోరేట్ వ్యవసాయం, కాంట్రాక్టు వ్యవసాయం, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో వేలాది ఎకరాల భూములను బహుళజాతి సంస్థలకు, దేశీయ బడా బూర్జువావర్గానికి కట్టబెడుతున్న ఫలితమే.

భూపరాయీకరణ, వ్యవసాయ రంగ సంక్షోభం మరింత తీవ్రమౌతూ, కొత్త రూపాల్ని తీసుకుంటున్న నేపథ్యంలో రైతాంగాన్ని, మొత్తం శ్రామిక ప్రజానీకాన్ని, కష్టజీవులందరినీ చైతన్యపరిచి వారిపై అమలవుతున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా నిలకడైన ప్రజా ఉద్యమాల్ని నిర్మించడమే నేడు మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

తెలంగాణా, నగ్సల్బరీ, శ్రీకాకుళోద్యమం నుండి నేటి వరకు వివిధ ప్రజా ఉద్యమాల్లో, భూమి, భుక్తి, విముక్తికోసం సాగిన, సాగుతున్న గిరిజన, రైతాంగ ఉద్యమాల్లో అమరులైన కామ్రేడ్స్ అందరికీ జోహార్లర్పిద్దాం. వారందించిన పోరాట స్ఫూర్తితో ఆశయాలకు పునరంకితమౌతామని ప్రతినబూనుదాం.

**జోహార్ అమరవీరులకు!**

- నూతన ప్రజాస్వామిక విప్లవం వర్థిల్లాలి!
- వ్యవసాయ విప్లవం వర్థిల్లాలి!
- భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పోరాడుదాం!

**'ఐక్యం అన్నింటికీ మూలం**
**అదే కదుల్తోంది లోకం**
**పురోగతి ప్రపంచనీతి**
**మనదొకే మానవజాతి**
**వ్యక్తికి బహువచనం**
**శక్తి'**

- శ్రీశ్రీ

# రాష్ట్ర జనరల్ కౌన్సిల్ తీర్మానాలు

## (2007 నవంబర్ 20, ఏలూరు)

**1. రైతాంగం పండించిన పంటలన్నింటికి మద్దతు ధర చెల్లించాలి. నవంబరు 21 రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేద్దాం!**

రైతు పండించిన ఏ పంటకు కూడ గిట్టుబాటు ధరను రైతు నిర్ణయించగల స్థితి లేదు. మార్కెట్‌ను నియంత్రిస్తున్న శక్తులే రేట్లను శాసించగలుగుతున్నాయి. రైతు రక్షణకంటూ ఏర్పరచిన వ్యవసాయ మద్దతు ధరల కమీషన్ కూడ మార్కెట్‌ను నియంత్రించే వ్యాపారవర్గాల, దళారీ వర్గాలకను గుణంగానే నిర్ణయాలు తీసుకొంటోంది. ప్రస్తుతం గోధుమకు మాత్రం మద్దతు ధర పెంచి వరికి అదే ప్రమాణాలను పాటించ నిరాకరిస్తోంది. మెట్ట ప్రాంతాల్లో పండే వేరుశెనగ, పత్తి మొదలైన పంటల విషయం కూడ ఇంతే.

వరికి వెంటనే 1000 రూపాయల మద్దతు ధర ప్రకటించాలనీ, ఇతర పంటలకు కూడ తగు ధరలను ప్రకటించి రైతాంగాన్ని అప్పులపాలు కాకుండా కాపాడాలనీ, ఆత్మహత్యలను నివారించాలనీ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది. ఇందుకోసం నవంబరు 21 రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయమని రైతుకూలీ సంఘం జనరల్ కౌన్సిల్ పిలుపునిస్తోంది.

**2. రైతాంగానికి పావలా వడ్డీకే రుణాలివ్వాలి. బ్యాంకు రుణాల్లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి:**

కారు కొనుక్కోవడానికి 0 శాతం వడ్డీతో రుణాలిస్తున్నారు గానీ దేశానికి తిండిపెట్టి, పారిశ్రామికోత్పత్తులకు ముడి సరుకును సమకూర్చే రైతుకు మాత్రం ప్రభుత్వ బ్యాంకింగ్ రంగం నుండి తగు రుణ పరపతి లేదు. వడ్డీలకు వడ్డీలు గుంజుతున్నారు.

రైతాంగ ఆత్మహత్యలకు కీలక కారణం రైతు అప్పుల ఊబిలో కూరుకుపోవడమే. ప్రభుత్వం నియమించిన జయతీఘోష్ కమీషన్ కూడ ఈ విషయం తేల్చి చెప్పింది. అయినా ప్రభుత్వం బాధ్యత వహించి రైతులకు తగు పెట్టుబడులు ఏర్పరచేందుకు చర్యలు చేపట్టలేదు.

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ రైతులకు పావలా వడ్డీకే తగు మొత్తాల్లో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇవ్వాలని బ్యాంకింగ్ రంగాన్ని ఇందుకోసం వినియోగించాలని డిమాండ్ చేస్తోంది.

**3. వ్యవసాయరంగానికి సబ్సిడీలు రద్దు చేయరాదు:**

తన దేశంలో వ్యవసాయానికి, ప్రభుత్వ రంగానికి భారీ సబ్సిడీలిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదులు మన పాలకుల్ని వ్యవసాయ సబ్సిడీలు రద్దు చేయమని వత్తిడి చేస్తున్నారు.

నిజానికి వ్యవసాయరంగం నుండి ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులను లెక్కిస్తే మన పాలకులు రైతులకిస్తున్న ఎరువుల సబ్సిడీలు, విద్యుత్ ఛార్జీల రాయితీల వంటివి అల్పమైనవే. ఎవరి ఖర్చులు వారే భరించాలంటూ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ వ్యయాన్ని రైతుల పైకే మరల్చడానికీ, ఎరువుల సబ్సిడీల రద్దుకు ప్రపంచబ్యాంకు వత్తిడి చేస్తోంది. గిట్టుబాటు కాని వ్యవసాయ విధానాల ఫలితంగా ఆహార పంటల విస్తీర్ణం 70 లక్షల ఎకరాల మేర తగ్గింది. సబ్సిడీలు లేకుంటే ఇది గణనీయంగా పడిపోవడానికి ఎంతో కాలం పట్టదు.

వ్యవసాయ సబ్సిడీలు కత్తిరించే చర్యలు చేపట్టరాదనీ, ఇస్తున్న సబ్సిడీలు పారిశ్రామిక వేత్తలకుగాక నేరుగా రైతుకే ప్రయోజనం కల్పించాలనీ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది.

**4. పేదల నుండి అసైన్‌మెంట్ భూములను గుంజుకోవడాన్ని ఆపివేయాలి.**

ప్రజావసరాలకోసం ప్రభుత్వ భూములు అవసరమనీ, అందువల్ల 'ఇంత కాలంపాటు మీరు అనుభవించారు చాలు. ఇపుడు ఖాళీ చేసి ప్రభుత్వానికి అప్పగించమని పేదలను డిమాండ్ చేస్తోంది, ప్రభుత్వం. అదే రకంగా పర్యావరణ రక్షణ పేరిట పేదలు సాగుచేసుకొంటున్న చెరువు శిఖం భూములను ఖాళీ చేయమని నోటీసు లిచ్చింది. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను పేదలకే పంచాలని, అసైన్డ్ చట్ట సవరణను విరమించాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేస్తుంది.

**5. కోనేరు రంగారావు కమీషన్ సిఫార్సులను అమలుచేయాలి:**

భూసమస్యల అధ్యయనానికి మంత్రి కోనేరు రంగారావు నేతృత్వంలో కమీషన్ వేశారు. ఈ కమీషన్ రాష్ట్ర ప్రభుత్వ గరిష్ట భూసంస్కరణల చట్టం, 1/70 చట్టం వంటివన్నీ అమలుపరచడంలో ఎలా విఫలమయిందీ వివరించింది.

ప్రభుత్వం ఈ కమీషన్ నివేదికను బయటపెట్టకుండా జాగుచేసి తీవ్రమైన వత్తిడి తర్వాత బయటపెట్టింది. అయితే కమీషన్ సిఫార్సుల ప్రకారం విధానాలలోని, ఆచరణలోని లోపాలను సవరించుకోడానికి బదులు పలు ప్రజావ్యతిరేకమైన- 9/77 చట్ట సవరణలాంటి భూసంబంధ ఆర్డినెన్సుల విడుదలకు పూనుకొంది. ఈ ఆర్డినెన్సులను ఉపసంహరించి కోనేరు కమిటీ సిఫార్సుల అమలుకు పూనుకోవాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది.

**6. పేదలకు ఇళ్ళస్థలాలను ప్రభుత్వమే కల్పించాలి:**

వ్యవసాయ భూముల్ని బలవంతంగానైనా గుంజి స్వదేశీ, విదేశీ సంపన్నవర్గాల కోసం ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరిట వేల కొలదీ ఎకరాలను కట్టబెడుతున్న పాలకులు సామాన్యుడికి నీడ కల్పించే విషయం వచ్చే సరికి తమ బాధ్యత కాదని తప్పుకొంటున్నారు.

గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూముల ధరలను అసాధారణంగా పెంచడంతో పేదలే కాదు– మధ్యతరగతికి కూడ ఇంటి స్థలం సమ కూర్చుకోవడం కలగా మిగిలింది.

నివాసం ఉండేందుకు ఇంటి స్థలం పొందడం –ప్రజల ప్రాథమిక హక్కు. ప్రభుత్వమే బాధ్యత వహించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదలందరికీ అవసరాని కనుగుణంగా భూములు సేకరించి ఇంటి వసతి కల్పించాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది.

**7. వ్యవసాయ శ్రమను నైపుణ్యం గల శ్రమగా గుర్తించాలి. వ్యవసాయ కూలి రేట్లను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాలి. కనీస వేతన చట్ట అమలుకు యంత్రాంగాన్ని ఏర్పరచాలి.**

పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి, నిత్యజీవితావసర సరుకుల ధరల పెంపుదలకు అనుగుణంగా వ్యవసాయ కూలి రేట్లను పెంచి ప్రకటించాలి. వ్యవసాయ శ్రమను నైపుణ్యంలేని శ్రమగా పరిగణించటాన్ని రైతుకూలీ సంఘం ఖండిస్తోంది. నైపుణ్యశ్రమగా లెక్కించి కూలిరేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తోంది. కనీస వేతన చట్ట అమలుకోసం తగు యంత్రాంగాన్ని ఏర్పరచాలని, ఉపాధి పనులు చేపట్టాలని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తోంది.

**8. వలసలను అరికట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించాలి:**

వ్యవసాయంపై ఆధారపడే గ్రామీణ వ్యవసాయకూలీలు పల్లెలను వదలి పట్టణాలకు, నగరాలకు వలసలుపోవడం ఊహించని స్థాయిలో పెరిగిపోయింది. వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిన పలుచర్యల ఫలితమే ఈ పర్యవసానం.

వ్యవసాయానికి తగు రక్షణ కల్పించి, పని దినాలు కల్పించే పంటలను పెంచ డానికి రైతాంగానికి ప్రోత్సాహాన్నివ్వడం ద్వారా గ్రామీణ ఉపాధిని పెంచాలి. వలసలను నివారించడం ద్వారా రైతు కూలీలు అనారోగ్యం పాలుగాకుండాను, ప్రమాదాల బారిన పడకుండాను జీవన భద్రత కల్పించాల్సిందిగా రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది.

**9. 1/70 చట్టాన్ని అమలుచేయాలి: అడవి నుండి గిరిజనుల్ని గెంటేసే విధానాలు ఆపాలి:**

గిరిజనుల తిరుగుబాట్లు, త్యాగాల ఫలితంగా రూపుదిద్దుకొన్నదే 1/70 చట్టం. షెడ్యూలు ప్రాంతంలోని భూమి ప్రాథమికంగా గిరిజనులకే చెందినట్లు ఈ చట్టం చెబుతోంది. గిరిజనేతరులెవరైనా ఈ భూములు కలిగి వుంటే తమ హక్కును రుజువు చేసుకోవలసిన బాధ్యత వారిదే.

చట్టం స్పష్టంగా చెప్పిన అంశాలు ఆచరణలో పెట్టే చిత్తశుద్ధి పాలకులకు లేని ఫలితంగా గిరిజనుల భూముల్లో 60 శాతం పైగా వారు కోల్పోయారు. గిరిజనులు తిరిగి తమ భూములను స్వాధీనం చేసుకోడానికి కదిలితే ప్రభుత్వమే గిరిజనులపై అబద్ధపు కేసులు బనాయించి నిర్బంధం ప్రయోగిస్తోంది.

మరోవైపు ఫారెస్టు భూముల్ని లీజుల కివ్వడం, గనులు త్రవ్వడం తదితర చర్యల ద్వారా గిరిజనులను అడవి నుండి గెంటివేస్తోంది.

1/70 చట్టం అమలుపరచాలని, గిరిజనులను అడవుల నుండి గెంటివేసే విధానాలను ఉపసంహరించాలనీ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తోంది.

**10. ఏజెన్సీలో విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలి:**

ఏజెన్సీలో వైద్య సౌకర్యాలు లేక ప్రతి సంవత్సరమూ వేలాది మంది మరణిస్తున్నారు. సీజనల్‌గా వచ్చే జబ్బుల నుండి రక్షించే చర్యలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. మరణాలు సంభవించి పత్రికలు, మీడియా ఆందోళన చేసినపుడు కూడా ప్రకటనలే తప్ప గిరిజనుల ప్రాణాలు కాపాడడానికి తగు శాశ్వత ఆరోగ్య, వైద్య యంత్రాంగాన్ని నెలకొల్పే బాధ్యతను ప్రభుత్వం చేపట్టలేదు.

విద్య విషయం కూడ ఇంతే. వేల కోట్ల రూపాయలు గిరిజన సంక్షేమం పేరిట చేస్తున్న కేటాయింపులతో అధికారులు, మధ్య దళారుల జేబులు నిండుతున్నాయి. ఏజెన్సీలో గిరిజనులందరికీ అవసరమైన వైద్య, విద్యా సౌకర్యాలను కల్పించాల్సిందిగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది.

**11. బాక్సైట్ త్రవ్వకాలను ఆపివేయాలి:**

ప్రభుత్వం ఎల్‌టిఆర్ చట్టాన్ని కాలరాస్తూ, సుప్రీంకోర్టు తీర్పును కూడా ఖాతరు చెయ్యకుండా, ఎన్ఎండిసి శిఖండిని అడ్డు పెట్టుకుని ఏజెన్సీ భూములను బాక్సైట్ త్రవ్వకాల పేరిట విదేశీ కంపెనీ జిందాల్‌కు కట్టబెట్టింది. అటవీ భూములపై గిరిజనుల హక్కులను కాలరాచే ఈ చట్టవిరుద్ధ విధానం ఇక్కడితో ఆగలేదు. ప్రభుత్వ సంస్థ జెన్‌కో పేరుపెట్టి, వందల ఎకరాలను ప్రైవేటు విద్యుత్తు ప్లాంటు నిర్మాణానికి కట్టబెట్టింది. దొడ్డిదారిన ఎల్‌టిఆర్‌ను వమ్ముచేసే పని ఇంత వరకూ పెత్తందారీ వర్గాలు చేస్తుండగా ఇప్పుడు ప్రభుత్వమే చేయటం అత్యంత గర్హనీయం.

బాక్సైట్ త్రవ్వకాలు దేశంలోని ఇతర ప్రాంతాలలో వినాశనాన్ని తెచ్చిపెట్టాయి. త్రవ్వకాలు జరిగిన ప్రాంతమంతటా చెట్టూ –చేమ లేకుండా పోతాయి. బాక్సైటు ఖనిజశుద్ధికి ఏర్లు అన్నీ కలుషితమౌతాయి. దిగువ ప్రాంతాల గ్రామాలకు త్రాగునీరు కూడా లేకుండా పోతుంది. గిరిజనుల జీవన విధానమే నాశనమైపోతుంది. ఒరిస్సాలో గంధమర్ధిన్ ప్రాంతంలో బాల్కో జరిపిన త్రవ్వకాలతో గిరిజనులు బిచ్చగాళ్లుగా మారి దేశద్రిమ్మరులయ్యారు.

బాక్సైటు నుండి అల్యూమినా మాత్రమే తయారు చేస్తారు. ఇప్పటికే కరెంటుకోతతోనూ, అధిక రేట్లతోనూ రైతాంగం, ప్రజలు పీడింపబడుతున్నారు. కాగా అల్యూమినా ప్లాంటుకు కారుచౌకగా విద్యుత్తు సరఫరా చేస్తారు. ఆ విధంగా దేశ సహజవనరులను కాలుష్యం బారిన పడవేసి, తరలించుకుపోతారు. తిరిగి అధిక రేటుకు అల్యూమినియంను మనకే అమ్ము తారు. బాక్సైటు త్రవ్వకాలు తెస్తాయంటున్న

అభివృద్ధి సామ్రాజ్యవాదులకు తప్ప దేశ ప్రజలకు కాదు.

ఈ కారణాల రీత్యానే రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) బాక్సైటు త్రవ్వకాలను ఆపివేయాలని కోరుతున్నది. ఎల్‌టిఆర్ చట్టాన్ని అమలుజరిపి ఏజెన్సీ భూములను గిరిజనులకు అప్పగించాలని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది.

**12. ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం (సెజ్ 2005)ను రద్దు చేయాలి:**

పరిశ్రమలను ప్రోత్సహిస్తే విదేశీ మారక ద్రవ్యం వస్తుందనీ, ఉద్యోగాలు వస్తాయనే సాకులు చెప్పి పారిశ్రామిక వేత్తలకు వేల కొద్దీ ఎకరాల వ్యవసాయ భూములను కట్టబెట్టేందుకు పాలకులు పూనుకుంటున్నారు. ఇందుకోసం సెజ్ 2005 చట్టాన్ని చేశారు. ప్రజావసరాల పేరిట రైతుల నుండి ప్రభుత్వమే భూములు సేకరించి ఈ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడుతోంది. ఈ ఆర్థిక మండళ్ళు ప్రత్యేక ప్రతిపత్తి కలిగి అక్కడ ఏ చట్టాలూ (కార్మిక, పర్యావరణ, వాణిజ్య, ఆదాయ పన్నులు, సుంకాలు) వగైరా వర్తించవు.

ప్రత్యేక ఎస్టేట్ల వంటి ఈ సెజ్‌ల ఏర్పాటు చట్టాన్ని రద్దు చేయాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది.

**13. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ.) నుండి బయటకు రావాలి :**

వ్యవసాయానికి పెరిగిన ప్రాధాన్యత రీత్యా అంతర్జాతీయ వాణిజ్య చర్చల్లో 1990ల నుండి వ్యవసాయం ఒక అంశంగా కొత్తగా చేరింది. పేద దేశాల వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల వ్యూహానికనుగుణంగా మలచుకుంటూ డంకెల్ ప్రతిపాదనల రూపకల్పన-క్రమంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు జరిగాయి.

దేశంలోని ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులందరి కోరికను పెడచెవినిపెట్టి డంకెల్ ఒప్పందంపై భారత పాలకులు సంతకం చేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగస్వాములయ్యారు. మన వ్యవసాయంపై ఇప్పటికే డబ్ల్యు.టి.ఓ. షరతుల ప్రభావం పలు రూపాల్లో పడింది. వ్యవసాయ సంక్షోభం పెరిగింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి ఇప్పటికయినా భారత ప్రభుత్వం బయటికి రావాలని, మన వ్యవసాయ రంగాన్ని మన ప్రజల ప్రయోజనాలకను గుణంగా రూపొందించాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది.

**14. కె.జి.బేసిన్ గ్యాస్‌లో 50 శాతం వాటా రాష్ట్రాని కివ్వాలి.**

కృష్ణా-గోదావరి బేసిన్‌లో దొరికే గ్యాస్‌ను రిలయన్స్ కంపెనీ గుజరాత్‌కు తరలిస్తోంది. మన రాష్ట్రంలోని సహజ వనరుల్లో మనం తగు వాటా పొందడం సహజ న్యాయం. ఇక్కడ లభించే గ్యాస్‌లో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది. దీనికై సాగే ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తోంది.

**15. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆపివేయాలి:**

'జలయజ్ఞం' పేరిట నిర్మితమవుతున్న ప్రాజెక్టుల్లో అతిపెద్దది పోలవరమే. దశాబ్దాలుగా ఫైళ్ళలో నలిగిన ఈ ప్రాజెక్టు చక్కగా రూపుదిద్దుకోవడం వెనుక సామ్రాజ్య వాదుల ప్రయోజనాలున్నాయి. ప్రత్యక్షంగా ఏ ఆయకట్టునూ ఇవ్వని ఈ ప్రాజెక్టు జల రవాణాకు, విద్యుదుత్పాదనకు, బహుళజాతి పరిశ్రమల నీటి అవసరాలకు ఉద్దేశించిందే తప్ప వేరుకాదు.

400 పైచిలుకు గ్రామాల్లోని లక్షలాది గిరిజనులను నిర్వాసితులను చేసి ఈ ప్రాజెక్టు నిర్మించనవసరం లేదనీ, దుమ్ము గూడెంనుండి సులువైన మార్గంలో నీటిని మళ్ళించవచ్చనీ ధర్మారావులాంటి ఇంజనీర్లు చేసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పెడచెవిన పెట్టారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని రైతుకూలీ సంఘం ఖండిస్తోంది. దీన్ని నిలిపి వేసి ప్రత్యామ్నాయ పథకం చేపట్టి లక్షలాది గిరిజనుల జీవితాలను, అపార అటవీ సంపదనూ రక్షించాల్సిందిగా కోరుతోంది.

**16. త్రాగునీరు వ్యాపార సరుకు కారాదు:**

నీటి ద్వారా సంక్రమించే జబ్బుల గురించి ఆరోగ్య స్పృహ ప్రజల్లో పెరిగింది. దీన్ని సొమ్ము చేసుకోవడానికి గుత్త కంపెనీలు మంచినీటి వ్యాపారం చేపట్టాయి. పెప్సీ, కోకోకోలా కంపెనీలు రెండూ రంగంలోకి దిగి లీటరు 2 పైసలకు నీటిని పొందుతూ లీటరు 10 రూపాయలకు మంచినీరు అమ్ముతూ వేల కోట్ల రూపాయలు లాభాలు పొందుతున్నాయి. మున్సిపల్, పంచాయితీరాజ్ వ్యవస్థల ద్వారా ఏర్పరుచుతున్న మంచినీటి ట్యాంకుల నుండి ఇళ్ళకు నీటి సరఫరాకోసం మీటర్లు ఏర్పరచి ప్రైవేటీకరించేందుకు ప్రపంచబ్యాంకు చేసిన సూచనల అమలుకోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ చర్యలు నిలిపివేయాల్సిందిగా రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది.

స్వచ్ఛమయిన, పరిశుభ్రమయిన నీటిని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. ఈ బాధ్యతను చేపట్టి నిర్వహించాలని ప్రభుత్వాన్ని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది. ఫ్లోరోసిస్ వంటి ప్రమాదకర వ్యాధుల నుండి ప్రజల్ని రక్షించాలని, నీరు కొనుక్కోవాల్సిన దుస్థితి లేకుండా ప్రభుత్వమే నీటి సరఫరా బాధ్యత చేపట్టాలని డిమాండ్ చేస్తోంది.

**17. ఆహారభద్రతా వ్యవస్థను కొన సాగించాలి:**

కరువులు, వరదల వంటి ప్రకృతి విపత్తుల సందర్భాల్లో ప్రజలకు ఆహార సరఫరా కల్పించడానికి ముందస్తుగా నిలువ చేసే ఆహారభద్రతా వ్యవస్థ అవసరం. భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.) గోదాముల సంస్థ, పౌర సరఫరా సంస్థల వంటి యంత్రాంగం ఇందుకోసం ఏర్పడ్డవే.

ప్రపంచవాణిజ్య సంస్థ నెలకొల్పడం వెనుక ఆహారధాన్యాల కోసం మనలాంటి దేశాలు సామ్రాజ్యవాదులపై ఆధారపడేలా చేసే వ్యూహం వుంది. అందుకనుగుణంగా ఎఫ్.సి.ఐ. లాంటి వ్యవస్థలను నిర్వీర్యంచేసే చర్యలను మన పాలకులు చేపట్టారు. ఇదే జరిగితే ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్), ఆహార సబ్సిడీలు వుండబోవు.

ఆహారభద్రతా వ్యవస్థలను కొనసాగించాలనీ, ఆహార సబ్సిడీలను కొనసాగించి ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పటిష్టంగా

అమలుపరచాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది.

**18. సముద్రతీర రైతుల భూములను ఫారెస్టు అధికారులు గుంజుకోవడాన్ని ఖండిస్తూ:**

తరతరాలుగా సముద్ర తీర ప్రాంతంలో సాగుచేసుకొంటున్న వరి, వేరుశెనగ రైతులను ఫారెస్టు అధికారులు దౌర్జన్యంగా తొలగిస్తున్నారు. కృష్ణాజిల్లాలో ఎదురు మొండి, దామెల గ్రామాల్లో 2 వేల ఎకరాలలో 250 ఎకరాల మాగాణి, పెదపట్నంలో 40 ఎకరాలు వేరుశెనగ భూములనుండి రైతులను తొలగించారు. సామాజిక వనాల సంరక్షణ సమితి పేరుతో ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలకు ఆ భూములను కట్టబెడుతున్నారు. దీనికోసం వరల్డ్ బ్యాంక్ సూచన మేరకు జీ.వో. 556 రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. పథకం ప్రకారం జరుగుతున్న రైతుల తొలగింపును ఖండించాలనీ, ఢీ ఫారెస్టు చేసి సాగుదార్లకు పట్టాలివ్వాలని, అంత వరకు దీర్ఘకాలిక లీజులను పునరుద్ధరించాలని డిమాండు చేస్తున్నాం.

**19. వీరవల్లి అగ్రహారం దళితులు సాగుచేసుకొంటున్న భూములకు వెంటనే పట్టాలు యివ్వాలి.**

విశాఖజిల్లా, మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారంలోని దళితులు సెంటు భూమిలేని నిరుపేదలు. గ్రామములో వివిధ రకాల బంజర్లు వందలాది ఎకరాలు ఉన్నాయి. బంజరు భూములు యివ్వమని కోరుతూ దళితులు అనేకరకాలుగా అధికారులకు విజ్ఞప్తి చేసుకొన్నారు. వీటిని అనుభవిస్తున్న భూస్వామ్య పెత్తందారు, దళితులు భూమి కోసం ప్రయత్నం చేసినప్పుడల్లా, దళితులను సాంఘిక బహిష్కరణ చేసేవాడు.

ప్రభుత్వ అధికారులతో విసిగిపోయిన దళితులు, బంజరు భూముల్లో ఉన్న సరుగుడు తోటలను నరికారు. పెత్తందార్లు పోలీసు, రెవెన్యూ అధికారులతో అడ్డుకొనే ప్రయత్నాలను దళితులు విఫలం చేశారు. ఈనాం భూములు ఖాళీగా ఉన్నాయి. వాటిని చదునుచేసుకోండి పట్టాలు యిస్తామని దళితులను నమ్మించి, చదును చేసిన తరువాత అగ్రకుల పెత్తందార్లకు పట్టాదారు పాస్ పుస్తకాలు యిచ్చారు. దీనిలో దళితులు ఐక్యమై సరుగుడు తోటలు నరికివేశారు. పోలీసులు దళితులపై దాడులు చేశారు. కేసులు పెట్టారు, స్త్రీలను నానా రకాలుగా అవమానించారు. అయినా అధైర్యపడకుండా 20 సంవత్సరాలనుండి భూమికోసం పోరాడుతున్న దళితులకు రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) జనరల్ కౌన్సిల్ మద్దతు తెలియచేస్తున్నది. దళితులు సాగుచేసుకొంటున్న భూములకు వెంటనే పట్టాలు యివ్వాలని, కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నది.

**20. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను రక్షించాలని డిమాండ్ చేస్తూ:**

వ్యవసాయం తర్వాత అతి పెద్దదైన చేనేత రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు. నేత కార్మికులు ఆత్మహత్యలకు పూనుకోవలసిన దుస్థితికి గురయ్యారు.

పశువుల పెంపకం, కోళ్ళపెంపకం, చేపల పెంపకంవంటి వ్యవసాయ అనుబంధ వృత్తులు కూడ వుత్పత్తి ఖర్చులు పెరిగిపోయి ఒక వైపు– మార్కెటింగ్ సమస్యతో మరొక వైపు సంక్షోభంలో పడ్డాయి. చిన్న వుత్పత్తి దారులు రంగంలో నిలబడలేని స్థితిని కల్పించారు. ప్రభుత్వాలు వీరి రక్షణకోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ఈ వృత్తులలోని చిన్న రైతులను రక్షించడానికి కావలసిన ప్రోత్సాహకచర్యలు చేపట్టాలని రై.కూ.సం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది.

**21. రిటైల్ మార్కెట్‌లోకి కార్పోరేట్ గుత్తసంస్థల ప్రవేశాన్ని నిషేధించాలి:**

వేల కోట్ల రూపాయల పెట్టుబడులున్న రిలయన్స్ లాంటి దేశీయ సంస్థలూ, వాల్‌మార్ట్‌లాంటి విదేశీ గుత్తసంస్థలూ చిన్న వ్యాపారులు చేసుకునే రోజువారీ రిటైల్ వ్యాపారంలోకి కూడ ప్రవేశించాయి. సూపర్ మార్కెట్‌ల పేరిట పచారీ సరుకుల అమ్మ కానికి, కూరగాయల అమ్మకానికీ పూను కున్నాయి.

చిన్న వ్యాపారులపై ఆధారపడే పదుల వేల కుటుంబాలు, దీంతో ఉపాధి కోల్పో తారు. వీధినపడతారు.

రిటైల్‌రంగంలోకి తోడేళ్ళమందను అనుమతించరాదనీ – చిన్న వ్యాపారుల ఉపాధిని రక్షించాలనీ రై.కూ.సం.(ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది.

**22. ప్రేమ పేరిట అమ్మాయిలపై హత్యలకు, యాసిడ్ దాడులకు తలపడుతున్న ప్రేమోన్మాదానికి వ్యతిరేకంగా సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించాలి:**

విజయవాడలో శ్రీలక్ష్మి అనే ఎం.సి.ఎ. విద్యార్థిని హత్యలాంటి సంఘటనలు ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల జరిగాయి. ఇదంతా సినిమా, టి.వి.ల ప్రభావంతో పెరుగుతున్న ప్రేమోన్మాదం తప్ప వేరుకాదు.

ఈ వికృత సంస్కృతికి వ్యతిరేకంగా సినిమా, టి.వి.లో వెదజల్లుతున్న విష సంస్కృతినుండి రక్షించు కునేందుకు అవసరమైన ప్రజాస్వామిక సాంస్కృతి కోద్యమ నిర్మాణానికి పూనుకోవాలని రైతు కూలీ సంఘం(ఆం.ప్ర.) పిలుపు నిస్తోంది.

**23. నందిగ్రామ్, సింగూర్‌ల రైతాంగంపై వామపక్ష ప్రభుత్వ హత్యాకాండను, నిర్బంధాన్ని ఖండిస్తూ:**

సెజ్‌ల పేరిట సంపన్న పారిశ్రామిక వర్గాలకు భూములు కట్టబెట్టడంలో సిపిఎం నేతృత్వంలోని బెంగాల్ వామపక్ష ప్రభుత్వం చాల దురుసుగా వ్యవహరించింది.

సుక్షేత్రమైన పంట పొలాలను వదులుకోడానికి నందిగ్రాం, సింగూర్‌లలో రైతాంగం సహజంగానే సిద్ధపడక ప్రభుత్వ యత్నాన్ని ప్రతిఘటించారు. ప్రభుత్వ యంత్రాంగమేకాక సిపిఎం పార్టీ యంత్రాంగం కూడ తోడై ఈ రైతులపై అమానుష హత్యాకాండకు పూనుకుంది. నిర్బంధాన్ని లెక్కచేయక ప్రజలు పోరాడి భూముల రక్షణకే పట్టుదలతో ప్రతిఘటిస్తు న్నారు. సిపిఎం నందిగ్రాం, సింగూర్‌లలో వ్యవహరిస్తున్న తీరు అత్యంత హేయమైనది. రైతాంగంపై నిర్బంధ కాండను నిలిపి వేయాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తోంది. పోరాడుతున్న రైతాంగానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) సంఘీభావం ప్రకటిస్తోంది. సెజ్‌ల ప్రతిపాదనలన్నీ వెనక్కు తీసుకోవాలని కోరుతోంది.

**24. వాకపల్లి గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డ పోలీసులను శిక్షించాలి:**

విశాఖజిల్లా వాకపల్లి గ్రామంలో నక్సలైట్‌ల కోసం కూంబింగ్ కని వెళ్ళిన పోలీసులు గిరిజన మహిళలపై అత్యాచారం జరిపి హింసించారు. అధికార యంత్రాంగం, మంత్రులూ ఈ వార్తలు వచ్చిన వెంటనే పోలీసులను బలపరుస్తూ ప్రకటనలకు పూనుకున్నారు. బాధిత మహిళలపైనే ప్రత్యారోపణలు చేశారు. వైద్య పరీక్షలకు ఆధారలు లేకుండా చేశారు. గిరిజనశాఖ ఉన్నతాధికారి ప్రాథమిక ఆధారాలున్నాయని ప్రకటించారు. అయినా పోలీసులపై శాఖా పరమైన దర్యాప్తుగానీ, చర్యలుగానీ లేవు. హైకోర్టు సైతం సిఐడి రిపోర్టు ఆధారాలు లేవని చెప్పిందంటూ కేసును మూసివేసింది.

పోలీసు, న్యాయయంత్రాంగం రెండూ కుమ్మక్కై గిరిజన మహిళలకు వ్యతిరేకంగా వ్యవహరించిన తీరు మన వ్యవస్థతీరుకు అద్దంపడుతోంది.

అధికార యంత్రాంగమూ, న్యాయ వ్యవస్థా వ్యవహరించిన తీరును రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) తీవ్రంగా గర్హిస్తోంది. అత్యాచారానికి తలపడ్డ పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టి తగు చర్యలు చేపట్టాల్సిందిగా డిమాండ్ చేస్తోంది.

**25. గుత్తికోయుల ఆవాసాల్ని తగుల బెట్టడాన్ని ఖండిస్తూ–**

ఖమ్మంజిల్లా ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌ను ఆనుకొని ఉన్న గుత్తికోయలు ఏ రాష్ట్రానికీ చెందనివారైపోయారు. వారి గ్రామాల్ని సరిహద్దుల పేరుతో ఫారెస్టువారు తగుల బెడుతున్నారు. ఇప్పటికి వారు ఏ రాష్ట్రానికి చెందినవారో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు తేల్చడం లేదు. వారిని ఓటర్ల లిస్టులో కూడ చేర్చ కుండా భారత పౌరులుగా గుర్తించడం లేదు. నిత్యంవారి పై కేసులు నమోదు చేస్తున్నారు. కట్టుబట్టలతో సహా గ్రామాలు కాలిపోయి, తినడానికి తిండిగింజలు కరువై రోజుల తరబడి పస్తులతో గడుపుతున్నారు. వారి గ్రామాల్ని తగుల బెట్టడాన్ని ఖండిస్తూ వారికి నివాస హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తుంది.

**26. గోదావరిజిల్లాల్లో గిరిజనులపై నిర్బంధం, అక్రమకేసులు రద్దుచేయాలి:**

ఉభయగోదావరిజిల్లాల్లో ముఖ్యంగా పోలవరం నిర్వాసిత, కాలవ బాధిత గిరిజనుల్ని నిర్బంధంగా గ్రామాల నుండి, పొలాల నుండి గెంటివేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తున్న రైతు–కూలీ సంఘం(ఆం.ప్ర.); ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు, కార్య కర్తలపై అక్రమకేసులు బనాయిస్తున్నారు.

ఇప్పటికి ప్రాజెక్టు విషయమై మూడు కేసులు బనాయించారు. బెయిల్ ఇవ్వ కుండా నెలల తరబడి నిర్బంధిస్తున్నారు. గిరిజనుల–రైతుకూలీ సంఘం(ఆంప్ర.) ఏజన్సీ గిరిజనసంఘం కార్యకర్తలపై బనాయించిన కేసులు ఎత్తివేయాలని జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది.

**27. జర్నలిస్టులపై నిర్బంధాన్ని ఖండిస్తూ:**

ప్రభుత్వంలోని అమాత్యుల, ఉన్నతాధికారుల అవినీతిని, అక్రమాలను బయట పెట్టిన ప్రతి సందర్భంలోను జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు దాడులకు గురవు తున్నారు. వారి కలాలకు, గళాలకు సంకెళ్ళు వేయడానికి పాలకులు పూను కుంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో జరిగిన అక్రమాలను బయటపెట్టినందుకు ఇటీవల 'ఆంధ్రజ్యోతి' పత్రికా విలేఖరులపై, క్రిమినల్ కేసులు పెట్టారు. పలుచోట్ల భౌతిక దాడులకు కూడ పాలకపక్షం తలపడు తోంది.

దీనిపై జర్నలిస్టులు నిరసన తెలపగా పోలీసు డి.జి.పి. 'మేం చెయ్యాల్సింది చేశాం. మీకు చేతనైంది చేసుకొండని' స్వయంగా మాట్లాడడం పోలీసు వ్యవస్థ అహంభావాన్ని బట్టబయలు చేస్తోంది, హెచ్చరిస్తోంది.

జర్నలిస్టులపై సాగుతున్న ఈ దాడుల్ని ఖండిస్తూ వారిపై బనాయించిన అక్రమకేసుల్ని ఎత్తివేయాలని రై.కూ.సం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది.

## అన్యాయ కాలము

**– గరిమెళ్ల సత్యనారాయణ**
**'జాతీయ గీతములు' కవితా సంపుటి, 1938.**

అన్యాయకాలంబు దాపురించిందిపుడు
అందరము మేలుకోవాలండి
మాన్యాలు భోగాలు మనుజులందరి కబ్బు
మార్గాలు వెతకాలి రారండి ॥అన్యాయ॥
ఏటి పొడుగున దున్ని యెరువేసి నీరెట్టి
నూర్పి పండించేది మనవంతా
గోటు సేయుచు బూతు కూతులను కూసి తల
కోసికొని పోవు టింకొక రొంతా ॥అన్యాయ॥
పొగలలో మరలలో పొగిలి పొగిలి సరకు
పుట్టించి యిచ్చేది మన వంతా
తొగరు వాతెఱ సొగసు తొయ్యలులతో కల్సి
విరగబడుచుండు టింకొక రొంతా ॥అన్యాయ॥
కూలిచాలక కడుపు మాడుతూ గుహలలో
కుందుతూ కుళ్లడము మనవంతా
గాలిమేడలలోను కమ్మతావులలోను
గర్వముగ భోగ మింకొక రొంతా ॥అన్యాయ॥

# రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర జనరల్ కౌన్సిల్
## (2005 నవంబర్ 24-హైదరాబాద్)

రైతుకూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్-అనకాపల్లి రాష్ట్ర మహాసభల అనంతరం-2005 నవంబరు 24వ తేదీన హైదరాబాద్‌లో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు, నాగరాజుల అధ్యక్షతన జరిగింది.

అనకాపల్లి మహాసభలనుండి జనరల్ కౌన్సిల్ మధ్యకాలంలో (2005 జూన్-2005 నవంబర్)లో జరిగిన ముఖ్యమైన కార్యక్రమాలను-సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె.కిశోర్‌బాబు ప్రవేశ పెట్టారు. వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు - ఈ మధ్యకాలంలో చేపట్టిన కార్యక్రమాల రిపోర్టును - అనుభవాలను వివరించారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ రఘూన్సి, 'రైతుకూలీసంఘం అవగాహన-నిర్మాణం' అంశంపై మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన వివిధ వాదనలను ప్రస్తావిస్తూ-సామ్రాజ్యవాదుల, భూస్వాముల ప్రయోజనాలను తీర్చ టానికే ప్రాజెక్టుల రూపకల్పన - ముఖ్యంగా- పోలవరం ప్రాజెక్టు రూపకల్పన సాగుతున్నదని స్పష్టం చేశారు. ప్రాజెక్టులపై ప్రభుత్వ వైఖరి-మన వైఖరిని వివరిస్తూ బుక్‌లెట్‌ను తీసుకు వచ్చామన్నారు.

చంద్రబాబునాయుడు అధికారం కోల్పో యినపుడు-కాంగ్రెస్ పార్టీ పట్ల అభిమానంతో రాజశేఖరరెడ్డిని గెలిపించలేదనీ తెలుగుదేశం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపట్ల ప్రజల్లో పెల్లుబుకిన అసంతృప్తి, వ్యతిరేకతల ఫలితంగానే వై.ఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగలిగాడనీ ప్రకటించామన్నారు.

అలాగే ఆత్మహత్యలకు నష్టపరిహారం ఇస్తే సరిపోతుందనే దానికి భిన్నంగా- నష్ట పరిహారం మేరకే పరిమితం చేయకుండా-ఆత్మహత్యలకుగల మూలకారణాల్ని వివరించే ప్రయత్నం చేశామన్నారు. అభివృద్ధికి గీటురాయిగా ప్రత్యేక ఆర్థిక మండళ్ళను చూపెడ్తున్న పరిస్థితి ఒకవైపు, మరోవైపున కొన్ని ప్రాంతాల్లో మెరుగైన పరిహారం తీసుకొని భూములను వదులుకోవాలనే వైపుగా రైతాంగాన్ని ప్రలోభాలకు గురిచేస్తున్న ప్రస్తుత తరుణంలో-ప్రత్యేక ఆర్థిక మండళ్ళ ప్రమాదం-ప్రైవేటు రాజ్యాలుగా ఉండబోయే తీరును వివరిస్తూ మనం బుక్‌లెట్ వేసి స్పష్టమైన అవగాహనతో ప్రచార ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

వ్యవసాయరంగంలోకి సామ్రాజ్య వాదుల చొరబాటును మరింత తీవ్రంచేసే హాంకాంగ్‌లో జరుబోతున్న 'ప్రపంచవాణిజ్య సంస్థ' సమావేశాల్ని బహిష్కరించాలని, భారతదేశం డబ్ల్యుటిఓ నుండి బయటకు రావాలని డిమాండ్ చేస్తూ-జనరల్ కౌన్సిల్ ముందు రోజే(2005 నవంబర్ 23న) రాష్ట్ర సదస్సును జరుపుకొని, స్పష్టమైన అవగాహనతో డిసెంబర్‌లో రాష్ట్రవ్యాపిత ఆందోళనా కార్యక్రమాల్ని నిర్వహించాలని రైతుకూలీసంఘం పిలుపిస్తున్నదని తెలియ చేశారు. (హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర సదస్సు ఉపన్యాసాలను తదనంతరం బుక్‌లెట్‌గా తీసుకొచ్చి రాష్ట్ర వ్యాపితంగా విస్తృత ప్రచారం చేశాం) ఆచరణలో ఎదురయ్యే అవగాహనపరమైన అంశాలను వివరించటంతోబాటు-సంఘ నిర్మాణాన్ని పటిష్టపరచు కోవలసిన అవసరాన్ని-సంఘ సభ్యత్వం- గ్రామ కమిటీల నిర్మాణం-పంక్షనింగ్‌ను మెరుగుపరుచుకోవలసిన అవసరాన్ని కా॥ఝూన్సి నొక్కి చెప్పారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె.కోటయ్య మాట్లాడుతూ -వ్యవసాయరంగంలో కనబడని శత్రువు ప్రమాదాన్ని గురించి వివరంగా చర్చించుకున్నామని, మన వృత్తుల్ని కనీసం కాపాడుకోవాలన్నా తీవ్ర పోరాటం చేయాల్సిన స్థితిలో, ప్రమాదపుటంచులో ఉన్నామని, హాంకాంగ్‌లో జరగబోయే డబ్ల్యుటిఓ సదస్సుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనోద్యమాల్ని నిర్మించాలని-పిలుపు నిచ్చారు.

---

**'విత్తినప్పటి నుండి గిట్టుబాటుకాటా దాకా**
**మోసిన కలలన్నీ విరిగిన మగ్గాలై,**
**మూసిన మిల్లులై**
**సింథటిక్ ప్రపంచపు వెన్నుపోటుకి**
**చిందరవందరౌతున్న చోట పురుగు**
**చెట్టుకే కాదు**
**మొత్తం మార్కెట్టుకు పట్టుకుంది**
**వ్యవస్థకు పట్టుకుంది**
**మరి 'డెమోక్రాన్' వీళ్లందరికీ**
**కొట్టమంటావా?**
**మట్టి పుట్టిన్నాటి చెకుముకి ఆరాటాన్ని**
**యుగాలుగా తలకెత్తుకుంటున్నోళ్లం**
**నీ తరం నా తరానికి నా తరం ముందు**
**తరాలకి**
**దారి కావాలి తప్ప పిడికెడు విశ్వాసం**
**కావాలి తప్ప**
**తిరగేసిన నాగలి కావాలి తప్ప**
**ఎక్స్‌గ్రేషియాలమై, సబ్సిడీలమై**
**సానుభూతులేరుకోవడం సిగ్గుచేటు**
**బాపూ! ఇంక నువ్వు**
**అసమర్థ మరణాలకి చివరి చరణానివి**
**నేను ఆశావహమైన బతుక్కి తొలి**
**కిరణాన్ని...'**

**- వఝల శివకుమార్**
**'పిడికెడు విశ్వాసం' కవిత నుండి**

# బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశీయ ప్రభుత్వాధిపతులు, సైనికులు, చేతివృత్తులవారూ, రైతులూ సాగించిన పోరాటాలు

- మేఘనాద్

**భారతదేశంలో** 1757లో బ్రిటీష్ సామ్రాజ్యవాద (ఈస్ట్ ఇండియా కంపెనీ) పరిపాలన మొదలయిన నెల రోజుల నుంచే భారత ప్రజల ప్రతిఘటన ప్రారంభ మయింది. ప్లాసీ యుద్ధంలో ఈస్టిండియా కంపెనీ దళాలను త్రిప్పికొట్టే ప్రతిఘటనా క్రమంలో నవాబు సిరాజుద్దౌలా ఓడి పోయాడు. ఈస్టిండియా కంపెనీ దుష్ట దోపిడీ చర్యలను ప్రతిఘటించిన అనేక సంఘటనలు జరిగాయి. అయితే 1850ల నుంచి బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిర్మాణయుతమైన సమరశీల పోరాటాలు జరిగాయి. భారత ప్రజలకు, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికీ మధ్య ప్రధాన వైరుధ్య రూపం తీసుకొన్నదాని పర్య వసానమే ఈ సంఘర్షణలు. భారత ప్రజలలో జాతీయత అన్న అంశం రూపు దిద్దుకొనసాగింది. అది జాతీయోద్యమంగా మారింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు భారత వ్యవసాయరంగంలో వారికవసరమైన మార్పులు తెచ్చారు. ఈ మార్పులు బ్రిటీష్ దేశ పరిశ్రమలకుపయోగపడే పంటలను పండించాలనే ఆంక్షలు, నిర్బంధాలు, భూమి శిస్తుల రూపంలోనూ, వ్యవసాయంలో రైతుకు ఏమీ మిగలకుండా తామే స్వాహా చేసే అనేక డొంకతిరుగుడు పద్ధతులను అమలు జరిపారు. భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు, వర్తకులు స్థిరపడిపోయి గ్రామీణ రైతాంగాన్ని పీడించి, పిప్పిచేయడానికి సంబంధించినవే ఆ మార్పులు!

భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మీద ఆధారపడేదిగా కావాలనే మార్చారు. వ్యాపారం కోసం వచ్చిన బ్రిటీషు వారు తమ సరుకుల అమ్మకం కోసం, దేశీయ చేతివృత్తులను నాశనం చేశారు. బ్రిటన్‌లోని తమ పరి శ్రమలకు ముడిసరుకును అందించే పంటలను రైతాంగంతో నిర్బంధంగా వేయించారు.

20వ శతాబ్దం ఆరంభం (1901) నాటికి భారత వ్యవసాయం, పరిశ్రమలు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. యూరప్‌లో వచ్చిన నూతన పోకడలను బ్రిటీష్ పాలకులు భారతదేశంలో ప్రోత్స హించదలచుకోలేదు. భారతదేశంలో ఏ రకపు ప్రజాతంత్ర అభ్యుదయ భావాలను, సంస్కరణలను అది తేదలుచుకోలేదు. ఆర్థిక వ్యవస్థను స్వతంత్ర ఆర్థికవ్యవస్థగా పెరగ నీయకూడదన్న నీతినే పాటించారు. భారత వ్యవసాయవనరులు, ప్రకృతివనరులు, భూగర్భవనరులు, అడవులు, నదులు, సముద్రాలు తదితరాలన్నింటిపై ఆధిపత్యం నెలకొల్పుకొని, భారత, ఆర్థిక, సాంఘిక పరిణామక్రమాన్ని ముందుకు సాగనీయ కుండా అడ్డుకోగలిగారు. 200 సంవత్సరాల సుదీర్ఘకాలం అత్యంత కృత్రిమంగా, మొరటుగా, నీచమైన, నిరంకుశమైన పద్ధతుల ద్వారా భారత ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మనో వికాసాభి వృద్ధిని తమ కనుసన్నలలో, కంట్రోలులో ఉంచుకొన్నారు. గజిబిజిగా గందరగోళ స్థితిలో వున్న ఫ్యూడల్ భారత సాంఘిక వ్యవస్థను, వున్న దానిని వున్నట్లుగా వుంచ నిశ్చయించుకొని వ్యవహరించారు.

వారి ఈ నిశ్చయాత్మకమైన, దుర్బుద్ధితో కూడిన విధానాలను అమలు జరిపిన బ్రిటీష్ జాతికి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులలో కొంత మంది దానిని తట్టు కోలేకపోయారు. ప్రజాస్వామికం, మానవత్వం, హేతుబద్ధత అన్న దృష్టిని ప్రోత్సహించారు. అదే సందర్భంలో పశ్చిమ యూరప్‌లో జరిగిన ప్రజాతంత్ర విప్లవ నినాదాలైన 'ప్రజాస్వామికం- స్వేచ్ఛ- సౌభ్రాతృత్వం' అన్న భావనల ప్రభావం భారతదేశ బుద్ధిజీవులపైన బలంగానే పడింది.

బ్రిటీష్ సామ్రాజ్యవాదం, ఆదివాసీల స్వతంత్ర జీవన వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, అక్రమంగా వారి ప్రాంతాలలోకి చొరబడి, వారిని అదుపులో వుంచే క్రూర ప్రయత్నా లను చేసింది. దేశంలో మతవిభేదాలను పెంచింది. కులవ్యవస్థను చెక్కుచెదరకుండా చేసింది. అవిద్య, అజ్ఞానాల్లోనే ప్రజల్ని ఉంచింది. గ్రామాలలో కుల ప్రాతిపదికపై విడగొట్టేందుకు కృషి చేసింది. మత నమ్మకాలను, సాంప్రదాయాలను ప్రోత్స హించింది. 'ఎవరి విషయం వారే చూసు కోండి, నలుగురు కలిసి వ్యవహరించ కూడ'దనే వ్యష్టివాద పద్ధతిని ప్రోత్సహిం చింది. చదువుకొన్నప్పటికీ పరీక్షలలో ప్రమోషన్‌ని నియంత్రించి ఉద్యోగాలకు అనర్హులను గావించింది.

యూరప్‌లో ప్రజాతంత్ర విప్లవానికి కృషిచేసిన యూరప్ పెట్టుబడిదారులు వలస, పరాధీన దేశాలలో, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ఖండాలలో ప్రజాతంత్ర విప్లవాలకు నాయకత్వం లేకుండా చేయ టానికి కుతంత్రాలతో వ్యవహరించారు.

బూర్జువా వర్గం ఇక మీదట ప్రజాతంత్ర విప్లవాలకు నాయకత్వమొహించరాదని, పారిస్ కమ్యూన్ నుంచి, రష్యా విప్లవా న్నుంచి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు నేర్చు కొన్న గుణపాఠం అది. అయినా భారత ప్రజలు 1757 నుంచి 1857 వరకు శతాబ్ది కాలంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదులను ఎదుర్కొన్న సంఘటనలు చాలా వున్నాయి. ఆ తర్వాత 1857 నుండి 1950 వరకు శతాబ్దికాలంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలలో ఆలోచనాస్థాయి క్రమంగా పరిణితిని, సంఘటితత్వాన్ని, సమరశీల తత్వాన్ని పెంపొందించుకొన్నారు.

1857లో మీరట్ సైనికుల తిరుగుబాటు పంజాబ్, బీహార్, రాజస్థాన్, బఖాగత్‌ల దాకా వ్యాపించింది. ఢిల్లీలో చివరి మొఘల్ చక్రవర్తి షాని దించి గద్దెపై కూర్చొన్న బ్రిటీష్ వాళ్ళను ఓడించి, నగరాన్ని స్వాధీనం చేసుకొని బహదూర్ షాను తిరిగి తమ చక్రవర్తిగా ప్రకటించారు. దాని కొనసాగింపుగా హిందూ-ముస్లిం సంస్థానాధిపతులూ, జమీందార్లూ, సైనిక నాయకులూ, రైతులూ, వృత్తిపని వాళ్ళూ తిరుగుబాట్లు చేశారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో జరిగిన తిరుగుబాట్లలో సైనికులు 50 వేలమందైతే రైతులు, చేనేత, వడ్రంగం, కమ్మరం, తోళ్ళు తదితర వృత్తిపని నిపుణులు లక్షమంది పాల్గొన్నట్లు చరిత్రకారులు అంచనా. బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా 1857లో వచ్చిన ఈ ప్రజాతిరుగుబాట్లకు అత్యధిక ప్రాముఖ్యత వున్నది. భారత ప్రజల ఈ సంఘటిత ప్రతిఘటనా శక్తి బ్రిటీష్ వారిని తీవ్రంగా కల్లోలపరిచింది. మత, కుల విభేధాలు లేని ప్రజాతిరుగుబాటు ఇది. ముస్లిం అయిన బహదూర్‌షాను హిందు రాజులూ, ముస్లిం రాజులూ, సైనికులూ, ప్రజలూ చక్రవర్తిగా గుర్తించారు. బహదూర్ షా, ఝాన్సీరాణి, నానా సాహెబ్ బ్రిటీష్ సామ్రాజ్యవాదులతో రాజీ లేని యుద్ధం చేశారు. బ్రిటీష్‌వాళ్ళు ఆ కాలంలో వీరి ముగ్గుర్నీ తమ ప్రధాన శత్రువులుగా పరిగణించారు. తాము 'మహమ్మదీయులకూ, హిందువులకూ మధ్య వైషమ్యం కల్పించలేకపోయామనీ, తమ ప్రయత్నాలు ఫలించలేదనీ' బ్రిటీష్ అధికారులు సమీక్షించుకున్నారు. దీనిని బట్టి భారత దేశంలో అప్పటి వరకు నడిచిన రాజకీయాలు మతపరమైనవి కావని స్పష్టమైంది.

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కుటిల రాజకీయాలతో దేశంలోని అత్యధిక సంస్థానాధీశులను లోబర్చుకొన్నారు. అదే విధంగా కొన్ని ఆదివాసీతెగలను కూడా లోబరచుకొన్నారు. దేశదేశాలను దోచుకున్న ధనబలం, ఆరితేరిన రాజకీయ, ఆయుధ శక్తుల ముందు ఆనాటి మన దేశ భక్తుల, ప్రజల తిరుగుబాట్లు వైఫల్యం చెందాయి..

1857 సెప్టెంబర్ 20వ తేదీన సేనా నాయకుడు బహదూర్ షాని బంధించారు. మిగిలిన నాయకులు పోరాటం కొనసాగించారు. అయినా నానాసాహెబ్ కాన్పూర్‌లో ఓడిపోయాడు. ఝాన్సీ లక్ష్మీబాయి 1858 జూన్ 17వ తేదీన పోరాడుతూ వీరమరణం చెందింది. గెరిల్లా పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తూ 1859 ఏప్రిల్‌లో విద్రోహం ఫలితంగా తాంతియాతోపే అసువులు కోల్పోయారు. ప్రముఖ సైనికనాయకులు, ఢిల్లీ తిరుగుబాటుదార్లకు సైన్యాధిపతి అయిన ఖాగ్జాఖాన్, బహదూర్‌ఖాన్, అహ్మదుల్లాలు కన్వర్‌సింగ్ కూడా 1859 నాటికి మరణించారు. అవధ్ బేగమ్ హజరత్ ఆత్మరక్షణ చేసుకొని నేపాల్ చేరింది. నాటికి బ్రిటీష్ అధికారం స్థిరపడినప్పటికీ 1857 తిరుగుబాటు వృధా కాలేదు. తిరుగుబాటుకి పందికొవ్వు, ఆవుకొవ్వు కారణం కాదు. ప్రజలలో సైన్యంలో పెరిగిన అసంతృప్తే కారణం. కొవ్వు సెంటిమెంటుతో హిందూ-ముస్లిం సైనికులను చీల్చలేకపోయారు బ్రిటీషువాళ్ళు. మన ఆంధ్రప్రదేశ్‌లో పాపికొండల అంచున గోదావరి ఒడ్డున కొరుటూరు గ్రామంలో కోరుకొండ సుబ్బారెడ్డి బ్రిటీష్ వాళ్ళ మీద తిరుగుబాటు చేసి నానాసాహెబ్, తనకు సహాయపడటానికి వస్తాడని ఎదురుచూస్తూ బ్రిటీష్ వాళ్ళచే బంధించబడి ఉరితీయబడ్డాడన్న చారిత్రక వాస్తవం 1857 తిరుగుబాటు ఎంత ప్రభావాన్ని వేసిందో తెలియచేస్తోంది.

ఆదివాసుల తిరుగుబాటుదారులను బ్రిటీష్ అధికార యంత్రాంగం అత్యంత దారుణంగా హత్యచేసింది. గొడ్డళ్ళు, విల్లంబులు, బల్లేలు, ఈటెలు మొదలైన సంప్రదాయ ఆయుధాలతోనే వారు బ్రిటీష్ సైనిక పటాలాలతో పోరాడారు. లక్షలాది మంది ఈ పోరాటంలో అసువులుబాశారు. ఆనాటి తిరుగుబాట్లలో 1820-37 లలో కోల్‌లు, 1855-56లలో సంతాల్‌లు, 1879లో రంప గిరిజనులు, 1895-1901 లలో ముండాజాతి ప్రజలు చేసిన తిరుగుబాట్లు ముఖ్యమైనవి.

భారత రైతాంగం వలసదోపిడీకి వ్యతిరేకంగా అడుగడుగునా పోరాడింది. దాని తిరుగుబాట్లను బ్రిటీష్ రికార్డులు, రిపోర్టుల్లో బందిపోటులు చేసిన చట్ట విరుద్ధమైన చర్యలుగా(పితూరీలు) నమోదు చేశారు. ఈ రైతాంగ ప్రతిఘటనల వివరాలు అందుబాటులో వుంచలేదు. ఇంకా చరిత్ర పుస్తకాలకెక్కని ఎన్నో వివరాలను నేటికీ రహస్యంగా వుంచారని చరిత్రకారుల అభిప్రాయం. వాహబీ ఉద్యమం, నీలిమందు రైతుల పోరాటాలు ఇలాంటివే.

**కౌలు, భూమిశిస్తుల భారానికి వ్యతిరేకంగా పోరాటాలు**

వాహబీ ఉద్యమం బెంగాల్, బీహార్, పంజాబ్, మద్రాసు వరకు వ్యాపించింది.

1858 తర్వాత రైతాంగం తనకు ప్రత్యక్షంగా ముందున్న జమీందార్లకూ, వడ్డీ వ్యాపారులకూ, తోటల యజమానులకూ వ్యతిరేకంగా పోరాటాలు చేసింది.

విదేశీ తోటలయజమానులకు వ్యతిరేకంగా నీలిమందు రైతులు 1859-90ల మధ్య గొప్ప పోరాటం జరిపారు. బెంగాల్, బీహార్‌లలో ఈ పోరాటాలు తిరుగుబాట్ల రూపం తీసుకున్నాయి. 1866-68లలో బీహార్‌కు చెందిన దర్భాంగా, చంపారన్, బెంగాల్‌కి చెందిన జెస్సోర్‌లో 1883లో ఒకసారి, 1889-90లలో మరోసారి తిరుగుబాట్లు జరిగాయి.

**కౌలు:** మహారాష్ట్రలో 1872-76 మధ్య కౌలు చెల్లింపుని వ్యతిరేకించి, ఈస్టిండియా కంపెనీ రెవెన్యూ అధికారి (కలెక్టర్)ని, స్థానిక జమీందార్లనూ, వారి ఏజంట్లనూ రైతాంగం ప్రతిఘటించి, కౌలు చెల్లించ నిరాకరించింది.

**శిస్తు:** 1875లో మహారాష్ట్రకు చెందిన పూనా, అహ్మద్‌నగర్‌లో భూమిశిస్తు చెల్లింపుకి వ్యతిరేకంగా రైతాంగం పెద్ద ఆందోళన చేసింది. బ్రిటీష్‌వారు ఈ ప్రతిఘటనను మరఫిరంగులతో అణచి వేశారు. కేరళకు చెందిన మలబార్ రైతులు శిస్తుకి

వ్యతిరేకంగా 1836-54 మధ్య 22 సార్లు తిరుగుబాట్లు చేశారు. తిరిగి అదే భూమి శిస్తుకి వ్యతిరేకంగా 1873-80ల మధ్య మరిన్ని పెద్ద తిరుగుబాట్లు చేశారు. వాటిని పున్నప్రా, వాయిలార్ పోరాటం అంటారు. 1893-94లో అస్సాంలో శిస్తులు చెల్లించని రైతుల భూములను స్వాధీనం చేసుకోవ డానికి వ్యతిరేకంగా ఆ రైతులు ప్రతిఘటించారు. ప్రభుత్వ తూటాలకు అనేక మంది రైతులు చనిపోయారు.

ఈ కాలంలో జరిగిన పోరాటాలు బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఓడించలేక పోయాయి. రైతులు ప్రదర్శించిన చొరవ, ధైర్యసాహసాలు, విశ్వాసం, ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడటం లాంటి లక్షణాలు మాత్రమే సరిపోలేదని అర్ధం చేసుకో వచ్చును. అయితే అవి కొత్త ఆలోచనలను, కొత్త మార్గాలను వెతుక్కోవాలనే గుణ పాఠాన్ని మాత్రం అందించాయి. కేవలం చెదరుమదురుగా జరిగిన ఈ పోరాటాలు, నిర్మాణయుతమైన బ్రిటీష్ ఆధునిక సాధన సంపత్తి ముందు నిలబడలేక పోయాయి. ఒకటి నుండి పదేళ్లపాటు జరిగిన ఆ పోరాటాలు సాహసోపేతమైనవిగా, విజయం పట్ల అత్యంత దృఢమైన విశ్వాసంగలవిగా పేర్కొనవచ్చును. అయినా అవి ఫలించలేదు. కారణం ఈ పోరాటాలకు ఒక రాజకీయ నిర్మాణ మార్గదర్శకత్వం లేదు. సమాజం మొత్తాన్ని తీసుకొని పరిశీలనచేసే అవ కాశాలను ఆనాటికి గుర్తించలేకపోవడమే.

"ఎవరో కొందరు ఆందోళనాకారుల దుర్బుద్ధివల్ల విప్లవాలు జరుగుతాయన్న మూఢనమ్మకాల రోజులు ఎప్పుడో గతించాయి. విప్లవకర అలజడులు ఎక్కడ వున్నా వాటి వెనకనే ఏదో ఒక సాంఘిక ఆకాంక్ష ఉండి తీరుతుందని, అది తీరకుండా కాలం చెల్లిన వ్యవస్థా నిర్మాణాలు అడ్డగిస్తున్నాయని ఈ రోజుల్లో అందరికీ తెలుసు" **- మార్క్స్**

**(రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్)**

పోరాటాలకు తిరుగుబాట్లకు మూలాలు సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజంలను కాపాడే ఈ దోపిడీ వ్యవస్థలోనే నిబిడీకృతమై ఉన్నాయి. అందుకే ఆదివాసీ, రైతాంగ పోరాటాలు ముందుకు వచ్చాయి. (అయితే ఆనాటికి దేశ వ్యాపిత పరిస్థితిని ఆకళింపు చేసుకోగలగటం, నూతనంగా వస్తున్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక) సామాన్య ఆదివాసులు, రైతాంగ జనబాహుళ్యం వలస ప్రభువుల, వారి తాబేదార్లయిన జమీందార్ల, ఏజెంట్ల స్వభావాన్ని, వారి క్రౌర్యాన్ని ఆనాటిపైతరగతుల వారికంటే, ఉన్నత విద్యా వంతుల కంటే బాగా అర్థం చేసుకొన్నారు. సామ్రాజ్యవాద క్రౌర్యాన్ని, జమీందార్ల దాష్టీ కాన్ని, నిరంకుశ ఉద్యోగుల నిరంకుశత్వాన్ని అర్థం చేసుకోవడంలో సామాన్య ఆదివాసీ రైతాంగం కంటే విద్యావంతులు వెనుకబడి వున్నారు. వారిని ఈ పోరాటాలే మేల్కొలిపాయి.

తర్వాత 20వ శతాబ్దంలో జరిగిన రైతాంగ పోరాటాలకు అవి స్ఫూర్తినిచ్చేవిగా వున్నాయి. స్థానిక దోపిడీవర్గాల మూలంగా రైతాంగం, చేతివృత్తులపనివారి జీవితాలు సంక్షోభం, అలజడులతో నడుస్తూ సామ్రాజ్య వాద వలసపాలనపట్ల అసంతృప్తి, వ్యతిరేకతలు పెల్లుబుకుతున్న పరిస్థితుల్లో సమాజాన్ని గురించి నూతన రాజకీయ దృక్పథం అవసరమైంది. ఆధునిక పోకడ లను ఆకళింపు చేసుకొని, నూతన సాంఘిక జీవితంలోకి ఎలా మలుపు తీసుకోవాలో- సామాన్య రైతాంగం, ఆదివాసీ పోరాటాల ఫలితంగా మేల్కొన్న విద్యావంతులు ఈ సమస్యలను గురించి ఆలోచించ మొదలు పెట్టటం అనేది ఉద్యమాల అభివృద్ధి క్రమంలో ఒక గుణాత్మకమార్పుకు సూచిక అయింది.

19వ శతాబ్దం చివర(1880-90)ల నుంచి దళితజాతులు, మహిళలు సాంఘిక మార్పు కోసం నడుం కట్టారు. జ్యోతీరావ్ పూలే నాయకత్వాన మహారాష్ట్రలో, అలాగే మరికొందరి నాయకత్వాన కేరళలో, తమిళ నాడులో, ఇలా అనేకప్రాంతాలలో ఉద్య మాలు ప్రారంభమైనాయి. హక్కుల రక్షణ, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలూ, రైతు సంఘాలు(కిసాన్ సభలు) మొదలయ్యాయి. నూతన సాంఘికవర్గంగా కార్మికవర్గం ఆవిర్భవించింది. సాంస్కృతిక రంగంలో ప్రగతిశీల భావాల పునరుద్ధరణ, సాధారణ విద్యావ్యాప్తి, స్త్రీకి సాధారణవిద్యా వ్యాప్తి కోసం ఉద్యమాలు ముందుకు వచ్చాయి. బ్రిటీష్ ప్రభుత్వం తాను సాగించాల్సిన ఆధునిక కర్తవ్యాలను, సాంఘిక సంస్కరణ లను ప్రజలు నిర్ణయించుకొనే హక్కును పక్కన పెట్టింది. సనాతన మతశక్తులను, సంప్రదాయ సాంఘికశక్తులను ప్రోత్స హించింది. కొంతమంది భారతదేశ మేధావులు, బ్రిటీష్ వాళ్ళ ఈ సంకుచిత దృక్పథాన్ని పసిగట్టారు. జాతీయ విద్య, స్త్రీ విద్య, దళితలకు విద్య; సాంఘిక వివక్ష, అణచివేత వగైరా అంశాలను ముందుకు తెచ్చారు. మరోవైపు జమీందార్లు, భూ స్వాములు, సంస్థానాధీశులు, ప్రభుత్వంలోని నిరంకుశ అధికారులు, సంప్రదాయ మేధావులు సామ్రాజ్యవాదం పట్ల మక్కువతో, ద్వంద్వ వైఖరితో వ్యవహరించసాగారు.

ఈ నేపథ్యంలో 1885లో కాంగ్రెసు పార్టీ పుట్టింది. 1925లో కమ్యూనిస్టు పార్టీ పుట్టింది. కాంగ్రెసు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ కన్నా 40 సంవత్సరాలు పెద్దది, గదర్ పార్టీ, ఇంకా అనేక పోరాట గ్రూపులూ, భగత్‌సింగ్ నాయకత్వాన నవజవాన్ భారత్ సభ మరి కొన్ని దేశభక్తియుత గ్రూపులు ఏర్పడ్డాయి.

ఒక బ్రిటీష్ రిటైర్డ్ అధికారి ఎ.ఓ. హ్యూమ్ ఏర్పాటు చేసిన కాంగ్రెసు పార్టీ అతని ఉద్దేశాల పరిధిని అనివార్యంగా దాటింది. జాతీయోద్యమశక్తులు, కార్మికులు, రైతుల ఆందోళనలకు నాయకత్వం వహించాల్సివచ్చింది. జాతీయ విద్యా నినాదంతో జాతీయకళాశాలలు, స్కూళ్ళు నిర్వహించాల్సివచ్చింది. పత్రికలు స్థాపించి ప్రజలకు ఆలోచలను అందించాల్సి వచ్చింది. స్వాతంత్ర్య సాధనా కృషికి విద్యా, వైజ్ఞానిక సాంస్కృతిక కృషిని జోడించాల్సి వచ్చింది. బ్రిటీష్-ఇండియా ప్రభుత్వం సంస్కరణలను, భారతీయులకు పరిపాలనలో భాగస్వామాల్ని ప్రకటించింది. రుణ విమోచన చట్టాలను చేసింది. రైతులకు సహకార పరపతి సౌకర్యాలు కల్పించింది.

పంటల అభివృద్ధి పథకాలను రూపొందించింది. ప్రజలలో పెరుగుతున్న జాతీయ చైతన్యం, అభివృద్ధి కోసం వారు పడుతున్న తహతహల మూలంగా ప్రజా ఉద్యమాలు పెల్లుబుకుతూనే వచ్చాయి. అయినప్పటికీ బ్రిటీష్ దోపిడీ పీడన విధానాలు భారత దేశాన్ని కొల్లగొట్టుకుపోయేయి. తీరా సంస్కరణల చట్టాలు పెట్టిన తర్వాత వాటి అమలు కోసం మరికొన్ని దశాబ్దాలు రైతాంగం, చేతి పనివారలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు ఎదురు చూశారు. బ్రిటీష్ యుగం నుంచి నేటి వరకు మన దేశంలోని సంస్కరణల చట్టాల తీరు అలాగే వున్నది.

ఈ రాజకీయ కపటత్వాన్ని బ్రిటీష్ సామ్రాజ్యవాదులు చివరివరకూ సాగించారు. 1878లో పత్రికలపై ఆంక్షల చట్టం, 1879లో ఆయుధాల చట్టం చేశారు. పత్రికా స్వేచ్ఛ, బహిరంగ సభలలో మాట్లాడే స్వేచ్ఛ అరికట్టబడ్డాయి. ప్రజలు ఆయుధాలు ధరించే హక్కుపై నిషేధం పెట్టారు. వీటి గురించి 1876-80లలో బ్రిటీష్ వైస్రాయి లార్డ్ లిట్టన్ తన రహస్య నివేదికలో ఇలా రానుకున్నాడు. ''ఈ ఆశయాలూ, వాగ్దానాలూ నెరవేరేవి కావనీ, నెరవేర్చబడవనీ మనకు తెలుసు. వీటిని నిరాకరించుటకూ, దగా చేయుటకు ఈ రెండే సమస్యలు మనలను ఎదుర్కొన్నవి. మనం చుట్టూ మార్గాన్ని వెదికాము....."

దీనికి 30వేలమంది విలేఖరుల నుండీ అందిన నిమ్న వర్గాలకు చెందినవారి మధ్య సంభాషణల రిపోర్టులే ఆధారం. ఇంకా ఇలా వ్రాసుకున్నాడు: "నెలకొని ఉన్న పరిస్థితుల పట్ల ఆ వర్గాల వారు పూర్తిగా అసంతృప్తితో వున్నారు....దాని కోసం కలసికట్టుగా వుండదలిచారు. ఏదో ఒకటి, అంటే దౌర్జన్యమే. పాతకత్తులు, బల్లేలు, జాకీతాళ్ళు, తుపాకులు అసంఖ్యాకంగా పోగుచేయబడి వున్నవని అవసరమొచ్చినపుడు ఉపయోగించబడగలవనీ తెలిసింది.....

....అరాచకం ప్రబలడానికీ, ప్రభుత్వాన్ని, ఘరానా వర్గాలను నిశ్చేష్టులను చేయడానికి ఇది నాందిగా వుంటుంది ..... బహుశా నిష్కారణంగానే ప్రభుత్వం ఎడల పగతో వున్న కొద్దిమంది విద్యార్థులు అక్కడక్కడా నాయకత్వం వహించవచ్చునని ఊహింపబడుతున్నది. ఈ విధంగా ఆ తిరుగుబాటు ఒక ఐక్యతను చేకూర్చి జాతీయ తిరుగుబాటుగా నడపవచ్చును".

ప్రజా తిరుగుబాట్లను గురించిన పై పరిస్థితిని బ్రిటీష్ ప్రభుత్వమూ, దాని అధికారులు చాలా తీవ్రంగా తీసుకున్నారు. దానికి రక్షణ కవాటం ఒకటి కావాలనే నిర్ణయానికి వచ్చారు.

అది ''మన చర్యల వల్లనే ప్రారంభమైన, దిన దిన ప్రవర్ధమానమైన, బ్రహ్మాండమైన శక్తులు తుస్సుమని బైటకు రావడానికి ఒక ఎస్కేప్ వాల్వు అర్జంటుగా అవసరమైంది; మనం కాంగ్రెస్ కంటే ఉత్తమమైన రక్షణ కవాటాన్ని (సేఫ్టీ వాల్వు) నిర్మించలేము.''

దీనిని బట్టి ప్రజలలో పెరుగుతున్న విప్లవ ఆకాంక్షలకు మధ్యతరగతి వర్గాలను, బుద్ధిజీవులను తోడుగానీయకుండా ఉపయోగపడే వేదికగా కాంగ్రెసు ఉండగలదని భావించి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కాంగ్రెసుకు జన్మనిచ్చారు. కాంగ్రెసులో మితవాద, అతి వాద గ్రూపు ఏదైనా అంతిమంగా బ్రిటీష్ సామ్రాజ్య వాద విధానాలకు లోబడే నడిచాయి. సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహం, ఖిలాఫత్ ఉద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమాలన్నింటినీ కాంగ్రెసు అదరగండంగా తన అదుపులో వుంచింది. దీనికి బార్డోలీ తీర్మానం భారత ఫ్యూడల్ జమీందార్లకు, బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు జోహుకుందార్లుగా మెలగాలని చెప్పింది. అయినా రైతులు సామ్రాజ్యవాద పోలీసులను, జమీందార్ల మనుషులను ఎదుర్కొన్నారు. శిస్తులు, పన్నులు కట్ట నిరాకరించారు. చౌరీచౌరా, పెదనందిపాడు, పల్నాడు, కాళీపట్నం తదితర ప్రాంతాల్లో రైతాంగం ప్రతిఘటించింది. ఈ ఉద్యమాలను చట్టబద్ధంగా అణచడం కోసమే బ్రిటీష్ ప్రభుత్వం చట్టాలు చేసింది. 1909లో రాజద్రోహనేర చట్టం, సభలు, సమావేశాలలో ఉపన్యాసాలపై ఆంక్షలు, రౌలట్ చట్టం లాంటి నిర్బంధ చట్టాలను తెచ్చింది. కాంగ్రెసు అహింసా సిద్ధాంతం, ధర్మ కర్తృత్వ సిద్ధాంతం సామ్రాజ్యవాద, భూస్వామ్య శక్తులను కాపాడడానికేనని స్పష్టమయింది.

1914లో మొదటి ప్రపంచ యుద్ధం దుష్ప్రభావాలు భారత రైతాంగంపైన, కార్మిక వర్గంపైన తీవ్రంగా పడ్డాయి. యుద్ధావసరాల బరువును రైతాంగంపైన, కార్మిక వర్గంపైన ప్రభుత్వం మోపింది. కఠినమైన నిర్బంధ చర్యలకు పూను కొన్నది. డిఫెన్స్ ఆఫ్ ఇండియా చట్టాన్ని ప్రయోగించింది. తాము మర్యాదస్తులమని భావించిన వారిని స్వంతగృహ నిర్బంధాలలో వుంచింది. కరువు కాటకాలకు లోనైన రైతుల్ని బలవంతంగా సైన్యంలో చేర్పించింది. కాంగ్రెసునేత గాంధీ సైన్యంలో చేరి స్వరాజ్యాన్ని సంపాదించండని గుజరాత్ రైతులకు నచ్చజెప్పాడు. ధరలు పెరగడం, బజారులో సరుకులు కొరవడడం, యుద్ధ నిధికి బలవంతపు వసూళ్ళు, రోగాలు రొష్టులతో లక్షలాది మంది మరణించడం లాంటి దారుణాలకు భారత ప్రజలు గురయ్యారు. సైన్యంలో చేరిన రైతాంగం తిరుగుబాటు చేసింది.

1914లోనే గదర్ పార్టీ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఏర్పడింది. బ్రిటీష్ సామ్రాజ్య వాదాన్ని ఓడించడానికి తగిన సాధన సంపత్తి గల (ఆయుధాలు, డబ్బు, టెక్నికల్) మొక్కవోని కార్యకర్తలుగా భారతీయుల్ని తయారుచేసే లక్ష్యంతో పనిచేసింది. యుద్ధానికి సన్నాహాలు చేసుకొంటున్న దశలో గదర్ వీరులు చాలామంది పట్టుబడి పోయారు.

1925లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. భారతదేశ స్వాతంత్ర్యం, దోపిడీ పీడనల నుంచీ కార్మిక, రైతాంగం విముక్తి అన్న లక్ష్యాన్ని ప్రకటించింది. రష్యాలో కమ్యూనిస్టులు అధికారం సాధించడంతో భారతదేశంలో కార్మిక కర్షక రాజ్య స్థాపనకు అంకితమైన శక్తులన్నీ పీడిత ప్రజలలో పని చేయడం, జాతీయ స్వాతంత్ర్యో ద్యమంలో భాగంగా కృషి చేయటం, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, మహిళా, విద్యార్థి, యువజన సంఘాల నిర్మాణానికి పూనుకొన్నది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు వీరి

ప్రయత్నాలను ఎక్కువ ప్రమాదకరమైనవిగా భావించారు. కమ్యూనిస్టులను పురిటిలోనే దెబ్బకొట్టాలనుకున్నారు. పెషావర్, కాన్పూరు, మీరట్ కుట్రకేసులను కమ్యూనిస్టులపై బనాయించారు. రాజద్రోహ నేరాలు మోపి అరెస్టులు చేశారు. మీరట్ కుట్రకేసు ముద్దాయిలుగా కమ్యూనిస్టుల ప్రకటనలో సామ్రాజ్యవాదానికి, ఫ్యూడల్ జమీందారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం తమ లక్ష్యంగా, కార్మిక, కర్షకులను చైతన్య పరుస్తామని' వెల్లడించారు. దానికను గుణంగానే రైతాంగాన్ని, కార్మికుల్ని ఆర్గనైజ్ చేశారు.

ఈ కాలంలో పనిచేసిన 'సాహసిక భయోత్పాత' సంస్థలు దెబ్బతిన్నాయి. వారి దేశభక్తి, సర్వస్వాన్నీ త్యజించి పోరాడటం అన్న గొప్ప లక్షణాలు కమ్యూనిస్టు యువతకు స్ఫూర్తినిచ్చాయి. అదే సందర్భంలో సాహసోపేత ప్రతీకార చర్యలకు బదులు ప్రజా ఉద్యమాలను నిర్మించాలని, జాతీయ ఐక్యసంఘటనలో భాగస్వాములుగా వుంటూ కార్మిక కర్షక ఉద్యమాలను నిర్మించాలనే కార్యక్రమాన్ని అమలు జరిపారు.

1940 దశకం ప్రారంభంలో సాగిన రెండవ ప్రపంచ యుద్ధం నాటికి కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో వున్నది. వివిధ సంస్థలలో వుంటూ–కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో వుంటూ కొంతమంది కమ్యూనిస్టుల ఆశయాల సాధన కోసం కృషి చేశారు. ప్రభుత్వ నిర్బంధం మూలంగా రహస్యంగా పనిచేస్తూ విశాల ప్రాంతాలలో రైతు ఉద్యమాల్ని, మిలిటెంటు కార్మికోద్యమాల్ని వారు నిర్మించారు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం పిలుపు మేరకు యుద్ధంలో మిత్ర రాజ్య కూటమికి అండగా నిలిచారు. కాంగ్రెసు వాళ్ళు మొదటి ప్రపంచ యుద్ధంలో తీసు కొన్న వైఖరిలాంటి వైఖరినే కమ్యూనిస్టులు తీసుకున్నారనే విమర్శకు గురయ్యారు. బ్రిటీష్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై నిర్బంధాన్ని తొలగించింది. కాంగ్రెసు నాయ కులను అరెస్టు చేసింది. కమ్యూనిస్టులను తుంగలో తొక్కివేయాలన్నంత కసితో కాంగ్రెసు కమ్యూనిస్టులపై దుష్ప్రచారం లంకించుకొంది. జాతీయ స్వాతంత్ర్యం కోసం కమ్యూనిస్టులు లేరని, రష్యా విజయం కోసం బ్రిటీషు ప్రభుత్వం వున్న మిత్ర కూటమిని బలపరుస్తున్నారని కాంగ్రెసు ప్రచారం చేసింది. దేశభక్తుల నుంచి, ప్రజాతంత్రశక్తుల నుంచి కమ్యూనిస్టులను ఒంటరి చేయడానికి శాయశక్తులా అది కృషి చేసింది. మొదటి ప్రపంచయుద్ధంలో కాంగ్రెసు బ్రిటీషు సామ్రాజ్యవాద ప్రయోజనాల నిమిత్తమే దానికి దాసోహ మన్నది. కానీ,కమ్యూనిస్టులు ఆనాడు ప్రపంచ శ్రామికవర్గ ఆశాజ్యోతిగా వున్న రష్యాని కాపాడుకోవటమే కాదు. జర్మన్, హిట్లర్ ఫాసిజం సకల దేశాలను కబళించేదిగా మారిందని, అది ప్రపంచ ప్రజలందరికీ కార్మిక కర్షకులందరికీ శత్రువనే దృష్టి నుంచి ఆ వైఖరి తీసుకొన్నారు. జాతీయ స్వాతంత్ర్య పోరులో భాగస్వామిగా కార్మిక, కర్షకులను చైతన్య పరచటం, యుద్ధం మూలంగా సంభవించిన దుష్ప్రభావాలను వ్యతిరేకిం చడం, యుద్ధ లెవీలను తిరస్కరించటం లాంటి కర్తవ్యాలను అది విడనాడలేదు.

ఫాసిజానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు, 'ప్రజాయుద్ధ' పిలుపు. ఫాసిజానికి వ్యతిరేకంగా సకల ప్రజానీకాన్ని సమీకృతుల్ని చేయడం ఆ పిలుపు ఉద్దేశ్యం. అయితే భారతదేశంలో జాతీయ ఐక్య సంఘటనలో నుంచి విడి పోవడం వలన జాతీయోద్యమం సాగిస్తూ వున్న ఫలితాలను కాంగ్రెసు సొమ్ము చేసు కోవడానికి వీలుకల్పించారు. కాంగ్రెసు వారు కమ్యూనిస్టులను పంచమాంగదళ మన్నారు. కమ్యూనిస్టులను తరిమి వేయండనే ఉన్మాదం రెచ్చగొట్టారు. కమ్యూ నిస్టు సభలను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను చేశారు. కాంగ్రెసువాళ్ళ ఈ ప్రయత్నాలను కార్మికులలో, రైతాంగంలో తాము ఏర్పాటు చేసుకొన్న పునాదినుండీ తిప్పికొట్టి, పార్టీని అభివృద్ధి నిరోధకుల నుండీ కాపాడు కొన్నారు. మరింత వేగంగా ప్రజా ఉద్యమాల నిర్మాణానికి పూనుకొన్నారు. సామాన్య ప్రజల విశ్వాసాన్ని కమ్యూనిస్టులు కోల్పో లేదు. కాని రాజకీయంగా, సూత్రరీత్యా వేసిన తప్పటడుగుకి వారు చాలామూల్యం చెల్లించాల్సి వచ్చింది.

1934లో ఏర్పడిన కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, అకాలి పార్టీ, షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ లాంటి సంస్థలు నిర్దిష్టమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పాత్రను పోషించ లేకపోయాయి. ఈ శక్తులు కూడా కమ్యూ నిస్టులను సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఒక నినాదాన్ని మరో నినాదంతో పోటీపెట్టి చిన్న పరిధిలోనే అవి మిగిలిపోయాయి. కమ్యూ నిస్టులు జాతీయ ఐక్యసంఘటనకు నాయకత్వ బాధ్యత తీసుకోలేని బలహీనత వారిని వెంబడించి వెంటాడింది. నేటికీ అది వెంబడిస్తూనే వుంది.

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నాటి నుంచి నిర్బంధాలకు గురవుతూ సాగిన కమ్యూనిస్టుల పట్ల, అట్టడుగు వర్గాలను చైతన్యదీప్తులను చేసిన వారి పట్ల ఈ శక్తులు తీసుకొన్న వైఖరులు కమ్యూనిస్టులను శల్య పరీక్షకు గురిచేస్తూనే వుంది.

1930, 1940 దశకాలలో వెలుగు లోకి వచ్చి విస్తృతి పొందిన కమ్యూనిస్టులు – అభివృద్ధి నిరోధక మత సాంప్రదాయక శక్తుల నుంచి విడగొట్టుకొని ప్రజాతంత్ర, సమతాభావాలను కార్మిక, కర్షకులలో వెదజల్లారు. వారితో మమేకమయ్యారు. వారి హక్కుల కోసం నిలబడ్డారు. అయితే సాంఘిక విప్లవం రాలేదు. హరిజనోద్ధరణ, దళితఉద్ధరణ ఉద్యమాలు గానీ, అణచి వేతకు గురవుతున్న కులఉద్యమాలు గానీ భారత ప్రజలకు ప్రధాన శత్రువుని నిర్ణయించుకొని వ్యవహరించే రాజకీయ, సిద్ధాంత దృష్టిని ప్రదర్శించలేకపోయాయి.

బ్రిటీష్ వ్యతిరేక జాతీయోద్యమంలోని వివిధ ప్రవాహాలకు చెందిన శక్తుల కృషిని, వారు సాధించిన ఫలితాలను కూడా కాంగ్రెసు తన ఖాతాలో వేసుకొనే ప్రయత్నం చేసింది. కమ్యూనిస్టులను రష్యా మానస పుత్రులుగాను, భగత్‌సింగ్ ప్రభృతులను టెర్రరిస్టు హింసా దౌర్జన్యపరులుగానూ, సుభాష్ చంద్రబోస్‌ని జర్మనీ వారి

సహాయంతో దేశవిముక్తిని సాధించే ప్రయత్నం చేశారని, ఫాసిజానికి తోడ్ప డ్డాడనీ, అంబేద్కర్ రాజ్యాంగ రచయితల్లో వున్నాడనీ, కనుక ఈ ప్రవాహాలూ తప్పుడు వని నేనే అందరికీ నాయకుడునని చెప్పు కొన్నది.

కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌లోని అతి వాదులను, మితవాదులను వేరుచేసి గుర్తించే విషయాన్ని కాంగ్రెస్‌లో అభ్యుదయవాదులు, అభ్యుదయ నిరోధకులు అన్నదాకా వెళ్ళి తన నాయకత్వాన సాగవలసిన ఉద్యమాలను దృక్పథరహితంలోకి నెట్టింది. ఇది పాలకవర్గ సెక్షన్‌లపై భ్రమలు గొలిపే దానికి దోహదపడింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదం తన దేశంలో ఫ్యూడలిజాన్ని రద్దు పరచు కొన్నప్పటికీ పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి పరచుకొన్నప్పటికీ, భారతదేశం లాంటి తన వలసదేశాల్లో ఆ పని చేయ దలచుకోలేదు. మౌలికంగా ప్రజాతంత్ర మార్పులను అంగీకరించలేదు. సంస్క రణలు, చట్టాలతో భారత ప్రజలను జోకొట్టే ప్రయత్నం ఒక వైపూ–నిర్బంధ చట్టాలతో, సైనికబలంతో అణచివేతలతో మరోవైపు అమలు జరిపింది. భారత మేధావి వర్గం బ్రిటీష్ ఆధునికతకు ఆకర్షితులై మైమరచి పోయారు. తమ కర్తవ్యాన్ని నిర్వచించుకొని, స్వతంత్రంగా ముందుకు వెళ్ళడంలో రాజకీయ నాయకత్వంలో వర్గ స్పృహ కొరవడటం వలన, తప్పుదారి పట్టింది.

అయినా వర్గ పోరాట సిద్ధాంతాన్ని అమలు జరిపి చూపించాలన్న నిబద్ధతగల కమ్యూనిస్టు నాయకులున్న చోట పెద్ద ఎత్తున ప్రజల్ని కదిలించారు. సంస్థాన్ ప్రజల పోరాటాలను, జమీందారీ వ్యతిరేక పోరాటాలను, విద్యార్థి, యువజన, మహిళా, సాహితీ, సాంస్కృతిక రంగాలన్నింటిలో సామ్రాజ్యవాద వ్యతిరేక బూర్జువా భూస్వామ్య వ్యతిరేక లక్ష్యాలతో కృషి చేశారు.

రెండవ ప్రపంచ యుద్ధం కలిగించిన దుష్ప్రభావాలకు భారత గ్రామీణ ప్రాంతం, పట్టణ మధ్యతరగతి, కార్మికవర్గం అత్యంత దారుణమైన పరిస్థితులకు గురయ్యింది. ఈ కాలంలోనే వర్లీ ఆదివాసీ రైతాంగ పోరాటానికి, తెభాగా రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. ఈ పోరాటాలు అనేకానేక ఫ్యూడల్ దోపిడీ, సాంఘిక అణచివేతల బంధనాలను తెగ్గొట్టాయి. కాంగ్రెసు పార్టీ దాని అధి నాయకత్వాన్ని, నిలదీసి ప్రశ్నించేటట్లు చేశాయి.

కాంగ్రెసు సామ్రాజ్యవాదంతో రాజీ, ఫ్యూడల్ వర్గాలతో రాజీ, నిరంకుశ బూర్జువా వర్గంతో రాజీపడే పార్టీ అని, అది అత్యధిక ప్రజానీకానికి, గ్రామీణ రైతాంగానికి, కార్మికవర్గానికి వ్యతిరేకమని తేల్చగలిగింది. కానీ కమ్యూనిస్టు పార్టీలో మితవాద నాయకత్వానిది పై చేయిగా వుంది. కాంగ్రెసు పార్టీని సాత్వికమైన శక్తులు గల పార్టీగా సోషలిజాన్ని, ప్రజా స్వామికాన్ని కాంక్షించే పార్టీగా దానిపై ఆశలు పెట్టుకున్నది. ఈ కారణంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి శ్రామికవర్గ నాయకత్వాన్ని అందించాలని, జాతీయ ఐక్య సంఘటనలో భాగస్వామిగా వుంటూ, పీడిత గ్రామీణ పేదలను, కార్మికులను, మధ్యతరగతివర్గాలను, దేశభక్తులనూ కూడగట్టి కార్యక్రమం చేపట్టడంలో అది సఫలీకృతం కాలేక పోయింది. భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు ఉరి, చంద్రశేఖర్ ఆజాద్ అమరత్వం, సీతా రామరాజుని కాల్చి చంపడం లాంటి సంఘటనలకు సంబంధించిన అను భవాలను క్రోడీకరించి, విశ్లేషించ పూను కోలేదు. వారిని గొప్ప దేశభక్తులుగా, వీరులుగా మాత్రమే స్తుతించింది. భారతదేశ విప్లవ ప్రజా ఉద్యమంలో ఆ కాలం అత్యంత కీలకమైనది. జాతీయ ప్రజా స్వామిక విప్లవంలో సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యక్రమానికి, భూమి పై హక్కు దున్నేవాడి దని, అడవిపై హక్కు ఆదివాసీదనీ, సముద్ర తీరాలు, నదులుపై హక్కు అక్కడ నివసించే ప్రజలదనీ, ఆ వృత్తిదారులదనీ, మాట్లాడే హక్కు, అధికారం పొందే హక్కు, దాని కోసం తదనుగుణమైన పోరాట పద్ధతిని చేపట్టే హక్కులను జోడించడంలో అది సఫలీకృతం కాలేదు. సాత్వికత, పెద్దరికాలు లాంటి గౌరవనీయలక్షణాలు నాటి కమ్యూనిస్టుపెద్దలను అడ్డుకున్నాయి.

నాటి తెలంగాణా గ్రామీణప్రాంతం సంస్థానాధిపతుల నుండీ, భూస్వామ్య, దొరల పెత్తనాన్నుండీ విముక్తి పొంది, రైతులు, కూలీలదే రాజ్యం అన్నదాకా చేరింది. గ్రామరాజ్యాలు నెలకొన్నాయి.

ఈ ఉదాహరణ భారత కమ్యూనిస్టు పార్టీలో ప్రత్యేకమయినది. దాని కేంద్ర కమిటీకి కార్యక్రమం అంటే ఇలా వుండాలని చెప్పిన అనుభవమిది. ఉత్పత్తి సాధనాలు పీడకుల, దోపిడీదారుల చేతు లలో ఉన్నంతకాలం అధికారం వారిదే. అవి పీడితులైన కష్టజీవుల చేతులలో వుంటే వారిదే అధికారం. దాని వెంటనే సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను మార్చుకొనే పోరాటం మొదల వుతుంది. ఆర్థిక, రాజకీయం, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు పరస్పరాధారం కలిగి వుంటాయి. వీటిని దేనికి దానినే విశ్లేషించ బూనటం, మార్చబూనటం అవివేకం కిందికి వస్తుంది. అశాస్త్రీయమవుతుంది. మార్క్సిజం– లెనినిజం పట్ల అనుమాన భూతాలను తిప్పాలనుకునే వారు తప్ప మరెవ్వరూ దానికి పూనుకోరు. మార్క్సిజాన్ని సంప్రదాయక వాదమనీ, ఆర్థిక నిర్ణాయక వాదమనీ ఎగతాళికి పూనుకొన్నవారు విప్లవ ప్రజా ఉద్యమానికి హాని చేశారు. దానిపై అప విశ్వాసాలు పెంచడానికి తోడ్పడ్డారు. చివరికి బూర్జువావర్గ ప్రయోజనాలు నెరవేర్చే కృషిలో మునిగిపోయారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగిన పోరాటాలు ఆగిపోయి వుండవచ్చు, లేక విఫలమవుతూ వుండ వచ్చు. కానీ అది నెలకొల్పిన విలువలను తుడిచివేయాలనుకోవడం, అందుకు పూనుకోవటం సాధ్యం కానిది, ఎవరి తరమూ కాదు.

'కలిమి బలమూ కల్గు కర్షకుల సీమలో
కాని కాలము వచ్చి కలహములు చెలరేగ
కుంపినీ వాడొచ్చెరా-పలనాట
ఖైదుకొట్లను కట్టెరా
దాస్యమూ దోపిడీ దారిద్ర్యమూ హెచ్చి
పాడిపంటల మేలు బంగారు నా తల్లి
కరువు కాపురమైందిరా-పలనాడు
కంటనీరెట్టిందిరా
ఒక్క సుమూహర్తాన ఉప్పొంగి భరతోర్వి
స్వాతంత్ర్య శంఖము సింహనాదము చేయ
మేరువై నిలిచిందిరా-పలనాడు
ముందుండి పోరిందిరా

కనెగంటి హనుమంతు కోరమీసము త్రిప్పి
పలనాటి ప్రజలచే పన్ను లెగబెట్టించె
బలియిచ్చె హనుమంతునూ పలనాడు
పరప్రభుత్వపు గుండ్లకూ
ఆనాటి పౌరుషాలానాటి విక్రమా
లానాటి వైభవా లానాటి సంస్కృతు
లీనాటికీ చరితలో-పలనాడు
విరచించె బంగారుతో
వెనుక తరముల వారి వీర చరితల సిరులు
నార్వోసి త్యాగమ్ము నీర్వెట్టి పెంచరా
విరిసి సుఖములు పండురా-పలనాడు
వెలలేని మాగాణిరా

**పులుపుల వెంకటశివయ్య**

**'పలనాడు వెలలేని మాగాణిరా' నుండి (డిసెంబరు 1945)**

# నడవాలి నడవాలి

**-చెరబండరాజు**

**నడవాలి నడవాలి**
**నడవాలి నడవాలి.**

**నడచి వచ్చిన ముళ్ళ**
**బాట గుణపాఠాల**
**దీపాల వెలుగులో నడవాలి నడవాలి**

**గడిచిపోయిన కాల**
**గర్భమే తల్లిగా**
**నమ్రతను చాటుతూ నడవాలి నడవాలి**

**వర్తమానం శత్రు**
**వలల ఛేదించుకొని**
**చీకట్ల గెలవాలి నడవాలి నడవాలి**

**దారి మధ్యన నీరు**
**నిప్పదొరకని వేళ**
**లిప్పడే వూహించి నడవాలి నడవాలి**

**క్రూర మృగములు గండ**
**శిలలు మన కడ్డమని**
**గునపాలు అందుకొని నడవాలి నడవాలి**

**నగరాలు పగవాడి**
**కేంద్రాలు అందుకే**
**పల్లెదోవలబట్టి నడవాలి నడవాలి**

**కలిసి వచ్చే దీన**
**పాదాలు మనవింటి**
**బాణాలుగా మార్చి నడవాలి నడవాలి**

**సొంత సుఖములు కోట్ల**
**కష్టజీవులకన్న**
**పానీయులుజేసి నడవాలి నడవాలి**

**నీరుగార్చే గడ్డు**
**నిమిషాలలో లక్ష్య**
**సిద్ధికై దీక్షతో నడవాలి నడవాలి**

# వలస దోపిడీ, వలస పాలన, వలస పాలకులు చేసిన చట్టాలు ఇంకానా ? ఇకపై సాగవని పాలకులపై తిరుగుబాటు చేయండి!

**డా॥ బి.డి.శర్మ**

(30.9.2007న జరిగిన రైతుకూలీ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సులో ప్రధాన వక్తగా భారత్‌జన్ ఆందోళన్ ఛైర్మన్ డా॥ బి.డి.శర్మ పాల్గొన్నారు. **వలస పాలనకు వ్యతిరేకంగా రైతాంగ కార్మిక పోరాటాలు-నేటికీ ప్రాధాన్యత కోల్పోని భూమి సమస్య** అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆయన ప్రసంగ పాఠాన్ని అందిస్తున్నాం.)

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై ప్రతిఘటన ప్రారంభించి నేటికి నూట యాభై సంవత్సరాలు. ఇంక్విలాబ్ జిందాబాద్ సామ్రాజ్యవాద్ నాశ్‌హో అనే రెండు మహత్తర నినాదాలను భారత జాతికి అందించిన భగత్‌సింగ్ శత జయంతి సంవత్సరం ఇది. ఈ ప్రత్యేకత ప్రాధాన్యత కలిగిన ఈ సందర్భంలో ఈ సదస్సు నిర్వహణకు పూను కోవడాన్ని అభినందిస్తున్నాను. సామ్రాజ్యవాదుల పడగ నీడలోకి దేశాన్ని నెట్టివేస్తూ వ్యవసాయ రంగాన్ని కార్పోరేటీ కరణ చేస్తున్నారు. సాంప్రదాయకంగా చేస్తున్న వ్యవసాయానికి కాలంచెల్లిందని వాదనలను మనం వింటున్నాం. ఈ సంక్షోభపు స్థితిలో స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న ఈ స్థితిలో, మనం ఉన్న సంక్షోభ స్థితి నుండి ఎలా బయపడాలో తెలుసుకునేందుకు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని గురించి తెలుసుకుందాం. వలసవాదులు రాకపూర్వం ఈ దేశంలో భూమి ఎవరి సొత్తూ కాదు. అది గ్రామ సమిష్టి అనుభవంలో ఉండేది. సాగుచేసే రైతాంగానికే ఆ భూములపై హక్కు ఉండేది. యూరప్‌లో పరిస్థితి వేరు. రాజే భూమికి హక్కుదారుడు. రైతు ఆ రాజు యొక్క బానిస మాత్రమే. వాణిజ్యం కోసం భారతగడ్డపై అడుగుపెట్టిన ఆంగ్లేయులు అనేక కుట్రలు, కుతంత్రాలకు దిగారు. అధికారం కైవసం చేసుకున్నారు. అప్పులు ఇచ్చి ఆర్థిక పరాధీనతలోకి నెట్టారు. సిరాజుద్దౌలా ప్రభుత్వం పెద్ద ఎత్తున బాకీ పడింది. అప్పు తీర్చడానికి డబ్బుకు బదులుగా భూములను ఆంగ్లేయులు అడిగారు. రాజు తిరస్కరించాడు.




భూమి డబ్బుతో కొనేదికాదని పోరాడి సాధించుకునేదని చెప్పాడు. ప్లాసీ యుద్ధంలో పోరాడి ఓడిపోయాడు. ఈ సంగతి ఎందుకు చెబుతున్నానంటే రైతు నుండి భూమిని కాజేయటానికి లక్షల రూపాయలు ఎర జూపినా ఇవ్వకపోతే బల వంతంగా రైతుల నుండి గుంజుకుంటు న్నారు. ప్రజలు మాత్రం పోరాడుతూ మేం చనిపోయిన తరువాత మాత్రమే మా పొలాలను స్వాధీనం చేసుకోగలరని చెబుతూ పోరాడుతున్నారు. ఈస్టిండియా కంపెనీ కుట్రలకు సిరాజుద్దౌలా బలయ్యాడు. ఈ యుద్ధంలో గెలుపొందిన తరువాత ఆంగ్లేయులు భూమిపై శిస్తు వసూలుచేసే పద్ధతిని ధాన్యం రూపంలోగాక 3/4వంతు పంటకు సమాన విలువైన డబ్బు రూపంలో శిస్తు వసూలు చేయడం మొదలుపెట్టారు. ప్రజలు ఈ విధానం వలన తీవ్రమైన దుస్థితిలోకి నెట్టబడ్డారు. ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటల్నే పండించమని రైతాంగాన్ని శాసించారు. ఈ క్రమంలోనే 1857లో తిరుగుబాటు వచ్చింది. దీనిని సిపాయిల తిరుగు బాటుగా పేర్కొనడం సరికాదు. ఇది ప్రజల తిరుగుబాటు. తమ మనుగడ కోసం సాగించిన పోరాటం. మొఘలుల చివరి చక్రవర్తి బహదూర్‌షా తిరుగుబాటుకు ప్రతినిధి. ఈయన ఢిల్లీ ప్రజలకు రాసిన లేఖలో ఇలా చెప్పారు. ఇప్పుడు నేను నామమాత్రపు పాలకుడ్ని. మీరే (ప్రజలే) అన్ని విషయాలు నిర్వహించుకుంటున్నారు. ఇప్పుడు బ్రిటీష్‌వాళ్ళు ఫిరంగులతో కొత్త విపత్తు తెచ్చారు. మీరే వీటి నుండి రక్షించుకోండి. దీనికి ప్రజలు అన్ని విభేదాలను విస్మరించి ఆ విన్నపాన్ని మన్నించి ప్రజా సైన్యంగా ఏర్పడి కంపెనీ సైన్యాలకు వ్యతిరేకంగా యుద్ధరంగంలోకి దూకారు. పాకీ వృత్తిచేసే వ్యక్తి ఒక నాయకుడిగా పోరాటం నడిపించాడు. కనుక ఇది సైనిక తిరుగుబాటుకాదు. గ్రామాల్లోని సోదర సోదరీమణులు చేసిన తిరుగుబాటు. భారత రైతాంగపు తిరుగుబాటు కొనసాగింపుగానే సాగిన సైనికుల తిరుగుబాటు. బ్రిటీష్

వాళ్ళు భారతదేశంలో ఎక్కడా గిరిజన ప్రాంతాలపై తమ ఆధిపత్యాన్ని, దురాక్రమణను స్థాపించలేకపోయారు. ప్లాసీ యుద్ధంలో ప్రజలు ప్రేక్షక స్థానంలో వున్నారు. కాని పాల్గొనలేదు. ఆదివాసీ ప్రాంతాలలో ఈ విధమైన పరిస్థితి లేదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తమ ప్రాణాలకన్నా మిన్నగా ప్రేమించే ఆదివాసీ ప్రజాసైన్యం ప్రతిఘటనదెబ్బకు బ్రిటీష్‌వాళ్ళు బెంబే లెత్తారు. ప్లాసీ యుద్ధంలో భూభాగాలు సంపాదించినంత సులువుగా ఆదివాసీ ప్రాంతాలను జయించలేకపోయారు. ఈ అవమానభారంతోనే ఆంగ్లేయులు ఆదివాసీ ప్రాంతాలను నిషిద్ధ ప్రాంతాలుగా ప్రకటించి వాటిని దూరంగా ఉంచి తమ అపజయాన్ని దాచుకోడానికి ప్రయత్నించారు. మీకు తెలుసో లేదో! పెద్దపెద్ద ఆదివాసీ ప్రాంతాలనే కాదు చిన్న చిన్న 100 లేక 150 మంది నివసించే అండమానుదీవులను కూడ ఆక్రమించలేకపోయారు. ఆనాటినుండి ఈనాటికీ మన పాలకులు వెళ్ళలేకపోయారు. ఆ దీవులు మన దేశంలో లేవా? మరి ఎందుకు మనం అక్కడికి వెళ్ళలేకపోయాము. అక్కడ మరొక దీవి ఉంది. అక్కడ 400 మంది ఆదివాసీలు ఉన్నారు. అక్కడకు బ్రిటీష్‌వాళ్ళు పాలించినంత కాలం వెళ్ళలేదు. కాని వారిని లోబర్చుకోవడానికి మాత్రం మన పాలకులు వాళ్ళకు చక్కెర, పొగాకు ఇచ్చి వారిని లోబర్చుకొని వారి ధైర్యాన్ని నాశనంచేశారు. మన పాలకులు ఇలా ఎందుకు చేసారు అని నేను ఆశ్చర్యపోయాను. అండ మాన్ దీవిలో ఆదివాసీల గురించి ఒక్క విషయం చివరిగా చెప్పాలి. వాళ్ళలో బ్రిటీష్ వాళ్ళతో చేతులు కలిపినవారు కాల గమనంలో కలిసిపోయినా ఎదిరించినవారు మాత్రమే నిలబడ్డారు.

నేను మధ్య భారతదేశంలో జార్ఖండ్ ప్రాంతంలో ఆదివాసీ సమూహాలు ఉండే ప్రాంతం నుండి వచ్చాను. అక్కడి ప్రజలు తాము దేవుడి బిడ్డలమనీ, తమకు భూమి దేవుడిచ్చాడనీ నమ్ముతారు. బ్రిటీష్‌వాడు వారి దగ్గర రెవిన్యూసుంకం విధించి వసూలుచేయడానికి ప్రయత్నించాడు. ప్రజలు రెవిన్యూ అంటే ఏమిటి? మేం ఎందుకు కట్టాలి? ఈ భూమి సాగుచేసి పంటలు పండించిన మేము శిస్తు ఎందుకు కట్టాలి అని ప్రశ్నించారు. మేం బ్రతకడానికి డబ్బు అవసరం అని బ్రిటీష్‌వాడు ఆ ప్రజలతో చెప్పాడు. నీవు బ్రతకడానికవసరమైన దానిని మేం చందాగా యిస్తామని ప్రజలు చెప్పారు.

ఈ రోజు రెవిన్యూ రికార్డుల్లో మనం ఇచ్చింది చందా అని రాసి ఉంటుంది. ఆ రోజు బ్రిటీష్‌వారు బ్రతకడానికి చందా ఇస్తామన్నాము. అదే పేరు ఆనాటి నుండి ఈనాటి వరకు ఉంది. ఈ రోజు పాలకులకు మనం చందాలు ఇవ్వాలా? వాళ్ళు చందా ఇవ్వాల్సిన పరిస్థితుల్లో ఉన్నారా? అని ఆలోచించాలి.

1857 నుండి 1945 మధ్యలో బ్రిటీష్ సామ్రాజ్యవాదులు మనల్ని పరిపాలించినపుడు ఈ తిరుగుబాటుకు కారణం గ్రామీణ వ్యవస్థలో ఉంది. దాన్ని నాశనం చేయాలని భావించారు. అందుకే మనల్ని బానిసలుగా తయారుచేసే విధానాలనే ప్రవేశపెట్టారు. 1857 తర్వాత పాలనా విధానంలో మార్పులు తెచ్చుకొని మనల్ని అర్ధ బానిసలుగా మార్చారు. ఈ పని గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు అటవీ ప్రాంతాల్లో కూడ చేశారు. అక్కడ ఏం జరిగిందో మనకు తెలుసు. 1947లో స్వాతంత్ర్యం వచ్చింది. కాని ఆ బానిస చట్టాలే ఇంకా ఎందుకు ఉన్నాయి? అటవీ హక్కుల పరిరక్షణ పేరుతో, అడవుల రక్షణ పేరుతో చేసిన చట్టాలన్నీ అడవి బిడ్డలైన ఆదివాసీలను దొంగలుగా, నేరస్తులుగా చూసే వలస వాదుల దృష్టికోణం నుండి రూపొందించారు.

ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టునే చూద్దాం. ఈ ప్రాజెక్టు ఎందుకోసం? అనే ప్రశ్నను పక్కనబెట్టినా నిర్వాసితులయ్యే గిరిజనులకు చూపిస్తున్న ప్రత్యామ్నాయాలు ఏమిటి? ఈ అడవిని వదలం, ఈ భూముల్ని వదలం అని గిరిజనులు ఆందోళనచేస్తుంటే వారిని అభివృద్ధి నిరోధకులుగా దేశ వ్యతిరేక శక్తులుగా ముద్రలు వేయడం ఏమిటి! హక్కులకోసం పోరాడుతున్న గిరిజనులను చిత్రహింసలు పెడుతున్నారు. ఈ రోజు అభివృద్ధి గురించి అందరూ మాట్లాడుతున్నారు. అయితే అభివృద్ధి అంటే ఏమిటి? ఎవరికి ఉపయోగపడుతుందని మనం పరిశీలించాలి. సంపన్నవర్గాలకు ఉపయోగపడే విధంగా సాగిన యీ అభివృద్ధి చర్యల ఫలితంగా నిర్వాసితులయిన వారిలో 50% గిరిజనులున్నారు. అంటే మొత్తం 4 కోట్ల నిర్వాసితులలో 2 కోట్లు గిరిజనులు. వీరందరికీ భూములు పంచామని చెబుతున్నారు. అవి సాగుయోగ్యమైనవి కావు. మానవ మాత్రులు ఉండ లేరక్కడ. ప్రభుత్వ రంగం-ప్రైవేటురంగం పరిశ్రమల కోసం సేకరించిన భూములన్నీ ఎక్కువ శాతం ఆదివాసీలవే. ఆ పరిశ్రమలలోనే వాళ్ళను దినకూలీలుగా మార్చివేస్తున్నారు. ఇదేనా అభివృద్ధి? ఈ అభివృద్ధిని మనం వ్యతి రేకించాలి? ఈ భూమి, నీరు, గాలి మనవి. ఇది మన సమిష్టి సంపద. వీటి ముందు నువ్వు సృష్టించిన కాగితాలు ఏవీ చెల్లవని చాటి చెప్పాలి. మన దేశంలో అభివృద్ధి కార్యకలాపాలు మన సాంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి.

చాలా ప్రాంతాలలో ప్రజలు వారిని (పాలకులను) ప్రతిఘటిస్తున్నారు. ఇపుడు ఏ మాత్రమైనా అభివృద్ధి జరిగింది అంటే శ్రమచేసే ప్రజలవలనే జరిగింది తప్ప పాలకుల వలన కాదు. పాలకులు తాము అభివృద్ధిని చట్టప్రకారమే చేస్తామంటున్నారు. అది పచ్చి మోసం. ఎవరైతే ఈ భూమికై కష్టపడుతుంటారో, వారికే అన్ని చెందుతాయి.

**మిత్రులారా!**

ఈ రోజు ప్రత్యేక పరిస్థితుల్లో, మలుపులో మనం ఉన్నాం. మన భూములను కాజేయడానికి వస్తే ఎదుర్కోవాలి. ఈ భూమి ఎవరిది అని చెప్తున్నామో, ఆ ప్రజలంతా ఈ పరిస్థితుల్లో ఈ భూమిని వదలబోమని పోరాటం చేయాల్సిందిగా కోరుతున్నాను. పోలీస్, మిలటరీ వ్యవస్థలలో ఉద్యోగాలు చేస్తున్న ఈ ప్రజల బిడ్డలంతా ఉద్యోగాలు వదిలిపెట్టి పాల కులు చేస్తున్న ఈ ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం దారిలో పోరాడాలని పిలుపునిస్తున్నాను.



ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓపిడిఆర్) 1986లో 'ప్రజాస్వామ్య హక్కులు, అవగాహన-ఆచరణ' అనే పుస్తకాన్ని ప్రచురించి రాష్ట్రంలో ప్రజా ఉద్యమాభిమానుల మన్ననలందుకుంది. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో జరిగిన అనేక మలుపుల్లో ఓపిడిఆర్ వైఖరిని, ఆచరణను ఈ పుస్తకానికి జోడిస్తూ, 'ముట్టడిలో ప్రజాస్వామ్య హక్కులు' అనే 800 పేజీల పుస్తకాన్ని ఓపిడిఆర్ సరికొత్తగాఈ వెలువరించింది.

స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడిన గత ఆరు దశాబ్దాల కాలంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు ఒకవైపున ప్రజాస్వామ్యాన్ని గురించి బాకాలూదుతూనే నిరంతరం ఏ విధంగా పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారో ఈ పుస్తకంలోని, అనేకమంది మేధావుల ఉపన్యాసాలు, ఓపిడిఆర్ నిజనిర్ధారణ కమిటీల రిపోర్టుల ద్వారా మరింతగా బోధపడుతుంది.

1975లో ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో అంతర్గత ఎమర్జన్సీని విధించిన రోజు మరియు అంతర్జాతీయంగా పోలీసు హింసకు వ్యతిరేకంగా 70 దేశాలు సంతకం చేసిన రోజైన జూన్ 25న (25.6.07న) గుంటూరులో 'ముట్టడిలో ప్రజాస్వామ్య హక్కులు' అన్న పుస్తకాన్ని ఆవిష్కరించటం యాదృచ్ఛికం కాదు.

పౌర, ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమానికి సంబంధించి స్పష్టమైన అవగాహన, సిద్ధాంత పరిజ్ఞానం కలిగి గత 3 దశాబ్దాలుగా ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమంలో కృషి చేస్తున్న ఓపిడిఆర్ ప్రచురించిన 'ముట్టడిలో ప్రజాస్వామ్య హక్కులు' పుస్తకాన్ని ప్రజా ఉద్యమ కార్యకర్తలు, ప్రజాతంత్రవాదులందరు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

# రాబోవు కాలము

- భాయిరాజ్

ఎవరు వేసిన ముందడుగు
భాగమున
ముందుకాలము పుట్టునో
వారె ధీరులు! వారె వీరులు!
వారె నిర్మాతలు!

ఏరుపూసి, నారుపోసి,
దమ్ముపట్టి నాట్లు వేసి
పంట భూములు పట్టుకొండన్నో
రాబోవు కాలము రైతుదేనన్నో

ఎవరి నుదిటి ముచ్చెమట ఊటన
రానున్న 'స్వర్గము'
ఎగజిమ్మ పూనునో
వారె శూరులు! వారె వీరులు!
వారె ఉద్యమకారులు!
ఇరుసుపట్టి ఇంజన్లు తిప్పి సరుకు
మోసి సంపదలు తీసి
ఫ్యాక్టరీలను పట్టుకొండన్నో
రాబోవు కాలము కార్మికునిదేరన్నో
పొద్దు పొడిచె అర్ధరాత్రి
జబ్బచరిచె జాము ధాత్రి
పాదాలనుండి శిరసుదాకా
ఎగబొడుచుకొచ్చెను
ఉడుకుడుకు సత్తువ
స్వేదజలమున సూర్యుడుదయించె
పిడికిళ్ళ పడమరన-
కన్నీటి కణమున సూర్యుడుదయించె
కన్నెరుపు తూర్పున-
ఎవరువేసిన ముందడుగు భాగమున
ముందుకాలము పుట్టునో
ఎవరి నుదుటిన ముచ్చెమట ఊటన
రానున్న 'స్వర్గము' ఎగజిమ్మపూనునో
వారె శూరులు! వారె వీరులు!
వారె ఉద్యమ నిర్మాతలు!

## దోపిడి రాజ్యం

- విజయ్

దోపిడిరాజ్యం దళారి రాజ్యం-పోలీసురాజ్యం తుపాకి రాజ్యం

గాంధీ టోపీ ఖద్దరు బురఖా-న్యాయస్థానం చువ్వల బోనూ
నిర్బంధాలను వెతికే చట్టం-నరకం చూపే జైలు గోడలూ

ఆకలి అంటే లాఠీ దెబ్బలు-పనులిమ్మంటే బుల్లెట్ల వర్షం
అదేమంటే జైలుశిక్షలూ-అక్రమమంటే తుపాకి కాల్పులు

గాలి పీల్చితే నీరు తాగితే-ఆలోచిస్తే నోరు విప్పితే
నిషేధాజ్ఞలూ-నిర్బంధాలూ జైలు గోడలూ దేశం నిండా

నలభై ఏడున గద్దెనెక్కిరి-ఇన్నియేళ్ళుగ మనల దోచిరి
మారిందేమిటి-పోయిందేమిటి! వచ్చిందేమిటి!
ప్రజాస్వామ్యమనె తుపాకి పాలన-స్వాతంత్ర్యమ్మనె దళారిపాలన

# కోరన్న మంగన్నలు అమరత్వం పొందిన 40 ఏళ్ళ నాటి శ్రీకాకుళం

మేఘనాద్

1967 అక్టోబరు 31. పాత శ్రీకాకుళంజిల్లా గిరిజనులు పీడన, అణచి వేతలకు వ్యతిరేకంగా సంఘటితపడుతూ, వర్గపోరాటాలలో రాటుదేలుతూ వచ్చిన గిరిజన స్త్రీ, పురుషుల పెల్లుబికిన ఆక్రోశం, వారి పోరాటదీక్షలపై దోపిడీ భూస్వామ్య వర్గం కుట్రతో, పిరికితనంలో దారుణానికి ఒడిగట్టిన రోజు. భూస్వామ్యవర్గాలు ఆశించిన దానికి భిన్నంగా, సంఘటిత ప్రజాఉద్యమాల ఫలితంగా పదునెక్కిన వర్గ పోరాటానికి 1967 అక్టోబర్ 31 సాక్షిగా నిలబడి ఉంది. నిత్య నిరంతర వర్గ సంఘర్షణల ప్రతిరూపంగా 1967 అక్టోబర్ 31 కనబడుతూ వుంది. ఆ రోజున సంఘ ఐదవ మహాసభకు మొండెంఖల్లుకి ఏజెన్సీ నలుమూలల నుండీ చీమలదండులా కదలబారిన గిరిజన స్త్రీ, పురుషుల పోరాట దీక్ష, ఉత్సాహాలు చూసిన భూస్వామ్య పెత్తందారీవర్గాలు తట్టుకోలేకపోయాయి. ఆ సభకు తరలివస్తున్న ప్రజానీకం- ఎర్ర చీరలు కట్టి, తలకు నూనెరాసి, చక్కగా దువ్విన తలల్ని దువ్వెనలతో, అడవి పూలతో అలంకరించుకొని చంకల్లో, భుజాల మీద పిల్లలతో, ప్రతివారి చేతిలో మహాసభకోసం బియ్యం, పప్పులు, కూర గాయలు, చేతికర్రలతో కొండలపై నుంచి బారులు బారులుగా వస్తున్న గిరిజన ప్రజానీకాన్ని చూచి భూస్వామ్య వర్గాలకు కంపరమెత్తింది. కుట్రపన్నారు. మొదట స్త్రీలపై దాడి, దాడి నుంచి రక్షించు కోవడానికి వెళ్ళిన పురుషులపై తుపాకులతో దాడి. సంఘ కార్యకర్తలు ఆరక కుమ్మర (కోరన్న) కొండ గొర్రె మంగలు (మంగన్న) తుపాకులకు బలయ్యారు.

గిరిజన ప్రజానీకం ఆగ్రహోదగ్రు లయ్యారు. భూస్వామ్య చర్యలకు నిరసనగా ఏజెన్సీ మొత్తం కదలబారింది. భూస్వాముల పనులను బందుచేశారు. కొన్నిచోట్ల వారి ఆస్తులను నాశనం చేశారు. అది న్యాయ మైన ఆగ్రహమే. ఈ ఆగ్రహాన్ని అదుపుచేసే పేరుతో నెల తరువాత రిజర్వు పోలీసు క్యాంపులు దింపింది ప్రభుత్వం. గిరిజన ప్రజలు సాగించిన ఆందోళన నిరసనోద్య మాలకు మూల కారణాలను దోపిడీ వర్గ ప్రభుత్వం పట్టించుకోలేదు. భూస్వాముల పక్షాన వారి రక్షణ కోసమే గిరిజనోద్యమంపై అప్రకటిత యుద్ధం మొదలుపెట్టింది.

ఇంగ్లాండుకు చెందిన ప్రఖ్యాత రచయిత థామస్ పైన్ 1792లో వ్రాసిన "మానవ హక్కులు" అనే గ్రంథం నుంచి కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన గ్రంథంలో ఉల్లేఖిస్తూ "ప్రభుత్వాలు ప్రారంభమైనది మొదలు, దగాలోనూ, లంచగొండితనం లోనూ అధికతరమైన పరిపక్వత కాక పోయినా అధిక పరిపక్వత సాధించినది ఇంగ్లాండ్ ప్రభుత్వమే. నిరంతరం దీనిని చూసస్తూన్న అలవాటువల్లనే వివేకం, ఆలోచన నశించిపోకుండా ఉన్నట్లయితే ఇది నీకు కొత్తకాదు, తెలియని విషయమూ కాదు'' ప్రభుత్వాల తీరు భౌతిక పరిస్థితులూ, ఉద్రిక్తతలు, ఆందోళనలు బద్దలు అయ్యే పరిస్థితికి దారి తీయవా? అలా దారితీస్తే దానికి బాధ్యులెవరని ప్రశ్నించారు.

''ఈ నేపధ్యంలోనే నానాటికీ పెరుగుతూ తిరుగుబాటుగా ప్రజ్వరిల్లుతున్న అసంతృప్తిని మనం అర్దం చేసుకోవాలి. పోలీసుల కుమ్మక్కుతో, మద్దతుతో భూస్వా ములు సాగిస్తున్న దౌర్జన్య పూరితమైన హింసాయుత కార్యకలాపాల వల్ల, నిరం తరం వారు సాగించే రెచ్చగొట్టే చర్యల వల్ల ఈ ప్రజ్వలన సాగుతోంది. ఈ అశాంతి, ప్రజ్వలనలో అది నక్సల్బరీ లేక శ్రీకాకుళం, గోపి వల్లభపూర్ లేక తూర్పుగోదావరి, ముషాహారి లేక ఖమ్మం లేక వరంగల్ అన్నిచోట్ల ఒకే విధమైన క్రమాన్ని మనం గమనించవచ్చును. ఈ అన్నిచోట్ల స్థానిక ప్రజలను వారి భూములనుండి తొల గించటం, చట్టవిరుద్ధమైన మామూళ్ళు వసూలు చేయడం, బలవంతపు వెట్టి చాకిరీ, అతితక్కువ వేతనాలు, అధిక వడ్డీరేట్లు ఇవన్నీ ఈ ప్రాంతాల ప్రజలను పీల్చిపిప్పి చేశాయి. ఈ అన్నిప్రాంతాలలోను మెరుగైన వేతనాలకోసం, భూమికోసం, వెట్టిచాకిరీ, తక్కువ వేతనాలు, పిచ్చి కొలతలు, మామూళ్ళలాంటి ఫ్యూడల్ దోపిడీ రూపాలను రద్దుచేసుకోవటానికి గిరిజనులను సంఘటితపరచడం తమ న్యాయమైన బాధ్యతగా కమ్యూనిస్టులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో వారు మొదట భూస్వాముల హింసనే ఎదుర్కోవలసి ఉంది. ఈ అన్ని ప్రాంతాలలోను పోలీసులు, ప్రభుత్వం. భూస్వాముల పక్షమే వహిస్తున్నారు. అన్ని చోట్ల కథ ఇంతే!

శ్రీకాకుళ గిరిజన రైతాంగ తిరుగు బాటును క్లుప్తంగా సమీక్షించినట్లయితే ప్రజలపక్షాన నిలుచుని పోరాడుతున్నది విప్లవకారులో లేక ప్రజలను దోపిడీ దౌర్జన్యాలకు గురిచేస్తున్న భ్రష్టుపట్టిన భూస్వాములు లేక ప్రభుత్వంలోని వారి ప్రతినిధులో అర్థం అవుతుంది. వీరిలో వాస్తవంగా కుట్రదారులెవ్వరో, నిజాన్ని బట్టబయలు చేస్తుంది. సాధారణంగా కమ్యూనిస్టు వ్యతిరేకత ఉండే మన దిన పత్రికలలో కొన్ని వార్తలు, వ్యాఖ్యలు చూసినా భూస్వాముల, ప్రభుత్వ విప్లవ ప్రతిఘాత హింసాకాండను తమ సొంత విప్లవకర హింసతో ఎదుర్కోవడం తప్ప

గిరిజన రైతాంగానికి మరొక దారి లేదని స్పష్టం చేస్తుంది.

రాజ్యాంగంలోని 5వ షెడ్యూలులో గిరిజనులకై ఉద్దేశించబడిన రాజ్యాంగ రక్షణలు, ప్రత్యేక హక్కుల గురించి భూస్వాములు ఎప్పుడూ లక్ష్యపెట్టలేదని స్పష్టమవుతుంది. ఎందుకంటే భూస్వాముల ప్రయోజనాలకు ప్రతిగా ప్రజలలోని ఏ భాగానికైనా ప్రత్యేకంగా కల్పించబడిన రాజ్యాంగ రక్షణలు ఒట్టి బూటకం మాత్రమేనని భూస్వాములకు తెలుసు. దీన్ని ఆచరణలో సహితం వారు రుజువు చేశారు. తుపాకి ఎవరి చేతిలోఉంటుందో, దానిని నిర్దాక్షిణ్యంగా ఎవరు ఉపయోగించగలుగుతారో వారిదే అధికారమని కూడా భూస్వాములకు బాగా తెలుసు. ఈ విధంగా భూస్వాములే సత్యమైన ఈ చారిత్రక సూత్రాన్ని అమాయకులైన గిరిజనులకు బోధించారు. (తాకట్టులో భారతదేశం).

శ్రీకాకుళం గిరిజన తిరుగుబాటు గురించి ఒక సమీక్షను ప్రచురిస్తూ "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక (4.1.1970) తమ "దుర్భర పరిస్థితులవల్ల అమిత దురాశా పరులైన మైదాన ప్రాంతాలవారు పెట్టే కడగండ్ల వల్ల విసిగి వేసారిన శ్రీకాకుళం గిరిజనులు తమకు జరిగిన అన్యాయాలకు ప్రతీకారంగా హింసాయుత చర్యలకు దిగారని" తగిన విధంగా ప్రచురించింది (తాకట్టులో భారతదేశంలో). మన దేశంలోని అణగద్రొక్కబడిన, తమ భూముల నుండి వెళ్ళగొట్టబడిన రైతాంగానికి ఆయుధాలు చేపట్టడం ఒక్కటే తమ విముక్తి మార్గమన్న వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చిన ఈ పోరాట చరిత్ర ఈ సమయంలో చాలా అవసరం. (తాకట్టులో భారతదేశం).

భూస్వాముల అత్యాచారాలు లెక్కకు మిక్కుటంగా ఉన్నప్పటికీ, ప్రధానంగా గత ఏడాది అక్టోబర్ 31 సంఘటన తిరుగుబాటును రగిల్చింది. ఆ రోజున నినాదాలిచ్చుకుంటూ పార్టీ సమావేశానికి వెళ్తున్న గిరిజన బృందంపై భూస్వాములు దాడి చేసి బాదారు, గిరిజనులు దీన్ని తిప్పికొట్టడంతో కొందరు భూస్వాములు తుపాకులు కాల్చారు. అక్కడికక్కడే ఇద్దరు గిరిజనులు చనిపోయారు.

ఇది భూస్వాముల పరాకాష్టకు చేరిన చర్యేగాని, 1960–61 నుంచే భూస్వాములు గిరిజనోద్యమాన్ని అణచి వేయడానికి దాని నాయకత్వాన్ని మట్టుబెట్టటానికి ప్రయత్నించారు. కామ్రేడ్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలపై హత్యాప్రయత్నాలు చేసింది ఈ సంవత్సరం లోనే. 1964 మొండెంఖల్ గ్రామసర్పంచ్‌పై దాడి, గుమ్మ లక్ష్మీపురంలో గిరిజన కార్యకర్త వల్లభుడిపై దాడి, కామ్రేడ్స్ రామలింగా చారి, దుప్పల గోవిందరావు, వేణుగోపాల్ దాస్ వంటి నాయకులు, కార్యకర్తలపై భూస్వాముల దాడులు, అసంఖ్యాక గిరిజన ప్రజలతో పాటు కా.అప్పలసూరిని నిర్బంధించటం లాంటి చర్యలకు పూనుకున్నారు. రాజ్యం (పోలీసు, ప్రభుత్వం) గిరిజనుల పైనా, గిరిజన సంఘ నాయకులపైన, పార్టీ కార్యకర్తలపైన, నాయకులపైన దాడి చేసినందుకు భూస్వాములపై చర్య తీసుకోకపోగా, గిరిజనోద్యమం పైనే దాడికి దిగింది. ఈ కాలమంతటా తీవ్ర నిర్బంధ కాండను అమలుజరిపింది. వేలాది మందిపై కేసులు పెట్టి జైళ్ళలో కుక్కింది, కోర్టుల చుట్టూ తిప్పింది. ఆ ప్రాంతాలలో పోలీసు అవుట్‌పోస్టులు పెట్టారు. ఉభలు (నాట్లు), కోతలమయంలో రిజర్వు పోలీసులను దింపారు.

దోపిడీవర్గ ఘోరకృత్యాలు, పాశవిక పోలీసు నిర్బంధం మధ్య కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద గిరిజనులు మరింత సంఘటితంగా నిలబడ్డారు. దృఢమైన ఐక్యతను ప్రదర్శించారు. ఆ రోజుల్లో ప్రతి విషయంలోనూ సంఘానిదే పై చేయిగా సాగింది. గణనీయమైన విజయాలు సాధించారు. 1967 సంవత్సరం మొత్తం భూస్వామ్యవర్గాలకు, గిరిజన సంఘం మధ్య నిత్య సంఘర్షణలమయంగా వుంది. ఈ సంఘర్షణల పరాకాష్టే 1967 అక్టోబర్ 31 సంఘటన. కామ్రేడ్ నాగిరెడ్డి ఇంకా ఇలా వివరించారు: భూస్వాములు, ప్రభుత్వం ఎన్ని రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా గిరిజనులు మరింత సంఘటితపడ్డారు. తమ సంఘాన్ని, తమ సంఘ పలుకుబడి ప్రాంతాన్ని విస్తరించు కున్నారు. అధిక వేతనాలు, భూమికోసం సాగించిన పోరాటాలు అనేకం విజయం సాధించాయి. బలవంతపు వెట్టిచాకిరీ తుదముట్టించబడింది. ఫారెస్టు అధికారుల మామూళ్లు అంతమొందించబడ్డాయి. దుర్మార్గమైన వడ్డీలు తగ్గించబడ్డాయి. ఇళ్ళ మీదపడి గిరిజన ఉత్పత్తులు కారుచౌక గాను, అప్పుల పేరుతో దోచుకోబడే పద్ధతులు రద్దు చేయబడ్డాయి. 1917 చట్టాన్ని అనుసరించి భూముల స్వాధీన కార్యక్రమం అమలు చేయబడింది. గిరిజనప్రాంత ప్రజలకు ఉన్న తరువాతనే అమ్మకం అన్న నియమాలు అమలు జరుపుకొన్నారు. ప్రజలలో తగవులు, గ్రామసంఘం ఆధ్వర్యంలో సంఘం నాయకత్వం పరిష్కరించేది. ప్రజాస్వామిక పద్ధతులలో నూతన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవనం వెల్లి విరిసింది. కమ్యూనిస్టు పార్టీ కృషిని గురించి కామ్రేడ్ నాగిరెడ్డి వార్తా పత్రికల నుంచి ఇలా ఉల్లేఖించారు.

"గత 8 సంవత్సరాలుపైగా నాటి మార్క్సిస్టు పార్టీలో కమ్యూనిస్టులు గిరిజన, వ్యవసాయ కూలీసంఘాలను ఒక మిలిటెంట్ సంస్థగా రూపొందించారు. అత్యంత నిరపాయకరమైన అమాయక ఆదిమ జాతుల వారిని సైతం క్రమబద్ధమైన ఎడతెగని కృషి ద్వారా అత్యంత ప్రమాద కరమైన తిరుగుబాటు శక్తిగా ఎలా మార్చవచ్చో కమ్యూనిస్టులు రుజువుచేసి చూపారు. "కమ్యూనిస్టులు మినహా భూస్వాములకు వ్యతిరేకంగా గిరిజనుల ఇబ్బందులు తీర్చటానికి ఏ ఇతర పార్టీ ఎలాంటి కృషి చేయలేదు".

"మార్క్సిస్టు పార్టీలోని కమ్యూనిస్టులు కొండ ప్రాంతాలలోకి వెళ్ళి గిరిజనులతో కలిసి నివసిస్తూ వారి ఆశలలో, కోర్కెలలో పాలు పంచుకొన్నారు. కమ్యూనిస్టు అగ్ర నాయకులు ఈ ప్రాంతంలో పర్యటించి దోపిడీ చేస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయమని గిరిజనులకు

**మన దేశంలోని అణగద్రొక్కబడిన, తమ భూముల నుండి వెళ్ళగొట్టబడిన రైతాంగానికి ఆయుధాలు చేపట్టడం ఒక్కటే తమ విముక్తి మార్గమన్న వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చిన ఈ పోరాట చరిత్ర ఈ సమయంలో చాలా అవసరం. (తాకట్టులో భారతదేశం).**

బోధించారు". కమ్యూనిస్టు కార్యకర్తలు ఎంత అంకితమై పనిచేస్తే ఈ గుణాత్మక మార్పు లొచ్చాయో అర్థం చేసుకోవచ్చు.

"భూస్వాముల ప్రత్యక్ష ప్రేరణతో" 144 సెక్షన్ ప్రకటించడాన్ని అసంఖ్యాక ప్రజలను చావగొట్టడాన్ని 1967 ఆగస్టులో పత్రికాగోష్టిలో ఖండించాను. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, 18.8.1967).

"144 సెక్షన్ ఉపసంహరించు కోవాలని, పోలీసు నిర్బంధాన్ని నిలిపి వేయాలని, నిష్పాక్షికమైన నిజమైన విచారణ జరిపించడానికి అనువైన వాతావరణం కల్పించాలని" నేను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానని "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" ఆ సమయంలో తెలియజేసింది.

నా ప్రకటనకు సమాధానంగా "శ్రీకాకుళంజిల్లా పోలీసు ప్రతినిధి 20.8.1967 ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఇలా అన్నారు. "పార్వతీపురం తాలూకా ఏజెన్సీ ప్రాంతంలోని ప్రస్తుత ఉద్రిక్తతకు బాధ్యత అతివాద కమ్యూనిస్టులదే " అని, వారు వ్యవసాయ కూలీలను తిరుగుబాటుకి రెచ్చగొట్టడం ప్రారంభించారని" వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తున్న నాట్ల కూలీరేట్లు చాలా హెచ్చుగా ఉన్నాయని ప్రకటించాడు. ఈ ప్రకటనల ద్వారా పోలీసులు రాజకీయ వేత్తల్లాగా భూస్వాముల తరపున నిలవ డానికి సిద్ధమయ్యారు. ఆ అధికారి ఇంకా "చైనా అనుకూల పార్టీ" గురించి, హింసా యుత నినాదాలు, భూస్వాములను హింసా యుతంగా బెదిరిస్తున్న గిరిజన ప్రదర్శకుల గురించి కూడా ప్రస్తావించారు. (తాకట్టులో భారతదేశం)

ఈ ప్రకటన ద్వారా పోలీసులు రాజకీయ వేత్తలుగా వ్యవహరించడమేకాక భూస్వాముల ఏజెంట్లేనని నిరూపించు కున్నారని కా॥ నాగిరెడ్డి వ్యాఖ్యానించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో వ్యక్త మవుతున్న తేడాలను పోలీసు యంత్రాంగం గమనంలోకి తీసుకుంది. భూస్వాములకు అండగా నిలబడి ప్రజా ఉద్యమాలను అణచడానికి నిర్ణయించుకొంది.

1967 విత్తనాలు, నాట్లు వేసే సమయంలో నిర్మాణాత్మక ఆందోళనకు దిగిన గిరిజన సంఘాన్ని చూచి భూస్వాములు కొయ్యబారిపోయారు. వారికి పిచ్చెక్కిపోయింది. భూస్వాములు, పోలీసులు కలిసి కుట్రలు మొదలుపెట్టారు. గుమ్మలక్ష్మీ పురం గ్రామ భూస్వాములు తమ పశువుల పాకలు తామే తగులబెట్టుకుని, గిరిజన సంఘ కార్యకర్తలపైన, కమ్యూ నిస్టులపైనా నేరం మోపారు. గిరిజనులపై ప్రత్యక్ష దాడులు మొదలయ్యాయి. 1967 జులై 24 నుండి 1967 ఆగస్టు 25 వరకు 200 గూడాలు, గ్రామాలలో 144 సెక్షన్ క్రింద ప్రజలు కదలకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు. పోలీసు కవాతులు నిత్యకృత్య మైనాయి. స్త్రీలపై అత్యాచారాలు, భూస్వా ముల దౌర్జన్య కాండ తీవ్రస్థాయికి చేరింది.

ముందే పేర్కొన్నట్లు భూస్వాములు–ప్రభుత్వము కలిసి కుట్ర అమలు చేయ మొదలుపెట్టారు. గిరిజన ప్రజానీకం సంఘం ప్రకటించిన డిమాండ్ల సాధన కొరకై పట్టుదలగా నిలబడ్డారు. అక్టోబరు 31న ఐదవ మహాసభ సన్నాహాలు మొదలు పెట్టారు."ఏజెన్సీ కదలబారింది. భూస్వాములు గుమ్మగ్రామం నుండి వస్తున్న స్త్రీలపై దాడి చేశారు. అది తెలిసిన ప్రజలు, కార్యకర్తలు ప్రతిఘటనకు వెళ్ళారు. దొంగచాటుగా భూస్వాములు నియమించిన గూండాలు తుపాకులతో గిరిజన సంఘ కార్యకర్తలను కాల్చి చంపారు.

ప్రజల నిరసనోద్యమ ధాటికి ఒక నెల రోజులు ఆగినట్లాగి, గిరిజన ప్రజలపై మళ్ళీ దాడులు మొదలు పెట్టారు. ప్రజలు ఆత్మరక్షణ చేసుకొంటూ దాడులను అనేక మార్గాలలో ఎదుర్కొన్నారు.

1968లోనే పత్రికలు శ్రీకాకుళంలో జరుగుతున్న విషయాలపై వ్యాఖ్యానించాయి –

1968 ఫిబ్రవరిలో హిందూ పత్రిక విలేఖరి యిలా వ్రాశాడు: "ఆ ప్రాంతంలో భూస్వాములచే 1967 అక్టోబరులో లేవిడి అనే గ్రామంలో ఇద్దరు వ్యక్తులు హత్య చేయబడిన అనంతరం చెలరేగిన ఉద్రిక్త పరిస్థితి ఇంకా తీవ్రంగా పెరుగుతూ వున్నట్లు" తెలియచేశాడు.

ఆ విలేఖరి ఇంకా యిలా వ్రాశాడు: "మౌలికంగా చూస్తే ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితి వ్యవసాయ సమస్య నుండి ఉద్భవించింది."

అదే హిందూ పత్రిక 1968 మార్చిలో ఇలా వ్రాసింది "శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలలో గత సంవత్సరం జులై నెలలో వెలికి వచ్చిన గిరిజన అశాంతి (ట్రైబల్ అన్‌రెస్ట్) గిరిజన సంక్షేమం విషయంలో ప్రభుత్వము దాని స్వచ్ఛంద సంస్థల వైఫల్యాన్ని బయటపెట్టింది". 1965 మార్చి 25న ఆంధ్రపత్రిక శ్రీకాకుళం ఏజెన్సీ సమస్యలపై వ్యాసంలో యిలా వ్రాసింది: "1959 నాటి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియాస్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్టు అమలుపరచడంలో ప్రభుత్వ వైఫల్యమే ఈ ప్రాంతంలో ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితికి కారణం" అన్నది.

–1968 మార్చి 17 లింక్ వారపత్రిక ఇలా వ్రాసింది: "ఒరిస్సా సరిహద్దులోని ఉత్తరాది జిల్లా శ్రీకాకుళంలో తరతరాలుగా దోపిడీకి గురవుతూ వున్న పార్వతీపురం గిరిజనం ఆర్థిక, సాంఘిక దోపిడీ నుంచి తమను తాము విముక్తి చేసుకోవాలని కోరుకుంటుంది".

– 1968 మార్చి 22 టైమ్స్ ఆఫ్ ఇండియా అక్కడి ప్రజల దుర్భర పరిస్థితులు వివరించి ఇలా వ్యాఖ్యానించింది: "అందు వల్ల అతివాద కమ్యూనిస్టులు రెచ్చగొడు తున్నారని ఆరోపించబడుతున్నట్లుగా వ్యవసాయ అశాంతికి నిజమైన ఆధారం ఉంది. తరచుగా జరిగే తగాదాల్లో మైదాన ప్రాంతాల వారి పక్షం వహించడమే ఇంత వరకు పోలీసులకు తేలిగ్గా వుంటున్నది.

– 1968 ఏప్రిల్ 11, 12 తేదీలలో స్టేట్స్‌మన్ ప్రత్యేక విలేఖరి వి.ఎం.నాయర్ గిరిజన తిరుగుబాటు గురించి రాసిన రెండు వ్యాసాలు ప్రచురించింది. వాటిలో భూస్వాముల దోపిడీ, ప్రభుత్వ విధానాలు, భూస్వామ్య, ధనిక వర్గాలకు మద్దతుగా ఉండి గిరిజనులను అలక్ష్యపరిచారని పేర్కొంటూ చివరగా యిలా వ్యాఖ్యానించింది "కమ్యూనిస్టులను మినహాయించితే భూస్వాములకు వ్యతిరేకంగా గిరిజన సమస్యలను తీర్చడానికి ఏ యితర రాజకీయ పార్టీ ఎలాంటి కృషి చేయలేదు. దీనికి విరుద్ధంగా ఇతర పార్టీలవారు గిరిజనులను అదుపులో పెట్టడానికి పెద్ద ఎత్తున పోలీసులపై ఆధారపడ్డారు. ఇంకా ఆధారపడుతున్నారు."

ఈ పత్రికల అభిప్రాయాలన్నీ తాకట్టులో భారతదేశం అనే గ్రంథంలో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఉల్లేఖించారు.

అక్టోబరు 31 సంఘటన ద్వారా భూస్వామ్య– ప్రభుత్వవర్గాలు ఏమి సాధించ దలిచాయో అది సాధించలేకపోయాయి. ప్రజలు తిరుగుబాటు మనస్కులై నారు. అదనపు పోలీసు బలగాలను దించి మరింత నిరంకుశ అణచివేతకే వారు సిద్ధమై వున్నారు.

బూర్జువా పత్రికలలోని ప్రజాస్వామిక వాదులు ప్రభుత్వవిధానాలను సమర్థించ లేకపోయారు. గిరిజన ప్రజల మౌలిక జీవన సమస్యలను పరిష్కరించమని కోరారు. ఉద్రిక్తతలకు కారణాలను ఎత్తిచూపారు. కాని ప్రభుత్వం పెడచెవిన బెట్టింది.

కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అగ్ర నాయకులు, రైతు, వ్యవసాయ కూలీ ఉద్యమ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, కొల్లా వెంకయ్య, నండూరి ప్రసాదరావు, గుంటూరు బాపనయ్యలు, అసెంబ్లీలో మార్క్సిస్టు పక్ష నాయకులు తరిమెల నాగిరెడ్డి, నర్రా రాఘవరెడ్డిలు చేసిన అనేక విజ్ఞప్తులను ప్రభుత్వం వినిపించుకోలేదు. 1968 మార్చి 4వ తేదీన "ఫ్యూడల్ శక్తులు తలెత్తి ఘోరకృత్యాలకు పాల్పడుతున్నారని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని కామ్రేడ్ నాగిరెడ్డి డెక్కన్ క్రానికల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో హెచ్చరించారు. 1968 మార్చి మొదటివారంలో పెదఖార్జీ గ్రామంలో పోలీసులు కాల్పులు సాగించి ఇద్దరిని చంపారు. వివిధ తప్పుడు ఆరోపణలతో 3500 మందిని అరెస్టు చేశారని, ఆ ప్రాంతంలో వరుసగా జరుగు తున్న సంఘటనల గురించి అక్కడ నెలకొన్న ఉద్రిక్తతపై విచారణ జరి పించాలని, శాసనసభ ప్రతిపక్ష నాయకుడు తరిమెల నాగిరెడ్డి చేసిన విజ్ఞప్తిని నాటి ముఖ్యమంత్రి తిరస్కరించాడు.

అన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ డిమాండ్‌కు పిలుపిచ్చినా ముఖ్యమంత్రి త్రోసిపుచ్చాడు. "కమిటీ ఏర్పాటుకు ఇది సమయం కాదని, పార్వతీపురం గిరిజన ఏజెన్సీ సమస్య ప్రాథమికంగా శాంతి భద్రతల సమస్యే"నని ముఖ్యమంత్రి చెప్పాడు.

బూర్జువా పత్రిక "దక్కన్ క్రానికల్" 12.3.68వ తేదీన అసెంబ్లీ సమావేశాలను సమీక్షిస్తూ, "శ్రీ నాగిరెడ్డి కోరినట్లు అఖిలపక్ష విచారణ జరపాల్సిన అగత్యం వుంది. మార్క్సిస్టు నాయకుల సంతృప్తి కోసమేగాక చట్టబద్ధ పరిపాలనలో ఆసక్తి గల వారందరి కోసం కూడా నిష్పాక్షిక విచారణ సంఘాన్ని ఏర్పాటు చేసి వాస్తవమేదో వెలికిలాగడం అవసరం" అని వ్రాసింది.

టైమ్స్ ఆఫ్ ఇండియా 22.3.68న ఇలా వ్రాసింది: శ్రీకాకుళం జిల్లాలో వరుసగా జరిగిన అనేక సంఘటనలపై న్యాయవిచారణ జరిపించాలని ప్రతిపక్షం వారు చేసిన డిమాండ్‌లను ముఖ్యమంత్రి పట్టుదలతో త్రోసిపుచ్చారు. "పోలీసు కాల్పుల వల్ల, సంఘర్షణ వల్ల పార్వతీపురం గిరిజన ప్రాంతంలో ఇంకేమయినా చావులు సంభవిస్తే దానికి మార్క్సిస్టు కమ్యూనిస్టులే బాధ్యత వహించవలసి ఉంటుందని ముఖ్య మంత్రి నాగిరెడ్డికి చెప్పాడని" వ్రాసింది.

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలను మూకుమ్మడిగా హత్యలు చేసేందుకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పన్నిన క్రూరమైన పథకం ఈ విధంగా నగ్నంగా బయట పడిందని నాగిరెడ్డి వ్యాఖ్యానించారు. ఆయనింకా ఇలా అన్నారు. "ప్రజలకు వ్యతిరేకంగా అన్ని రకాల చట్ట విరుద్ధమైన పద్ధతులను ఉపయోగించింది ప్రభుత్వం, భూస్వాములే. గ్రామాలలో బీభత్సాన్ని సృష్టించింది భూస్వాములు, వారి గూండాలే. ప్రజలపై తుపాకులను, మారణా యుధాలను ఉపయోగించినది భూస్వాములే. గిరిజనులపై కాల్పులు సాగించినది పోలీసులే. రైతాంగంపై బాహాటంగా యుద్ధాన్ని ప్రకటించింది భూస్వాములు, ప్రభుత్వమే".

**"అందువల్ల ఉద్యమం యొక్క ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేయటానికి; కొన్ని సాధారణ నిర్ధారణలకు రావటానికి; పోరాటాన్ని విస్తృత పరిచేందుకు గాను మరిన్ని విలువైన అనుభవా లను సంపాదించేందుకు తాత్కాలిక ఓటములని విప్లవ కారులు ఉపయోగించుకోవాలి. విప్లవ ప్రతీఘాతకులు, పాలకవర్గాలు తమ తాత్కాలిక ఉత్సాహాన్ని మిద్దెలెక్కి గట్టిగా ప్రకటించనీయండి. అయితే వారి ఉత్సాహం ఎంతో కాలం నిలువదని విప్లవకారులకు తెలుసు.**

1967 అక్టోబరు 31కి ముందూ, ఆ తరువాత జరిగిన చరిత్ర శ్రీకాకుళం గిరిజన ప్రజానీకం ఒకవైపు–భూస్వాములూ, వడ్డీ వ్యాపారులూ,ప్రభుత్వం దాని యంత్రాంగము మరోవైపు నిలబడి రెండు శత్రు శిబిరాల మధ్య సాగిన వర్గ పోరాట చరిత్రే.

కోరన్న, మంగన్నలు ధన్యజీవులు. దోపిడీ వర్గాన్ని ధిక్కరించి ప్రజల హక్కుల కోసం ప్రాణాలొడ్డిన ధీరులు. ఈ రెండు పేర్లూ తెలంగాణా పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సరసన చేరిపోయాయి.

ఇప్పటి వరకూ సాగిన పోరాటం 1968 జూన్ వరకు మార్క్సిస్టుపార్టీలోని కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వానే సాగింది. ఆ తర్వాత అది మరో రూపం తీసుకుంది. ఆ మరో రూపం గాకుండా సరైన రూపంలోనే అది ఎందుకు కొనసాగించబడలేదు? రాజ్యాంగ

యంత్రాంగాన్ని ఎలా నిలువరించవలసింది? వారి కుట్రలను ఎలా భగ్నం చేయవలసింది? లాంటి ప్రశ్నలు ఈ నలభై ఏళ్ళ కాలంలో తలెత్తి చర్చించబడుతూనే ఉన్నాయి. విప్లవనిర్మాణాలన్నింటికి ఒకానొక అంశం మీద మాత్రమే ఏకాభిప్రాయం ఉంది. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ముగింపులో చెప్పిన దానితో ఎవరికీ విభేదం ఉండకపోవచ్చు.

''ఎవరు కుట్రదారులు? అని నేనడగాలనుకుంటున్నాను. అతి హేయమైన భూస్వాములు, వారి తొత్తు ప్రభుత్వం యొక్క దుస్సాహసిక, చట్టవిరుద్ధమైన, నీతిబాహ్యామైన దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అత్యంత సాహసంతో పోరాటం సాగించిన ప్రజలా కుట్రదారులు?

లేక గత అనేక సంవత్సరాలుగా రాజ్యాంగ సూత్రాలన్నింటికి విరుద్ధంగా వ్యవహరించి ప్రజల భూములను, శ్రమను కొల్లగొట్టడమేకాక ప్లేగులా బాధించి, వారి పోరాటతత్వాన్ని నాశనం చేసేందుకై అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, చివరికి కాల్పులతో వారిపై నాజీల క్రౌర్యాన్ని ప్రదర్శించిన భూస్వాములూ, వారి ప్రభుత్వమా కుట్రదారులు?

ప్రస్తుతానికి గిరిజనులు సాగించిన మహత్తర ప్రతిఘటన తాత్కాలికంగా వెనుకడగు వేయడం చూసి బూర్జువా పార్టీలు వారి భృత్యులు ఎంతో మహోత్సాహంతో చంకలు కొట్టుకుంటున్నారు. తీవ్రమైన నిర్బంధకాండ తాత్కాలికంగా విజయం సాధించవచ్చును".

...."మనం ఓడించబడినట్లైతే, మళ్ళీ మొదట నుంచి మన కృషిని ప్రారంభించడం కన్నా మనం చేయాల్సింది మరేమీ ఉండదు. అయితే అదృష్టం కొద్ది, ఉద్యమం మొదటిరంగం ముగింపుకి రెండో రంగం ప్రారంభానికి మధ్య మనకు అనుమతించబడిన అతికొద్ది విరామకాలాన్ని పోరాటం ఆలస్యంగా ప్రజ్వరిల్లడాన్ని, దాని ఓటమికి దారితీసి తప్పనిసరిచేసిన కారణాలని అధ్యయనం చేయడం అనే అత్యవసరమైన పనికి కావల్సిన సమయాన్నిస్తుంది. అయితే కొందరి నాయకుల యాదృచ్ఛిక ప్రయత్నాల్లోనో, సామర్థ్యాల్లోనో, తప్పుల్లోనో, పొరపాట్లలోనో లేక విద్రోహాల్లోనో కారణాలు వెదకకూడదు. అలాగాక విప్లవంతో గడగడలాడిన ప్రతి ప్రదేశంలోని సాధారణ, సాంఘిక స్థితిగతుల్లోనూ, జీవన పరిస్థితుల్లోనూ కారణాలను అన్వేషించాలి. విప్లవ ప్రతీఘాతకత్వ విజయాలకు కారణమేమిటని మనం పరిశీలన కెళ్ళినపుడు ఫలానివాడో లేక వీడో ప్రజలకు "విద్రోహం" చేశాడంటూ తయారుగా ఉన్న జవాబొకటి మనకి విన్పిస్తూంటుంది. అది నిజం కావచ్చు కాకపోవచ్చు. కాని ఎట్టి పరిస్థితులలోను ఏ విషయాన్ని వివరించి చెప్పదు. కనీసం తాము (ప్రజలు) ఆ విధంగా విద్రోహానికి ఎలా గురయ్యారు. గురవుతూ వుంటే ప్రజలు ఎందుకు ఊరకుండిపోయారు? ఎలా జరిగిందో కూడా ఆ సమాధానం చూపదు. ఫలానా వాడిని విశ్వసించకూడదు అన్న ఒక వాస్తవాన్ని పట్టుకుని, అదే విజ్ఞాన సర్వస్వంగా ఉన్న ఏ రాజకీయ పార్టీకయినా భవిష్యత్ ఏమి ఉంటుంది'' (మార్క్స్ ఏంగెల్స్–జర్మన్ విప్లవం– ప్రతీఘాత విప్లవం.)

పైన మార్క్స్, ఏంగెల్స్‌లను ఉల్లేఖించి కామ్రేడ్ నాగిరెడ్డి ఇలా అంటున్నాడు."అందువల్ల ఉద్యమం యొక్క ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేయటానికి; కొన్ని సాధారణ నిర్ధారణలకు రావటానికి; పోరాటాన్ని విస్తృత పరిచేందుకుగాను మరిన్ని విలువైన అనుభవాలను సంపాదించేందుకు తాత్కాలిక ఓటములని విప్లవకారులు ఉపయోగించుకోవాలి. విప్లవ ప్రతీఘాతకులు, పాలకవర్గాలు తమ తాత్కాలిక ఉత్సాహాన్ని మిద్దెలెక్కి గట్టిగా ప్రకటించనీయండి. అయితే వారి ఉత్సాహం ఎంతోకాలం నిలువదని విప్లవకారులకు తెలుసు. అలా నవ్విన వాళ్లే నవ్వుల పాలవుతారు". మన కార్యక్రమం నుండి వైదొలగకుండా చుక్కాని పట్టుకుని నిలబడుదాం.

(ఈ వ్యాసం 'తాకట్టులో భారతదేశం'లోని 15వ అధ్యాయం ''పీడితుల్లోకల్లా అధమాధములు గిరిజనులు' ఆధారంగా వ్రాయబడింది.)

## పోరుదారి

\- భూపాల్

'రణనినాదమిదె ఆరంభం
శ్రీతయ్యాతగా సాగిన సమరం
ఏజన్సీలో మహా ఉద్యమం
వెల్లి విరిసినది వర్గద్వేషం
గిరిజన ప్రాతకు సరియగు రూపం
పోరాటంలో నేర్చిన పాఠం ॥రణ॥

ధాన్యం రవాణా అడ్డగించిరీ
మాన్యం భద్రతనుద్ధరించిరీ
అప్పలు కుప్పలు నిరాకరించిరి
పంటలు తామే స్వీకరించిరీ ॥రణ॥

భావితరాలకు గిరిజన వీరులు
భారతాన గురిచూపిన దారులు
ఈ గిరిజన రైతాంగ ఉద్యమం
సాయుధమై శ్రీకాకుళోద్యమం......
జోహార్ జోహార్ జోహార్
కొండగొర్రి మంగన్నకు జోహార్
అమర ఆరికా కోరన్న జోహార్

('పోరుదారి' నృత్య రూపకం నుండి)

*"సామాజిక వ్యవస్థలో అంతర్గతంగా ఇమిడి వున్న వైరుధ్యాల కుప్పయే మన రాజ్యాంగం. సామ్రాజ్య వాద దోపిడీకి, ఫ్యూడల్ భూస్వామ్య విధానానికి సామాజిక ఆర్థిక పునాదిని కొనసాగించడానికే ఈ రాజ్యాంగం ఉద్దేశించబడిందనేది నిస్సందేహం. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు సంతృప్తిపర్చి మభ్యపెట్టడానికి తప్ప వేరు గాదు. ప్రజల తిరుగుబాటు శక్తిపట్ల భయంవల్ల ప్రేరేపించబడి చేర్చబడినవే."*

\- తరిమెల నాగిరెడ్డి

# మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట ముద్దుబిడ్డలు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నల అమరత్వాన్ని స్మరించుకుందాం! ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు సమాయత్తమవుదాం!

**(శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నల 40వ వర్ధంతి సభ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ప్రచురించిన కరపత్రం)**

**ప్రజలారా,**

వీరోచిత శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటంలో, లేవిడి దాడిలో గిరిజనోద్యమ కార్యకర్తలైన కోరన్న, మంగన్నలు భూస్వాముల చేతిలో అమరులై ఈ అక్టోబరు 31 నాటికి 40 సంవత్సరాలు పూర్తి అవుతున్నది. 1967 అక్టోబరు 31న ఏజన్సీ గిరిజన సంఘం 5వ మహాసభ మొండెంఖల్లులో జరిగింది. దీనికి హాజరయ్యేందుకు వేలాది మంది గిరిజనులు గిరిజన సంఘం జెండాలు చేపట్టి మొండెంఖల్ చేరుకుంటున్న సమయంలో గుమ్మనుండి వస్తున్న గిరిజన మహిళలను లేవిడి దగ్గర భూస్వాములు దారికాచి అవమానించి, కొట్టారు. ఈ విషయం తెలిసి ఆగ్రహోదగ్రులైన గిరిజనులు అన్యాయాన్ని ప్రశ్నించేందుకు మొండెంఖల్ నుండి తరలివస్తుండగా భూస్వాముల గూండాలు కాపుగాసి కోరన్న, మంగన్నలను కాల్చిచంపారు. కానీ గిరిజనోద్యమస్ఫూర్తిని చంపలేకపోయారు. ఆనాటి నుండి ఈనాటి వరకూ గిరిజనులు తమ హక్కులకోసం ఉద్యమిస్తూనే వున్నారు. కోరన్న, మంగన్నలను స్మరించుకొంటూ స్ఫూర్తిని పొందుతూనే వున్నారు.

1961లో గిరిజన సంఘం మొదటి మహాసభ జరిగే నాటికి పాత శ్రీకాకుళం జిల్లా గిరిజనులు దుర్భరస్థితిలో బతుకుతుండేవారు. భూమి, అడవి, అటవీ ఉత్పత్తులు, గిరిజనులశ్రమ అంతా భూస్వాముల, షావుకార్ల చేతిలో బందీ అయిపోయింది. పిచ్చి కొలతలు, హెచ్చువడ్డీలతో గిరిజన కుటుంబాలు తల్లీ బిడ్డలతో సహా వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. దొంగ వేలిముద్రలతో భూములు లాక్కోవటం, భూస్వాములతో పాటు ఫారెస్టు, రెవెన్యూ వాళ్ళ దౌర్జన్యాల మధ్యే గిరిజనుడి తెల్లవారేది. అప్పటికి ఒంటినిండా బట్టలు కట్టుకోవటం రాని గిరిజనులు అడవిలో పులిని చూసినా దడిచేవాళ్ళు కాదు గానీ తెల్లబట్టల షావుకారుని చూసి భయపడేవాళ్ళు. ఈ దుర్భర స్థితిలో గిరిజనుల కష్టాల నుండీ, కన్నీళ్ళనుండి తలెత్తిన ప్రతిఘటనగా గిరిజన సంఘం ముందుకు వచ్చింది. పైన పేర్కొన్న అన్ని రకాల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా 1961 లో జరిగిన గిరిజన సంఘం మొదటి మహాసభ 10 అంశాలతో డిమాండ్‌లను రూపొందించింది. భూస్వాముల అన్యాక్రాంతమైన భూములు, బంజరు భూములకోసం, నాగులు, పిచ్చికొలతలు, హెచ్చువడ్డీల రద్దు కోసం, గిరిజనుల వ్యవసాయ పనిముట్ల కోసం, అడవిమీద హక్కుకోసం, పాలేర్ల జీతాల పెంపుకోసం పోరాడటమేకాక ఒక నూతన గిరిజనుడిని రూపొందించటం కోసం విద్య, వైద్యాలను, స్వపరిపాలనను డిమాండ్ చేస్తూ గిరిజనోద్యమం ముందుకు వచ్చింది. గిరిజనులకు బట్టలు కట్టుకోవటం, జుట్టు కత్తిరించుకోవడం దగ్గర నుండి చదువు నేర్పించటం, రాజకీయాలు బోధపరచటం వరకు గిరిజన సంఘం చేపట్టని కార్యక్రమం లేదు. చనిపోయే సమయానికి కోరన్న, మంగన్నల సంచిలో ఒక పలక, గిరజన సంఘం జెండా వుండటమే గిరిజన సంఘం కృషికి ఉదాహరణ. మెట్టుమెట్టుగా సాగిన గిరిజన సంఘం కృషి గిరిజనోద్యమంగా రూపుదాల్చింది. చైతన్యవంతులైన గిరిజన స్త్రీపురుషులు అందరూ ఈ గిరిజనోద్యమంలో అవిభాజ్యమైనారు. కుటుంబాలకు కుటుంబాలే గిరిజనోద్యమ చైతన్యంతో పోరాటబాటపట్టాయి.

అయితే ప్రజలను, ముఖ్యంగా కష్టజీవులను, అందులోను ఆదివాసి, దళిత, మైనార్టీ ప్రజలను కనీసం మానవులుగా కూడా గుర్తించనిరాకరించే ఈ దోపిడీ వ్యవస్థ, దాని అధికార యంత్రాంగం శ్రీకాకుళంలోని ఈ నూతన మార్పులను చూసి కళ్ళల్లో నిప్పులుపోసుకున్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సాగిన గిరిజనోద్యమం యొక్క ఏ దశలోనూ రాజ్యం సానుకూలంగా వ్యవహరించలేదు సరికదా, కత్తిగట్టి కాలరాయడానికి ప్రయత్నించింది. కోరన్న, మంగన్నలను బలి తీసుకున్న భూస్వాములకు, గుండాలకు ప్రభుత్వ యంత్రాంగం రక్షణ కల్పించి రాజలాంఛనాలతో కాపాడింది. ఏజన్సీని పోలీసులమయం చేసింది. భూస్వాములు సీతంపేట సంతను దోపిడీచేసి, సంతల్లో గిరిజన సంఘం నాయకుల్నికొట్టి, పైగా నాయకులే సంతలు దోపిడీ చేసారని తప్పుడు కేసులు బనాయించింది. సంఘచైతన్యంతో గిరిజనులు వియత్నాం సంఘీభావదినం జరుపుతూ అమెరికా సామ్రాజ్యవాది దిష్టిబొమ్మను తగలబెడితే ఇక్కడ భూస్వాములు, ప్రభుత్వాధికారులు తమనే తగలబెట్టినట్టు విలవిలలాడారు. భూస్వామ్య దోపిడీ, సామ్రాజ్యవాదదోపిడీ, దురాక్రమణలకు గల అవినాభావ సంబంధాన్ని బట్టబయలు చేశారు.

ఈ దశలో గిరిజనోద్యమంపై రాజ్యం కనీవినీ ఎరుగని నిర్బంధాన్ని అమలు చేసింది. పోలీసులు గిరిజన కుటుంబాలకు కుటుంబాలను చంపివేశారు. వందలాది మంది గిరిజనులు తప్పుడు కేసులు బనాయించబడి, సంవత్సరాల తరబడి కుటుంబాలతో సంబంధం లేకుండా జైళ్ళలో నిర్బంధించబడ్డారు. ఎందరో మహిళలు భరించరాని అవమానాలకు, అత్యాచారాలకు

గురయ్యారు. అయినా సంఘం పక్షాన ధీటుగా నిలబడ్డారు. 1970 నాటికి నాలుగు వందల మంది గిరిజనులు, ప్రజాఉద్యమ కార్యకర్తలు, నాయకులు, మన దేశ, మన ప్రజల ఉద్యమ ముద్దు బిడ్డలు అమరులయ్యారు. పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పైల భీముడు, అరికి సోములు, పంచాది నిర్మల, అంకమ్మ, సరస్వతి తదితర ప్రజానాయకులు అమరులైనారు. సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ చినబాబు వంటి ప్రజా కళాకారులు, చాగంటి భాస్కరరావు, దేవినేని మల్లిఖార్జునుడు వంటి డాక్టర్లు, మేధావులు ప్రజలకోసం ఉద్యమస్ఫూర్తితో, దోపిడీ, పీడనలు లేని సమాజం కోసం పోరాడుతూ తమ జీవితాలను అర్పించారు. ఈ మొత్తం క్రమంలో ప్రజలు, గిరిజనోద్యమ కార్యకర్తలు, నాయకత్వం తమ శాయశక్తులూ ఒడ్డి గిరిజనోద్యమాన్ని నిర్మించడానికి, నిలబెట్టుకోవడానికి ప్రయత్నించారు. అమరుడు, విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి శ్రీకాకుళ గిరిజనోద్యమం ప్రతి మలుపులోనూ వెన్నంటి వుండి, గిరిజనులపై బనాయించిన అక్రమకేసులను, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడారు. వేలాదిమంది ప్రజల, ప్రజానాయకుల ఊపిరులతో, త్యాగాలతో, రక్తతర్పణతో జీవం పోసుకొని సాగిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం అజేయమైనది. భవిష్యత్ తరాలకు మార్గదర్శకమైనది.

నాటి శ్రీకాకుళ పోరాట ఫలితంగా విధిలేక ప్రభుత్వం 1/70 చట్టాన్ని ప్రకటించింది. కానీ అది ప్రకటనలకే పరిమితమైనది. ఈ నాటికీ గిరిజనులు సంతల్లో ఘోరమైన దోపిడీకి గురవుతున్నారు. చింతపండు తదితర అటవీ ఉత్పత్తులకు ఈ నాటికీ గిట్టుబాటు ధరలేదు. జి.సి.సి. గుత్త సంస్థగా, షావుకార్ల దోపిడీకి తీసిపోని విధంగా వ్యవహరిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ, పెత్తందార్ల సారా వ్యాపారం గిరిజన ప్రజల మూలుగుల్ని పీల్చివేస్తోంది. విద్య, వైద్యం ఈ నాటికీ ఏజెన్సీ ప్రజలకు అందని మానిపళ్ళలాగానే వన్నాయి. రోగమొచ్చినా, రొస్టొచ్చినా, కొండలు దాటుకొని, మైళ్ళ కొద్ది నడిచి, డబ్బు పోసి వైద్యం కొనుక్కోవటమో లేక రోగాలతో తీసుకొంటూ చావటమో తప్ప గిరిజనుడికి మరో మార్గం లేకుండా వుంది. ప్రభుత్వ విధానాలు అడవి నుండీ, భూమి నుండీ గిరిజనుణ్ణి దూరం చేస్తున్నాయి. ప్రభుత్వం తాను చేసిందే అయినా 1/70 చట్టాన్ని, భూ సంస్కరణల చట్టాన్ని అమలు చేయకపోగా 180 గిరిజన గ్రామాలను షెడ్యూలు ప్రాంతం నుండి మినహాయించ పూనుకొంది. గిరిజనులు చదునుచేసి, సాగు చేసిన సారవంతమైన భూముల పరాయీకరణ, నామమాత్రపు రేటుతో అన్యాక్రాంతం చేసే పరిస్థితే నేటికీ సాగుతున్నది. మన పొరుగునే వున్న విశాఖ జిల్లాలో బాక్సైటు కంపెనీలకు, రాయగడలో అల్యూమినియం కంపెనీలకు అడవిని, సహజ సంపదను కట్టబెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ పరిస్థితిలో గిరిజనులు కడుపు చేత పట్టుకొని పనులు వెతుక్కుంటూ వలసపోతున్నారు. నిలువ నీడలేని వలస కూలీలుగా ప్రకృతి వైపరీత్యాలకు, అంటువ్యాధులకు, అత్యాచారాలకు, ఎయిడ్స్ లాంటి వ్యాధులకు ముందుగా బలవుతున్నది గిరిజనులే. ఫ్యూడల్ పెత్తనం, దోపిడీలవల్ల, ప్రపంచీకరణ విధానాల వల్ల ఇటు భూమికి, అడవికి దూరమై, అటు సంఘంలో స్థానంలేక, తమకంటూ వుండే కుటుంబం, కట్టుబాటు, సంఘ ఆదరణ లేక గిరిజనులు నారాశ్రయులవుతున్నారు. పిడికెడు మెతుకుల కోసం గిరిజన మహిళలు వ్యభిచారంలోకి నెట్టబడుతున్నారు.

ఈ స్థితిలో గిరిజనుల మనుగడకు ప్రధానమైన భూమి సమస్యను, పరిష్కరించటం, అడవిపై హక్కు కల్పించటానికి బదులుగా ప్రభుత్వం, ఐటిడిఎలు సంస్కరణల తాయిలాలు చూపి మభ్యపెడుతున్నాయి. గిరిజనుల భూమి సమస్య, అడవిపై హక్కు సమస్య, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల సమస్య, సంతలలో మోసాల సమస్యలు పరిష్కరించటానికి ఏ మాత్రం పూనుకోవటం లేదు. గిరిజనులకు ఉపాధిని కల్పించే తునికాకు సేకరణను ఎప్పటికప్పుడు ఏదో ఒక సాకు చెప్పి నిలిపి వేస్తున్నారు.

నలభై ఏళ్ళనాడు గిరిజన సంఘం నాయకత్వాన సాగిన పోరాటం సంఘం పెట్టుకొనే స్వేచ్ఛను, హక్కును సాధించింది. సంఘం ద్వారానే, పోరాటం ద్వారానే మన హక్కులు, రక్షణ సాధ్యం అన్న ఎరుకను, ధైర్యాన్ని ఇచ్చింది. పోరాటం ఆగిపోదని చాటింది. ఆనాటి నుండి నేటికీ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గిరిజనులు, గిరిజనేతర పేదలు రైతుకూలీ సంఘం నాయకత్వంలో భూమి కోసం, హక్కులకోసం పోరాడుతూనే వున్నారు. వందలాది మంది ప్రజలు, సంఘ నాయకత్వం నిర్బంధానికి గురయ్యారు. జైళ్ళ పాలయ్యారు. ఉద్యమ క్రమంలోనే విజయనగరం జిల్లా దుగ్గేరులో పెత్తందార్ల దాడిలో కామ్రేడ్ జెన్ని తిరుపతి అమరుడయ్యాడు. నాటి శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట వారసత్వంగా అందిన పోరాట చైతన్యంతో సంఘ నిర్మాణం, భూమి పై హక్కు, అడవిపై హక్కు కోసం మనం ఉద్యమించాలి. ఆ రకంగా దోపిడీ పీడనలు లేని సమాజం కోసం ఉద్యమ నిర్మాణానికి మరింత దీక్షా నిబద్ధతలతో పునరంకితం కావటమే కోరన్న, మంగన్నలకు, శ్రీకాకుళ ఉద్యమ అమరులందరికి మనం ఇచ్చే నివాళి.

## భూమిక

**– దర్భశయనం శ్రీనివాసాచార్య**

అప్పుడప్పుడూ
కొన్ని పాత సంగతులు రాస్తాను
ఉదాహరణకు–మట్టిని గురించి

అప్పుడప్పుడూ
కొన్ని ప్రస్తుత విషయాలు
ప్రస్తావిస్తాను
ఉదాహరణకు–మట్టిని గురించి

అప్పుడప్పుడూ
కొన్ని రేపటి కదలికల్ని
ఊహిస్తాను
ఉదాహరణకు–మట్టిని గురించి

ఎప్పుడు రాసినా
బతుకును బతికించే
నిలబెట్టే కదిలించే
కీలక మూలకం గురించే

## పోరుదారి

***(శ్రీకాకుళ గిరిజనోద్యమ 'పోరుదారి' నృత్య రూపకాన్ని కవి, రచయిత భూపాల్ రచించారు. ఈ కళారూపాన్ని 2007 డిసెంబరు 31న కోరన్న, మంగన్నల 40వ వర్ధంతి సందర్భంగా తీవ్ర నిర్బంధం మధ్య పార్వతీపురంలో జరిగిన బహిరంగ సభలో మొదటిసారిగా ప్రజా కళాకారులు ప్రదర్శించారు.)***

కదం కదంగా కదిలి ఐక్యమై
పదం పదంగా పోరుబాటలై
నిన్న వదిలిన తెలంగాణమై
నమ్మిన నక్సల్ శ్రీకాకుళమై
చిందిన నెత్తురు శ్రీకాకుళమై
విప్లవీరులు ఎత్తిన జెండై
కొత్త నెత్తురులు హత్తిన ఎరుపై
అడవులు కొండలు వాగులు వంకలు
నదులు లోయలు ఊర్లూ గుడిసెలు
సంఘటితంగా సైసైమంటూ
పోరుదారిలో పొందిన న్యాయం
భూమి వుంటెనే భుక్తి వుందని
భూమితోనె జనవిముక్తి వుందని
సాగిమూగినది వేమందినది
రాజుకున్నదీ రాష్ట్రమంతటా
గిరిజన వీరులు బిగి పిడికళ్ళతో
ఎగసిన జెండై ఏకం కాదా!
కొండమొదలుగా గుండెలో నిలిచీ
గోదావరి లోయల్లో ఉబినది
జగిత్యాల సిరిసిల్లల్లో ఎగసీ
దుగ్గేరున తన దమ్ము జూపినది
భూమి సమస్య భుక్తి సమస్య
పోరుదారిలో ఫలించగలదని
పోరుదారిలో ప్రజల కోసమై
నేలకొరిగినా వీరులందరూ
అరుణతారలు రేపటి సూర్యులు
అమరులందరికి జోహార్లంటూ
ఉదయం సూర్యుడు ఎంత సత్యమో
పోరుదారి ఇది అంత సత్యమని
గిరిజనోద్యమం వర్ధిల్లాలీ!
రైతుకూలీసంఘానికి జైజై!!
రైతుకూలీసంఘానికి జైజై!



# కోరన్న మంగన్నల వర్ధంతి సభకు కామ్రేడ్ కానుసన్యాల్ సందేశం

(1969లో కా॥ కానూసన్యాల్ శ్రీకాకుళం ఏజన్సీలో పర్యటించి, గిరిజనోద్యమాన్ని పరిశీలించారు. పార్వతీపురం కుట్ర కేసులో ముద్దాయిగా విశాఖ జైలులో ఏడేళ్లు వున్నారు. 2007 అక్టోబరు 31న-పార్వతీపురంలో జరిగిన కోరన్న, మంగన్నల వర్ధంతి సభకు కా॥కానూసన్యాల్ పంపిన సందేశమిది.)

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కామ్రేడ్స్ కోరన్న, మంగన్నల అమరత్వం 40 సంవత్సరాలైన సందర్భంగా సంస్మరణ సభను నిర్వహించటం అభినందనీయం.

భూస్వాముల, షావుకార్ల పాశవికదాడులను ప్రతిఘటిస్తూ శ్రీకాకుళం గిరిజనోద్యమ పురోగమనంలో కోరన్న మంగన్నలు ప్రాణాలర్పించింది 1967 అక్టోబరు 31నే.

శ్రీకాకుళ గిరిజనులు తరతరాలుగా భూస్వామ్య దోపిడీకి గురయ్యేవారు. కాంగ్రెస్ పాలనలో ఇది మరింత తీవ్రమయింది. భూస్వాముల వారి తొత్తుల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గిరిజనులు అనేక సందర్భాల్లో తిరుగుబాటు చేశారు.

గిరిజన సంఘం ఏర్పడటంతో వారి ఉద్యమం సంఘటితపడింది. కమ్యూనిస్టు విప్లవకారుల మార్గదర్శకత్వంలో వారనేక పోరాటాలు చేశారు. భూస్వాములనుండి వెయ్యి ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. 2,500 ఎకరాల ప్రభుత్వ బంజరను స్వాధీనం చేసుకున్నారు. షావుకార్లు ఆహారధాన్యాలు బయటకు తీసుకువెళ్ళకుండా ఆపివేశారు.

ఉద్యమం ప్రజా వెల్లువ రూపం తీసుకుంది. భూస్వాములు భీతి చెందారు. లేవిడి గ్రామంలో జరుగుతున్న గిరిజన సంఘ సభకు తరలివస్తున్న ప్రజలపై భూస్వాములు, గూండాలు దాడి చేశారు. స్థానిక ప్రజలు వారికి రక్షణ వెళ్లగా వారిపై తుపాకీ కాల్పులు సాగించారు. కోరన్న, మంగన్నలు నేలకొరిగారు. అనేకులు గాయపడ్డారు.

కోరన్న, మంగన్నల అమరత్వం గిరిజనోద్యమాన్ని ఉన్నత స్థాయికి చేర్చింది. భూస్వామ్య దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలా, ఆత్మత్యాగాల గాథే శ్రీకాకుళ గిరిజనోద్యమం.

భారత విప్లవోద్యమంలో భాగమైన శ్రీకాకుళం గిరిజనోద్యమం ఈనాటికి ఎంతో ప్రాధాన్యతను కలిగి వుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో దేశీయ పాలకవర్గాలు, సామ్రాజ్యవాదం దోపిడీ, పీడనలను తీవ్రం చేసిన సామాజిక పరిస్థితి నెలకొని ఉన్న నేడు-వ్యవసాయ విప్లవక్రమంలో ప్రభుత్వం నిర్వహించే పాత్ర యొక్క అన్ని పార్శ్వాలను శ్రీకాకుళ గిరిజనోద్యమం తెలియచెప్పిన విషయాన్ని మనమేనాడు మరువరాదు. భూస్వామ్య దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా శ్రీకాకుళం గిరిజన ప్రజావెల్లువ రేకెత్తించిన ఆకాంక్షలను చారుమజుందార్ తెచ్చిన అతివాద దుస్సాహసిక పంథా వమ్ము చేసిందన్న చేదు నిజాన్ని మనం మరిచిపోరాదు.

**కోరన్న, మంగన్నలకు జోహార్లు!**
**వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి!!**

# శ్రీకాకుళ పోరాటం గురించి రెండు పుస్తకాలు




**డాక్టర్ బి.శివరామిరెడ్డి, 2006 నవంబర్‌లో, చాగంటి భాస్కరరావు ప్రచురణగా 'మహత్తర శ్రీకాకుళ పోరాటం' (చారిత్రక పరిశీలన)** అనే గ్రంథాన్ని రచించి, వెలువరించారు. విప్లవకారుల్లోనూ, పీడిత వర్గాలలోనూ కొండంత ఆశలను రేకెత్తించిన శ్రీకాకుళం పోరాటం ముందుకు సాగలేకపోవటానికి కారణాలను; తీవ్రమైన నష్టాలకూ, నిస్తబ్దతకు గురవటానికి అంతిమంగా ఓటమి పాలవటానికి దారితీసిన పరిస్థితులను తన గ్రంథంలో జాగ్రత్తగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. శ్రీకాకుళ పోరాట వివిధ దశల్లో , కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాత్మకంగా పాక్షిక సమస్యలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ, సంఘ నిర్మాణాన్ని, పార్టీ నిర్మాణాన్ని అభివృద్ధి చేస్తూ, చట్టబద్ధ, చట్టవ్యతిరేక విధానాల్ని జోడిస్తూ–చేపట్టిన కృషిని వివరించారు. అలాగే అతివాద పంథా అనుసరించినందునవచ్చిన నష్టాలను, వాటిలో మిళితమై వున్న సిద్ధాంత రాజకీయ సమస్యలను లోతుగా, నిర్మొహమాటంగా డాక్టర్ బి.శివరామిరెడ్డి తన గ్రంథంలో చర్చించారు. సాయుధ పోరాటం అంటే ఏమిటి? సాయుధ ప్రతిఘటన అంటే ఏమిటి? గెరిల్లా యుద్ధమంటే ఏమిటి? గెరిల్లా ప్రాంతం, స్థానిక యుద్ధం, చలన యుద్ధం, అఫెన్స్, డిఫెన్స్ వంటి అనేక సమస్యలను చైనా, వియత్నాం అనుభవాల వెలుగులో రచయిత చర్చించారు. ఉద్యమ పరిశీలకులకూ, పరిశోధకులకూ ముఖ్యంగా రైతాంగ ఉద్యమ కార్యకర్తలకు ఈ గ్రంథం విలువైన అనుభవాలనిస్తుంది.

---




**2007 ఏప్రిల్‌లో–తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు, వెంకట్ రచించిన 'శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమం'** పుస్తకాన్ని వెలువరించింది. ఈ రచన ద్వారా–1958 నుండి శ్రీకాకుళ ప్రాంతంలో–కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన జరిగిన ప్రారంభ కృషి వివరంగా అర్థమౌతుంది. ఉత్తరాంధ్రకు సంబంధించిన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల; ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్, గంజాం జిల్లాలో ఆనాడు సాగిన ఫ్యూడల్ పెత్తనం, దోపిడీ, జమీందారీ, ఇనాందారీ విధానాలూ, అవి రైతాంగానికి కల్గించిన కడగండ్లు; ఈ దోపిడీ పీడనలకు అణచివేతను ఎదుర్కొంటూ ప్రజా ఉద్యమాలు పెల్లుబికిన తీరును మనమీ రచనలో పరిశీలించగలుగుతాం. కమ్యూనిస్టు పార్టీ ప్రయత్న పూర్వక కృషి, అంకితభావంతో కూడిన కార్యకర్తల త్యాగపూరిత కృషి మనకు బోధపడుతుంది. కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వాన అమలు జరిగిన ఒంటెత్తు విధానాలు ఉద్యమానికి తీవ్ర నష్టం కలుగజేశాయనీ, విప్లవ ప్రజాపంథాకు నాయకత్వం వహించిన వారిని కూడా అతివాద ఒంటెత్తు విధానం ముంచెత్తిందనీ రచయిత అభిప్రాయపడ్డారు–ప్రజా విప్లవోద్యమాన్ని విచ్ఛిన్నం చేసే మార్క్సిస్టేతర ధోరణులను ఎదుర్కోవటానికి ఈ గ్రంథం ప్రోత్సాహకరంగా ఉంటుంది.

"మహత్తర శ్రీకాకుళ పోరాటం' మరియు 'శ్రీకాకుళ గిరిజనోద్యమం'–ఈ రెండు రచనలనూ ప్రజా ఉద్యమ కార్యకర్తలు తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిన అవసరముంది.

---

**'భారత విప్లవ పోరాట చరిత్రలో**
**శ్రీకాకుళం చాప్టరు చదివి కదలండి కామ్రేడ్స్**
**ఇక్కడ నెత్తురు మంటలో**
**విప్లవాచరణను కడిగి**
**మరెక్కడికైనా తీసుకెళ్ళండి-**
**ఇక్కడి ఊపిరి తుఫానులో**
**విప్లవాచరణను వూపి పరీక్షించి**
**ఇంకెక్కడికైనా తీసుకెళ్ళండి-**
**సూర్యుడు నేలన దిగింది**
**శ్రీకాకుళంలోనే తమ్ముడూ**
**నేలన సూర్యుడు యింకిపోవడం**
**శ్రీకాకుళంలోనే చూడాలి'-**
**-ఛాయరాజ్**
**'శ్రీకాకుళం' (ఉద్యమ కథా కావ్యం నుండి)**

# కార్మికోద్యమ నాయకుడు కామ్రేడ్ ఎన్.వి.కె.కు జోహార్లు



కామ్రేడ్ ఎన్.వి.కృష్ణయ్య నెల్లూరుజిల్లా, వెంకటగిరి మండలం యాతలూరు గ్రామంలో 1930లో ఒక భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే వామపక్ష రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు.

1952-55 కాలంలో-వెంకటగిరి ప్రాంతంలో రైతు సంఘాన్ని నిర్మించటంలో చురుగ్గా వున్నారు. యాతలూరులో భూస్వామ్య పెత్తందారీ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపారు. తండ్రినే ఎదురించి -భౌతిక దాడులకు గురయ్యారు. వెంకటగిరి జమీందారీ వ్యతిరేక పోరాటంలో రైతాంగ పక్షాన నిలిచారు. తెలంగాణా వెనుకబాటుకు సాగునీటి సౌకర్యం కల్పించకపోవటమే ప్రధాన కారణమని చెప్తూ-అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించి కరీంనగర్‌లో సదస్సు నిర్వహించారు. లక్షమందికి పైగా హాజరైన ఈ సదస్సు తెలంగాణా ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది. ఈ సదస్సు నిర్వహణలో ఎన్.వి.కె ప్రముఖ పాత్ర నిర్వహించారు.

అన్ని వర్గాల ప్రజలపై ప్రభుత్వం సాగిస్తున్న పాశవిక నిర్బంధకాండను ఖండించటంలో కా॥ ఎన్.వి.కె ఈ కాలమంతటా ముందున్నారు. కండలేరు మునక భూముల అవినీతిని బయటపెట్టి విచారణ కమిటీని వేయించారు.

భూస్వామ్య, పెత్తందారీ వ్యతిరేక పోరాటాలలోనూ, కార్మికవర్గ పోరాటాలలోనూ, రాటుదేలారు. ఆందోళనాకారుడిగా-మంచి ఉపన్యాసకుడిగా దోపిడీ పాలకవర్గాల ఆర్థిక, రాజకీయ విధానాలను ఎండగట్టారు.

**కామ్రేడ్ ఎన్.వి.కృష్ణయ్యకు మా విప్లవ జోహార్లు.**

# పీడిత ప్రజల ప్రియ మిత్రుడు, ప్రముఖ న్యాయవాది, ప్రజాతంత్రవాది యస్.వి.ఎల్.కు జోహార్లు



యస్.వి.ఎల్‌గా సుప్రసిద్ధులైన శిష్టా వెంకటలక్ష్మినరసింహంగారు 96వ ఏట-గుంటూరులో కన్నుమూశారు. 1936 నుండి దాదాపు 7 దశాబ్దాలకాలం న్యాయవాద వృత్తిలో కొనసాగటమేకాక, తన జీవిత కాలంలో పీడిత ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు న్యాయపరంగా అన్ని విధాలా అండదండలనిచ్చిన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వారు శ్రీ ఎస్.వి.ఎల్. వృత్తిని సంపాదనా మార్గంగా ఎంచని ఆదర్శజీవి.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ, వివిధ ప్రజాసంఘాలు తీవ్రమైన నిర్బంధం ఎదుర్కొంటున్న కాలం(1948-51)లో పోలీసులకు పట్టుబడితే ప్రజా ఉద్యమ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోతున్న కాలంలో- వారి తరఫున కోర్టులో వాదిస్తూ, కొండంత అండగా నిలిచారు ఎస్.వి.ఎల్.

పాలకవర్గ విధానాలపట్ల ప్రజల నిరసనను తీవ్ర నిర్బంధాన్ని ఉపయోగించి ప్రభుత్వం అణచివేస్తున్న కాలంలో 1969లో కమ్యూనిస్టు విప్లవకారులపై పాలకులు పెట్టిన కుట్రకేసులకు డిఫెన్సు లాయర్‌గా శ్రీ ఎస్.వి.ఎల్ నిలిచారు. కమ్యూనిస్టు విప్లవకారుల నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి కుట్ర కేసుగా ప్రసిద్ధిగాంచిన సికింద్రాబాద్ కుట్ర కేసులో డిఫెన్స్ నిర్వహించారు. చరిత్ర ప్రసిద్ధి గాంచిన పార్వతీపురం కుట్ర కేసులో విప్లవకారులకు డిఫెన్స్ నిర్వహించారు.

నిండు జీవితం గడిపి-విలువలతో కూడిన ఏడుపదుల వృత్తి జీవితం గడిపి; సమాజప్రగతి, మార్పు భావనలతో సాగుతూ, ఆ ప్రగతి, మార్పులను తేగలిగిన కార్మిక, కర్షక, పీడిత వర్గాలపట్ల సానుకూల స్పందనతో నడుస్తూ, తన జీవిత పయనాన్ని సాగించిన ఎస్.వి.ఎల్ నరసింహంగార్కి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గం విప్లవజోహార్లు తెలుపుతున్నది.

# కామ్రేడ్ చింతలాడ చిన్నబ్బాయికి జోహార్లు



ఏజన్సి గిరిజన సంఘం, పశ్చిమగోదావరిజిల్లా అధ్యక్షుడూ; రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ చింతలాడ చిన్నబ్బాయి 40 ఏళ్ళ చిన్న వయస్సులోనే మూత్రపిండాల వ్యాధితో 8-7-07న చనిపోయాడు. చిన్నతనంలోనే గిరిజన సంఘంలో చేరి, స్వగ్రామం తూటుగుంటలో భూపోరాటాలకు నాయకత్వం వహించారు. గోదావరి ఏజన్సీలో, ఇతర గ్రామాలూ, ఖమ్మంజిల్లాలోని గిరిజన ఉద్యమాలలో ముఖ్యపాత్రను నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యతిరేక ఉద్యమంలో చివరి వరకూ చురుగ్గా పాల్గొన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూనే, గిరిజన నాయకుల అరెస్ట్‌కు నిరసనగా హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కామ్రేడ్ చిన్నబ్బాయి మృతి గిరిజన, రైతుకూలీ ఉద్యమానికి తీరని లోటు. జోహార్ కామ్రేడ్ చిన్నబ్బాయి.



# రాజీ లేకుండా, కడవరకూ కష్టజీవుల పక్షం వహించిన, మార్క్సిస్టు తాత్త్విక, ఆచరణ రంగాలను జోడించిన కర్మయోగి కామ్రేడ్ బి.రామకృష్ణ

కామ్రేడ్ బి.రామకృష్ణ కష్టజీవుల కుటుంబంలో పుట్టి, కష్టజీవుల ఉద్యమాల మధ్యపెరిగి, కమ్యూనిస్టు తాత్త్వికతను అలవరచుకుని, కష్టజీవులపక్షం మనిషిగా, కష్టజీవుల ఉద్యమాల పక్షపాతిగా తన జీవిత కాలమంతా బ్రతికిన ఉన్నత వ్యక్తిత్వం కలవారు. దోపిడీవర్గ సిద్ధాంతాల మాయాజాలాన్ని ఎదుర్కొని నిలబడిన తార్కికుడు; భౌతికవాదులను తెలుగు ప్రజలకు ఎరుకపరచిన నాస్తికవాద నిష్ణాతుడు; తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషలలో పండితుడు. నిరాడంబరుడు కామ్రేడ్ బి.రామకృష్ణ.

ఆర్జించిన విజ్ఞానాన్ని పదిమందికి పంచిపెట్టి, అది ఆచరణ రూపం ధరించటానికి కామ్రేడ్ రామకృష్ణ జీవితకాలం తపన చెందారు. దీనిని 'తూ నా బొడ్డుంబాలు' చేసి దారి తప్పిన శిష్యవర్గాన్ని గురించీ, స్నేహితుల గురించీ ఆయన వ్యధ చెందాడు.

'దేవుణ్ణి, మతాన్ని వ్యతిరేకించకుండా కమ్యూనిస్టు కాజాలడ'ని కారల్‌మార్క్సు చెప్పినదాన్ని రామకృష్ణ ఆచరించేందుకు పూనుకున్నాడు. ఇక్కడనుండి మన దేశంలో పాతుకుపోయిన అంధ విశ్వాసాలను మూఢభక్తిభావాలను పరిశీలించబూనుకున్నాడు. మార్క్సిజాన్ని ఆచరణయుక్తం చేయడానికి-పరిశీలన, అధ్యయనం చేస్తూనే ఆచరణకు వేదికను ఏర్పరచుకున్నాడు. చార్వాక విద్యా పీఠాన్ని స్థాపించాడు. కులం, మతం ప్రస్తావన ఏ రూపంలోనూ అంగీకరించకూడదనే నియమాన్ని ఆచరించాడు. పిల్లల చేత ఆచరింపజేశాడు. బూర్జువా వార్గలు కల్పించే అవకాశాలను కాలదన్నాడు. హోదాలనాశిస్తే ఏదో ఒక యూనివర్సిటీ నుండి ఆయన 'డాక్టరేట్' హోదా తేలిగ్గా పొందగలిగేవాడు. సంపాదనకు బూర్జువా భావజాలాన్ని అనుసరించి వుంటే పేదరికంలో బ్రతకాల్సిన అవసరం వుండేది కాదు. ఆయనకు ఆదాయ-వ్యయాల స్పృహ లేదు. అదే ఆయన "బలహీనత". ఈ కారణంగా కొంతమంది స్నేహితులు, కొందరు శిష్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొంతకాలం దూరంగా జరిగితే జరిగి వుండవచ్చు. అసంతృప్తి చెందితే చెంది వుండవచ్చు. కానీ, తన ఉద్యమ అవసరాలకు ఖర్చు చేయాల్సి వచ్చినపుడు, 'నీదా? నాదా?' అన్న దానితో సంబంధంలేని ఆయన మానసిక స్థితే-ఆదాయ వ్యయాల స్పృహ లేకపోవడానికి కారణం కావచ్చు.

ఆయన గోదావరి అడవిబిడ్డలను, కరీంనగర్, వరంగల్ దళిత పుత్రులను చేరదీసి చదువు చెప్పాడు. వారి మంచి చెడ్డలకోసం ఆరాటపడ్డాడు. కొండమొదలు వెళ్ళాడు. గిరిజన ప్రజలకు మూఢనమ్మకాలను తొలగిస్తూ మాయలను విప్పి చెప్పాడు. విజయనగరం బయలుదేరి, వెళ్ళలేకపోయాడు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలు 2001 ఏప్రిల్‌లో-గుంటూరులో జరిగినపుడు-ఆహ్వానసంఘం అధ్యక్షులలో ఒకరుగా వుండి సహాయ, సహకారాలందించాడు. 'రైతాంగ రుణగ్రస్తత' పై- రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో- వివిధ జిల్లాలలో క్షేత్రస్థాయి పరిశీలనలతో బి.డి.శర్మగారు హాజరైన చర్చాగోష్టికి (2002, మార్చి) చార్వాకాశ్రమంలో అతిథ్యమిచ్చాడు. 1975లో ఏర్పడిన ఓపిడిఆర్‌లో సంస్థాపక కార్యవర్గ సభ్యుడిగా ప్రజాతంత్ర హక్కుల కోసం కృషి చేశారు. ప్రజా ఉద్యమాలకు మరెన్నో విధాల సహకారాలందించిన వారు కామ్రేడ్ రామకృష్ణ.

ఆయన మార్క్సిస్టు. నాస్తికవాదాన్ని దోపిడీ నుండి కష్టజీవుల విముక్తి కోసం జరిగే కృషికి తోడు చేశాడు. అందుకే ఆయన చుట్టూ అట్టడుగు వర్గాలే చేరాయి. దోపిడీవర్గ నాస్తికులు కూడా వున్నారు. వారు శుద్ధ నాస్తికులు. నాస్తికులయినంత మాత్రాననే చాలదు. నాస్తికత దోపిడీకి మూలాలను, దోపిడీవర్గ కుతంత్రాలను కనుగొని దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడాలి. మార్క్సు అలాంటి నాస్తికుడు. భగత్‌సింగ్ అలాంటి నాస్తికుడు. కమ్యూనిస్టులు అలాంటి నాస్తికులు. రామకృష్ణ దోపిడీ సమాజాన్ని కూల్చడానికి ఈ నాస్తికోద్యమాన్ని సాధనం చేసుకున్నాడు. కామ్రేడ్ రామకృష్ణ కార్యశీలి, కర్మయోగి-ఆయనకు మా రైతుకూలీసంఘం హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నది.

# కామ్రేడ్ సూరపనేని శేషగిరిరావుకు విప్లవ జోహార్లు



కామ్రేడ్ సూరపనేని శేషగిరిరావు 1922లో దివితాలుకా తాడేపల్లి గ్రామంలో జన్మించారు. కామ్రేడ్ శేషగిరిరావు మొదట్లో గాంధేయవాదిగా వుంటూ క్రమంగా కమ్యూనిస్టు ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. తన జీవిత కాలంలో ప్రజా ఉద్యమ పంథాకనుగుణంగా నిలిచారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు విశేషమైన కృషి చేశారు. తాడేపల్లిలో దళితవాడకు ఇక్కడున్న స్థలాలు ఇప్పించటంలో, రోడ్డు సదుపాయం కల్పించటంలో స్థానిక పెత్తందార్లతో తలబడి విజయం సాధించారు. తాడేపల్లి గ్రామం నుండి ఘంటసాల వరకు పంటబోదుని సాధించటంలో పెత్తందార్లను, భూస్వాములను ఎదుర్కొన్నారు. కామ్రేడ్ శేషగిరిరావు జీవిత పర్యంతం విప్లవకారుల ఐకత్య కోసం పరితపించారు. ప్రజాతంత్ర ఉద్యమ వేదిక 'జనపథం' పక్ష పత్రికకు కడ వరకూ సంపాదకులుగా కొనసాగారు. కామ్రేడ్ సూరపనేని శేషగిరిరావుకు రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ) విప్లవ జోహార్లర్పిస్తున్నది.

# కామ్రేడ్ జొన్నల అంజిరెడ్డికి జోహార్లు

కామ్రేడ్ జొన్నల అంజిరెడ్డి గుంటూరుజిల్లా నంబూరు గ్రామంలో భూస్వాముల కుటుంబంలో జన్మించారు. అయినప్పటికీ తన జీవితకాలమంతటా కష్టజీవుల పక్షాన నిలిచాడు. దళిత, వ్యవసాయ కూలీలకు, కూలీరేట్ల పెంపుదలకు, ఇళ్ళ స్థలాల సాధనకు బంజరు భూముల స్వాధీనానికి కామ్రేడ్ అంజిరెడ్డి అండగా నిలిచాడు. దళిత కూలీలపై, కుల వివక్ష, ఆర్థిక పీడనలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ కృషిలో కామ్రేడ్ అంజిరెడ్డి క్రియాశీల పాత్ర నిర్వహించాడు. వలస కూలీలకు తమ చావిడిలో ఎల్లవేళలా ఆశ్రయం కల్పించేవాడు. స్త్రీ పునర్వివాహం, వితంతు వివాహాలను ప్రోత్సహించాడు. బెంగాల్ కరువు, రాయలసీమ కరువు, ఉత్తర విశాఖ కరువు సందర్భాలలో కరువు సహాయ నిధులు సేకరించటంలో కామ్రేడ్ అంజిరెడ్డి గొప్ప వితరణశీలిగా తన వంతు పాత్ర నిర్వహించాడు. 1968లో వ్యవసాయ కూలి రేట్ల పెంపుదల ఆందోళన, కాంపైన్‌కు నాయకత్వం వహించినందుకుగానూ మోతుబరుల ఆగ్రహానికి గురైనా వెనుదీయలేదు. తన భూముల్లోనే మొదటగా కూలీరేట్లు పెంచి, ఆందోళన సాగించేవాడు. 2005 సెప్టెంబరు 19న నంబూరు గ్రామంలో మరణించిన కామ్రేడ్ అంజిరెడ్డి ఆదర్శజీవి-ఆయనకు మా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.



# కామ్రేడ్ జెన్నిమామ్మకు జోహార్లు

విజయనగరంజిల్లా దుగ్గేరు గ్రామవాసి కామ్రేడ్ జెన్నిమామ్మ( వెంకమ్మ) (75 సం॥లు). గత 15 సం॥ల నుండీ దుగ్గేరు రైతుకూలీ ఉద్యమంలో కీలకమైన పాత్ర వహిస్తూ ఉద్యమం ప్రతి మలుపులో అగ్రభాగాన నిలబడింది. దుగ్గేరు ఉద్యమంపై పెత్తందార్లు, పోలీసులు కుమ్మక్కై చేసిన భౌతిక దాడుల్లోనూ(1996-99) అక్రమంగా బనాయించిన హత్యాయత్నం కేసులో బొబ్బిలి జైలులోనూ, విశాఖ సెంట్రల్ జైలులోనూ నిర్బంధించబడింది. ఫారెస్టు, పోలీసు, రెవిన్యూ అధికారులు బనాయించిన అక్రమ కేసుల వల్ల కోర్టుల చుట్టూ రోజులతరబడి తిరగవలసి వచ్చేది. 1999లో పెత్తందారీ వర్గాలు, పోలీసు వర్గాలతో కుమ్మక్కై మారణాయుధాలతో దాడిచేసి కామ్రేడ్ జెన్ని తిరుపతిని హత్య చేశారు. ఆ ఘటనకు ముందు, ఘటన తర్వాత పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కోవటంలో దుగ్గేరులోని గిరిజనులకు ధైర్యాన్నిస్తూ, సంఘనాయకత్వానికి అండదండలందించటంలో ఎంతో కీలకమైన కర్తవ్యాన్ని నిర్వహించింది.

దుగ్గేరు ఉద్యమాన్ని, నాయకత్వాన్ని విచ్ఛిన్నం చేయడానికి, దాడులు చేయడానికి వివిధ శక్తులు సాగిస్తున్న ప్రయత్నాలను త్రిప్పికొట్టడంలో ప్రతి సందర్భంలోనూ జెన్నిమామ్మ మెలకువగా, చురుకైన పాత్ర నిర్వహించింది.

గత 15 సం॥రాలుగా ఉద్యమంతో పెనవేసుకొని, తన వంతు బాధ్యతను నిర్వహిస్తూ అనేక కష్టాలనెదుర్కొంటూ నిలబడిన కామ్రేడ్ జెన్నిమామ్మ అక్టోబర్ 25, 2007న అనారోగ్యంతో మరణించింది. కామ్రేడ్ జెన్నిమామ్మకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) విప్లవ జోహార్లర్పిస్తున్నది.

# కామ్రేడ్ బత్తుల సీతారామయ్యకు జోహార్లు

కామ్రేడ్ బత్తుల సీతారామయ్య గుంటూరుజిల్లా, పెదకాకాని హేమలతా టెక్స్‌టైల్స్ కార్మికునిగా, కార్మిక నాయకునిగా సుదీర్ఘకాలం పనిచేసి, కార్మికవర్గ రాజకీయాలతో కార్మిక, కర్షక, కష్టజీవుల రాజ్యం కోసం కడవరకు కృషి చేశాడు. కామ్రేడ్ సీతారామయ్య పెదకాకాని ప్రాంతంలో పీడిత ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అండదండగా నిలిచాడు.

చిన్నప్పటి నుండి కళలపట్ల ఆసక్తి కల కామ్రేడ్ సీతారామయ్య, కళారూపాల ద్వారా ముఖ్యంగా నాటిక, నాటకాల ద్వారా ప్రజలను చైతన్యపరిచేందుకు పూనుకొని, యువకులను కూడగట్టి కళా ప్రదర్శనలిచ్చేవాడు. దురలవాట్లకు వ్యతిరేకంగా నిలబడమని, గ్రామ సమస్యలపై కృషి చేయమని బోధిస్తూ, విద్యార్థి, యువజన సంఘాలలోకి వారిని ప్రోత్సహించేవాడు.

పీడిత వర్గాలు రాజ్యాధికారం సాధించాలని, విప్లవాన్ని సాధించాలని, నూతన సమాజాన్ని నిర్మించాలని నిరంతరం తపించిన కామ్రేడ్ సీతారామయ్య 26.9.05న కన్నుమూశారు. కామ్రేడ్ సీతారామయ్యకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జోహార్లు అర్పిస్తున్నది.

# కామ్రేడ్ మార్కండేయ శర్మకు జోహార్లు

పీడిత ప్రజా ఉద్యమాలకు నిరంతరం అండగా నిలిచిన కామ్రేడ్ మార్కండేయశర్మ అనారోగ్య కారణంగా 23.9.06న మరణించారు. సమాజంలో మౌలిక మార్పులు సాగాలని, నూతన ప్రజాతంత్ర విప్లవంలో భాగంగా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణం జరగాలని గుర్తించి, ఉపాధ్యాయుడిగా, ప్రకాశం జిల్లా ఏపిటీచర్స్ ఫెడరేషన్ నాయకుడిగా సుదీర్ఘకాలం కామ్రేడ్ మార్కండేయశర్మ కృషి చేశారు. వర్గ ఉద్యమాల పట్ల సంఘీభావంగా నిలిచారు. ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఉపాధ్యాయ, ప్రజాతంత్ర ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ శర్మ, కడవరకు పీడిత వర్గ రాజకీయాలతో నిలిచి, నిస్వార్థంగా కృషిచేశారు. కామ్రేడ్ మార్కండేయశర్మకు విప్లవ జోహార్లు.

# కామ్రేడ్ ముక్కు శంకరయ్యకు జోహార్లు

ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘం కార్యదర్శి పీడిత ప్రజల పక్షాన నిలిచిన కార్యకర్త, కామ్రేడ్ ముక్కు శంకరయ్య అనారోగ్యంతో 11.2.06న నెల్లూరుజిల్లా ఉదయగిరి సమీపంలోని కొత్తపల్లిలో కనుమూశాడు.. కామ్రేడ్ శంకరయ్య చివరి వరకూ వర్గ రాజకీయాలను అంటిపెట్టుకొని ఉన్నాడు. తన కుటుంబ సభ్యులను, బంధువులను కూడా విప్లవ రాజకీయాలు చేపట్టమని ప్రోత్సహించేవాడు. పిల్లల రాజకీయ విశ్వాసాల విషయంలో ప్రజాస్వామికంగా వ్యవహరించేవాడు. గ్రామాలలో స్త్రీ విద్యను ప్రోత్సహించి, వారిని రాజకీయాలలో పనిచేసేవారిగా మలిచేందుకు కృషి చేసేవాడు. అమరుడు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి అధ్యక్షునిగా వున్న రైతుకూలీసంఘానికి కామ్రేడ్ ముక్కు శంకరయ్య కార్యదర్శిగా 1992-95 మధ్యకాలంలో పని చేశాడు.

**ఆ కామ్రేడ్‌కు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నివాళులర్పిస్తున్నది.**

# కామ్రేడ్ 'వల్లం'కు జోహార్లు

కృష్ణాజిల్లా తిరువూరులో 1934లో జన్మించిన వల్లం నరసింహారావుగారు 5 సంవత్సరాల వయసు నుండీ గాయకునిగా ప్రజాకళాకారుల తర్ఫీదులలో ఎదిగారు. 'సుంకర' రాసిన పాటలు పాడటం ద్వారా, బెంగాల్ కరువు బుర్రకథ చెప్పటం ద్వారా, ముందడుగు నాటకంలో స్త్రీ పాత్రను నటించటం ద్వారా ప్రారంభమైన ఆయన కళా జీవితం చరిత ప్రసిద్ధికెక్కిన 'మా భూమి' నాటకంలో ఉన్నత దశకు చేరింది. స్వంత బృందాన్ని ఏర్పరచుకొని రాష్ట్రమంతటా మా భూమి నాటిక ప్రదర్శనలిచ్చారు.

'సుంకర' రాసిన అల్లూరి సీతారామరాజు బుర్రకథను తరువాత తరాల వారికి అందించాలనే దీక్షతో-వల్లం నరసింహారావుగారు-తమ అంతిమ రోజుల్లో విజయనగరం జిల్లా గిరిజన బాలికల దళానికి శిక్షణనిచ్చిన జ్ఞాపకాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) గౌరవంగా మదిలో పదిల పరచుకుంటూ వల్లం నరసింహారావుగార్కి అరుణారుణ జోహార్పస్తున్నది.

# అమరులకు జోహార్లు

**2005 జూన్ రాష్ట్ర మహాసభల నుండి 2005 నవంబర్ జనరల్ కౌన్సిల్ మధ్య కాలంలో వివిధ జిల్లాల్లో మరణించిన సంఘ సభ్యులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులకు రైతుకూలీసంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జోహార్లర్పించింది. వేలాది గ్రామాల్ని కబళిస్తూ, లక్షలాదిమంది గిరిజనులను నిర్వాసితుల్ని చేస్తున్న పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక ఆందోళనలో భాగంగా ప్రదర్శనకు తరలివస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కామ్రేడ్స్ మాడే శిరమయ్య, చింతలాడ సుధాకరరెడ్డి, రామా భవానీలకు కౌన్సిల్ నివాళులర్పించింది. కామ్రేడ్స్ సత్యారావు(శ్రీకాకుళం), సత్యం(విజయనగరంజిల్లా) మల్లెపల్లి లక్ష్మీనారాయణ(అనకాపల్లి), కానే చిన్నదొర(కొండమొదలు), పువ్వుల సీతయ్య(చిమిడివలస), సూరపనేని జగదాంబ(చల్లపల్లి), మాలెంపాటి సీతారామయ్య(దివి తాలూకా) మధు(గుంటూరుజిల్లా), పరశురామ్ (అనంతపురం), బలరామయ్య (రాపూరు), దేశెట్టి చినవెంకటస్వామి(వెలుగోడు), రాపాక బుచ్చమ్మ(తడిబాలి), ఇప్పిలి అప్పయ్య (సత్యవరం) దువ్వారపు అప్పన్న, దువ్వారపు లక్ష్మణ(దూలపేట), కొర్రపాటి బ్రహ్మయ్య (కర్నూలు జిల్లా)– ఈ కామ్రేడ్స్ అందర్ని స్మరిస్తూ జనరల్ కౌన్సిల్ జోహార్లు తెలిపింది. అమరుల ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామని నినదించింది.**

2005 నవంబర్ జనరల్ కౌన్సిల్ నుండి 2007 నవంబర్ మధ్య కాలంలో మరణించిన రైతుకూలీసంఘ సభ్యులు, కార్యకర్తలు, సోదర సంఘాల నేతలు, ప్రజాతంత్రవాదులకు; వివిధ ఉద్యమాల సందర్భంగా నేలకొరిగిన వారందరికీ 2007 జనరల్ కౌన్సిల్ ఘననివాళులర్పించింది.

**గుంటూరుజిల్లా –** నెమలికంటి ఏసుపాదం(తాడికొండ), పల్లె వీరారెడ్డి(పల్నాడు), కూరపాటి వీరేశలింగం(మంగళగిరి); మామిడి జక్రయ్య (రెంటచింతల) జొన్నలగడ్డ కోటయ్య(పల్నాడు); **ప్రకాశంజిల్లా –** ద్వారం వెంకారెడ్డి(వలసపాలెం), ఓవిబి ఆచారి(ఒంగోలు); మూలె వెంకటస్వామిరెడ్డి (బొమ్మిరెడ్డిపల్లె); **విజయనగరంజిల్లా –** జెన్నిమామ్మ(దుగ్గేరు); కర్నూలుజిల్లా – పులి రామకృష్ణారెడ్డి, బొమ్మిరెడ్డి భాస్కరరెడ్డి(వెలుగోడు) **తూర్పుగోదావరిజిల్లా –** చింతలాడ పెద్దిరెడ్డి (కొండమొదలు), మావూరి గురుమూర్తి(రాజమండ్రి), నడిపూడి పెద పాపారావు(కొండమొదలు), కుంజం అంకమ్మ(రాజుల భార్య, కొండమొదలు) **పశ్చిమగోదావరిజిల్లా –** నంద్యాల వెంకటరామిరెడ్డి; **ఖమ్మం జిల్లా–** దిరద గంగయ్య, సన్యాసమ్మ, గొర్రె లక్ష్మమ్మ, కోమల సూర్యారావు, ఎ.నాగరాజు, శ్రీకాకుళం జిల్లా– అధికార్ల కూర్మయ్య (కనుగులవలస)

కళావతమ్మ(అనంతపురం), ఇందిర టీచర్ (కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి సతీమణి, గుంటూరు)– వీరందరకూ జనరల్ కౌన్సిల్ నివాళులర్పించింది. ఒరిస్సాలో కళింగనగర్ పోలీసు కాల్పుల్లో నేలకొరిగిన పదకొండు మంది గిరిజనులు; గంగవరం పోలీసు కాల్పుల్లో హతుడైన నూకరాజు; పశ్చిమబెంగాల్‌లోని నందిగ్రామ్ పోలీసు కాల్పుల్లో, సిపిఎం దాడుల్లో బలైనవారు; ముదిగొండలో పోలీసు హతులందరినీ స్మరిస్తూ జనరల్ కౌన్సిల్ మౌనం పాటించి–జోహార్లు తెల్పింది.

# రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) ప్రచురణలు
# (2005-07)



పోలవరం ప్రాజెక్టు, దాని మూలంగా ప్రజలకు ఒనగూడే ప్రయోజనాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం, హడావుడి జరుగుతున్న నేపథ్యంలో-సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగానే ఈ ప్రాజెక్టు, దీని కాలవల నిర్మాణం డిజైన్ చేయబడ్డాయని, రైతాంగానికి సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం కాదని వివరణాత్మకంగా, సహేతుకంగా ఈ పుస్తకంలో వివరించారు. జనశక్తి ఎడిటర్ కామ్రేడ్ జస్వంతరావు రాసిన రెండు ప్రధానమైన వ్యాసాలతోపాటుగా, పోలవరం ప్రాజెక్టు సమస్యపై రైతుకూలీసంఘం చేపట్టిన ఆందోళనలను, సంఘ దృక్పథాన్ని వివరించే కరపత్రాలు, విజ్ఞాపన పత్రాలు, గిరిజన గ్రామసభల తీర్మానాలు అనుబంధాలుగా ఈ పుస్తకంలో ఉన్నాయి.

ఈ పుస్తకం 'పోలవరం ప్రాజెక్టు లక్ష్యాలు, పునరావాస సమస్యలు' పేరుతో రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) ప్రచురణగా 2005 జూన్‌లో వెలువడింది.

---



వ్యవసాయరంగ సంక్షోభం, రైతాంగ ఆత్మహత్యల నివారణ కోసం రాజశేఖరరెడ్డి ప్రభుత్వం జయతీఘోష్ అధ్యక్షులుగా అనేకమంది వ్యవసాయరంగ మేధావులు, వ్యవసాయ నిపుణులతో కమిటి ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి సమస్యను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేసింది. జయతీఘోష్ కమీషన్ సిఫార్సులను వివరిస్తూ, వాటి అమలుకు పూనుకోని ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ, ఆందోళనా కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో 2005 మే నెలలో రైతుకూలీసంఘం ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఈ పుస్తకంలో జయతీఘోష్ కమీషన్ నివేదిక సంక్షిప్త పాఠంతోపాటు ఈ కమీషన్ రాష్ట్ర పర్యటన సందర్భంగా రైతుకూలీసంఘం హైదారాబాద్, విజయనగరం, అనంతపురంలలో ఆయా ప్రాంత సమస్యలను వివరిస్తూ అందజేసిన మెమొరాండాలను కూడా అనుబంధాలుగా అందించారు.

---



రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెనుకబడిన తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టులు నిర్మించాలన్న ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా 'జలయజ్ఞం' పేరిట ధనయజ్ఞం సాగిస్తున్నది-దీనిని నిరసిస్తూ, 'జలయజ్ఞంలో రైతాంగం, ప్రజలు సమిధలు కారాదు! సామ్రాజ్యవాదుల, దళారీల కుట్రలు, కుతంత్రాలను త్రిప్పికొట్టండి!! సమగ్ర జలవనరుల సాధన కోసం నమైక్యంగా ఉద్యమించుదాం' అనే పేరిట రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రచురణగా 2005 ఆగష్టులో బుక్‌లెట్‌గా వెలువరించాము.





2005 నవంబర్‌లో ప్రచురించిన 'ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టులు–ప్రభుత్వ మోసపూరిత విధానాలు' నదీ జలాల వినియోగం, ప్రాజెక్టులకు సంబంధించిన వ్యాసాల సంకలనంగా వెలువడింది. ప్రాజెక్టుల అమలు కోసం సంఘటిత పోరాటాలకు సిద్ధం కావలసిన అవసరాన్ని, రాయలసీమ నీటి సమస్యకు పరిష్కారం చూపించే గుల్హాతి కమీషన్ సూచనలను అమలు చేయాలని, తెలంగాణా జిల్లాల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ పథకాలకు సంబంధించిన విలువైన సమాచారం ఈ బుక్‌లెట్‌లో లభిస్తుంది.

---





ప్రపంచ దేశాల మినిస్టీరియల్ సమావేశాలు 2005 డిసెంబర్ 13 నుండి హాంకాంగ్‌లో జరుగబోతున్న సందర్భంలో వెలువడిన పుస్తకమిది. హాంకాంగ్ సమావేశంలో మన దేశ ప్రజల, రైతాంగ ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు పణంగా పెట్టే విధానాలు చేపట్టనున్న నేపథ్యంలో దీన్ని నిరసిస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఏపిఎఫ్‌టియులు సమష్టిగా హైద్రాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో వివిధ అంశాలపై ప్రసంగించిన వక్తల ఉపన్యాసాలతో–ముఖ్యంగా 'వ్యవసాయరంగం–ప్రపంచ వాణిజ్య సంస్థ' అంశంపై సమగ్రంగా ఈ వ్యాసాలు ఉన్నాయి. డబ్ల్యుటిఓ వ్యతిరేక ప్రచార ఆందోళనకు సరైన అవగాహనందించటానికి, దిశా నిర్దేశానికి ఈ బుక్‌లెట్ తోడ్పదుతుంది.

---



'సెజ్–2005 రద్దు చేయాలని' రైతాంగం నుండి భూముల గుంజివేతను నిలిపివేయాలనే టైటిల్‌తో 2006 అక్టోబరులో చిన్న బుక్‌లెట్ సకాలంలో రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) ప్రచురణగా వెలువడింది. ఈనాడు విస్తారంగా చర్చించబడుతున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళను గురించి ప్రజలు, కార్యకర్తలకు ఆనాడే ఒక ప్రాథమిక అవగాహన కల్పించి, సెజ్ వ్యతిరేక ఆందోళన దిశగా నడిపించేందుకు ఈ బుక్‌లెట్ దోహదపడింది.

---






2007 అక్టోబర్ 31–కోరన్న, మంగన్నల 40వ వర్ధంతి సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర పిలుపు మేరకు పార్వతీపురంలో నిర్బంధం నడుమ నిర్వహించిన బహిరంగ సభలో ఈ రెండు ప్రచురణలను ప్రజా రచయిత, కళాకారుడు, దర్శకుడు, భూపాల్ ఆవిష్కరించారు. గిరిజనుల కోసం కొన్ని జనంపాటల అనువాదాలను జాతాపు భాషలోనూ (తెలుగు లిపిలో), మరి కొన్నింటిని ఒరియా భాషలోనూ 'లోకుఖత్తాఞ' (జనం పాటలు)గానూ; ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల గురించి, సమస్యల పరిష్కారం కోసం సాగే పోరాటాల గురించి, పోరాటాల క్రమంలో అసువులుబాసిన అమరుల గురించి పాటలతో 'మనపాట' (పాటల సంకలనాన్ని) రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఉత్తరాంధ్ర జిల్లాల ప్రచురణలుగా వెలువడ్డాయి.





# అమరుల స్మృతిలో...



29.11.05, కొండమొదలులో ప్రసంగిస్తున్నవారు కా॥ ఝాన్సి
ఎడమ నుండి కామ్రేడ్స్ గంగరాజు, రత్నమాల, సిబిఆర్, ఇల్లా రామిరెడ్డి, నాగరాజు, రామారావు



24.4.07, వెలుగోడులో అమరుడు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి
వర్ధంతి సందర్భంగా స్థూపం వద్ద నివాళులు



20.11.06, మునుగోపాలలో కామ్రేడ్ కారం పార్వతి
వర్ధంతి సందర్భంగా ప్రదర్శన



20.11.07, ఏలూరు, అమరులను స్మరిస్తూ మౌనం పాటిస్తున్న
రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ప్రతినిధులు



24.5.06న కృష్ణాజిల్లా ప్రొద్దుటూరులో ఆవిష్కరించిన తొలితరం కమ్యూనిస్టులు
'కామ్రేడ్స్ సూర్యదేవర గోపాలరావు, భీమవరపు కృష్ణారెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి,
⇦ మండేపూడి నాగభూషణరెడ్డి, ఈడా సాంబమూర్తిల' స్మారక స్థూపం.

1.10.05, నంబూరులో కామ్రేడ్ జొన్నల అంజిరెడ్డి సంస్మరణ సభ,
ప్రసంగిస్తున్నవారు కా॥ కొల్లిపర వెంకటేశ్వరరావు.
ఎడమ నుండి కామ్రేడ్స్ జి.విజయకుమార్, ముత్తిరెడ్డి శ్రీరాములు, కోటయ్య, ఝాన్సి



28.7.07న మరణించిన కా॥చింతలాడ చిన్నబ్బాయి సంస్మరణ సభలో మాట్లాడుతున్నవారు ఎం.వెంకటరత్నం.
ఎడమ నుండి కామ్రేడ్స్ గంగరాజు, రామారావు, ఎం.ఎస్.నాగరాజు.



# 'సెజ్' వ్యతిరేక ఆందోళనా కార్యక్రమాలు



6.11.06న పార్వతీపురంలో సెజ్ వ్యతిరేక ధర్నాలో పాల్గొన్న ప్రజానీకం



17.11.06న గుంటూరు ధర్నాలో మాట్లాడుతున్న కా॥ నాగేశ్వరరావు
ఎడమ నుండి కామ్రేడ్స్ రఘు, ముసలయ్య, ఘంటా సీతారామయ్య, లక్ష్మారెడ్డి



అనంతపురంలో సెజ్ వ్యతిరేక ధర్నాలో మాట్లాడుతున్న డా॥బి.సూర్యానారాయణరెడ్డి
ధర్నాలో రహమతుల్లా ఖాన్, లక్ష్మీరెడ్డి, ప్రజానీకం



ఒంగోలు, సెజ్ వ్యతిరేక ధర్నాలో మాట్లాడుతున్న కా॥డి.వి.ఎన్.స్వామి
ధర్నాలో కామ్రేడ్స్ లలిత, సుధాకర్, రామారావు, రవి, ప్రజానీకం



21.11.06, ఏలూరులో సెజ్ వ్యతిరేక ధర్నాలో ప్రజానీకం



6.11.06న నిజామాబాద్‌లో సెజ్ వ్యతిరేక ధర్నాలో మాట్లాడుతున్న కా॥ గుంగుల నర్సయ్య-ప్రజానీకం

# సామ్రాజ్యవాదాన్ని, డబ్ల్యుటిఓను వ్యతిరేకిస్తూ......



29.11.05, కొండమొదలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల;
అమెరికా అగ్రరాజ్య దిష్టిబొమ్మల దగ్ధం




2.3.06న ఒంగోలులో బుష్, వైయస్సార్, మన్మోహన్ వేషధారణలతో
'బుష్ గో బ్యాక్' నిరసన ప్రదర్శన



7.11.06న పిడుగురాళ్ళలో సద్దాం ఉరిని నిరసిస్తూ,
బుష్ దిష్టిబొమ్మతో ప్రదర్శన



2.3.06న అనంతపురంజిల్లా రాయదుర్గంలో బుష్ దిష్టిబొమ్మ దగ్ధం
ప్రదర్శనలో కామ్రేడ్స్ సి.నాగరాజు, తిమ్మారెడ్డి




6.11.06న పార్వతీపురంలో బుష్ దిష్టిబొమ్మతో నిరసన ప్రదర్శన




12.1.06న మచిలీపట్నంలో బహిరంగ సభలో మాట్లాడుతున్న కా॥జె.కిశోర్
ఎడమ నుండి కామ్రేడ్స్ బెల్లంకొండ రవి, వేమన ఆదినారాయణ, సోని, భార్గవశ్రీ, అంజమ్మ

# రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలపై...



భూస్వాముల ఆక్రమణలోని భూముల్ని పేదలకు పంచాలని
18.4.07న కొమరాడలో ధర్నా-మాట్లాడుతున్నవారు కా॥డి.వర్మ



29.7.07న పోలవరంలో ముదిగొండ కాల్పులను నిరసిస్తూ
ఏజన్సీ గిరిజన సంఘం ప్రదర్శన



13.8.06న గుంటూరుజిల్లా తుమ్మకోటలో రైతాంగ సమస్యలపై ప్రదర్శన
ముందు వరుసలో కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు,
కోటయ్య, విజయకుమార్




6.3.06వెంకటగిరిలో చేనేత కార్మికుల సమస్యలపై
ధర్నాలో మాట్లాడుతున్న కామ్రేడ్ జె.కిశోర్



ప్రకాశంజిల్లా ఈతముక్కల భూముల సమస్యలపై
23.3.07 ఒంగోలులో ప్రదర్శన



29.9.05, బందరులో దేశ వ్యాపిత
కార్మికుల సమ్మెకు మద్దతుగా ప్రదర్శన



మేడే సందర్భంగా శ్రీకాకుళంలో ప్రదర్శన

# పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా.......



దేవీపట్నం బహిరంగ సభ-
మాట్లాడుతున్నవారు కామ్రేడ్ ఎం.ఎస్.నాగరాజు



2006 ఫిబ్రవరి, వెంకటరెడ్డిగూడెంలో ప్రజలతో చర్చాగోష్ఠి
ఎడమ నుండి ప్రొ॥జయప్రకాష్, సి.బి.ఆర్, బి.డి.శర్మ, ఎస్.ఝాన్సి
నాగరాజు, రామారావు తదితరులు



24.6.06 పోలవరం స్పిల్‌వే వద్ద సంఘం ఆధ్వర్యంలో
పనులను అడ్డగిస్తున్న ప్రజానీకం




19.11.07 ఏలూరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కా॥ ఇల్లా రామిరెడ్డి
ఎడమ నుండి కామ్రేడ్స్, జె.కిశోర్, కె.కోటయ్య,కె.ఆర్.చౌదరి. పి.జస్వంతరావు, ఎస్.ఝాన్సి



20.11.07న ఏలూరు ధర్నాలో పాల్గొన్న ప్రజానీకం



ధర్నాలో పాల్గొన్న ప్రజలతో గొంతు కలిపిన నేతలు,
ప్రజాతంత్రవాదులు

# వరద సహాయ కార్యక్రమాలు



2006 ఆగష్టులో రైతుకూలీసంఘం ఏర్పరచిన 'వరద సహాయక కమిటి'
బృందానికి వరద బాధిత ఏజన్సి గిరిజనుల ఆహ్వానం



బాధితులకు పంపిణీ కోసం తెచ్చిన
సహాయ సామగ్రిని ఒడ్డుకు చేరవేస్తున్న గిరిజనులు





వరద బాధితులను ఉద్దేశించి మాట్లాడుతున్న కామ్రేడ్ జె.కిశోర్‌బాబు. చిత్రంలో కామ్రేడ్స్ ఎస్.ఝాన్సి, కె.కోటయ్య, సి.పెద్దన్న, ఎం.ఎస్.నాగరాజు తదితరులు. వరద బాధితులకు బట్టల పంపిణి



ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయాన్ని హక్కుగా సాధించుఉకోవడానికి సిద్ధమైన గిరిజనులు.



శ్రీకాకుళంజిల్లా కోమర్తి ఆఫీసులో  తలదాచుకున్న వంశధార వరద బాధితులను
పరామర్శిస్తున్న కా॥ఝాన్సి

# జిల్లాలలో సదస్సులు



23.11.05, హైద్రాబాద్ రాష్ట్ర సదస్సులో రైతుకూలీసంఘం సావనీరును ఆవిష్కరిస్తున్న దృశ్యం
ఎడమ నుండి కామ్రేడ్స్ వై.సోని, జాఫ్రీ, వి.హనుమంతరావు, సి. పెద్దన్న, జె.కిశోర్‌బాబు, ఎస్.ఝాన్సి, జి.విజయకుమార్, సి.బి.ఆర్, కె.కోటయ్య




సదస్సులో ప్రసంగిస్తున్న డా॥బి.డి.శర్మ
ఎడమ నుండి కామ్రేడ్స్ జి.విజయకుమార్, గణేష్ పండా, ఆదారి.అప్పారావు, డి.వర్మ, నాగభూషణం, ఎస్.ఝాన్సి, కె.కోయటయ్య






ప్రసంగిస్తున్న ప్రొ॥కె.ఆర్.చౌదరి
ఎడమ నుండి కామ్రేడ్స్ రామారావు, నాగభూషణం, గణేష్ పండా, బి.డి.శర్మ, ఎస్.ఝాన్సి, జస్వంతరావు, వర్మ



30.9.07న విశాఖపట్నంలో 'వలస పాలన వ్యతిరేక రైతాంగ కార్మిక పోరాటాలపై 'ఉత్తరాంధ్ర సదస్సులో అమరులకు జోహార్లు చెప్తున్న దృశ్యం





సద్నులో ప్రసంగిస్తున్న కా॥టి.అరుణ.
ఎడమ నుండి కామ్రేడ్స్ నాగభూషణం, వర్మ, కిషోర్, ఝాన్సి

నందిగామ సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ కె.కోటయ్య,
ఎడమ నుండి కామ్రేడ్స్ మందాజార్జి, షేక్ బద్రుద్దీన్, వాసిరెడ్డి సాంబశివరావు, భార్గవశ్రీ, సోని








# సంఘీభావంగా...







24.8.07 పాటియాలా(పంజాబ్)లో రైతాంగ సమస్యలపై రైతు, కూలీ సంఘాల సదస్సు వేదికపై కా॥ ఎస్.ఝూన్సి, డా॥ బి.డి.శర్మ, వివిధ సంస్థల ప్రతినిధులు.

గేయాలాలపిస్తున్న పంజాబీ ప్రజాకళాకారులు

సదస్సు ప్రారంభోపన్యాసం చేస్తున్న ప్రముఖ పంజాబీ ప్రజాకాళాకారుడు కా॥గురుచరణ్‌సింగ్

2007 మార్చి, విజయవాడలో నందిగ్రామ్ హత్యాకాండపై సభలో మాట్లాడుతున్న డి.సత్యనారాయణరెడ్డి




2007 మార్చి నందిగ్రామ్ హింసాకాండ బాధితులను పరామర్శిస్తున్న కా॥ఎస్.ఝూన్సి



ఎడమ నుండి కామ్రేడ్స్ ఎస్.ఝూన్సి, వై.సోని, కె.కోటయ్య

నందిగ్రామ్ హత్యాకాండపై విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కా॥ఝూన్సి చిత్రంలో కామ్రేడ్స్ కె.కోటయ్య, గణనాథ్‌పాత్రో, సి.బి.ఆర్, సుబోధ్‌మిత్రా తదితరులు






2006 జనవరి 2న కళింగనగర్ పోలీస్ హత్యాకాండకు బలైన గిరిజనులకు జోహార్లు చెప్తున్న బృందం చిత్రంలో కామ్రేడ్స్ వి.నారాయణరెడ్డి, ఝూన్సి, ఛాయరాజ్, కోటయ్య, సిబిఆర్, శివరామ్(ఒరిస్సా) తదితరులు.



కళింగనగర్ బాధితులను పరామర్శించి వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యులు

సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు

బట్టీ బోధనా విధానము విజ్ఞానాభివృద్ధికి శత్రువు

# బి.వి.సుబ్బయ్య హైస్కూల్

స్థాపితం : 1963 (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంస్థ)

**పేర్నమిట్ట (పోస్టు) యస్.ఎన్.పాడు మండలం, ప్రకాశం జిల్లా**

**తెలుగు మరియు ఇంగ్లీషు మీడియం**



**ఫోన్స్ 08592-256232 256295**

గత పది సం॥ నుండి 98%కి పైగా ఉత్తీర్ణతా శాతం సాధించుచున్నాము. వీరిలో 90% ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులగుచున్నారు.గత రెండు దశాబ్దాలుగా బట్టీ బోధన విధానమునకు స్థానములేకుండా, వ్యక్తిగత లాభం లేకుండా నిర్వహించుట, దెబ్బ వేయకుండా అభిమానంతో కూడిన వైఖరితో విద్యార్థులు సంపూర్ణ క్రమశిక్షణను సంతోషముగా పాటించునట్లు చేయగలుగుట వలన ఈ విజయాలను సాధించగలుగు చున్నాము.

## విద్యాసంస్థ నిర్వహణలో అందరూ పాటించదగిన మా అనుభవాలు

- విద్య లక్ష్యము విజ్ఞానము. ఈ విజ్ఞానము ప్రతి విద్యార్థికి సంపూర్ణముగా లభించుటకుగాను ఒక్కొక్క సెక్షన్‌లో పరిమితమైన సంఖ్యలో 35 మందికి మించకుండా ఉంచి, ప్రతి విద్యార్థికి సంపూర్ణంగా అర్థమగునట్లు బోధించుచున్నాము.
- విజ్ఞానాభివృద్ధికి గొడ్డలి పెట్టు అయిన బట్టీ బోధనా విధానమునకు మా సంస్థలో స్థానము లేదు.
- ఈ బట్టీ విధానానికి మూలమైన వ్యక్తిగత లాభంకోరు వ్యాపార పద్ధతులకు మా సంస్థలో స్థానము లేదు.
- అయిన ఖర్చును మాత్రమే విద్యార్థి భరించునటువంటి పద్ధతిలో మా హాస్టల్ నడుపుచున్నాము.
- విద్యార్థి ఆరోగ్యమునకు, మనోవికాసమునకు, శారీరక వ్యాయామమునకు ఆటలు ఎంతో అవసరం. ఇందుకు గాను 10 ఎకరములు ఆట స్థలము కలదు. మరియు ముగ్గురు పి.ఇ.టి.లు కలరు. అవసరమైన ఆటల పరికరములన్నియూ కొరత లేకుండా అమర్చుచున్నాము. జిల్లా ఆటల పోటీలలో మా విద్యార్థులు అందరూ ఘనమైన విజయాలు సాధించిన విషయం అందరకూ తెలిసినదే.
- పూర్తి స్థాయి ప్రయోగశాల మరియు గ్రంథాలయములు కలవు.
- ప్రతి విద్యార్థిపై "సమగ్ర పరిశీలన" (Case Study) ద్వారా అందరి విద్యార్థుల అభివృద్ధికి చర్యలు తీసుకొందుము.
- అన్ని తరగతుల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ నందు శిక్షణ ఇవ్వబడును.
- అదుపు లేకుండా కాపీలు జరుగుచున్న ఈ రోజులలో మా విద్యార్థులు కాపీ జోలికి పోరని ఎల్లరకు తెలియును.
- ఇందుకు కారణము ఈ సంస్థ నుండి బట్టీ బోధన విధానమును తరిమివేయుటే.

సెక్రటరీ & కరస్పాండెంట్

**బి.వి. సుబ్బయ్య**

# ప్రకాశం జిల్లా పాల ఉత్తత్తిదారుల సరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్

జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ(ఎన్‌డిడిబి)
వారి ఉమ్మడి యాజమాన్యంలో నడుస్తున్న డెయిరి



ఒంగోలు: 231205, 234919, సెక్యూరిటీ:23407, ఫ్యాక్స్: 232264

**ప్రకాశం జిల్లాలో పాడి పరిధ్రమ అభ్యున్నతికి, పాల ఉత్పత్తిదారుల అర్ధికాభివృద్ధికి**
**గత 30 సంవత్సరాలుగా నిరంతర కృషి చేస్తున్నరైతు యాజమాన్య సంస్థ-ఒంగోలు డెయిరి**



ఎస్.కె.ఎం. వలి, మేనేజింగ్ డైరెక్టర్

# ఒంగోలు డెయిరి



చల్లా శ్రీనివాసరావు, చైర్మన్

## పాలు మరియు పాల పదార్థములు 'అత్యుత్తమం"

- ప్రకాశం జిల్లా పాల ఉత్తత్తిదారులు గత దశాబ్దాలుగా ఎదురుచూసిన పాలపాడి కర్మాగారము 23.12.06న ప్రారంభించబడివది.
రోజుకొ 2.5.లక్షల లీటర్ల పాలను ప్రతిరోజ పాలపాడిగా తయారు చేయుట జరుగుతున్నది
- పాడి పశువులు ఆరోగ్య సంస్థ కొరకు అత్యవసర పశువుల చికిత్సా వాహనమును అక్టబరు నుండి ప్రారంభించబడినది.
- అధిక పాల సరఫరాకు అధిక ధర అనే నినాదంతో అత్యధికముగా పాలు సరఫరా చేసిన సంఘములకు అత్యధిక రేటు లీ 1కి రూ.26.00 చొప్పన చెల్లించుచున్న సంస్థ
- 28 కూలీంగు బల్‌నస కూలింగు యూనిట్లను జిల్లాలో 3 సం॥లలో స్థాపించుటకు, డిశంబరు 2007 నాటికి 10 బల్క్ కూలింగు యూనిట్లు ప్రారంభించుటకు చర్యలు చేపట్టబడినవి.
- 2006-07 సం॥లలో వివిధ పాడిపశువుల ఋణ పథకముల ద్వారా 2965 పాడిపశువులను పాల ఉత్పత్తిదారులకు సరఫరా చేయుట జరిగినది.
- 2007-08 సం॥లలో 3500 పాడి పశువులకు ఋణ పథకము ద్వారా ఇచ్చుటకు నిర్దేశించుచూ, ఇప్పటి వరకు 950 పాడి పశువులను పంపిణీ చేయుట జరిగినది.
- గాలి కుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక కార్యక్రమము క్రింద ఆగష్టు నెలలో టీమ్స్‌గా ఏర్పాటు చేసి, 53000 డోసులు చేయుట జరిగినది
- ప్రతి సంవత్సరం పాడి పశు ఆరోగ్య సంక్షేమ (సాంకేతిక వరులు) కార్యక్రమము కొరకు 1 కోటి 95 లక్షల రూపాయల నిధజతో కృషి చేస్తున్న సంస్థ
- రైతుల పాల ఉత్పత్తి నిరంతరం గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులకు ప్రోత్సాహకములు చెల్లించుచున్న సంస్థ.
- మేలుజాతి పాడి పశువుల అభివృద్ధి కొరకై సబ్సిడిపై ముర్రాజాతి విత్తనపు దున్నలను జిల్లాలోని కుగ్రామములకు కూడా సరఫరా చేస్తున్న సంస్థ.
- పాడి పశువుల పచ్చిమేత పోషణకై 50% సబ్సిడీపై పశుగ్రాస విత్తనములు మరియు బహువార్షిక పశుగ్రాస రకములైన కో-3, ముంబసా, టాంజానియా, గిని గడ్డి కలువులను ఉచితంగా అందిస్తున్న సంస్థ.
- పాడి పశువుల ఆరోగ్యాన్ని కాపాడుటకు ఖనిజలవణ మిశ్రమమును 50% సబ్సిడీతో అందిస్తున్న సంస్థ.
- 30% సబ్సిడీపై పాడి పశువుల బీమా సౌకర్యం కల్పించి అపత్సమయంలో అందుకుంటున్న సంస్థ.
- మేలుజాతి పాడి పశువులైన ముర్రా జాతి చూడి పడ్డలు మరియు గేదెలను హర్యానా రాష్ట్రం నుండి దిగుమతి చేసుకొని రైతుల పాల దిగుబడిని పెంచుటకు కృషిచేస్తున్న సంస్థ.

| సరఫరా చేయవలసిన పరిమాణము (సంఘము/కేంద్రము) | ఉత్పత్తి దారునికి చెల్లింపు మొత్తము (లీటరుకి) రూ. పై |
|---|---|
| 50 లీ॥ కంటె తక్కువ | 23.50 |
| 51-100 లీటర్లు | 23.50 |
| 101-250 లీటర్లు | 24.50 |
| 251-400 లీటర్లు | 24.50 |
| 401-600 లీటర్లు | 25.00 |
| 601-1000 లీ. | 25.50 |
| 1000 లీ. పైన | 26.00 |

రాష్ట్రములోనే పాల ఉత్పత్తి దారులకు అత్యధికముగా లీటరకు 26.00రూ. ఇస్తున్న సంస్థ మన ఒంగోలు డైయిరీ.

మన ఒంగోలు డెయిరీ ఉత్పత్తుల్ని కాపాడుకుందాం రైతు శ్రేయస్సుకు, వినియోగదారుని ఆరోగ్య రక్షణకు పాటుపడదాం.......
జిల్లాలోని వినియోగదారుల అవసరాలను గ్రహించి ఎప్పటికప్పడు నూతన ఉత్పాదనలను, కల్తీలేని ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్న సంస్థ మన ఒంగోలు డెయిరి


with Best Compliments From:
SRI SARATHI STUDIOS
PRIVATE LIMITED
8-3-321, AMEERPET,
HYDERABAD-500 073
PH:3237299


with best compliments from:
SAROVAR COFFEE SHOPPE
5-9-22, sarovar complex,
secretariat Road,
Hyderabad-500 063
Ph: 3237299


WITH BEST COMPLIMENTS FROM:
ANIL PRABHAS PRIVATE LIMITED
HOTEL SAROVAR
5-9-22, Secretariat Road
Hyderabad-500 063
ph: 3237638

# భూమి సమస్య: చారిత్రక ప్రాధాన్యతగల మూడు రైతాంగ పోరాటాలు

ఎస్.రఘాన్ని

ఫ్యూడల్ సంకెళ్లను బ్రద్దలుకొట్టడానికి భారత ప్రజలు, ప్రత్యేకించి రైతాంగ ప్రజలు 1947కు ముందూ, ఆ తర్వాతా అనేక పోరాటాలు సాగించారు. వీటిలో తెలంగాణా, తేభాగా, నక్సల్బరీ పోరాటాలు ఎంతో చారిత్రక ప్రాధాన్యత గల విప్లవ పోరాటాలు. ఈ మూడు వేర్వేరు చారిత్రక, రాజకీయ నేపథ్యాలలో సాగిన పోరాటాలు. వీటి స్థాయిల్లో కూడా తేడాలున్నాయి. ఐనప్పటికీ, భారత ప్రజల ప్రజాతంత్ర ఆకాంక్షలకు, ఎడతెగని ప్రయత్నాలకు ప్రాతినిధ్యం వహించడంలో ఈ పోరాటాలకు స్పష్టమైన మౌలికమైన సారూప్యతలున్నాయి.

## తెలంగాణా రైతాంగ పోరాటం

తెలంగాణా పోరాటం గ్రామీణ ప్రాంతాల్లో మూర్తీభవించిన ఫ్యూడల్ వ్యవస్థ, దానికి రక్షణగా నిలిచిన నిజాం రాచరిక నిరంకుశత్వం రాజ్యమేలుతున్న హైదరాబాదు ఎస్టేట్‌లో ఆరంభమైన పోరాటం. ఆంధ్ర మహాసభ నాయకత్వాన ప్రాధమిక ప్రజాతంత్ర కోర్కెలతో శాంతి యుత, చట్టబద్ధ నిరసనగా ఆరంభమైన ఈ పోరాటం కమ్యూనిస్టుల అవిశ్రాంత కృషి వల్ల, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం ఫ్యూడల్ వర్గాల ఆర్థిక, రాజకీయ అధికార పునాదులనే కూకటివేళ్లతో పెరికి వేయగల వ్యవసాయ విప్లవోద్యమంగా అభివృద్ధి చెందింది. ఫ్యూడల్ వర్గాలకు, వారి రక్షణ కోసం రంగం లోకి దిగిన నిజాం నిరంకుశ పాలనకు, దాని సాయుధ బలగాలకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ ప్రతిఘటనగా, గెరిల్లా పోరాటంగా అభివృద్ధి చెందింది. నిజాం నిరంకుశపాలన కుప్పలా కూలిపోతున్న సమయంలో రైతాంగ ఉద్యమాన్ని రక్తపు టేరుల్లో ముంచెత్తి ప్రజలు సాధించిన విజయాలను వమ్ము చేయడానికి రంగంలోకి దిగిన భారత సైన్యానికి వ్యతిరేకంగా నాలుగేళ్లపాటు సాయుధ ప్రతిఘటనా, పోరాటంగా కొనసాగింది.

తెలంగాణా రైతాంగ విప్లవోద్యమం నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 16,000 చ.మైళ్ల విస్తీర్ణంగల సుమారు 30,00,000 జనాభా నివసించే 3,000 గ్రామాలలో సాగింది. శత్రుదాడుల నుండి తన్ను తాను రక్షించుకొంటూ, బలంగా రూపొందే ప్రయత్నంలో ఇతర జిల్లాల్లోని విశాల గిరిజన ప్రాంతాలకు, వాటిని ఆనుకొనివున్న మైదాన ప్రాంతా లకు ఉద్యమం విస్తరించింది.

కమ్యూనిస్టు పార్టీ విశాలాంధ్ర రాష్ట్ర శాఖ నాయకత్వాన, ఆంధ్ర మహాసభ నాయకత్వాన సంఘటితపడి అనేక పోరాటాలు సాగించిన తెలంగాణా రైతాంగ ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో ఫ్యూడల్ వర్గాల ఆర్థిక, రాజకీయ అధికారాలను దెబ్బతీసి గ్రామ రాజ్యాలను నెలకొల్పడానికి దారితీసే సమగ్రమైన వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని అమలు జరిపారు.

ప్రజలు అన్ని రకాల వెట్టిచాకిరీలకు స్వస్తి చెప్పారు. అక్రమ నిర్బంధ వసూళ్లకు స్వస్తి చెప్పారు. నిర్బంధ లెవీ చెల్లించ నిరాకరించారు. భూస్వాములనుండి కౌలుకు తీసుకొన్న భూములను నిలబెట్టుకున్నారు. భూస్వాములు అక్రమంగా స్వాహా చేసిన భూములను తిరిగి ఆక్రమించుకొన్నారు. ప్రభుత్వం, భూస్వాముల ఆక్రమణలో ఉన్న బంజరు భూములను స్వాధీనం చేసుకొన్నారు. భూస్వాముల ధాన్యం నిల్వలను స్వాధీనం చేసుకొని పంచుకొన్నారు. పటేల్, పట్వారీలు, భూస్వాముల, వ్యాపారుల రికార్డులను, ప్రామిసరీ నోట్లను, బాండ్లను స్వాధీనం చేసుకొని తగులబెట్టారు. అధిక వడ్డీరేట్లు పూర్తిగా రద్దు చేయబడ్డాయి; లేదా తీవ్రంగా తగ్గించబడ్డాయి. భూస్వాముల మిగులు భూములను స్వాధీనం చేసుకొని పంచుకొన్నారు. భూములకు కనీస గరిష్ట పరిమతి నిర్ణయించి, మిగతా భూమిని పంచుకొన్నారు. ప్రజా కమిటీల నాయకత్వాన 10 లక్షల ఎకరాల భూమిని భూమిలేని, పేదరైతులు పంచుకొన్నారు. గ్రామాల్లో భూస్వాముల, పెత్తందార్ల దౌర్జన్యాలు రద్దు చేయబడినాయి. వ్యవసాయ కార్మికులకు కూలీరేట్లు పెంచబడ్డాయి. ప్రజాకంటకులైన భూస్వాములను గ్రామాలనుండి, గడీల నుండి, భవనాలనుండి ప్రజలు తరిమి వేశారు. అత్యంత క్రూరులుగా తేలిన ప్రజా శత్రువులను తగిన విధంగా శిక్షించారు. 3,000 గ్రామాలలో ప్రజలు గ్రామరాజ్యాలు ఏర్పాటు చేసుకొన్నారు. గ్రామరైతు కమిటీలే భూమి పంపిణీ, విద్య, వైద్యం, గ్రామీణ పరిపాలనా వ్యవహారాలన్నింటినీ నిర్వ హించాయి. ఈ గ్రామరాజ్యాల ఆధ్వర్యంలో ప్రజలు వ్యవసాయానికి అవసరమైన నీటి కాలువలు, చిన్న చెరువులు సమష్టిగా తవ్వు కొన్నారు. గ్రామరాజ్యాలు స్త్రీ, పురుషులకు సమాన హక్కులుంటాయని ప్రకటించాయి. వాటిని ఆచరణలోకి తేవడానికి కృషి చేశాయి. కులవివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రచారాన్ని తీవ్రతరం చేశాయి. ప్రజా కళారూపాలను ప్రోత్సహించాయి. ప్రజలను దురలవాట్ల నుండి బయట పడవేయడానికి విస్తారమైన కృషి చేశాయి. పోరాట క్రమంలో ప్రజలు 10,000 గ్రామ రక్షణ దళాలను, గెరిల్లా సాయుధ బలాలను నిర్మించుకొన్నారు. నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం పురోగ మించిన క్రమంలో ఈ బలాలను పెంచు కొన్నారు.

పోరాటాన్ని అడవి ప్రాంతాలకు విస్తరించే అధ్యయనం చేసింది. నిర్దిష్టమైన, అడవి ప్రాంతాల ప్రజలసమస్యలను నిర్దిష్టంగా అధ్యయనం చేసింది. నిర్దిష్టమైన, పాక్షికమైన కోర్కెలను రూపొందించి గిరిజన ప్రజలను పోరాటాల్లోకి నడిపించింది. ఈ కోర్కెలలో కొన్ని ఇలా ఉన్నాయి: గిరిజనుల నుండి వసూలు చేసే అనేక రకాల పన్నులు, అక్రమ నిర్బంధ వసూళ్లు రద్దు చేయాలి; దున్నేవానికే భూమి పై హక్కుండాలి; భూస్వాములు, కాంట్రాక్టర్లు అక్రమంగా కాజేసిన భూములను గిరిజనులు తిరిగి స్వాధీనం చేసుకోవాలి; అధిక వడ్డీ దోపిడీని, అప్పులను, వెట్టి చాకిరీని రద్దు చేయాలి; అడవిపైనా, అడవి ఉత్పత్తులపైనా అధికారం, హక్కు గిరిజనులదే. గిరిజన ప్రాంతాలకు స్వయంపాలన, స్థానికపరిపాలనాధికారం ఉండాలి. పోరాటంలో గిరిజనులు అనేక విజయాలు సాధించారు.

వీరోచితమైన ఈ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టులు, రైతుయోధులు అమరులయ్యారు. 10,000లకుపైగా ఏళ్ల తరబడి శత్రు నిర్బంధ శిబిరాల్లో, జైళ్ళల్లో మగ్గారు. కనీసం 50,000 మంది ప్రజలు వారాలు, నెలల తరబడి పోలీసు, మిలటరీ క్యాంపుల్లో చిత్రహింసలు అనుభవించారు.

## విప్లవ గుండె-నల్లగొండ

**- తిరునగరి రామాంజనేయులు**

నల్లగొండరా విప్లవపు గుండెరా
కొల్లగొట్టి తిను దోపిడిమూకల
గుండెల్లో పెనుగాలంగా నల
గొండ విప్లవోద్దండ శక్తియై
చండ ప్రచండత చాటిందిర మన ॥న॥

బందగి రక్తం చిందిన క్షేత్రం
అమరుడు కొమరయ్యొరిగిన నేల
విప్లవశక్తుల పుట్టినిల్లురా
స్వేచ్ఛాసమరం సాగిన రంగం ॥న॥

మధ్యయుగంబుల అమానుషత్వం
మానవరుధిరం త్రాగే క్రౌర్యం
జమీందారుల జాగీర్‌దారుల
దేశముఖుల దౌర్జన్యపశుత్వం
పూడ్చి పెట్టగా స్వేచ్ఛ పొందగా
పట్టుబట్టి తొడగొట్టె తొట్టతొలి
నల్లగొండరా విప్లవ ప్రచండరా ॥న॥

పచ్చి నెత్తురులు తాగే నైజాం
పిచ్చి కుదిర్చిన వీరుల తల్లీ
రెచ్చిన రజ్వీ పిచ్చికుక్కల
మచ్చుమాపు యోధుల్ల మాతరా
పటేలు పన్నిన పద్మవ్యూహం
బదాబదులు గావించిన శక్తి
అహింస కవచపు రాక్షసమూకల
పద ఘట్టనలకు తొణకని హిమగిరి
నల్లగొండరా అది తెల్గుగుండెరా ॥న॥

ఏకధాటి తన నణచగ మూర్ఖపు
పటేలు నైజాం పటాలమ్ములే
నిరాయుధులపై కిరాతమ్ముగా
దురాగతాలతొ పరుగెత్తించి
పరాన్నభుక్కుల ప్రజాహంతకుల
కిరాతమూకల బిరాన దించి
చరిత్రలో కని వినని విధంగా
స్వైర విహారం సల్పిన గానీ
అదరక బెదరక ఆశవమున సెగ
పొగలు జిమ్ము విప్లవపు మేరు వది
నల్లగొండరా తెలగాణ గుండెరా ॥న॥

నిరంకుశుం డా నైజం కీచకు
నడుము సడలె తన మడమ తాపునకు
పాడుబడెను నైజాం పరిపాలన
మూడువేల తెలగాణ గ్రామముల
పదిలక్షల ఎకరాల భూ స్థలికి
వదలె దొరల తరతరాల చెరలు
దేశానికి ఒక ఆశాజ్యోతిగ
విముక్త వెల్గుల వెదజల్లెనురా
ప్రపంచ పీడిత తాడిత శక్తులు
భళి భళి భళియని ప్రస్తుతించెరా ॥న॥

అనేక లక్షలమంది శత్రుదాడులకు గురయ్యారు. ఆస్తుల లూటీని, విధ్వంసాన్ని ఎదుర్కొన్నారు. వేలాదిమంది మహిళలు మానభంగాలకు, నానారకాల అత్యాచారాలకు, అవమానాలకు గురయ్యారు. ఒక్క మాటలో, మొట్టమొదట నిజాము, అతని రజాకారు సాయుధ మూకలు, ఆ తర్వాత నెహ్రూ ప్రభుత్వం-నిజాం సాయుధ బలాలు అత్యంత బీభత్సపూరిత పాలన సాగించాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన రైతాంగ ప్రజలు, ప్రజాసాయుధబలాలు అత్యంత వీరోచితంగా వీటినెదురొడ్డి నిలిచారు. మహిళలు పార్టీ కార్యకర్తలుగా, రైతాంగ పోరాటయోధులుగా, గెరిల్లాలు, ప్రజాకళాకారులు, ప్రజాశ్రేణులుగా పెద్ద సంఖ్యలో ఈ పోరాటంలో పాల్గొన్నారు. అసాధారణ సాహసాన్ని, త్యాగనిరతిని ప్రదర్శించి ఆదర్శ జీవులుగా వెలుగొందారు.

ఈ విధంగా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన లక్షలాది రైతాంగ ప్రజలు అనేక రూపాల్లో సంఘటితపడి అర్ధదశాబ్ద కాలం పాటు(1946-51) సాగించిన పోరాటం. దున్నేవానికే భూమి అన్న నినాదాన్ని కేంద్రంగా చేసుకొని, మొత్తం భూమి సంబంధాలను ప్రజాతంత్రయుతంగా, విప్లవాత్మకంగా పునర్నిర్మించడానికి, గ్రామీణ ప్రాంతాలలో ఫ్యూడల్, భూస్వామ్య వర్గాల ఆర్థిక, రాజకీయ అధికారాన్ని కూల ద్రోయడానికి దోపిడీ, పీడనలకు గురవుతున్న విశాల జన బాహుళ్యం సాగించిన వ్యవసాయ విప్లవం. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకు, పోరాటానికి విశ్వసనీయ బలాన్ని సమకూర్చిన నిజమైన ప్రజాతంత్ర విప్లవం. సామ్రాజ్యవాదులతో నీచమైన, ద్రోహపూరితమైన రాజీకిదిగిన భారత దళారీ బూర్జువా- భూస్వామ్య వర్గాల ప్రతినిధిగా కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వం సైనిక చర్య ద్వారా తెలంగాణా రైతాంగ ప్రజలను రక్తపుటేరుల్లో ముంచెత్తడానికి పూనుకొన్నప్పుడు భారత పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర విప్లవపతాకాన్ని

ఎగురవేసిన మహత్తర పోరాటం. రక్త తర్పణతో సమకూర్చుకొన్న విప్లవాను భవాలనాధారం చేసుకొని, మావో ఆలోచనా విధానం వెలుగులో భారతదేశంలోని నూతన ప్రజాతంత్ర విప్లవ ఆవశ్య కతను, వ్యవసాయవిప్లవ ప్రాముఖ్యతను నొక్కి చెప్పిన విప్లవోద్యం ఇది. భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవశక్తులను సంఘటి తపరచడంలో, పోరాటపథంలో నడిపించ డంలో, అజేయమైన శక్తిగా రూపొందిం చటంలో వ్యవసాయ విప్లవం నిర్వహించగల పాత్రను, ప్రజాయుద్ధం యొక్క ఆవశ్యకతను భారతదేశంలో అది తీసుకొనగల నిర్దిష్టమైన రూపురేఖలను ఎత్తిచూపిన విప్లవోద్యమం ఇది.

## తేభాగా రైతాంగ పోరాటం

రెండవ ప్రపంచయుద్ధంలో భారత జాతీయోద్యమం ఒక వెల్లువగా ఉప్పొంగింది. క్విట్ ఇండియా నినాదం దేశ వ్యాపితంగా లక్షలాది ప్రజలను కార్యాచరణలోకి దింపింది. ఈ సందర్భంగా కార్యాచరణలోకి వచ్చిన గ్రామీణ ప్రజలలో రైతాంగమే ప్రధానశక్తిగా వున్నారు.

1943లో బెంగాల్ రాష్ట్రం మిద్నపూర్ జిల్లాలో యుద్ధ సన్నాహాల పేరిట బ్రిటీష్ వలస ప్రభుత్వం చేపట్టిన నిర్బంధ లెవీ వసూలుకు వ్యతిరేకంగా వేలాది రైతాంగ ప్రజలు కదిలారు.ప్రభుత్వాన్ని సాంప్రదాయిక ఆయుధాలతో ప్రతిఘటించడానికి సిద్ధపడ్డారు. దీనిలోభాగంగానే, రెండు సబ్ డివిజన్లకు చెందిన ప్రజలు రోడ్లను ధ్వంసం చేసి, పోలీస్ స్టేషన్లకూ– గ్రామలకూ ఉన్న సంబంధాన్ని తెంచి వేశారు. రోజుల తరబడి కొన్ని గ్రామాల్లో 'స్వతంత్ర పాలన' అమలు జరిపారు. విస్తారమైన ప్రాంతంలో వలస పాలనను ప్రతిఘటించే ప్రయత్నంలో ఒక భాగమే ఇది. ఐతే, 1943లోనే మిద్నపూర్‌తో సహా బెంగాల్ తీరప్రాంతాలను భయానక ఉప్పెన –ఆ తర్వాత మహాక్షామం ముంచెత్తాయి. 30 లక్షల జనాన్ని ఇవి పొట్టన పెట్టుకొన్నాయి. బ్రిటీష్ వలస పాలకులు ఈ మహావిపత్తును వాడుకొన్నారు. మిద్నపూర్ ప్రజల పోరాటం తీవ్రంగా దెబ్బతిన్నది.

ఫాసిజం ఓటమితో దేశంలో యుద్ధానంతర ప్రజావెల్లువ పెల్లుబికింది. తెలంగాణా, వర్లీ (మహారాష్ట్ర), పున్నప్ర–వాయిలార్(కేరళ), మోగా(పంజాబ్), బీహార్ తదితర రాష్ట్రాల్లో రైతాంగ పోరాటాలు ముందుకు వచ్చాయి. 1946లో తేభాగా రైతాంగ పోరాటం (బెంగాల్) ఈ వెల్లువలో ఒక భాగంగా వచ్చినదే.

1946 సెప్టెంబరు పంట కోతల సమయంలో తేభాగా ఉద్యమం ఆరంభిం చాలని పార్టీ బెంగాల్ రాష్ట్ర కమిటీ, బెంగాల్ రాష్ట్ర కిసాన్ సభలు రైతాంగానికి పిలుపు నిచ్చాయి. భూస్వాముల వద్ద భూమిని కౌలుగా తీసుకొని సేద్యం చేస్తున్న కౌలు దార్లకు (భారగ్‌దార్లు) పంటలో సగం వాటా కాక మూడింట రెండువంతుల పంట ఇవ్వాలి." "కౌలుదార్లు తమ స్వంత కళ్లాల లోనే పంటను నూర్చాలి"; "అప్పుగా ఇచ్చిన ధాన్యం పై వడ్డీ తీసుకోరాదు"; "అక్రమ వసూళ్లు మానాలి"; "కౌలుదార్లకు బెంగాల్ రాష్ట్ర కిసాన్ సభ ఇచ్చిన పోరాటనినాదాలు.

1946 ఆకురాలు కాలంలో తేభాగా ఉద్యమం ఒక వెల్లువలా ఉధృతమైంది. అతిస్వల్పకాలంలోనే మిద్నపూర్, దినాజ్ పూర్, రంగ్‌పూర్, 24 పరగణాలు, జల్పాయ్ గురి, ఖుల్నా, మాల్దా, చిటగాంగ్, జెస్సోర్, మైమన్‌సింగ్ తదితర 19 జిల్లాలకు చెందిన విశాల ప్రాంతాలకు విస్తరించింది.

రైతువలంటీరు దళాలు వందలు, వేల సంఖ్యలో భూముల్లోకి దిగి పంటలు కోయడం; మొత్తం పంటను తమ కళ్లాల్లో నిలువ చేయడం; భూస్వాములు ఈ కళ్లాలకు వచ్చి, తాము నిర్ణయించిన మూడవ వంతు వాటా తీసుకొని వెళ్లాలని చెప్పడం; కోతలను అడ్డుకొనడానికి, తమ కళ్ళాలకు చేర్చడాన్ని అడ్డుకొనడానికి భూస్వాములు ప్రయత్నిస్తే దాన్ని ప్రతిఘటించడం, భూస్వాముల, పోలీసుదాడులనుండి తమ కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని రక్షించుకొనడం; భూస్వాములు తమ కళ్లాలకు చేర్చుకొన్న ధాన్యాన్ని తిరిగి తమ కళ్లాలకు తరలించడం లాంటి పద్ధతులన్నీ కౌలుదార్లు ఈ ఉద్యమం సందర్భంగా అమలు జరిపారు.

ఇక్కడ రైతాంగ కోర్కెలు నిస్సందేహంగా పాక్షికమైనవి. ఐనప్పటికీ, ప్రజలు ఈ సందర్భంగా అనుసరించిన మిలిటెంటు పోరాట, నిర్మాణ పద్ధతులు, సాయుధ ప్రతిఘటనా పద్ధతులు పోరాటానికి విప్లవకర స్వభావాన్ని సమ కూర్చాయి.

ఈ పోరాటంలో లాఠీలు, ఎర్రజెండాలు ధరించిన రైతాంగవలంటీర్లు ప్రదర్శనలు జరిపేవారు; పంటలు కోసేవారు. పంటలను కళ్లాలకు చేర్చేవారు. నూర్చే వారు. భూస్వాములను, పోలీసులను ప్ర ఘటించే వారు. కొన్ని చోట్ల తుపాకులు లాక్కొన్నారు. ఈ పోరాటంలో రైతు కార్య కర్తలు తుపాకీగుళ్లకు నేలకొరిగారు. అరెస్ట యిన తమ నాయకులను విడిపించుకొన డానికి వేలాదిమంది ప్రజలు కార్యాచరణకు దిగేవారు. ఇదే కాలంలో తూర్పు పాకిస్తాన్ లోని మైమన్‌సింగ్ జిల్లా నేత్రకోన, సదర్,

> "మా బాధలే మీ మృత్యువు
> మా మరణము క్రొత్త బ్రతుకు
> రాగల యుగముల మనిషికి
> ప్రాణ వాయువీ సమరము
> మీ పాపం పండుతుంది
> మీ రాజ్యం కూలుతుంది
> ప్రజాబలం సమవాదపు
> ప్రభుత్వాన్ని ఏలుతుంది
> ఇది జోస్యం కాదు, కాదు
> ఇతిహాసపు గతితర్కం
> అధికారపు బీరాలను
> అది గాలికి ఎగరగొట్టు
> సామ్రాట్టుల సామాన్యపు
> సమాధులకు పంపించును"
>
> **- హరీంద్రనాథ ఛటోపాధ్యాయ**
> **'వీర తెలంగాణ విప్లవ గాథలు' నుండి**
> **అనువాదం: ఆరుద్ర**

జమాల్‌పూర్ ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజ్వరిల్లిన “టంకా ఉద్యమం' (పంట పండినా, ఎండినా కౌలుదార్లు భూస్వామికి కౌలు చెల్లించి తీరాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా-) జమీందారీ విధానం రద్దు ఉద్యమం తేభాగా ఉద్యమానికి తోడైంది. అత్యంత మిలిటెంటుగా సాగిన ఈ టంకా ఉద్యమం సాయుధపోరాట రూపం తీసుకొన్నది. మహిళా ఆత్మరక్షణ సమితిగా సంఘటితపడిన ఈ ప్రాంతాల మహిళలు ఈ పోరాటంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నాయకత్వపాత్ర నిర్వహించారు. ముస్లిం భూస్వాములకు వ్యతిరేకంగా హిందూ-ముస్లిం రైతులు ఐక్యంగా పోరాడారు.

తేభాగా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో రైతుల కోర్కెలను ఆమోదించే ఒక బిల్లును బెంగాల్ ప్రభుత్వం (1947) గెజెట్‌లో ప్రచురించింది. కాని దీన్ని మరుక్షణంలో చెత్తకుండీలో పడవేసింది. తీవ్ర నిర్బంధంతో రైతాంగంపై విరుచుకపడింది.

జూన్ 1947లో ఒక పెద్ద రైతాంగ వెల్లువ రాగలదనీ, ఆ సమయానికి జమీందార్ల, జోతేదార్ల స్వంత భూములు స్వాధీనం చేసుకొనే వ్యవసాయ విప్లవోద్యమానికి రైతాంగం సిద్ధంగా వుండాలని ఫిబ్రవరి 1947లో బెంగాల్ కిసాన్ సభ మహాసభ పిలుపిచ్చింది. కాని ఇది అమల్లోకి రాలేదు. ఈలోగా అనేక ప్రతికూల మార్పులు వచ్చాయి. దేశంలో ఉవ్వెత్తుగా లేచిన జాతీయ వెల్లువను దెబ్బతీయడానికి వలస పాలకులు మతోన్మాదాన్ని ఒక ఆయుధంగా సంధించారు. రెండు మతాల్లోని (హిందూ, ముస్లిం) మతోన్మాదులు, సామ్రాజ్యవాదులకు దళారులుగా మారిన రాజకీయ శక్తులు ఈ నీచమైన కుట్రకు పనిముట్లుగా ఉపయోగపడ్డారు. బెంగాల్-మతోన్మాద కల్లోలానికి, నవకాలీ హత్యాకాండలకు ఒకపెద్ద ప్రయోగశాలైంది. తేభాగ ఉద్యమ పురోగమనానికి ఈ పరిస్థితి ఒక పెద్ద అవరోధమైంది.

అధికార మార్పిడితోపాటు జరిగిన దేశ విభజన, తేభాగ రైతాంగ పోరాటాన్ని భౌగోళికంగా నిలువునా చీల్చివేసింది. ఈ పోరాటానికి ప్రధాన కేంద్రాలుగా వున్న జిల్లాలు పాకిస్తాన్‌లో భాగమయ్యాయి. సహజంగానే మొత్తం రైతాంగఉద్యమం బలహీనపడింది. అధికార మార్పిడి తర్వాత తూర్పు పాకిస్తాన్‌లో మైమన్‌సింగ్ జిల్లాల్లో గిరిజన పోరాటం, గిరిజన సాయుధ పోరాటం కొన్నాళ్లపాటు కొనసాగాయి.

తేభాగా పోరాటం వ్యవసాయ విప్లవోద్యమానికి ఆనాడున్న భౌతిక అనుకూల పరిస్థితి ఎత్తి చూపింది. కౌలు రేటులాంటి పాక్షిక సమస్య అత్యంత విశాలమైన (19 జిల్లాలు) ప్రాంతాలను, లక్షలాది భూమిలేని, పేద రైతాంగాన్ని, గిరిజనులను, ముస్లిం ప్రజలను మిలిటెంటు కార్యాచరణలోకి, సాయుధ ప్రతిఘటనలోకి తెచ్చిందంటే వ్యవసాయ విప్లవోద్యమంలో గర్భితమై వున్న విప్లవశక్తినే అది వెల్లడిస్తుంది. సరైన, నిలకడైన రాజకీయ నాయకత్వం కొరవడిన స్థితిలో ఈ పోరాటం మరో అడుగు ముందుకు వెళ్లలేకపోయినప్పటికీ ఈ పోరాటం చారిత్రక ప్రాధాన్యతగలది. దీని అనుభవాలు నేటికీ విలువైనవి.

## నక్సల్బరీ రైతాంగ పోరాటం

పశ్చిమబెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లా సిలిగురి సబ్ డివిజన్ నక్సల్బరీ ప్రాంతంలో ముందుకు వచ్చిన (1967) రైతాంగ విప్లవోద్యమం భారత రాజకీయాలలో మరొక మారు విప్లవకర మలుపును ఆవిష్కరించిన చారిత్రక ప్రాధాన్యతగల పోరాటం.

దేశం-తీవ్రమైన ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో వున్న సమయంలో, రెండు దశాబ్దాలపాటు ఏకఛత్రాధిపత్యం సాగించిన కాంగ్రెసు ప్రభుత్వాలు అనేక రాష్ట్రాలలో ప్రజల అసంతృప్తి జ్వాలల, తీవ్రమైనపాలక వర్గాల వైరుధ్యాల తాకిడికి కూలిపోయిన సమయంలో బెంగాల్లో ఐక్య సంఘటన ప్రభుత్వం రాజ్యమేలుతున్న సమయంలో ప్రజ్వరిల్లినదే ఈ నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు.

1946-47 నాటి చారిత్రాత్మక తేభాగా పోరాటం సాగిన ప్రాంతాలలో ఈ ప్రాంతం ఒక భాగం. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన 1951 నుండీ ఎగుడుదిగుళ్లతో, వంకర టింకర క్రమంలో, శాంతియుతంగా, హింసాయుతంగా, చట్టపరిమితుల్లో, చట్టాలకు అతీతంగా అనేక రూపాల్లో అభివృద్ధి చెందిన వర్గపోరాటమే 1967 స్థాయికి చేరిన నక్సల్బరీ పోరాటం.

నక్సల్బరీ విస్తారమైన ప్రాంతాల్లో టీ తోటలు వ్యాపించి వున్న ప్రాంతం కూడా. ఈ తోటల్లో పనిచేసే వేలాది కార్మికులు భూమిలేని, పేద రైతుకుటుంబాలనుండి వచ్చినవారే. సహజంగానే రైతాంగ-కార్మిక ఉద్యమాలు అత్యంత సన్నిహితంగా, పెనవేసుకొని అభివృద్ధి చెందడానికి ఇది ఎంతో అనుకూల పరిస్థితిని సమకూర్చింది.

1951-54 మధ్యకాలంలో జోతేదార్ల అక్రమ వసూళ్ళకు వ్యతిరేకంగా రైతాంగం, టీ తోట యజమానుల దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు సంఘటితపడ్డారు. అనేక పోరాటాలు చేశారు. పరస్పరం సంఘీభావ సహకారాలందజేసుకొన్నారు. 1955లో బోనసు కోసం సమ్మెకు దిగిన టీ తోటల కార్మికులకు రైతాంగం మద్దతుగా నిలిచింది. కార్మికులపై దాడికి టీ తోటల యజమానులు, పోలీసులు దిగినప్పుడు వేలాది మంది కార్మికులు-రైతులు ఐక్యంగా ఎదుర్కొన్నారు. ఒక సందర్భంలో పోలీసులను నిరాయుధులను చేశారు. 1958-62లో బెంగాల్ రాష్ట్ర కిసాన్ సభ బినామీ భూముల పునరాక్రమణకు పిలుపిచ్చింది. ఈ సమయంలోనే నక్సల్బరీలో జరిగిన సబ్ డివిజన్ కిసాన్ సమితి రైతులకు ఇలా పిలుపిచ్చింది: 1) జోతేదార్ల పంటలను కోసి మీ కళ్లాల్లో నిలువచేయండి. 2) జోతేదార్లు భూములు తమవి అని ధృవపరిచే పత్రాలను రైతు కమిటీలకు అందజేయాలి. అప్పుడే వారి వాటా ఇవ్వబడుతుంది. 3) రైతులు తమ పంటలను కాపాడుకోవాలి. దీని కోసం వారు సాయుధం కావాలి. 1958-59లో తీవ్ర నిర్బంధం అమలైంది. ఈ కాలంలో ప్రజలు భూస్వాములతో, పోలీసులతో ఘర్షణ పడ్డారు. అత్యధికభాగం పంటలను కాపాడుకొన్నారు. అంతటా ఎర్ర జెండాలతో నక్సల్బరీ అరుణారుణమైంది. ఒక పెద్ద భూస్వామి దౌర్జన్యంగా రైతుల ధాన్యాన్ని

కాజేయడానికి ప్రయత్నించినప్పుడు 5000 మంది రైతులు సాంప్రదాయక ఆయుధాలతో కదిలి గూండాలను, పోలీసులను ఎదుర్కొని ధాన్యాన్ని కాపాడుకొన్నారు. 1962-64 భారత చైనా యుద్ధం సందర్భంగా ఈ ప్రాంతంలో కూడా అరెస్టులు జరిగాయి. 1964లో సిపిఐ (ఎం) ఏర్పడిన సమయంలో దేశ వ్యాపితంగా పార్టీ నాయకత్వం నిర్బంధాలకు గురైంది. ఈ ప్రాంతంలో కూడా నాయకత్వంలో అత్యధిక భాగం అరెస్టయింది. 1964లో డార్జిలింగ్ జిల్లా పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాలు, కార్మిక-రైతాంగ ఉద్యమాలు సిపిఐ(యం)తో వచ్చాయి.

1964-66 మధ్యకాలంలో జైళ్ల లోపలా, బయటాఉన్న ఈ జిల్లా కమ్యూనిస్టు నాయకత్వం భారత విప్లవ పంథా గురించి ఆలోచనలు, చర్చలు సాగించారు. భిన్న ధోరణలు వ్యక్తమైనప్పటికీ స్థూలంగా భారత విప్లవం ప్రజాయుద్ధ పంథా అనుసరించాల్సి ఉంటుందన్న నిర్ణయానికి వచ్చారు.

1966 జూన్-డిసెంబరు కాలం నక్సల్బరీ తిరుగుబాటుకి ఆరంభకాలం. సెప్టెంబరు 1966లో 9 రోజులపాటు సాగిన టీ తోటల కార్మికుల సాధారణ సమ్మె రైతాంగ తిరుగుబాటులో సన్నాహక పాత్ర నిర్వహించింది. పోలీసుకాల్పుల్లో ఒక కార్మికుడు మరణించడంతో కొండల్లో కార్మికుల ఆగ్రహం పతాక స్థాయికి చేరింది. మైదానాల్లో, నక్సల్బరీ రైతాంగం తమ వ్యవసాయ పనులను ప్రక్కనబెట్టి కార్మికుల పక్షాన ధృఢంగా నిలిచింది. కోర్కెలను సాధించకుండానే రివిజనిస్టులు సమ్మె విరమణకు పూనుకొని కార్మికుల నుండి ఏకాకు లైపోయారు. ఈ సమ్మె కార్మికుల చైతన్యాన్ని ఎంతగానో పెంచింది. వారు తమ సంఘ వార్షిక సభలో భూమి కోసం పోరాటం సాగిస్తున్న నక్సల్బరీ రైతాంగానికి తమ మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. రైతాంగ పోరాటానికి సంఘీభావంగా కార్మికులు మూడుసార్లు సమ్మె చేశారు. 1966 సెప్టెంబరులో సాంప్రదాయిక ఆయుధాలతో వేలాది రైతులు కదిలి పంట కోతలు, పంటల స్వాధీనం సాగించారు. రైతుల పంటలను స్వాధీనం చేసుకొనడానికి వచ్చిన పోలీసులను సాయుధ టీ తోట కార్మికులు అడ్డుకొన్నారు. ప్రభుత్వం పార్టీ నాయకులను, కార్మిక, రైతు కార్యకర్తలను వేటాడింది. నిర్బంధాలకు పాల్పడింది.

1967లో వచ్చిన ఎన్నికల సందర్భంగా ఎలా వ్యవహరించాలన్నది ఒక వివాదాంశ మైనది. వ్యవసాయ విప్లవ రాజకీయాలను జనం మధ్యకు విస్తారంగా తీసుకొని వెళ్లడానికి ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలన్నది డార్జిలింగ్ జిల్లా కార్యకర్తల వైఖరి. వారదే చేశారు. ఎన్నికలు జరిగిన వెంటనే రైతాంగం పంటల స్వాధీన ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. రైతులకూ - భూస్వాములకూ ఘర్షణలు చెలరేగాయి. కార్మిక-కర్షకుల ఐక్య ప్రతిఘటన ముందు భూస్వాములు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో భూమి సమస్య ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా, 1967 ఆరంభంలో జరిగిన నక్సల్బరీ సబ్ డివిజన్ రైతు మహాసభ నిర్ణయాలు ఎంతో కీలకమైనవి. ఈ మహాసభ 10 విప్లవ కర్తవ్యాలతోపాటు ఇలా పిలుపిచ్చింది: 1) భూములపై భూస్వాముల ఆధిపత్యాన్ని బ్రద్దలుకొట్టి, రైతు కమిటీల ఆధ్వర్యాన భూమిలేని, పేదరైతులకు భూములు పంచాలి 2) భూస్వాముల, అభివృద్ధి నిరోధకుల దాడులను ప్రతి ఘటించడానికి రైతాంగ సాయుధం కావాలి. 3) గ్రామాలకు సంబం ధించిన అన్ని వ్యవహారాలనూ గ్రామ రైతు కమిటీలే నిర్వహించాలి. ఈ పిలుపు మొత్తం రైతాంగ ప్రజల్లో గొప్ప ఉత్తేజాన్ని, కదలికనూ తెచ్చింది. 1967 మార్చి చివర-ఏప్రిల్ చివరిదాకా ఒక నెలరోజుల కాలంలో కార్యాచరణలోకి దిగిన వేలాది రైతాంగం అనేక విజయాలు సాధించారు. 1967 మే 7న

## రాబోయే రోజుల్లో

- పులుపుల వెంకటశివయ్య (1945 జులై)

రాబోయే రోజుల్లో రాజయ్యే మొనగాడా
ఈ రోజు పేదోడా ఇంకా నిదురోయేవా? ॥రాబోయే॥

తొలి కోడి కూసింది తొలి సంజె కాసింది
దశదిశలా జగమంతా తళతళలై మెరిసింది ॥రాబోయే॥

ఇలగన్న జనశక్తి యుద్ధంలో నిలుచుంది
ఎర్రన్ని మన జెండా ఎగసిందీ పైపైకి ॥రాబోయే॥

హిట్లర్ల హతమార్చి ఇలనొక్క స్వర్గంగ
ఎర్రనీ పిడికిలీ ఏలగా వచ్చింది ॥రాబోయే॥

మీదే ఈ నేలంటూ మీవే ఈ నిధులంటూ
ఏకమై నిలుడంటూ ఎలుగెత్తి పిలిచింది ॥రాబోయే॥

రాబోయే రోజుల్లో రచియించే బంగారు
చరితలకు తొలిపలుకు సవరింపలేవోయి ॥రాబోయే॥

రోజున జరిగిన సబ్ డివిజన్ కార్మిక-కర్షక సంయుక్త మహాసభ రైతాంగ పోరాట నినాదాలకు పూర్తి మద్దతు ప్రకటించింది.

1967 ఎన్నికల్లో సిపిఐ(ఎం) కూడా భాగస్వామిగా ఉన్న 14 పార్టీల ఐక్య సంఘటన బెంగాల్లో అధికారం చేపట్టింది. ఈ ప్రభుత్వం ఒక వైపున చర్చల ద్వారా నక్సల్బరీ ఉద్యమంపై నీళ్లు చల్లడానికి ప్రయత్నిస్తూనే నిర్భంధాన్ని తీవ్రతరం చేయడానికి నాయకులను అరెస్టు చేయడానికి పూనుకొన్నది.

మే 24, 1967 రోజున నక్సల్బరీకి మూడు కిలోమీటర్ల దూరాన వున్న బరాజోర్ గ్రామంపై పోలీసులు పెద్ద ఎత్తున దాడికి దిగారు. ఈ సందర్భంగా వేలాది రైతులు, కార్మికులు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో వాంగ్డీ అనే ఒక సబిన్‌స్పెక్టర్ చనిపోయాడు. కొందరు పోలీసు అధికారులు గాయపడ్డారు. తమ భూముల పరిరక్షణ కోసం ప్రజలు జరిపిన ప్రతిఘటన ఇది. ఈ ఘటన భూమి కోసం రైతాంగం సాగిస్తున్న పోరాటాన్ని ఉన్నతదశకు తీసుకొని వెళ్లింది. మే 25 రోజున నక్సల్బరీకి కొద్దిదూరంలో వున్న ప్రసాదుజోట్ వద్దకు ఎస్‌డివోతో సహా సాయుధ పోలీసులు వచ్చారు. అక్కడ జనరల్ బాడీ సమావేశం జరుపుకొంటున్న మహిళలు వెంటనే వారిని చుట్టు ముట్టారు. కొద్దిసంఖ్యలో ఉన్న పోలీసులను నిరాయుధం చేశారు. తమని వదిలిపెట్టమని పోలీసులు వేడుకొనడంతో అక్కడున్న మగవారు కల్పించుకొని విడిపించారు. తమ ఆయుధాలతో కొన్ని గజాలదూరం వెళ్లిన పోలీసులు వెనక్కి తిరిగి కాల్పులు జరిపారు. ఒక పసిపాపతో సహా 11 మంది మహిళలు అక్కడికక్కడే నేలకొరిగారు; అమరులయ్యారు. మే 24 నాటి ఘటనకు ప్రతిగా ప్రతీకారం కోసం పోలీసులు వచ్చారనీ, పథకం ప్రకారమే కాల్పులు జరిపారనీ ఈ ఘటన నిరూపిస్తుంది. పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వం భూస్వాముల ప్రయోజనాలకోనవే నిలిచిందని ప్రభుత్వం జరిపిన ఈ హత్యాకాండ నిరూపించింది.

నక్సల్‌బరీ రైతాంగ విప్లవోద్యమంలో కా॥త్రిభువన్‌కాను, సోభన్‌అలి, బర్మామాజీ, బాబూలాల్ బిశ్వకర్మకార్, 10మంది రైతు మహిళలు, ముక్కుపచ్చలారని పసికందు, ఇంకా అనేక కమ్యూనిస్టు, రైతుపోరాట యోధులు అమరులయ్యారు. వేలసంఖ్యలో అరెస్టులకు, దాడులకు, చిత్రహింసలకు గురయ్యారు. కార్మికులు, కర్షకులు ఆదర్శవంతమైన మైత్రిని, సంఘీభావాన్ని, ఐక్యతను ప్రదర్శించారు. పోరాటశీలతను ప్రదర్శించారు.

ప్రగతి, ప్రజాస్వామ్యం, సోషలిజం లాంటి పదాలతో, ప్రచారపటాటోపంతో సంస్కరణల వాగ్దానాలతో రెండు దశాబ్దాల పాటు భారత పాలకవర్గాలు పాలన సాగించిన తర్వాతకూడా గ్రామీణ ప్రాంతాల్లో మౌలికమైన, ప్రజాతంత్రయుత మార్పులు రాలేదని, రైతాంగం సంఘటితపడి, విప్లవోద్యమ కార్యాచరణ పూనుకొనడమే దీనికి మార్గమని నక్సల్బరీ రైతాంగం ఎత్తి చూపింది. భారతదేశంలో అనేక ప్రాంతాల్లో భూస్వామ్యవిధానానికీ-విస్తృత జన బాహుళ్యానికీ మధ్య వైరుధ్యాలు తీవ్రస్థాయికి, బ్రద్దలయ్యేస్థాయికి చేరాయని, రైతాంగాన్ని వ్యవసాయవిప్లవం ప్రాతిపదికగా చైతన్యపరిచి, సంఘటిత పరిచి విప్లవ కార్యాచరణలోకి నడిపిస్తే విప్లవప్రజలు అద్భుతమైన మార్పులని ఆవిష్కరిస్తారని, సామ్రాజ్యవాద, భూస్వామ్యదోపిడీ పీడనల నుండి దేశాన్ని విముక్తి చేయగల నూతన ప్రజాతంత్ర విప్లవానికి బలమైన, విశ్వసనీయమైన పునాదులు వేయగలరని నక్సల్బరీ పోరాటం చూపెట్టింది. తెలంగాణా రైతాంగ పోరాటం శక్తివంతంగా ప్రాతినిధ్యం వహించిన నూతనప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను, విప్లవపంథాను తిరిగి బలంగా ఎజెండామీదకు, విస్తారంగా ప్రచారంలోకి తెచ్చిన పోరాటమిది. విప్లవరాజకీయాలకు పునరంకితంకావడానికి, ఈ రాజకీయాల ప్రాతిపదికగా పునఃసంఘటితం కావడానికి కమ్యూనిస్టు శక్తులకు ఇచ్చిన శక్తివంతమైన పిలుపే ఈ పోరాటం. అదేసమయంలో మిత వాదకోణంనుండి, అతివాద దుస్సాహసిక కోణంనుండి అనేక వక్రీకరణలకు, దాడులకు ఈ పోరాటం గురైందన్నది, ఇది నేటి విప్లవోద్యమానికి తీవ్రనష్టాలను, యిబ్బందులను తెచ్చి పెట్టిందన్నది ఒక విచారకర వాస్తవం.



ముందే చెప్పినట్లు భారతదేశంలో తెలంగాణా, తేభాగా, నక్సల్బరీపోరాటాలు చారిత్రక ప్రాధాన్యత గల పోరాటాలు. వ్యవసాయ విప్లవ కర్తవ్యాలనాధారం చేసుకొని విస్తృత రైతాంగజన బాహుళ్యాన్ని విప్లవకార్యాచరణలోకి నడిపించిన పోరాటాలు. ఈ పోరాటాలు అందుకొన్న స్థాయిని, అమలు జరిపిన కర్తవ్యాలను బట్టి, విప్లవ సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకు, నిర్దిష్ట ఆచరణలకు అన్వయించడంలో సాధించిన ఫలితాలను బట్టి ఈ పోరాటాలందించే అనుభవాల లోతుపాతులుంటాయన్నది వాస్తవం. అదే సమయంలో భారత ప్రజలు, వారికి ఆయాకాలాల్లో నాయకత్వం వహించిన కమ్యూనిస్టులు వ్యవసాయవిప్లవోద్యమాల అనుభవాలను సమకూర్చిపెట్టిన సంపదల్లో ఒక భాగమే, ఈ పోరాటాల అనుభవాలు. నూతన ప్రజాతంత్ర విప్లవానికి- దానిలో ఒక భాగమైన వ్యవసాయవిప్లవ నిర్మాణానికి కృషి చేస్తున్న శక్తులు వీటిని స్వంతం చేసుకోవాలి; ఆకళింపు చేసుకోవాలి; నేటిపరిస్థితులకు, ఆచరణకు అన్వయించుకోవాలి

# ఆహార సంక్షోభం-సామ్రాజ్యవాదుల కుతంత్రం

- ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, హైద్రాబాద్

అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ ఇటీవల ఒక ముఖ్యమైన ప్రకటన చేశాడు. అదేమంటే, ఈనాడు అమెరికాతో సహా అనేక దేశాల్లో ఆహార సంక్షోభ పరిస్థితులు నెలకొనిఉన్నాయనీ, దీనికి ప్రధాన కారణం భారత్, చైనా దేశాల్లో ప్రజలు బాగా తిని బలిసిపోయారనీ, అందువల్ల విదేశాలకు భారత్ ఆహార ధాన్యాలు, ముఖ్యంగా, బియ్యం, గోధుమలను ఎగుమతి చేయడం లేదనీ! ఈ ప్రకటన నిజాలను నిలువునా పాతిపెట్టేదిగా వుంది. నిజానికి అమెరికా ప్రజల ఆహారధాన్యాలు, తదితర ఆహార పదార్థాల వినియోగంతో పోల్చుకుంటే, భారత ప్రజల వినియోగ స్థాయి అత్యంత తక్కువుగా వున్నట్లు గణాంక వివరాలు తెలుపుతున్నాయి. భారత్‌లో ఆహారధాన్యాల తలసరి వినియోగం సగటున 178 కేజీలు వుంటే, అమెరికాలో అది ఐదురెట్లు ఎక్కువగా వుంది. అది 1046 కేజీలు. పాల వినియోగం రెట్టింపుగా వుంది. భారత్‌లో 36 కేజీలు, అదే అమెరికాలో 78 కేజీలు. వంటనూనెల వినియోగం సగటున భారత్‌లో 11 కేజీలు, అమెరికాలో 41 కేజీలు. మాంసం భారత్‌లో1.6 కేజీలు, అమెరికాలో 42.6 కేజీలు. అంటే దాదాపు 22 రెట్లు అధికం. భారత్‌లో బియ్యం, గోధుమ, జొన్నలు మొదలైన ఆహారధాన్యాల వినియోగం 2007-08లో 19.73 కోట్ల టన్నులు. అదే అమెరికాలో 31.04 కోట్ల టన్నులు. ఉభయదేశాల్లోని జనాభాను పోల్చుకుంటే, భారత్‌లో ప్రజల ఆహార ధాన్యాల వినియోగం ఎంత తక్కువగా వుందో గ్రహించవచ్చు. ఆఫ్రికా దేశాలకంటే భారత్‌లో ఆహార సమస్య తీవ్రంగా వుంది.

అయినప్పటికీ, జార్జిబుష్ అలాంటి ప్రకటన ఎందుకు చేశాడు? భారత ప్రజలను కాలే కడుపులతో పస్తులుంచి, ఆహారధాన్యాలను, ముఖ్యంగా బియ్యాన్ని అమెరికా ప్రజలను మేపడానికి ఎగుమతి చేయాలా? బుష్ ఆషామాషీగా ఆ ప్రకటన చేయలేదు. తేలికతనంతో చేయలేదు. విషయ పరిజ్ఞానం లేకనూ చేయలేదు. అన్నీ తెలిసీ చేశాడు. ఈ ప్రకటనలో మోసం వుంది. కుట్ర వుంది. కుతంత్రం వుంది. సామ్రాజ్యవాదశక్తుల అహంభావం, అహంకారం, దబాయింపు, బెదరింపులను ఈ ప్రకటన తేటతెల్లం చేస్తోంది.

సామ్రాజ్యవాద దేశాలకు, ముఖ్యంగా అమెరికా దేశానికి చెందిన బహుళజాతి కంపెనీలు అనేక దేశాల్లో ఆహారధాన్యాల వ్యాపారాన్ని తమ గుప్పెట్లో వుంచుకున్నాయి. అవి దేశదేశాల్లో ఆహారధాన్యాల ధరలతో పాటు ఎగుమతి, దిగుమతులను శాసిస్తున్నాయి. మన దేశంలో అమెరికాకు చెందిన కార్గిల్ కంపెనీ గోధుమ, బియ్యం వ్యాపారం చేస్తోంది. భారీ ఎత్తున గోధుమలను పంజాబ్ తదితర ప్రాంతాల్లో కొనగోలు చేసి సేకరిస్తోంది. గోధుమలను నిల్వ చేసేస్తోంది. పిండి తయారుచేసి దేశీయ మార్కెట్లో అమ్ముకుంటోంది. లక్షలాది టన్నుల గోధుమను ఎగుమతి చేసే ప్రయత్నంలో వుంది. ఎగుమతికి భారత ప్రభుత్వం అనుమతించడం లేదు. అందువల్లనే, అమెరికా ఎగుమతికి అనుమతులివ్వాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం పైన ప్రకటనలు, తదితర మార్గాల ద్వారా ఒత్తిడి చేస్తోంది. సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు అత్యధిక లాభాలను ఆహారధాన్యాల ఎగుమతుల ద్వారా సాధించి పెట్టడమే సామ్రాజ్యవాద శక్తులకు నాయకత్వం వహిస్తున్న అమెరికా యొక్క కుటిల ప్రయత్నమని విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాదు, పేద దేశాల్లోని ప్రజలు ఏమి తినాలి, ఏ మేరకు తినాలి అని శాసిస్తున్నాడు. భారత్ ప్రజలు ఎక్కువగా తింటే, అది ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. అందువల్ల ప్రపంచ ప్రజలు ఆకలికి గురికావాల్సి వస్తుందని బుష్ సెలవిస్తున్నాడు. నిజానికి, భారత్ నుండి ప్రపంచ మార్కెట్‌కు ఎగుమతి అయ్యే ఆహార ధాన్యాల స్థాయి అత్యల్పం. బుష్ చెప్పినట్లు ఇది ప్రపంచ ప్రజల ఆహార వినిమయాన్ని ఏ మాత్రం ప్రభావితం చేయజాలదు. ఇదంతా సామ్రాజ్యవాదుల మాయాజాలం. బహుళజాతి సంస్థల లాభాలమయం.

## ఆహార సంక్షోభం యొక్క తీవ్రత:

దాదాపు 80 దేశాల్లో ఆహార సంక్షోభం నెలకుని వుందనీ, 33 దేశాల్లో ఇది మరింత తీవ్రంగా వుందని నివేదికలు తెలుపుతున్నాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో ఆకలి, ఆహార సమస్య తీవ్రంగా వుంది. రోజుకి రెండు డాలర్లకంటే తక్కువ ఆదాయం కలిగి, 60 నుండి 80 శాతం ఆహారంపైనే ఖర్చు పెట్టే ప్రజలు ప్రపంచంలో దాదాపు 300 కోట్లమంది వున్నట్లు తెలుస్తోంది. పెరిగే ధరలతో వీరు ఆహారాన్ని కొనలేక ఆకలితో అర్థాకలితో అలమటిస్తున్నారు. మన దేశంలో దాదాపు 35 కోట్ల మంది పేదలకు ఆహారం అందుబాటు గగనతలమవుతోంది. ఆహారం కొరత, పోషకాహారంలేని కారణాల వల్ల పేద ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, 1998-99లో 51.8% మంది స్త్రీలు, 74.3% మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. 2004లో, ఐదు సంవత్సరాల పిల్లల్లో 1000కి 5మంది, మరియు పుట్టిన సమయంలో 1000కి 62 మంది పిల్లలు చనిపోతున్నారు.

## ఆహార సంక్షోభానికి కారణాలేమిటి?

పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విధానాలే దేశదేశాల్లో ఆహార సంక్షోభానికి ప్రధాన కారణం. ఆహారధాన్యాల పంపిణీ, వ్యాపారం గుత్తపెట్టుబడిదారీ కార్పోరేట్ సంస్థలు, సామ్రాజ్యవాద దేశాల బహుళ

జాతి కంపెనీల అధీనంలోకి పూర్తిగా వెళ్ళిపోయాయి.

ప్రపంచంలో మొత్తం ఆహార ధాన్యాల వ్యాపారాన్ని 5-6 బడా బహుళజాతి సంస్థలు శాసిస్తున్నాయి. కార్గిల్, బుంగే, ఆర్చర్ డేనియల్స్ మిడ్ల్యాండ్ మొదలైన కంపెనీల లాభాలు ఆశ్చర్యంగా యున్నాయి. కార్గిల్ కంపెనీ నికరఆదాయం 2008 మొదటి నాలుగు నెలల్లో 1.03 బిలియన్ డాలర్లు, అంటే 86% గత సంవత్సరం కంటే పెరిగింది. బుంగే లాభాలు 867 మిలియన్ డాలర్లకు (189%) పెరిగాయి. అర్చర్ డేనియల్స్ మిడ్ల్యాండ్ లాభాలు 1.15 బిలియన్ డాలర్లుకు(8.5%) పెరిగాయి. గత సంవత్సరం కార్గిల్ కంపెనీ పంజాబ్ రాష్ట్రంలో లక్షలాది టన్నుల గోధుమను సేకరించి నిలువ చేసుకుంది. తదుపరి ధరల్ని విపరీతంగా పెంచేసింది.

ప్రపంచ బ్యాంక్ విధానాలకు అనుకూలంగా మన దేశంలో గతంలో ఎప్పుడో పత్తికి అమలుచేసిన ప్యూచర్/ఫార్వర్డ్/భవిష్య మార్కెట్‌ను, ఆహారధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు, మిర్చి మొదలైన వ్యవసాయోత్పత్తులకు అమలు చేసింది ప్రభుత్వం. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఈ వుత్పత్తుల్లో వ్యాపారం జరుగుతోంది. భౌతికంగా మార్కెట్లో ఈ వుత్పత్తులు వుండవు. పేపర్ల మీదనే వ్యాపారం జరుగుతోంది. బడా బహుళజాతి సంస్థలు వందల కోట్ల రూపాయలతో ఈ వ్యాపారం చేయగులుగుతున్నాయి. ఫైనెన్స్ పెట్టుబడి ఆహార ధాన్యాల వ్యాపారంలోకి అత్యధికంగా రావడమే ఆహార సంక్షోభానికి మూల కారణం. ఇది స్పెకులేటివ్ (సట్టా వ్యాపారం) పెట్టుబడి. 60% వ్యవసాయోత్పత్తుల వ్యాపారాన్ని భవిష్య మార్కెట్లోనే చేస్తున్నారు. 2000 సంవత్సరంలో కేవలం 5 బిలియన్ డాలర్ల వ్యాపారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జరిగేది. 2006వ సంవత్సరానికి ఆ వ్యాపారం 175 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ వ్యాపారంలో అత్యధికంగా విదేశీ ఫైనాన్స్ పెట్టుబడి వుంది. భారీ మొత్తంలో ధాన్యాన్ని సేకరించి, నిలువ చేస్తున్నాయి కంపెనీలు. తమకి అనుకూలమైన సమయంలో ధరలను పెంచుతున్నాయి. అధిక లాభాలను కొల్లగొట్టుతున్నాయి. వ్యవసాయ వుత్పత్తిదారులను దోచుకుంటున్నాయి. పేద ప్రజలనూ (వినియోగదారులను) దోచుకొంటున్నాయి. కార్గిల్, కాంటినెంటల్, ఐటిసి, హిందుస్తాన్ లివర్స్, రిలయన్స్ మొదలైన కంపెనీలు ధాన్యాన్ని సేకరించి, ధరలను పెంచి అధిక లాభాలకు అమ్ముకుంటున్నాయి. ప్రభుత్వ విధానం ప్రైవేట్ కంపెనీలకే ఊతమిచ్చేదిగా వుంది. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌ను దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసింది. అందువల్లనే, ఆహారధాన్యాల ధరలు పెరిగాయి, పెరుగుతున్నాయి. ప్రభుత్వ విధానాల మూలంగా దేశంలో ద్రవ్యోల్బణం 11.86 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణం పెరగడానికి అంతర్జాతీయ మార్కెట్లో పెట్రోల్, డీజెల్, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం కూడా కారణమంటున్నారు. ఎప్పుడూ లేని విధంగా క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 147 డాలర్లకు చేరింది. ఆహార సంక్షోభానికి మరో ముఖ్యమైన కారణం రూపాయి కొనుగోలు శక్తి పడిపోవడం. 1990-91లో 37 పైసలకే కొనగలిగే వస్తువులకు ఇప్పుడు ఒక్క రూపాయి కంటే ఎక్కువగా పెట్టాల్సివస్తుంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం మూలంగానూ, పెరుగుతున్న ఇంధనం ధరలవల్లనూ కూడా ఆహారధాన్యాల ధరలు పెరుగుతున్నాయని విశ్లేషిస్తున్నారు.

## కొనుగోలు శక్తి:

మన దేశంలో ప్రజలు ముఖ్యంగా పేద ప్రజల కొనుగోలు శక్తి అతి తక్కువ స్థాయిలో వుంది. దేశంలో దాదాపు 35 కోట్లమంది పేదరికంలో జీవిస్తున్నారు. అసంఘటిత రంగంపైన వేసిన జాతీయ కమిటీ అధ్యక్షుడయిన అర్జున్‌సేన్ గుప్తా అంకెల ప్రకారం, 77 శాతం శ్రామికులు రోజుకు 20 రూపాయల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం, అతితక్కువ ఆదాయాలు, వనరుల లేమి, పేదరికం మొదలైనవి ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయి. పేదవారు పెరిగిన, పెరుగుతున్న ధరలతో ఆహారధాన్యాల్ని కొని తినగలిగిన పరిస్థితి లేదు. ఆకలికి, అర్ధాకలికి గురి అవుతున్నారు. పెరిగిన ధరల శగను మధ్యతరగతి ప్రజలు కూడా తట్టుకోలేకపోతున్నారు. ఆహార సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం వుంది.

## ప్రభుత్వ బాధ్యత:

సరళీకరణ విధానాలు అవలంబిస్తున్నందువల్ల ప్రభుత్వం అక్రమ నిల్వలను, చీకటి మార్కెట్‌ను నివారించలేకపోతోంది. నిత్యావసర వస్తువుల చట్టాన్ని అమలు చేయడం లేదు. స్వేచ్ఛా వాణిజ్యం పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నారు, మధ్య

"ఓ వంచన నాయకులారా!
ఓ దళారి పాలకులారా!
ఎంతకాలమీ ఘోరం
ఎన్నినాళ్ళు ఈ నరకం
తాకట్టున భారతదేశం
వధ్యశిలన రైతుజీవితం
ఏ కసాయి క్రూర కార్యమూ
ఈ రైతుజాతి నిర్మూలనమూ
ఓ వంచన నాయకులారా!
ఓ దళారి పాలకులారా!
..........................
పెట్టుబడికి కట్టుబడిన
పైరుపచ్చ విప్లవమూ
బహుళజాతి సహాయంతో
వ్యవసాయపు క్షామము
సాగుతాగునీరు లేదు
గిట్టుబాటు ధరలు రావు
భూమి పంచమని అడిగితె
ఊరితాళ్ళ పంపిణీలు
ఊబిలు తీసే పనికే
పథకాలని పేరిడిన
ఓ దళారీ పాలకులారా!
బొమ్మ బొరుసు నాయకులారా!"

- దివికుమార్

'దళారి పంచకులారా'! నుండి

దళారులు. స్వేచ్ఛా వాణిజ్యం వల్ల ఉత్పత్తి దారునికి వుపయోగం లేదు. వినియోగ దారునికి వెసులుబాటు లేదు. ధరలను అదుపు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. భారత ఆహార సంస్థ, సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ మొదలైన ప్రభుత్వ రంగ సంస్థలు ఆహారధాన్యాల సేకరణను పూర్తిగా తగ్గించివేశాయి. ప్రజాపంపిణీ విధానం అస్తవ్యస్తంగా వుంది. ధరల అదుపు, ప్రజా పంపిణీ విధానం మొదలైన వాటి పట్ల ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించాలి.

**ఆహార ధాన్యాల ఉత్పత్తి:**

ప్రపంచంలోనే ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతోంది. సామ్రాజ్యవాద శక్తులు, వ్యవసాయ వాణిజ్య సంస్థలు తమ లాభాల కోసం వాణిజ్య పంటలను ఆహారధాన్యాల స్థానే ప్రోత్సహిస్తున్నాయి. ప్రత్యక్షంగానూ, (నేరుగానూ) పరోక్షంగానూ అంతర్జాతీయ సంస్థలైన అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంక్ ద్వారా పేద దేశాలపైన ఒత్తిడి తెచ్చి, ఆశలు కల్పించి, లేదా బెదిరించి ఆహార ధాన్యాల పంటల నుండి వాణిజ్య పంటల వైపు ఈ శక్తులు ఆ దేశాల్ని మళ్ళించాయి. ఈ మార్పులవల్ల ఆఫ్రికా, కొన్ని లాటిన్ అమెరికా దేశాలు తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే, అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలు ఆ దేశాల నుండి కాఫీ, కోకో, పండ్లు, పువ్వులు, చక్కెర మొదలైన వాటిని తమ కార్పొరేట్ల ద్వారా పొందుతున్నాయి. ఇలాంటి విధానాలనే మన దేశంపై రుద్దుతోంది. ఆహారధాన్యాల విస్తీర్ణం తగ్గిపోతోంది. సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపారం ద్వారా మన వ్యవసాయాన్ని శాసించే స్థితికి అమెరికా వచ్చింది. ప్రపంచ బ్యాంక్ విధానాల అమలు వల్ల ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రాధాన్యతను ఇవ్వడం లేదు. ప్రభుత్వ పెట్టుబడులు వ్యవసాయ రంగానికి అనుకూలంగా లేవు. వ్యవసాయ రంగానికి సబ్సిడీలను అతి తక్కువగా ఇస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారం బహుళజాతి కంపెనీల చేతుల్లోకి పోయింది. ఈ కంపెనీలు వీటి ధరలను విపరీతంగా పెంచాయి. పైగా, నకిలీ, కల్తీ విత్తనాలను కూడా సరఫరా చేస్తున్నాయి. రైతాంగాన్ని ఇవి నష్టాల ఊబిలోకి తోస్తున్నాయి. వ్యవసాయో త్పత్తుల అమ్మకంలో ప్రైవేట్ కార్పొరేట్లకి, బహుళజాతి కంపెనీలకి గుత్తాధిపత్యం కల్పించడానికి ప్రపంచ బ్యాంక్ సలహా మేరకు, రూ.695/- కోట్ల ఆర్థిక సాయంతో మన రాష్ట్రంలో 1110మండలాలలో ప్రభుత్వమే మార్కెట్లను స్థాపించి, అభివృద్ధి చేస్తోంది. ఈ మార్కెట్లలో విదేశీ బహుళజాతి కంపెనీలు కూడా ఏ మోతాదులైనా సరుకులు నేరుగా రైతులనుండి తమకు అనుకూలమైన రేట్లతో కొనవచ్చు. నిల్వ చేసుకోవచ్చు. దేశంలోనే ప్రాసెసింగ్ చేసు కోవచ్చు. అమ్ముకోవచ్చు. విదేశాలకు ఎగుమతి చేయొచ్చు. అతి త్వరలోనే ఈ కంపెనీలు గుత్తాధిపత్యాన్ని పొందుతాయి. రైతులను, వినియోగదారులను ఉభయులనూ దోపిడీ చేసి, లాభాలు దండుకుంటాయి. ఇవన్నీ కూడా ఆహార సమస్యను జటిలం చేస్తాయి.

హరిత విప్లవ సాంకేతిక పరిజ్ఞానానికి స్థిరత్వం లేదు. ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గి పోతోంది. పైగా, అమెరికా, కెనడా, యూరోప్ దేశాలు జీవ ఇంధనం (బయో ఫ్యూయల్స్) కోసం ఆహార ధాన్యాలయిన మొక్కజొన్న, గోధుమలు పండే విస్తార మయిన భూమిని మళ్ళించాయి. మనల్ని కూడా అలా చేయమని ఉపదేశిస్తున్నాయి. 110 కోట్లమంది జనాభా కలిగిన భారత్ ఈ విధానాన్ని అమలు చేస్తే, అత్యధిక జనాభా ముఖ్యంగా పేదవారు ఆకలి మంటల్లో ఆహుతి కావాల్సిందే. ఇండో-అమెరికా అణు ఒప్పందం విషయంలోనే కాదు. ఇంకా అనేక రంగాల్లో మన పాలకులు అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహమయ్యారు.

అదే మన వ్యవసాయరంగాన్ని, ఆహార భద్రతను ఛిన్నాభిన్నం చేసింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి నుండి, ఎగుమతులకు అనుకూలమైన పంటల వైపు మళ్ళించ కలిగింది. ఈ పరిస్థితులు మారాలి.

**లవయా కంపెస్సీన:**

ఈ సందర్భంలో లవయా కంపెనీ ప్రతిపాదించిన ఆహార సార్వభౌమత్వం ఆదర్శనీయమని విజ్ఞులు అంటున్నారు. ఆహార సార్వభౌమత్వం ఆహార భద్రతకు ప్రత్యామ్నాయం. ప్రజలకు ఆహార అందుబాటు మాత్రమే చాలదు. వారికి భూమి, నీరు, వనరుల అందుబాటు అవసరం. ఆహార విధానాలననుసరించి తెలుసుకుని, నిర్ణయాలు తీసుకొనే హక్కు సంబంధిత ప్రజలకు ఉండాలి. వ్యవసాయ వాణిజ్య వర్గాల కుట్రలకు, అంతర్జాతీయ మార్కెట్లకు ఆహార రంగాన్ని వదిలివేయ కూడదు. ఆహారోత్పత్తికి కీలకమైన చిన్న, మధ్యతరగతి కుటుంబ క్షేత్రాలను తిరిగి ఏర్పరచినప్పుడు మాత్రమే ప్రపంచ ప్రజల ఆకలిని అంతం చెయొచ్చు. ఏ దేశంలో నయితే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తారో, ఆదేశ ప్రజానీకానికి పోషకఆహారం లభించాలి. స్వేచ్ఛా వాణిజ్యం, వ్యవసాయ ఎగుమతుల విధానాలను వ్యతిరేకిస్తూ, దేశీయాంగ వినిమయం, ఆహార స్వయంసమృద్ధిపైన దృష్టి కేంద్రీకరించాలి. ఆహార స్వయం సమృద్ధి, కుటుంబ క్షేత్రాల బలోపేతం- వీటికి అదనంగా క్రింద కనబరిచిన అంశాలను కూడా లవయా కంపెస్సీన సంస్థ ఆహార సార్వభౌమత్వానికి అవసరమని చేర్పించింది.

1. సంపూర్ణ గౌరవంతో ఆరోగ్య ప్రదమైన సుస్థిర జీవనం గడప డానికి సురక్షిత పౌష్టిక, సాంస్కృతికంగా సముచితమైన ఆహారాన్ని నాణ్యతతో చాలినంతగా ప్రతి ఒక్కరికి అందచేయడానికి గ్యారంటీ ఇవ్వాలి.
2. తాము పనిచేస్తున్న భూమిపైన యాజమాన్యం, నియంత్రణ అధికారాన్ని భూమిలేని, వ్యవసాయం చేస్తున్న జనానికి, ముఖ్యంగా మహిళలకు ఇవ్వాలి. ఆదివాసీలకు తిరిగి భూములను ఇవ్వాలి.

3. భూమి, నీరు, విత్తనాలు మొదలైన సహజ వనరులను కాపాడుకుంటూ జాగ్రత్తగా వాడుకోవాలి. రసాయనిక ఉత్పాదకాలు, ఏకైక పైర్ల వాణిజ్య పంటలు, సాంద్ర, పారిశ్రామిక ఉత్పత్తిపై ఆధారపడాన్ని అంతం చేయాలి.
4. వ్యవసాయరంగంపై బహుళజాతి కంపెనీల నియంత్రణకు అనుకూలించే ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల యొక్క విధానాలను వ్యతిరేకించాలి.
5. స్పెకులేటివ్ పెట్టుబడి (సట్టా వ్యాపారాన్ని) నియంత్రించాలి. దానిపైన పన్ను వేయాలి. విదేశీ బహుళజాతి కంపెనీలపైన కఠినమైన నియమ నిబంధనలను అమలుపర్చాలి.
6. ఆహారాన్ని ఆయుధంగా వాడటాన్ని అంతం చేయాలి. నిర్వాసితం; బలవంతపు పట్టణీకరణ, రైతుల అణచివేతలను నిలిపివేయాలి.
7. అన్ని స్థాయిల్లోనూ వ్యవసాయ విధానాల రూపకల్పనలో రైతులు, ముఖ్యంగా చిన్న రైతులు, గ్రామీణ మహిళల భాగస్వామ్యానికి గ్యారంటీ ఇవ్వాలి.

ఈ సందర్భంలో ఒక శతాబ్దం వెనుక కారల్‌మార్క్స్ రాసిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. "సాంకేతిక అభివృద్ధికి పెట్టుబడిదారీ వ్యవస్థ మద్దతునిస్తుంది. అయినప్పటికీ ఆ వ్యవస్థ హేతుబద్ధ వ్యవసాయానికి వ్యతిరేకం. ఇలాంటి వ్యవసాయానికి పెట్టుబడిదారి వ్యవస్థ అనుకూలం కాదు". మార్క్స్ అభిప్రాయాలు ఈనాటి ఆహార మరియు వ్యవసాయ సంక్షోభాలను రూఢి చేశాయి. మానవ అవసరాలకంటె లాభాలకే ప్రాముఖ్యత ఈ వ్యవస్థ ఇచ్చింది. అందువల్ల లక్షలాదిమంది రైతులు తమ భూములను వదలాల్సి వచ్చింది. భూమి యొక్క ఉత్పాదకతను ఈ వ్యవస్థ విస్మరించింది. నేల, నీరు, మరియు గాలిని కలుషితం చేసింది. దాదాపు వందకోట్ల మంది ప్రజలను ఎడతెగని ఆకలికి, పోషక ఆహార లేమికి గురిచేసింది.

ఆహార సంక్షోభం, వ్యవసాయ సంక్షోభం రెండూ హేతుబద్ధతలేని, మానవ వ్యతిరేక వ్యవస్థ వల్ల ఉత్పన్నమైనవి. ప్రపంచ ప్రజలకు ఆహారాన్ని అందించడానికి, పట్టణ, గ్రామీణ శ్రామిక జనాంగం చేతులు కలపాలి. ఈ వ్యవస్థను కూలద్రోయడానికి పోరాటబాటే ఏకైక మార్గం.

(సూచన: లవయా కంపెన్సీన రిపోర్టులు (1996, ఇయాన్ అంగస్ రాసిన 'ఆహార సంక్షోభం' అనే వ్యాసాన్ని సంప్రదించడమైనది)

దిక్కుమొక్కు లేని జనం



ఒక్కొక్కరు అగ్నికణం

# ఝార్ఖండ్ ఉనికి, మరియు సహజ సంపదలపైన అభివృద్ధి పేరిట సామ్రాజ్యవాదుల దాడి.

**- శంభూ మహతో**



రమారమి మూడుకోట్ల జనాభా గలిగిన ఝార్ఖండ్ ప్రాంతం 75,834.29 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించివుంది. కాని సాంస్కృతిక ఝార్ఖండ్ ఇంతకన్నా ఎంతో పెద్దది. అది నేటి ఝార్ఖండ్‌తో పాటుగా పశ్చిమబెంగాల్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్‌లోని కొంతభాగం కూడా కలిసి వుంటుంది. ప్రస్తుతానికి కేవలం బీహార్‌లో వుండిన ఝార్ఖండ్ భాగానికి మాత్రమే ఝార్ఖండ్ ప్రాంతంగా హోదా కల్పించ బడింది. నేటి ఝార్ఖండ్ సమాజం ఆదివాసీలు, మూలవాసుల(మొదటనుండి ఇక్కడే జీవిస్తున్న వారు, ఝార్ఖండ్‌కి బయటినుంచి ఉద్యోగాలు చేసుకొనేందుకు వచ్చినవారు, వ్యాపారస్థులు, కాంట్రాక్టర్లు, జాగీర్దారీకోసం వచ్చినవారితో ఏర్పడింది. చాలాకాలం క్రితం బయట నుంచి వచ్చినవారు ఇక్కడి భాష, సంస్కృతి, ఝార్ఖండ్ యొక్క సామాజిక వాతావరణంలో ఇమిడిపోయి, మూలవాసు లుగా మారి పోయారు. మూలవాసుల్లో కొన్ని జాతుల వారు ఝార్ఖండ్‌ని మినహాయిస్తే మరెక్కడా కానరారు. ఉదాహరణకి- బైడెక్‌లు, దేశవాళీలు, పైయక్‌లు, రజౌ తయాలు, గోడైయత్‌లు, ఘాసీలు, భుయి యాలు, గంఘులు, మరి వగయిరాలు. ఇవి వివిధ గుంపులు సమూహాలుగా వుంటాయి. చారిత్రక, భౌగోళిక కారణాలవల్ల ఝార్ఖండ్‌నే తమ నివాసస్థానంగా ఎన్నుకొని ఇక్కడ స్థిరపడ్డారు.

ఝార్ఖండ్ సమాజపు పడుగుపేకల ముఖ్య రూపం-సమానత్వం, సమష్టితత్వంపై ఆధారపడివుంది. ఇక్కడ శారీరకశ్రమకి ఎక్కువ గౌరవం ఇవ్వబడుతుంది. అందువల్ల నేటికీ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ యువకులు, యువతులు, లెక్చరర్లు కూడా పొలం దున్నుతారు. ధాన్యం బస్తాలు మోస్తారు. అడవికిపోయి, ఇప్పపూలు ఏరు కొస్తారు. కట్టెలు కొట్టుకొస్తారు. పశువుల్ని మేతకి తోలు కెళ్తూ మనకి దర్శనమిస్తారు. ఇలాంటి దృశ్యాలు ఇతర రాష్ట్రాల్లో- ప్రత్యేకించి బీహార్‌లో, పశ్చిమబెంగాల్‌లో, ఉత్తరప్రదేశ్‌లో మనకి కనిపించవు. ఇక్కడ మెజారిటీ, మైనారిటీల ఆధారంగా నిర్ణయాలు తీసుకోరు. అందరి ఆమోదంతో మాత్రమే నిర్ణయాలు తీసుకుంటారు. ఇక్కడి ఆర్థిక వ్యవస్థ కూడా తనని తాను పోషించుకో గలిగిన శక్తివంత మైనది. ఇక్కడ సమాజం ఉప్పు, మసాలా దినుసుల కోసం మాత్రమే బజారుమీద ఆధారపడ్తుంది. భూమిమీద, అడవిమీద వ్యక్తిగత యాజమాన్యపు ఆస్తిహక్కులు వుండవు. ప్రకృతి వనరులమీద మొత్తం గ్రామానికే హక్కు భుక్తాలుంటాయి. ప్రతి గ్రామములో ఏదో ఒక ఆదివాసీ సమూహం యొక్క ఏదో ఒక కిల్లీ(గోత్రం) నియంత్రణలో వుంటుంది. ప్రకృతి వనరులను అధిక లాభాలకి కాకుండా, అవసరాలకి మాత్రమే అమ్ముతుంటారు. ఇది ధార్మిక-సాంస్కృతిక పరంపర యొక్క మాధ్యమంతో ప్రత్యేక అర్థాన్ని సూచింపబడు తోంది. సరళమయిన భాషలో దీని సూత్రం ఏమిటంటే -'సరనా' (ప్రకృతిపూజ), 'పాహడా' లేక 'మహాల్' (వంశపు సామాజిక-పాలకసంఘటన) 'పాంచా' లేక 'మదయీద్' (పంటలు ఆధారంగా ఒకరికొకరు ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో శ్రమకి ఫలితం తీసుకోకుండా సాయపడటం), ఈ విధంగా ఝార్ఖండ్ సమాజం క్రీ.పూ. 600 నుంచి క్రీ.శ.1769 వరకు చిన్నచిన్న మార్పులతో సాగుతోంది. ఈనాటికీ సరనా కోసం పాహడా, పాహడా కోసం రాజు (కోట లేదు. తనదైన రెవెన్యూ కూడా లేదు.) పంచాయితీకి గ్రామ ముఖియా (ముఖ్యుడు) బాధ్యుడవు తాడు. ఈ పదవులన్నీ సామాజికంగా జరిగే ఎన్నికలవల్లే ఏర్పడుతాయి. కాని ఈనాడు క్రమక్రమంగా మార్పువస్తోంది. బ్రిటిష్ రాజ్యం వచ్చాక, అది ఆదివాసీ ప్రపంచాన్నీ, వారి రాజ్యాధికారపు వ్యవస్థని తారుమారు చేసేసింది. ఈ ఆదివాసీ ప్రపంచం మొగల్ సామ్రాజ్యాన్ని తమ మధ్యన స్థాపించనివ్వ లేదు. వారి తిరుగుబాట్లు, వ్యతిరేకత ఎంతగా వున్నా ఆధునిక బ్రిటిష్ సామ్రాజ్యం ఎదుట ఈ ఆదివాసీ ప్రపంచం నిలువలేకపోయింది. ఇప్పుడు ఆదివాసీ వ్యవస్థ స్థానే పెట్టుబడి దారీ, భూస్వామ్య వ్యవస్థలు బలపడటం సాగిస్తున్నాయి. గ్రామాల్లో జరిగిన మార్పుల్లో భాగంగా జమీందారీలు, కచేరీలు, పోలీసు స్టేషన్లు ఏర్పడ్డాయి. రెండోప్రక్క పట్టణాల్లో కలెక్టర్లు, కోర్టులు, కెప్టెన్ల రాజ్యం సాగ జొచ్చింది. సామూహికత్వం స్థానంలో వ్యక్తి కేంద్రీకరింపబడ్డాడు. సమానత్వానికి బదులుగా దోపిడీవ్యవస్థ వునికిలోకి వచ్చింది. వీటన్నిటికీ వ్యతిరేకంగా తిరుగు బాట్లు, పోరాటాలు సాగుతూనే వున్నాయి.

1947 లో దేశంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత కూడా పై వ్యవస్థలో ఎలాంటి మార్పూ జరుగలేదు. గ్రామంలో జరిగిన మార్పులో భాగంగా జమిందారు, బ్లాకు మార్కెట్, బ్యాంకు, పోలీసుస్టేషను, కచేరీల ప్రభావం స్థిరపడి కొనసాగింది. దీనితో పాటుగా పట్టణాల్లో సయితం ప్రత్యేకించి ఎలాంటి మార్పూ చోటు చేసుకోలేదు. కుట్రలో భాగంగా స్థాపించబడిన ఆధునిక శాసనవ్యవస్థ, మార్కెట్ ఆధారిత వ్యవస్థ, చవుకగా వస్తున్న వ్యాపార వస్తువుల ముందు ఝార్ఖండ్ సమాజపు పాతవ్యవస్థ ధ్వంసం

చేసినట్టయితే, రాబోవు ఇరవై సంవత్సరాల్లో ఇనుమూ, ముప్పయ్ ఏళ్లలోబొగ్గు నిల్వలన్నీ హరించుకుపోతాయి. అయినా భూమి అట్టడుగునుంచి పెద్దఎత్తున ముడిఇనుముని తవ్వితీసుకొనే అవకాశం ప్రభుత్వం స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు ఇచ్చేస్తోంది. అసలు నిజం ఏమిటంటే–ఆయిల్‌కి సంబంధించిన పంపకం సామ్రాజ్యవాదుల మధ్య జరిగి పోయింది. ఆయిల్ తర్వాత అభివృద్ధికి సంబంధించిన అవసరమయిన అంశం ఇనుముని సంపాయించడానికి సామ్రాజ్య వాద దేశాలు త్వరత్వరగా ఒప్పందాలు చేసేస్తు న్నారు. వనరులపై పట్టు సంపాదించడం, ఇంతకన్నా ఎక్కువగా లాభాలు ఆర్జించ గలగడం, వారికున్న ఒకేఒక్క లక్ష్యం. ప్రజల అభివృద్ధితో వారికెలాంటి సంబంధమూ లేదు. అందువల్ల ఈ విషయంలో దృష్టి వుంచాల్సిన ఆవశ్యకత ఏమిటంటే– ఒక దేశానికి తమ ఖనిజ సంపదనీ, ప్రకృతి వనరుల భాండా గారాన్నీ శాశ్వతంగా పరిసమాప్తి చేసే య్యడం ఏమేరకు వివేకవంతమయినదో మీరే చెప్పండి! దీని పర్యవసానం– రానున్న తరం అనుభవించాల్సి వస్తుంది. వారు బొగ్గు కోసం, ఇనుముకోసం విదేశీయుల ముందు చేతులు చాచాల్సి వుంటుంది.

అన్నిటికన్నా ఆశ్చర్యకరమయిన విషయ మేమిటంటే– మనదేశ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరిట తాము చేసిన ఈ విధానమే సరైనదని చెబుతూనే, తర్వాత దేశం అభివృద్ధి చెందుతుందనీ, దీనితో పాటుగా దేశంలోని నిరుద్యోగులకు ఉద్యో గాలు లభిస్తాయని నమ్మబలుకుతుంది. వరద లాగా ఉద్యోగాలు వచ్చిపడ్తాయని చెబుతోంది. ఆదినుంచీ సామ్రాజ్యవాదులకు 'జీ హుజూర్ 'అంటూ వారి ప్రయోజనాలకి అనుగుణంగా ఆర్థిక విధానాలను రూపొంది స్తున్న నేటి కేంద్ర ప్రభుత్వపు ఆర్థికమంత్రి– వ్యవసాయంవల్ల దేశానికి గాని, రాష్ట్రాలకి గానీ ఎలాంటి అభివృద్ధీ సాధ్యం కాదని అదేపనిగా చెబుతూనే వున్నారు. ఇది ప్రజల్ని భ్రమల్లో వుంచి, వారి సర్వస్వాన్నీ దోచుకు పోయే కుట్ర తప్ప వేరేమీ కాదు! యదార్థం మరోలా వుంది.

1947 లగాయితు నేటిదాకా ఆమోదించ బడిన అభివృద్ధి పాలసీ వల్ల ఎవరికి అభివృద్ధి జరిగింది? ఎవరు అధిక సంపన్నులయ్యారు? ఎవరికి గుర్తింపు, ఉనికి సంకటం ఎదుర య్యాయి? నిజాయితీగా చెప్పాల్సివస్తే, లక్షలాది మంది ఆదివాసీలూ, మూల వాసులూ వారివారి భూములు పోగొట్టు కోవలసి వచ్చింది. తమ సంస్కృతి, గుర్తింపు పై వచ్చిపడ్డ ఆపదని కుక్కిన పేనులా భరించాల్సి వచ్చింది. వీరిని నిర్వాసితుల్ని చేసేసి, 'ఎలాఛస్తే అలా చావం'డంటూ రోడ్డు మీదకి విసిరి వేయ బడ్డారు. వీరికి నౌకరీ దొరకనేలేదు సరిగదా, పునరావాసం కూడా కల్పించలేదు, ప్రభుత్వం. దోచుకోబడిన ఝార్ఖండ్ ప్రజలు, బీదరికం బారిన పడ్డారు. ఇక్కడి ఆదివాసీలూ, మూలవాసీ ప్రజలూ అభివృద్ధి కాటుని భరిస్తున్నారు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన అంశం ఏమిటంటే– అభివృద్ధి పర్యవసానాలను అందరికన్నా ఎక్కువగా ఇక్కడి ఆదివాసీలు, మూలవాసులు, దళిత సమాజమే భరించారు. ఈనాటి దయనీయ స్థితి ఏమిటంటే– వారి జనసంఖ్య క్రమంగా తగ్గిపోతున్నది. 1931లో ఆదివాసీల, దళితుల జనసంఖ్య మొత్తం జనాభాలో 58 శాతం వుండేది. అది 1999 –2000 వచ్చేసరికి తగ్గిపోయి ఆదివాసీల జనం సంఖ్య 26.30 శాతం, దళితుల జనసంఖ్య 11.14 శాతం అయిపోయాయి. పశ్చిమబెంగాల్‌కి చెందిన మేధావి అశోక్‌మిత్రా చెప్పినదాన్నిబట్టి 1971 నాటికి దళితుల, ఆదివాసీల జనసంఖ్య 42 శాతం వుంటే, మూలవాసుల జనసంఖ్య 43 శాతం, బయటినుంచి వచ్చినవారి జన సంఖ్య 15 శాతం వుండేది. అయితే 1980 కి వచ్చేసరికి ఆదివాసీల జనసంఖ్య 30 శాతానికి తగ్గి పోయింది. ఇహ మూలవాసులకు సంబం ధించినంతవరకు ప్రతి జనాభాలెక్కల సమయంలోనూ విడిగా లెక్క తీసుకోవడం జరగడంలేదు. ఇహ దళితులకి సంబంధించిన జనసంఖ్య లెక్క విషయంలో సయితం నిజం ఏమిటో బయటికి రావడం లేదు. ఇందుకు కారణం– బయటినుంచి వచ్చే దళితుల్ని సయితం స్థానిక దళితులతో కలిసి లెక్క కట్టే యడం జరుగుతోంది. గతంలో వున్న 'అభివృద్ధి పథకం', నేటి పర్యంతం అమలు పరిచే 'అభివృద్ధి పథకం' మూలంగా ఆదివాసుల జనసంఖ్య నిరంతరం తగ్గి పోతూనే వస్తోంది.

ఇహ 'అభివృద్ధి పథకం' క్రింద నిరు ద్యోగులకి ఉద్యోగాలు సృష్టించాల్సివస్తే, ఇది ఒట్టి బూటకం తప్ప వేరేమీకాదు. ఇక్కడ పెట్టే పెట్టుబడి, దాని ఉద్దేశం ప్రజాప్రయోజనం కోసం కాకుండా, ఎక్కువలో ఎక్కువ లాభాలు గడించడానికని ఏ సాధారణ వ్యక్తయినా అర్థం చేసుకోగలడు. భారీ పరిశ్రమను ప్రారంభించే ముందు పదికోట్లు పెట్టుబడి పెట్టినపుడు సుమారు 15 వుద్యోగాలు ఏర్పాటుచేయబడేవి. అది ఇప్పుడు తగ్గించి 4,5 ఉద్యోగాలకి దిగిపోయాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ క్రింద దేశంలో నూతన ఆర్థిక విధానం అమలులోకి వచ్చిన దగ్గర్నుంచీ, నేటి పర్యంతం లక్షలాది చిన్నా, పెద్దా పరిశ్రమలూ, గనులూ మూతబడి పోవడంతో పాటుగా, కోటికన్నా ఎక్కువ మంది కార్మికులు పనులు పోగొట్టుకొని రోడ్డున పడ్డారు. దీని ప్రభావం ఝార్ఖండ్ ప్రాంతంమీద విస్తృతంగా పడింది. ఝార్ఖండ్ కార్ఖానాలకీ, ఖనిజసంపదకీ ప్రసిద్ధి చెందిందిగదా! ఝార్ఖండ్‌లో పరిశ్రమలు పెట్టడంకోసం, పెద్దడ్యాంల నిర్మాణం కోసం, అభివృద్ధి పేరుతో 1951 నుంచి 1991 వరకు అక్కడి రైతాంగం నుంచి 22వేల ఎకరాలకన్నా ఎక్కువ భూమి తీసేసుకున్నారు. దీనివల్ల లక్షలాది మంది ప్రజలు నిర్వా సితులుగా మారిపోయి, రోడ్డే చిరునామాగా బతకసాగారు.

ఝార్ఖండ్‌లో వ్యవసాయరంగ పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. ఇక్కడ వ్యవ సాయం చేయడానికి అనువయిన భూమి 38 లక్షల హెక్టార్లు వుంటే, ప్రభుత్వం ఇస్తున్న గణాంకాల ప్రకారమే 2 లక్షల హెక్టార్ల పంటభూముల్లోకి మాత్రమే నీటిపారుదల జరుగుతోంది. ప్రభుత్వ గణాంకాలకన్నా వాస్తవిక పరిస్థితి పూర్తి భిన్నంగా వుంది. కారణం–ప్రభుత్వం నిర్మించిన లిఫ్టు ఇరిగేషన్ల చెక్ డాములూ, చెరువులూ వ్యర్థంగా పడి

వున్నాయి. సువర్ణరేఖ వంటి డామ్ నిర్మాణం జరిగినపుడు ప్రభుత్వం నీటిపారుదల గురించి ఒకకల మనముందుంచింది. అయితే ఈ డామ్‌నుంచి సాగుభూములకు నీటి సరఫరా జరగటంలేదు, పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఇది అసలు పరిస్థితి. ప్రభుత్వమే ఇలా ప్రకటిస్తోంది. వ్యవసాయ రంగంలో 40 శాతం ఉత్పత్తి అయినా లభించడం లేదు. వర్షాధారంవల్ల ఒకపంట పండుతుంది. ఇక్కడి 95 శాతం ఆదివాసీలూ, మూలవాసులూ వ్యవసాయరంగం మీద, అడవి ఉత్పత్తులమీద ఆధారపడి జీవిస్తూ వుండగా, వ్యవసాయంచేయడం వల్ల జీవితం గడవడమే దుర్భరమవుతున్నప్పుడు, పొట్టచేత పుచ్చుకొని పెద్దఎత్తున పట్టణాలకి వలస పోయి, కూలిపని చేసుకోవడానికి వస్తున్నారు. వారు పట్టణాల్లో భవనాలు నిర్మిస్తున్న చోట, రిక్షాలుతోలడం, తోపుడుబళ్లు లాగడం వంటి పనులుచేసి పొట్టలు నింపుకుంటున్నారు. ఇహ స్త్రీల పరిస్థితి ఏమిటంటే- వలసలు పోలేరుగనుక, వారు స్థానిక సంతలకివెళ్లి, హండియా(కల్లు వంటిది) అమ్ముకొంటూ ఆ వచ్చిన డబ్బులతో పొట్టపోసుకుంటున్నారు.

ఝార్ఖండ్‌లో పైరుపచ్చ విప్లవం. దానిపేరుచెప్పి, రసాయనిక ఎరువులూ, మొక్కలకు వేసే పురుగులమందులూ, అత్యుత్తమయిన విత్తనాలను గురించి ఊదర కొడుతూ ప్రాంతాలనుంచి, గ్రామాలద్వారా ప్రచారాలయితే సాగుతున్నాయి. పర్యవసానం-ప్రతి రైతూ అధికదిగుబడి లభించ గలదన్న గంపెడాశతో ఇవన్నీవాడి, తాను నమ్ముకున్న నేలతల్లి పండించే శక్తి సామర్థ్యాల్ని కాస్తా శాశ్వతంగా నాశనం చేసేస్తున్నాడు. కొన్ని ప్రాంతాల్లోనయితే పరిస్థితి ఎంతగా దిగజారిందంటే, వంశపారం పర్యంగా వస్తూ వుండిన విత్తనాలు విత్తనాని కయినా కాన రావు. ఇహ ఇప్పుడు పంటలు పండించడం ఖరీదుతో కూడుకున్న పని అయ్యింది. ఇది సహజమయిన పరిణామం మాత్రం కాదు. సామ్రాజ్యవాదులు, బహుళ జాతి కంపెనీలు చేసిన కుట్ర ఫలితం. పంటలుపండించడం ఖరీదయిన వ్యవహారం కావడంవల్ల ఇక్కడి రైతాంగం పీకలలోతు

'పాము కరిస్తే బతకొచ్చు, కుక్క కరిచినా బతకొచ్చు
గాట్ కరిచిందో అంతే సంగతులు
అది పేటెంట్ కోరల్తో ట్రిప్స్ పంజాతో
త్రీనాట్ వన్ నాలుకతో తృతీయ ప్రపంచ దేశాల
గుండెలు చీల్చి
నొప్పి లేకుండా నెత్తురు తాగుతుంది
వాడున్నాడే ఆ మాయల ఫకీరుగాడు
వాడు పుడుతూ పుడుతూనే ఐ.ఎం.ఎఫ్.
వరల్డ్ బ్యాంకుల
గారడి సరంజామాల్ని వెంట తీసుకున్నాడు
వాటితో కనిపించని యుద్ధాలు సృష్టిస్తాడు
యుద్ధాలిప్పడు భూమ్మీదో, ఆకాశం మీదో జరగవు
సంపదల మీద, సహజ వనరుల మీద,
మనిషి ఆలోచనల మీద, బలహీనతల
మీద జరుగుతాయి.
పారిస్‌లో గులాబి నెత్తురు తాగిన మంత్రదండం
ఉరుగ్వేలో రూపం మార్చుకున్నప్పడే
కుట్ర వడ్లగింజలో జొరబడింది
మాయలఫకీరు శాంతిదూతగా మారినప్పడే
మూడవ ప్రపంచయుద్ధం
నా దేశం నెత్తిన ప్రపంచ వాణిజ్యమై కూర్చుంది
స్వేచ్ఛా వాణిజ్యంతో మనం వాడి సరకులకు
నగిషీలమై మెరుస్తుంటే
కుట్ర అంతర్జాతీయ సంతై దేశాలను
అమ్మకానికి పెట్టింది
చెమట చుక్క మీద ఎవ్వరికీ అంతుపట్టని కొత్త
శ్రమ విభజనల్ని గీసి
మనిషి నుండి మనిషిని దేశం నుండి దేశాన్ని
విడదీసి వెంటాడుతుంది
ఇది కత్తిగాటును మించిన డంకెల్ గాటు!'

- పి.విద్యాసాగర్
'దిష్టిబొమ్మ' కవిత నుండి

అప్పుల్లో కూరుకుపోతున్నారు. బ్యాంకుల్లో కన్నా, వడ్డీ వ్యాపార స్థులూ, పెత్తందార్లూ పన్నిన ఉచ్చుల్లో ఎక్కువ మంది రైతులు ఇరుక్కుపోయారు.రైతు పంట ఖర్చులను పెంచటమే కాకుండా వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కనుగుణంగా రూపొందిస్తున్నారు. ఫలితంగా వ్యవసాయరంగం సంక్షోభంలో పడింది. ప్రభుత్వం రైతులకి వ్యవసాయ రుణాలు అందించడంలో విఫలత వలన అధిక వడ్డీలకి వడ్డీవ్యాపారస్తుల్ని ఆశ్రయించక తప్పకపోవటం, పంటలకి గిట్టుబాటు ధర లభించకపోవటంవల్ల రైతులు అప్పుల భారంలో కొట్టుమిట్టాడుతున్నారు. రైతాంగ రుణాల మాఫీ పథకం కూడా ఇక్కడ అత్యధిక రైతులకు ఉపయోగపడదు. ఈ పరిస్థితుల వలన రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితికి నెట్టబడుతున్నారు. రాజధానికి సమీపంలోవున్న రాతులో రైతు చేసుకొన్న ఆత్మహత్య దీనికి అద్దంపడు తుంది.

ఝార్ఖండ్ ఆకలిచావులకు ప్రసిద్ధి కెక్కింది. ఇక్కడ ప్రతిఏడాదీ ఆకలిచావులు జరుగుతున్నా ప్రభుత్వం అలాంటివేమీ లేవని దబాయిస్తోంది. అర్ధాకలితో జీవించే వారి సంఖ్య ఇక్కడ తక్కువలేదు. ఇక్కడి ఆదివాసీ జనాభా అడవిలో లభించే కంద మూలాలు, అడవి ఫలాలు తింటూ జీవితాల్ని వెళ్లదీస్తారు. కాని ఈనాడు ఫలాలు యిచ్చే చెట్లను నరికి, వాటిస్థానే వ్యాపారాలకి అనుగుణంగా చెట్లను నాటిస్తూ వున్నారు. అడవుల్నించి లభించే ఫలాల, అడవి ఉత్పత్తులనుంచి లభించే ఆదాయం కూడా ఇహ ముగిసిపోయింది. అడవుల మీద గ్రామాలకు ఉండే అధికారానికి తెరదిం చేస్తున్నారు.

ఝార్ఖండ్‌లో ఉద్యోగాల పరిస్థితి ఏమీ బాగోలేదు. కేంద్ర ప్రభుత్వం అమలుపరచిన **రాష్ట్రీయరోజ్‌గార్ గ్యారంటీ యోజన** ఇక్కడ విఫల మయ్యింది.'కాగ్' రిపోర్టును అనుసరించి తన లక్ష్యానికి 77శాతం వెనుకపట్టు పట్టింది. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం ఝార్ఖండ్ గ్రామాల్లో నివసించేవారి రోజువారి ఖర్చు దాదాపు 14రూపాయలు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడికీ, షరతులకీ లొంగిపోయి పంటపొలాలకిచ్చే రాయితీలను క్రమక్రమంగా తొలగిం చెయ్యడం వల్లనూ, ప్రజాపంపిణీవ్యవస్థపై అయ్యే ఖర్చుని క్రమంగా మూసివేయడం వల్లనూ బీదవాళ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారు కాబోతోంది. విశృంఖలంగా, అదుపులేని మార్కెట్‌వ్యవస్థ వల్ల పెరుగుతున్న అధిక ధరలు ప్రజల బ్రతుకుల్ని దుర్భరం చేసేస్తున్నాయి. నిత్యావసర వస్తువులైన బియ్యం, గోధుమ పిండి, మంచినూనెతో సహా ఇతర వస్తువులు సయితం లభించడం ఒక సమస్య అయి కూచుంది.

అన్నిటినీ 'బూస్వాహిస్వాహా' చేసేసుకొనే సామర్థ్యం గలిగిన సామ్రాజ్యవాదం సర్వాన్ని మింగేస్తోంది. పరిశ్రమలు, ఖనిజాలు, వ్యవసాయం, విద్య, వైద్యఆరోగ్యం, ఉద్యోగాలు, మార్కెటింగ్, వగయిరా. ఈ ఆర్థికవిధానాల్ని అమలుపర్చడంలో యుపిఏ, ఎన్‌డిఏ, వామపక్షాలు ఏకాభిప్రాయంతో వుండటమే గాకుండా ఒక పార్టీని మించి మరొక పార్టీ ముందుకి దూసుకుపోయేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయి. వేరొక వంక ప్రజల మధ్యవున్న వైరుధ్యాల్ని పెద్దవిచేసి వారిని భ్రమల్లో వుంచడంలో వెనక్కి తగ్గడం లేదు. యుపిఏ భాగస్వామ్య పార్టీలు లేని రాష్ట్రాల్లో, ఆ ఆర్థికవిధానాలకు వ్యతిరేకంగా నిప్పులు కురిపించడంలో అలసిపోవడం లేదు. వారు పరిపాలించే రాష్ట్రాల్లో ఆ ఆర్థిక విధానాల్ని తు.చ. తప్ప కుండా అమలు కూడా చేస్తున్నారు. ఇవన్నీ తాము నమ్మ దగినవారమని సామ్రాజ్యవాదం ముందు తమతమ కార్యాచరణలద్వారా గట్టిగా రుజువుచేసుకుంటున్నారు.

దేశంలో పదివేలకోట్లకు అధిపతు లయినవారి సంఖ్య, వందకోట్లకి అధిపతు లయినవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. సకల గృహ ఉపకరణాల ఉత్పత్తుల్లో నాలుగోవంతు భాగం వీరి దగ్గర ఉండడం నేటి పరిస్థితి. రెండోవైపున క్రమంగా అధిక ధరలు పెరిగిపోతూనేవున్నాయి. అదేవిధంగా దరిద్రరేఖదిగువన జీవిస్తున్న వారిసంఖ్య కూడా నానాటికీ పెరిగిపోతూ వస్తోంది. ఒకవైపున ఈదేశంలోని నివాసిఅయిన ముఖేష్ అంబానీ తన రోజు వారి జేబు ఖర్చుక్రింద ఐదులక్షల రూపాయలు తీసుకొంటాడు. అదే దేశంలోని డెబ్బయి ఏడుశాతం జనాభా రోజువారిఖర్చు ఇరవై రూపాయలు మాత్రమే. కోట్లాది మంది ప్రజలు రోజూ రెండుపూటలా తిండికి కటకటలాడి పోతున్నారు. అంటే దీని అర్థం ఈ ఆర్థికాభివృద్ధివల్ల ఫలాలు సామాన్యులకు అందకుండా దోపిడీ వర్గాలకు చెందుతున్నాయి.

మనదేశంగ్రామాలతో కూడుకున్నదన్న వాస్తవాన్ని ఎన్నటికీ మరువరాదుమనం. వ్యవసాయరంగ అభివృద్ధి జరగకపోవడం వల్ల ఇక్కడ నివశిస్తున్న డెబ్బయ్ఏడు శాతం జనాభా-రైతుల, సామాన్యప్రజానీకపు అభివృద్ధి జరగలేదు. పరిస్థితి మెరుగు కావాలంటే మొదట చేయాల్సిన పని భూ సంస్కరణలు. దున్నేవానికి భూమి పంపకం తోపాటుగా, సంపూర్ణమయిన నీటిపారుదల వ్యవస్థ ఏర్పాటుచెయ్యాలి. పర్యావరణానికి లాభదాయకమయిన రైతు పరంపరాగతంగా అభివృద్ధి చేసిన ఎరువులనూ, విత్తనాలనూ ఉపయోగిస్తూ, వారికివున్న జ్ఞానాన్ని, వైజ్ఞాని కంగా వికసింపచేయాలి. పొలాలమీద పంటలు పెంచే పేరుతో బహుళజాతి కంపెనీల గుప్పిట్లో వున్న పరిస్థితినుంచి బయటపడెయ్యాలి. దీని వల్ల నీటిమట్టం, పర్యావరణం, మట్టిని రక్షించడంతోపాటుగా అప్పులనుంచి సయితం బయటపడెయ్యడం జరుగుతుంది. అయితే ఇదేమంత సులు వయిన పనికాదు. దేశంలోని అతితెలివిగల పాలకవర్గపార్టీలు రెండవ గ్రీన్ రివల్యూషన్ గురించి మాట్లాడుతున్నారు. ఇది అత్యా ధునిక టెక్నాలజీపై ఆధారపడి వుంటుంది. ఇక్కడ గుర్తుపెట్టుకోవలసిన విషయమేమి టంటే- తొలి గ్రీన్ రివల్యూషన్ కూడా అమెరికా ఒత్తిడికిలోబడి, అక్కడి బహుళ జాతి కంపెనీల హితవుకోరి ఇక్కడ అమలు

జరిగింది. ఈ రెండవగ్రీన్ రివల్యూషన్ జనకుడుకూడా అమెరికాయే. దీని కోసమే వ్యవసాయం విజ్ఞాన చౌరవ ఒప్పందం జరిగింది. ఈస్ట్ ఇండియా కంపెనీ లాగా **'ప్రత్యేక ఆర్థిక మండలి'** పేరిట దేశంలో కంపెనీ రాజ్యం స్థాపించే ప్రయత్నం జోరుగా సాగుతోంది. ఇప్పుడు 'సెజ్' కన్నా పెద్దదాన్ని జిల్లా స్థాయిలో **ప్రత్యేక వ్యవసాయ మండలి (ఎవజ్)** తెచ్చే ప్రయత్నం జరుగు తోంది. ఇందుకోసమని కేంద్ర ప్రభుత్వం 33 సాజ్‌లకోసం ప్రతిపాదనకి తమ ఆమోదం తెలిపింది. ఈ విషయంలో ఉదయించే పెద్ద ప్రశ్న ఏమిటంటే ఒక దేశంలో తొలి గ్రీన్ రివల్యూషన్ జరగడం మూలంగా లక్షలాదిమంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నపుడు అదే దేశంలో పెరిగిన ధరలు, అత్యున్నత టెక్నాలజీ ఆధారంగా చేసే సేద్యం సాధారణ రైతాంగానికి హితవు కోరుకుంటుందా? ఈ రెండవ గ్రీన్ రివల్యూషన్ ఉద్దేశం వ్యవసాయాభివృద్ధి కోసం కాదు, భూములు రైతాంగం చేతుల నుంచి జారిపోయి, బహుళ జాతి కంపెనీల చేతుల్లో వుంచడానికి. ఈ విషయం కంపెనీలకి దళారులుగా వుండే వారి చేయితడుపు కూడా పూర్తికావడం, అదివేరే విషయం. ఈ విషయంలో వీరు వ్యవసాయం నుంచిరైతాంగాన్నీ, చిల్లరకొట్ల వ్యాపారస్థుల్నీ తొలగించివేయడానికి కృత నిశ్చయంతో వున్నారు. పరిశ్రమ మీద వీరి పట్టు ముందునుంచీ వున్నదే. ఇక్కడ బహుళజాతి కంపెనీలతో టెక్నికల్‌గానూ, పెట్టుబడి విషయంలో గానీ ఎలాంటి సాపత్యం లేని వ్యాపారస్థుల(కుటీర పరిశ్రమలు, చిన్న చిన్న వ్యాపారాల యజమానులు) వ్యాపారాల్ని మూసివేస్తున్నారు. అన్నిటినీ గ్రహించే సామ్రాజ్యవాద పెట్టుబడి దృష్టి - ఒక వ్యవసాయమనే కాదు, ఒక పరిశ్రమ అనేకాదు, బజారుపైన అనే కాదు- యావత్ దేశాన్ని బానిసత్వంలో ముంచెత్తడానికి సిద్ధంగా వుంది. అపారమయిన ఖనిజ, ప్రకృతిపరమయిన, బహుమూల్య సంపదని కారుచౌకగా హస్తగతం చేసుకొనేందుకు అవసరమయిన ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. **దీని ప్రభావం అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువగా ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, ఇలాంటి ప్రాకృతికమయిన, ఖనిజసంపదలతో నిండిన ఇరుగు పొరుగు ప్రాంతాలపై తీవ్రంగా వుంది.** ఈ ఉద్దేశం పరిపూర్తి చేసేందుకు ఇక్కడి పెట్టుబడిదారులు కూడా సహకరిస్తున్నారు. ఇటీవల రాంచీలో ఝార్ఖండ్‌కి సంబంధించిన కుటీరపరిశ్రమల యజమానులు ఒక సెమినారుని ఏర్పాటు చేశారు. దానిలో నిర్వాహకులు సామ్రాజ్య వాద ప్రపంచీకరణయొక్క మానవీయ ముఖాన్ని చూపిస్తూ, దాన్ని నిరూపించేందుకు నానాతంటాలుపడ్డారు.

బహుళజాతి కంపెనీల పెట్టుబడి ముందు జాతీయ పెట్టుబడి అభివృద్ధి సాధ్యం కానిపని. ప్రపంచ వ్యాపితంగా సాగిన విప్లవాలనుంచి తీసిన గుణపాఠంకూడా ఇదేను. సామ్రాజ్యవాద పెట్టుబడితో ఒంటరిగా జాతీయ పెట్టుబడి పోరాటం చెయ్యలేదన్న విషయం కూడా నిరూపించ బడింది. అది రాయితీ పొందేందుకు తీవ్రంగా ఈదుతుంది. సామ్రాజ్యవాద పెట్టు బడితో కేవలం ఒకే ఒక్కటి పోరాడ గలుగు తుంది. అది కార్మికవర్గం. కార్మికవర్గ నేతృత్వంలో రైతాంగం దగ్గర్నుంచి జాతీయ పెట్టుబడిదారీ వర్గంతో ఏర్పడిన సంఘటన. ఇదే సంఘటన, దేశంతో పాటుగా మొత్తం దేశ జనాభాని నమిలేసి, హరాయించు కోవాలని ఆత్రం పడుతున్న సామ్రాజ్యవాద దేశాలకు ధీటయిన జవాబు ఇవ్వగలుగు తుంది. యాదృచ్ఛికంగా దేశంలో అనేకచోట్ల ఈ కుట్రనీ, దోపిడీనీ వ్యతిరేకిస్తూ ప్రజల గర్జనలు వినిపిస్తూవున్నాయి. భారతదేశంలో ఝార్ఖండ్-ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా ఇందుకు అనుకూలమయిన ప్రాంతాలు. కావలసిం దల్లా అడుగు ముందుకి వేయడమే.

**హిందీనుంచి అనువాదం: నిర్మలానంద**

# ఎరుపు

– గంగినేని వెంకటేశ్వర్‌రావు

**పాప ఎరుపు**
**కనుపాప ఎరుపు;**
**చెల్లి బొట్టు ఎరుపు**
**తల్లి ఫాలం ఎరుపు!**

**పండ్ల తోట ఎరుపు**
**బండ చాకి రెరుపు,**
**వెర్రికేక ఎరుపు**
**నరుల ఆకలెరుపు**

**కొత్త కోర్కె ఎరుపు**
**కొడవలంచు ఎరుపు**
**తుదిక్షణాలు ఎరుపు**
**తూర్పుకొండ ఎరుపు!**

**దుక్కిచాలు ఎరుపు**
**తెలుగుపూలు ఎరుపు**
**ఇంటిముంగి టెరుపు**
**ఎల్లలన్నీ ఎరుపు!**

**కోపం రూపం ఎరుపు**
**గుండెగాయం ఎరుపు**
**రక్తగాన మెరుపు!**
**నేనెత్తినజెండా ఎరుపు!**
**నా**
**కావ్యరాశి ఎరుపు**
**నా**
**స్వప్నస్వర్గం ఎరుపు'**

# అమెరికా- భారత వ్యవసాయ విజ్ఞాన చొరవ ఒప్పందం: సామ్రాజ్యవాద కబంధ హస్తాల్లోకి భారత వ్యవసాయరంగం

పి.జస్వంతరావు

2005 జూలైలో భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ అమెరికా పర్యటన సందర్భంగా, వ్యవసాయరంగంలో విద్య, పరిశోధన, సేవలు, వాణిజ్య సంబంధాలను విస్తృతపరిచే కృషి ఇరుదేశాలూ చేస్తాయని సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీని కొన సాగింపుగా 2005 నవంబరులో ఒక వివరమైన పని పథకాన్ని రూపొందించారు. 2006 మార్చిలో అమెరికా అధ్యక్షుడు బుష్ భారత పర్యటన సందర్భంగా "అమెరికా-భారత వ్యవసాయ విజ్ఞాన చొరవ" అన్న ఒప్పందం చేసుకున్నారు. దీని కొరకు రూపొందించిన పనిపథకాన్ని ఆమోదిం చారు. అమెరికా సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల్లోకి భారత వ్యవసాయ రంగాన్ని శాశ్వతంగా నెట్టివేసే ఈ ఒప్పందాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసర ముంది.

1960లలో అమెరికా అందజేసిన సహకారం వల్ల సస్యవిప్లవాన్ని భారత్ సాధించగలిగిందనీ, ఇది శ్వేత (పాల), నీలి (మత్స్య), ఊదా (వంట నూనెలు) విప్లవాల విజయానికి దారితీసిందనీ పొగుడుతూ, నేడు వ్యవసాయ విద్య, పరిశోధన, సేవా, వాణిజ్య రంగాలలో అమెరికా అందించే సహకారం దేశ వ్యవసాయ పురోగతికి తోడ్పడుతుందనీ పని ప్రణాళికలో పేర్కొ న్నారు. ప్రపంచవ్యాపితంగా వ్యవసాయంలో నేడు నూతన సవాళ్లు- భూమండల వేడిమి పెరుగుదల, పర్యావరణ మార్పులు, కొత్త కీటకాలు, చీడలు, సహజ వనరుల క్షీణత, కుటుంబ ఆహార భద్రత, వ్యవసాయ లాభ దాయకత, వృద్ధిరేటు తగ్గుదల-ఎదురౌ తున్నాయనీ, వీటిని పరిష్కరిం చేందుకు సాంకేతిక పరిజ్ఞానమూ, ప్రైవేటురంగ మదుపు పెంపుదల, వ్యాపారీకరణ, వ్యవ సాయంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యా లను విస్తరించటమే మార్గమనీ పని ప్రణాళికలో తెలిపారు. వీటి సాధనకే వ్యవసాయ విజ్ఞాన ఒప్పందం జరిగిందని చెప్పారు.

ఈ లక్ష్యాల కనుగుణంగా కేంద్రీకరించ వలసిన నాలుగు రంగాలను గుర్తించి నిధులను కేటాయించారు. 1. విద్య, అభ్యాసనా వనరులు, పాఠ్యాంశాలు, శిక్షణ. దీనికోసం రు.65 కోట్లు కేటాయించారు. 2. ఫుడ్ ప్రాసెసింగ్, ఉప ఉత్పత్తుల వినియోగం, జీవ ఇంధనాలు. దీనికి కేటా యించినది రూ.45 కోట్లు. 3. బయో టెక్నాలజీ (జీవ సాంకేతిక పరిజ్ఞానం). దీనికి రూ.215 కోట్లు కేటాయించారు. 4. నీటి నిర్వహణ. దీనికి రూ.25 కోట్లు. ఈ ఒప్పందం క్రింద భారత ప్రభుత్వం మొత్తంగా రూ.350 కోట్లను ఖర్చు చేస్తుంది. అమెరికా ఎంత ఖర్చు చేస్తుందో చెప్పలేదు. అమెరికాలో శిక్షణ కొరకు పంపిన యువ శాస్త్రవేత్తలకు ఉచిత నివాస వసతిని అమెరికా కల్పిస్తుందని మాత్రమే పని ప్రణాళికలో పేర్కొన్నారు.

ఈ పని ప్రణాళికను అమలు చేసేం దుకు ఒక బోర్డును నియమించారు. 9 మంది భారత్ తరఫున, 9 మంది అమెరికా తరఫున 18 మందితో బోర్డు ఏర్పడింది. సస్యవిప్లవ పితామహుడిగా చెప్పే నార్మన్ బోర్లాగ్, భారత్‌లో దాన్ని అమలు జరిపి దేశ వరి జన్యు సంపదనంతా అమెరికాపరం చేసిన ఎం.ఎస్.స్వామి నాథన్‌లు గౌరవ సలహాదారులుగా వున్నారు. భారత వ్యవ సాయ పరిశోధనా సమితి (ఐసిఏఆర్) సంచాలకుడు మంగళరాయ్, అమెరికా వ్యవసాయ శాఖాధిపతి ఎల్లెన్ టెర్ప్‌స్ట్రాలు సహఅధ్యక్షులుగా వున్నారు. భారత ప్రభుత్వ ప్రతినిధులుగా విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి జయశంకర్, వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి ఎన్.ఎల్.భట్‌లు వుండగా, అమెరికా తరఫున విదేశాంగ సంబంధాల చికాగో సమితి అనే ప్రభుత్వే తర సంస్థ డైరెక్టర్ మార్షల్ బౌటన్ సభ్యులుగా వున్నారు. ఇక భారత వ్యవసాయ విశ్వవిద్యాలయాల తరఫున జి.బి. పంత్ వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉపకుల పతి పి.ఎల్.గౌతం, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి సి.రామస్వామి, భారత పశుసంవర్ధక పరిశోధనా సంస్థ సంచాలకుడు ఎం.పి.యాదవ్‌లు సభ్యులుగా ఉండగా, అమెరికా తరఫున లాండ్ గ్రాంట్ కళాశాలల, విశ్వవిద్యాలయాల జాతీయ సమితి ఉపాధ్యక్షుడు మార్టిమర్ న్యూఫ్‌విల్లీ, ఓహియో విశ్వవిద్యాలయ వ్యవసాయ విభాగ డీన్ సురేంద్ర సింగ్‌లు వున్నారు. ఇక భారత ప్రైవేటు కంపెనీల తరఫున వెంకటేశ్వరా హేచరీస్ అధిపతి అనూరాధా దేశాయి, ఐటిసి వ్యవసాయ వాణిజ్య విభాగపు సిఇఓ పి.శివకుమార్ సభ్యులుగా వుండగా, అమెరికా ప్రైవేటు కంపెనీల తరఫున ప్రముఖ విత్తనాల కంపెనీ మోన్‌శాంటో, అతిపెద్ద రిటైలు వ్యాపార కంపెనీ వాల్‌మార్ట్, ఆర్చర్ డేనియల్ మిడ్‌లాండ్ కంపెనీల ప్రతినిధులు సభ్యులుగా వుంటారు.

## జన్యుమార్పిడి విత్తనాలకు ఎర్ర తివాచీ

మొత్తం రూ.350 కోట్లలో రూ.215 కోట్లు జీవ సాంకేతిక పరిజ్ఞానానికి కేటా యించారు. దీనిలో కూడా సింహభాగాన్ని జన్యుమార్పిడి రంగానికే కేటాయించారు. దిగుబడులు పెంచటం లక్ష్యమని చెప్పు కున్నారు. అయితే చీడలు పట్టకుండా జన్యు మార్పిడి చెయ్యటం కోసమే పరిశోధనలు జరుగుతాయి. చీడపీడలు తగ్గితే దిగుబడులు పెరుగుతాయని వారి వాదన. బి.టి. ప్రత్తి లాగే జన్యుమార్పిడి విత్తనాలను వరి, గోధుమ, ఆవాలు, అరటి, బొప్పాయి, కర్ర పెండలం పంటలలో చీడ పట్టవని చెప్పే

జన్యుమార్పిడి విత్తనాలను ప్రవేశపెడతారు. అలాగే మేకలు, గేదెలు, కొరమీను చేపలలో మూలకణాలను ఏరి జన్యుమార్పిడి చేస్తారు.

అమెరికా సామ్రాజ్యవాదులు జీవ సాంకేతిక పరిజ్ఞానం పేరిట జన్యుమార్పిడి పంటలు/జీవాలను ప్రవేశపెట్టి వ్యవసాయ రంగాన్నీ, దాని అనుబంధ వృత్తులనూ, బహుళ జాతి కంపెనీల దోపిడీకి నిలయం చేయబూనుకున్నారు. బి.టి. ప్రత్తి విత్తనాల అనుభవాన్ని గమనించిన వారెవరికైనా, విత్తనానికి అధిక ధరలు చెల్లించినా, పురుగుమందుల వాడకం తగ్గకపోగా, దిగుబడులు పెరగలేదనీ, పెరిగినా అయిన ఖర్చుకు తగిన నిష్పత్తిలో లేదనీ అర్థ మౌతుంది. కాగా దీనిని కప్పిపుచ్చుకునేం దుకు అంతకన్నా మెరుగైన విత్తనా లంటూ బి.టి. పత్తిలో కొత్త రకాలు ఏడాదికి రెండు చొప్పున ప్రవేశపెడుతున్నారు. పైన పేర్కొన్న పంటలలో జన్యుమార్పిడిలో 90% పైగా పేటెంట్లు అమెరికా బహుళజాతి కంపెనీల కున్నాయి. వీటిని భారత వాతా వరణానికి అనువుగా మార్చటం కోసమే ఈ ఒప్పందాన్ని తెచ్చారు.

కోళ్ల పెంపకం గృహకృత్యంగా అంతమైపోయి వాణిజ్య కార్యకలాపంగా మారటంలో జన్యుమార్పిడి ప్రక్రియ కీలక పాత్ర నిర్వహించింది. ఫలితంగా పౌల్ట్రీ పరిశ్రమ కోడిపిల్లల నుండి, కోళ్ళ దాణా, మందులు వరకూ, అంతేకాక వాటి అమ్మకాలు, అలాగే కోడిగ్రుడ్డు పొడి, కోడి మాంసం వరకూ గుత్తాధిపత్యానికీ, విదేశీ కంపెనీల దోపిడీకీ నిలయమైంది. మేకలు, గేదెలు, కొరమీనులలో జన్యుమార్పిడి రకాలను ప్రవేశపెట్టడమంటే ఈ రంగం విదేశీ కంపెనీల గుత్తాధిపత్యం క్రిందకు వెళ్లుతుందనీ, మేకలు, గేదెల పెంపకంలో ఉపాధి పొందుతున్న లక్షలాది బడుగు వర్గాలను తొలగించి, వాణిజ్య స్థాయిలో నిర్వహించేవారు ప్రవేశిస్తారనీ అర్థం చేసు కోవటం కష్టమేమీ కాదు. కనుకనే జన్యు మార్పిడి రంగంలో గుత్తాధిపత్యం వున్న మోన్‌శాంటోకూ, ఐటిసికీ బోర్డులో స్థానం కల్పించారు. పౌల్ట్రీలో గుత్తాధిపత్యం వున్న వెంకటేశ్వరా హేచరీస్‌కూ, వీటిని కొని అమ్మే రిటైలు కంపెనీలకు స్థానం కల్పించారు.

మరో మాటల్లో చెప్పాలంటే, రిటైలు వ్యాపారం, విత్తనాల తయారీ పురుగు మందుల తయారీ రంగాల్లోని బడా కంపెనీ లకు వ్యవసాయ విజ్ఞాన ఒప్పందంలో చోటు కల్పించారు. ఇవి భారత రైతాంగం ఏ పంటలు పండించాలో, వాటికి ఏ విత్తనాలూ, మందులూ, ఎరువులూ వాడాలో, వాటిని బడా రిటైలు కంపెనీలకు ఏ విధంగా అమ్మాలో నిర్ణయిస్తాయి. భారత వ్యవసాయ రంగం వీటి నియంత్రణలోకి వెళ్లే క్రమాన్ని త్వరితం చేసేదే ఈ ఒప్పందం. బ్రిటీషు వలసపాలన బలవంతంగా భారత రైతాంగంతో నీలి పంటను వేయించి, తాను నిర్ణయించిన రేటుకే రైతాంగం నుండి కొనుగోలు చేసేది. దీనికి ప్రత్యక్ష వలస పాలనాధికారం ఆనాడు కలిగి వుంది. ఈనాడు నయావలస విధానం ఆర్థిక మీటలతో రాజ్యం మీద పెత్తనం పొంది రైతాంగం వేయాల్సిన పంటనూ, తన కంపెనీలకు అమ్మితీరాల్సిన ధరనూ నిర్ణయిస్తున్నాయి. సామ్రాజ్యవాదం ముందు మోకరిల్లిన భారత దళారీ బూర్జువాల నిజరూపాన్ని తెలిపే ఒప్పంద మిది.

ఈ బహుళజాతి కంపెనీలు తయారు చేసిన విత్తనాలనూ, జీవాలను భారత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించటమే వ్యవసాయ పరిశోధనల లక్ష్యం చేశారు. కనుకనే వీజియన్‌పీ (బఠాణీలు), గేదెలు, ఫిన్‌ఫిష్‌ల జన్యు పట్టికలను తయారు చేయటం; వీటి మాలిక్యులర్ బ్రీడింగ్, సెల్‌లైన్స్ తయారీలపై వ్యవసాయ పరిశోధనలు సాగిస్తారు.

## విద్య, పరిశోధనల వాణిజ్యీకరణ

ఇక వ్యవసాయ విద్యను కూడా దీని కనువుగానే రూపొందిస్తారు. వ్యవసాయ విద్య నాణ్యతనూ, ప్రాసంగికతనూ పెంచి, పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు పెంచటం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించే విధంగా మానవ వనరులను అభివృద్ధి చేయటం లక్ష్యంగా వ్యవసాయ విద్య పాఠ్యాంశాలను, అభ్యాసన పద్ధతు లనూ, పరిశ్రమలతో బంధాలనూ రూపొం దించి అంతర్జాతీయ పోటీకి విద్యార్థులను తయారుచేస్తారు. దీని అర్థం స్పష్టం. బహుళజాతి కంపెనీల ఉత్పత్తులను రైతులకు పరిచయంచేసే, వారిచే ఉపయో గింపచేసే వారిగా వ్యవసాయ విద్యార్థులను తీర్చిదిద్దుతారు. తమ విత్తనాలూ, మందులు మార్కెట్లోకి వచ్చేసరికి, వాటి గుణగణాలనూ, వాటి వాడకం వల్ల ఒనగూడే లాభాలను వివరించి చెప్పే సేల్సుమాన్లుగా విద్యార్థులకు శిక్షణ యిస్తారు. మానవ వనరుల అభివృద్ధి అన్న అందమైన పదజాలానికి నిజమైన అర్థమిది.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రూ.45 కోట్లు కేటాయించారు. దీనిని వ్యవసాయ ఉత్పత్తుల నుండి నూనెలు పిండే, ఆలియో రెసిన్‌లనూ, జీవరంగులను వెలికితీసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పైన వెచ్చిస్తారు. అలాగే జీవ ఇంధనంగా వాడేందుకు వ్యవసాయ ఉత్పత్తుల నుండి ఆల్కహాలు తయారుచేసే సాంకేతిక పరి జ్ఞానంపై ఖర్చు చేస్తారు. నేడు భారత రైతాంగ మెదుర్కొంటున్న సమస్య తగిన ధర వచ్చే వరకూ పంటలను నిల్వ ఉంచ లేకపోవటం; కూరగాయలు, పండ్లు వంటి వాటిలో నిల్వ సౌకర్యాలు లేక 30-40 శాతం వరకూ రైతులు పంటను నష్టపోతున్నారు. కనుక ఫుడ్ ప్రాసెసింగ్ అంటే పంటలను నిల్వ చేసుకొనే సౌకర్యాన్ని కల్పించటం కాగా పంటలను బడా కంపెనీలకు ముడిసరుకుగా మారుస్తున్నారు. ఆ విధంగా దేశ ప్రజల అవసరాలూ, రైతాంగ ప్రయోజనాలూ నెరవేర్చేందుకు కాకుండా, బడా కంపెనీలకు లాభాలను చేకూర్చేందుకు పంటలు వేసే విధానానికి రంగం సిద్ధం చేసేదిగానే ఒప్పందం వుంది.

## సాగునీరు కూడా సరుకే

భూగర్భ, భూఉపరితల జలవనరులను లబ్ధికరంగా వినియోగించటం లక్ష్యంగా ఒప్పందం ప్రకటించుకుంది. బిందు సేద్యం, తక్కువ ఎత్తు తుంపర సేద్యం, మధ్యస్థ ఎత్తుతుంపర సేద్యాలను అను సరించటమే దీనికి మార్గమని సూచించింది. వీటిని

అన్వయించే యాంత్రీకరణను పెంచటంపై పరిశోధన సాగాలంది. 60 శాతం భూమికి నీటి పారుదల సౌకర్యం లేదన్న, వర్షాధార మన్న వాస్తవాన్ని పట్టించు కోలేదు. ఇప్పటికీ బిందు, తుంపర సేద్యాన్ని వినియోగిస్తున్న రైతాంగాన్ని అడిగితే, వీటి కొనుగోలు, నిర్వహణకు 80 శాతానికి పైగా సబ్సిడీనిస్తే తప్ప రైతాంగం వినియోగించలేమని తెలిపారు. వీటి యాంత్రీకరణను పెంచట మంటే రైతాంగం వీటిని నెలకొల్పేందుకు ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. ఫలితంగా పేద, మధ్యతరగతి రైతాంగం వీటిని వాడలేరు. వీటిని ప్రాధాన్యతా రంగ రుణాలలో చేర్చి, బ్యాంకులను రుణాలిమ్మని బడ్జెట్లో చెప్పారు. వీటిని తయారుచేసే అతిపెద్ద కంపెనీ జైన్ పైప్స్ తన అమ్మకాలు 50 శాతం పెరుగుతాయని అంచనా వేసింది. ధనిక రైతాంగం మాత్రమే వీటిని వాడగలుగుతారు. తక్కువ వడ్డీకే పంట రుణాలుగా పరిగణిస్తూ వీటి కొనుగోలుకు ధనిక రైతాంగానికి ప్రభుత్వం తోడ్పడు తున్నది. ఈ ఒప్పందానికి అనుగుణంగానే ప్రభుత్వ విధానాలు రూపొందుతున్నాయని స్పష్టమౌతోంది.

ఒప్పంద అమలుబోర్డు ఏం చేస్తున్నదో బయటకు తెలియటం లేదు. తన విత్తనాలను దేశమంతటా అమ్ముకోవటం కోసమే తాను బోర్డులో వున్నానని మోన్‌శాంటో ప్రతినిధి అన్నట్లు రాష్ట్ర మాజీ వ్యవసాయ మంత్రి పేర్కొన్నారు. పాత బిటి రకాలు విఫల మయ్యాయన్న వాస్తవాన్ని తొక్కిపట్టి, ఎలాంటి క్షేత్రస్థాయి పరిశీలనలూ లేకుండా మోన్‌శాంటో కంపెనీకి మరో 10 రకాల బిటి విత్తనాలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

దేశంలో దాదాపు 45 సంవత్సరాలుగా వున్న వ్యవసాయ విశ్వవిద్యాలయాలు భారత వ్యవసాయరంగానికి చెందిన అన్ని అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాయి. వర్షపాతం, భూసారం, పంటలు, సాగు పద్ధతులు, ఎరువులు, పోష కాలు మొదలగు అన్ని అంశాలపైనా సమగ్ర సమాచారం, తగిన సాంకేతిక పరిజ్ఞానం వుండటంతోపాటు, దానిని రైతాంగానికి అందించగల విస్తరణ సేవలను పటిష్టం చేసే అంగాలున్నాయి. ఇప్పటికే విస్తరణ సేవలను నిర్లక్ష్యపరిచిన రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విజ్ఞానం రైతాంగాని కందించగల వ్యవస్థను దెబ్బతీసాయి. ఈ విస్తరణ సేవలను ప్రైవేటీకరిస్తామనీ, రైతులు వీటికి మూల్యం చెల్లించాలనటం ద్వారా విస్తరణ సేవలనూ, కంపెనీల అమ్మకాలు పెంచే సేవలుగా మార్చారు. ఇప్పుడు విజ్ఞాన ఒప్పందంతో విశ్వ విద్యాలయాలవద్ద ఉన్న విజ్ఞానం, సమాచారం కూడా బీరువాలలో చేరి బూజుపట్టి పోతాయి. ఇక కంపెనీలు చెప్పిందే వేదమవుతుంది. వాటినిగ్గుతేల్చే స్థితి విశ్వవిద్యాలయాలకు లేకుండా పోతుంది.

సస్యవిప్లవ వ్యూహం వ్యవసాయ రంగం లోకి సామ్రాజ్యవాద పెట్టుబడి చొరబాటుకు వాహకంగా పనిచేసింది. దీని తార్కిక కొన సాగింపుగా వ్యవసాయరంగాన్ని సామ్రాజ్య వాద పెట్టుబడికి తోకగా మార్చాలన్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యూహానికి అనువుగానే వ్యవసాయ విజ్ఞాన ఒప్పందం జరిగింది.

దేశం, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే, ఈడేర్చే విధానాలను శాస్త్ర విజ్ఞానం సూచించదు. సామాజిక వాస్తవాన్ని గుర్తించి, దాన్ని మెరుగుపరిచేందుకు ఏ చర్యలు తీసుకోవాలో, నిర్ణయించాల్సింది రాజకీయ నాయకత్వం. ఆ చర్యలు అమలుకు శాస్త్రీయ విజ్ఞానాన్ని ఎలా వాడు కోవాలో నిర్ణయించు కోవాలి. శుద్ధ శాస్త్ర విజ్ఞానం మాత్రమే సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారాన్ని సూచించదు. శాస్త్ర విజ్ఞానం పేరిట బడా పెట్టుబడిదారుల లాభార్జనను పెంచే పద్ధతులనే నిజమైన శాస్త్రీయ పరిష్కారాలుగా చూపుతున్నారు. భారత వ్యవసాయరంగాన్ని సామ్రాజ్య వాదానికి తోకగా మార్చే ఆర్థిక, రాజకీయ విధానాలనుసరిస్తున్న భారత దళారీ బూర్జువా పాలకులు దానికి శాస్త్ర విజ్ఞానపు ముసుగు వేయటానికీ, ఆ ముసుగులో దేశ వనరు లనన్నింటినీ సామ్రాజ్యవాదులవరం చేయటానికి ఉపయోగిస్తున్న సాధనమే, వ్యవసాయ విజ్ఞాన ఒప్పందం.

---

**'నాగలి నా శ్వాస!**
**నాగలి నా చరిత్ర మొదటి అక్షరం**
**శ్వాసలో నాగలి వాసన**
**కోల్పోయిన నాడు**
**ఇక, మనిషిగా మరణించినట్టే లెఖ్ఖ**
**నాగలి ఆత్మహత్య చేసుకుందంటే**
**మనిషి చరిత్ర యావత్తూ ఆత్మహత్య**
**చేసుకున్నట్టే లెఖ్ఖ**
**జీవనది గొంతులో**
**పురుగుమందు కుమ్మరించినవాడే**
**విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి**
**కాలువల్ని తవ్వగలడు**
**పసిడి కాంతులపైరు తల్లిని**
**ఛీత్కరించినవాడే**
**ఆత్మహత్యకు ఎక్స్‌గ్రేషియా**
**వదనంతో**
**దుఃఖాన్ని ఒలకపోయగలడు**
**డాలర్‌ను స్టెతస్కోప్‌ను చేసి**
**మెడలో శాస్త్రంగా ధరించినవాడే**
**ఆత్మహత్యను మాస్ హిస్టీరియాగా**
**ప్రకటించగలడు**

**నా శ్వాసా!**
**నా చరిత్ర దాతా!!**
**వైట్ హౌస్‌ను కడిగిన నీరును**
**క్రిమిసంహారక జలాలుగా**
**పంటపొలాల్లోకి పారించక ముందే**
**శ్వాసలో నాగలి వాసన కోల్పోయిన**
**వాడి గుండెపై**
**ఒక్కసారి గాల్లో ఎగిరి**
**నీ కర్రు మొన దించు.'**

**- కౌముది**
'నా చరిత్ర మొదటి అక్షరం' కవిత నుండి

# ప్రైవేటు రాజ్యాలుగా ' ప్రత్యేక ఆర్థికమండళ్లు'

**జె. కిషోర్‌బాబు**

దేశాన్ని పారిశ్రామికవాడగా రూపొందించడం కోసం, లక్షలకోట్ల రూపాయలు విదేశీ పెట్టుబడులు రాబోతున్నాయని చెప్పి కేంద్ర ప్రభుత్వం 2005-ప్రత్యేక ఆర్థికమండళ్ళు (SEZ) చట్టాన్ని చేసింది. మొత్తం దేశంలో సముద్ర తీర ప్రాంతాన్ని ఎంచుకొని సెజ్‌లకు పాలకులు అనుమతిస్తున్నారు.

మన రాష్ట్రంలో కూడ శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు విస్తారంగా వున్న తీరప్రాంతాన్ని ఎంచుకున్నారు. విశాఖ-కాకినాడ- కృష్ణపట్నం ఓడరేవులను కేంద్రంగా చేసుకొని సెజ్‌లకు భారీగా భూముల కేటాయింపు జరుగుతోంది. బహుళజాతి కంపెనీలు దేశంలోని వనరులను లూటీ చేసేందుకు ఆంధ్రకోస్తాని వ్యూహాత్మక ప్రాంతంగా ఎంచుకొన్నాయి. 5వ నంబరు జాతీయ రహదారి, రైల్వేలైను సముద్ర తీరానికి దగ్గరగా వెళుతుండడం; విశాఖ, కాకినాడ, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులుండడం; రోడ్డు, రైలు, సముద్ర రవాణా అవకాశాలు అనుకూలంగా ఉండటంతోపాటు, సహజ నిక్షేపాలు ఈ ప్రాంతంలో అధికంగా ఉండి, తమ దోపిడీకి అనుకూలంగా ఉండటంతో బహుళజాతి కంపెనీలు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నాయి.

చెన్నై నగరం విస్తరించడంతో పోర్టు నుంచి రాకపోకలకు అసౌకర్యం కలగడంతో, సమీపంలో వున్న కృష్ణపట్నం ఓడరేవు నిర్మాణం శరవేగంతో జరుపుతున్నారు. దీనికోసం కృష్ణపట్నం పోర్టు విస్తరణ పనుల నిర్వహణను నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి (ఎన్.సి.సి) ప్రభుత్వం అప్పగించింది. కృష్ణపట్నం-తడ- సత్యవేడు పారిశ్రామిక కారిడార్ కాబోతోందని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే థర్మల్ పవర్ ప్రాజెక్టులు, లెదర్ పార్కులు, ఇండస్ట్రియల్ పార్కులు, అపెరల్ పార్కుల కోసమని పదులవేల ఎకరాల భూములను రైతులనుండి గుంజుకుంది. సెజ్‌ల్లో పరిశ్రమలు నెలకొల్పే పారిశ్రామిక అధిపతులకు కావాల్సిన రోడ్లు, రవాణా, విద్యుత్, నీరు వంటి మౌలిక సౌకర్యాలను సమకూర్చేందుకు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ (APIIC) కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం కృష్ణపట్నం పోర్టుని ఆధారం చేసుకొని 5 సెజ్‌లతో కలిపి 13 కంపెనీలకు భూములు కట్టబెట్టింది. కృష్ణపట్నం పరిసర గ్రామాల్లో రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపు అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్ట్ కోసమని 2945 ఎకరాలను, ముత్తుకూరు మండలం పైనంపురం, నక్కలమిట్ట గ్రామాల్లో థర్మల్ పవర్ ప్లాంట్ కోసమని ఎపి జెన్‌కో కి 2532 ఎకరాలు, ఇదే మండలంలో పోర్టు విస్తరణ, లెదర్ పార్కు కోసమని వేలాది ఎకరాల సాగు భూములను ప్రభుత్వం గుంజుకుంది. చిత్తకూరు మండలం తమ్మినపట్నం పరిసర గ్రామాల్లో మీనాక్షి, సింహపురి థర్మల్ పవర్ ప్లాంట్ల కోసం పెద్దఎత్తున భూముల కేటాయింపు జరిగింది. శ్రీలంక మాస్ హోల్డింగ్-అపెరల్ పార్కుకి చింతవరం కొత్తపాలెం, ఏరూరు గ్రామాల్లో 750 ఎకరాలను, అంకులపాటూరులో SBQ స్టీల్‌ప్లాంటుకి 11 వందల ఎకరాలు సముద్రతీర ప్రాంతంలో భూములను కేటాయించింది.

జాతీయ రహదారికి అందుబాటులో వున్న తడ మండలంలోని మాంబట్టు వద్ద చైనాకు చెందిన అపాచీ కంపెనీకి సెజ్ క్రింద 300 ఎకరాలను, మరో 5 పాదరక్షల కంపెనీలకు, ఇదే గ్రామంలోనే రీజెన్ పవర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, అశోక్ లైలాండ్, టాటా రీఎర్సన్, ఈస్టర్న్ మాట్రెస్సెస్, విన్ కమ్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్, జామెంట్రిక్స్ లేజర్ వెల్డింగ్ అండ్ కమాండ్ యూనిట్‌కి వేలాది ఎకరాల భూములను అప్పగించింది. ఇక నాయుడుపేట, ఓజిలి, పెళ్ళకూరు మండలాల్లో ఎపిఐఐసి నేరుగా 5600 ఎకరాలను రైతులనుండి గుంజుకొన్నది. ఈభూములను మేనకూరు సెజ్‌గా నోటిఫై చేసి ఇందులో 2 వేల ఎకరాలను కెపారో ఆటోమొబైల్ కంపెనీకి, 230 ఎకరాలను తైవాన్‌కు చెందిన ఆటోమొబైల్ కంపెనీకి ఎపిఐఐసి కట్టబెట్టింది. ఈ జిల్లాలోనే కొడవలూరు మండలం రాచర్లపాడు వద్దనున్న ఇఫ్కో ఎరువుల కర్మాగారానికి చెందిన 10వేల ఎకరాలను కిసాన్ సెజ్ (రైతుల ప్రత్యేక ఆర్థికమండలి)కి అప్పగించింది. నెల్లూరుజిల్లా సరిహద్దునే వున్న చిత్తూరు జిల్లా సత్యవేడులో 12వేల ఎకరాలను శ్రీసిటీకి అప్పగించింది.

సాగుభూములను పరిశ్రమలకోసమూ, సెజ్‌లకోసమూ తీసుకోబోమని సోనియా గాంధీ చేసిన ప్రకటన రైతులనుండి వచ్చిన ఆగ్రహావేశాలను చల్లబరచడానికే చేసింది. ఆచరణలో లాక్కొన్నదంత సాగుభూములనే. భూములు వదులుకోవడానికి నిరాకరించిన రైతులపై అధికారయంత్రాంగం, స్థానిక పెత్తందార్ల సహాయంతో బెదిరింపులకు దిగుతోంది. రైతులు నిరసన తెలుపుతున్న సందర్భాల్లో సెటిల్‌మెంట్ పట్టాదార్లను -అసైన్డ్, ప్రభుత్వ భూములు సాగుచేస్తున్న రైతులను విభజించి ముందుగా కొంత అధికమొత్తం ఇస్తామని సెటిల్‌మెంట్ పట్టాదార్లకు ఆశచూపి లొంగదీసుకొంటోంది. వీరితో ఒప్పందం జరిగిన తర్వాత అసైన్డ్, ప్రభుత్వ భూములను సాగుచేసుకొంటున్న రైతులవద్దకొచ్చి మేంచెప్పిన ధరకు భూములు ఇవ్వకపోతే ఒక్కరూపాయి కూడా పరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకుంటామని, పైగా ఇప్పటివరకూ ప్రభుత్వ భూములు సాగుచేసుకున్నందుకు ప్రభుత్వానికే మీరు కొంత చెల్లించుకోవాల్సివుంటుందని అధికారయంత్రాంగం బెదిరింపులకు పూనుకుంటున్నది.

సెజ్‌లద్వారా లక్షలాదిమందికి ఉపాధి దొరుకుతోందని ఇంటికో ఉద్యోగమిస్తామని

శ్రమల్లో ముంచిన ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కింది. ఏపనీలేక కడుపులు మాడ్చుకుంటున్న నిరుద్యోగులను కారు చౌకగా శ్రమదోపిడీ చేసేందుకు కావాల్సిన పద్ధతులన్నీ అవలంభిస్తున్నా ప్రభుత్వానికి పట్టలేదు.

దీనికి నగ్నమైన ఉదాహరణ, అపాచీ కంపెనీ! 30 వేలమందికి ఉద్యోగవకాశాలు కల్పించి, నెలకు నాలుగువేల రూ॥లకు తగ్గకుండా జీతం అందించడమే అపాచీ లక్ష్యమని కంపెనీ ప్రారంభసభలో వై.ఎస్ ప్రకటించాడు. ఇప్పటికిచ్చింది 5 వేల ఉద్యోగాలే. కంపెనీపెట్టిన కొద్దినెలలకే కంపెనీ కార్మికుల జీతాలను దిగ్గోసింది. 3500రూ॥ వున్న మూలవేతనం(బేసిక్)లో వెయ్యి రూపాయలు కోత విధించింది. ఓ.టి. చెల్లింపుల్లోకూడా కోతపెట్టి కార్మికుడి శ్రమనుకొల్లగొడుతున్నారు. మూలవేతనంలో విధించిన కోత మూలంగా పి.యఫ్.కు చెల్లించే నిధినికూడా తగ్గించివేశారు. ఏవో సాకులు చూపి అటెండెన్స్, బోనస్, ప్రొడక్షన్ బోనస్‌లను కూడా కత్తిరిస్తున్నారు.

ఎంతోకాలంగా తమ సమస్యలపై సంఘటితపడి పోరాడుతున్న చరిత్ర కార్మిక వర్గానికి వున్నా అపాచీలో కార్మికులకు తమ సమస్యను విన్నవించుకొనే పరిస్థితికూడా లేదు. కంపెనీ ప్రారంభదినాల్లో ఒక కార్మికుడ్ని చైనా అధికారి బూటుకాలితో తన్ని అవమానపరచినందుకు అన్ని యూనిట్లలో వున్న కార్మికులు సమ్మెకి దిగారు. చేసేదిలేక చైనా అధికారిని వెనక్కు పంపించినా సాధింపుచర్యల్లో భాగంగా సమ్మెకు నాయకత్వం వహించిన కార్మికుడ్ని ఉద్యోగంనుండి తొలగించారు. అందుచేత జయంతి రోజున ప్రభుత్వ సెలవుదినాన్ని అమలు చేయాలని కార్మికులు ఆందోళనకు దిగినందుకు నలుగురు కార్మికులను ఉద్యోగం నుండి తొలగించింది. ఈ సంఘటనలన్నీ చూస్తే కట్టుబానిసలుగా పనిచేయడమే తప్ప తమ సమస్యల సాధన కోసం గొంతెత్తితే సహించ మని కంపెనీ చెప్పకనే చెబుతోంది. ప్రభుత్వ కార్మిక చట్టాలేమీ ఇక్కడ వర్తించడం లేదు. సెజ్‌ల లక్ష్యం చట్టాలనుండి మినహాయింపు పొందడమే గదా!

పారిశ్రామికాభివృద్ధి పేరుతో కంపెనీ లకు మన భూములను, వనరులను ధారా దత్తం చేయడమే మన దళారీ పాలకుల ధ్యేయం. పారిశ్రామికవేత్తలకు సేవచేయడం తప్ప, ప్రజలను వారి దోపిడీకి బలిచేయడం తప్ప వేరుకాదన్నది స్పష్టం. ఉపాధికల్పన అన్నపేరుతో మన శ్రమను కారుచౌకగా కంపెనీలకు అప్పచెబుతోంది. అందరికీ ఉపాధి, పనికి తగిన వేతనం అన్న వాటి కోసం ప్రజానీకమూ, కార్మికవర్గమూ సంఘటితపడి పోరాడడమే పరిష్కారమార్గం.

# పోనీ

**- చెరబండరాజు**

పోనీ.....
పోనీ ప్రాణాలు మావి
పోతేపోనీ
రావాలి భూములూ
కావాలీ సొంతమూ ॥పోనీ ప్రా॥

పిందెకూడ చిదమకుండ
కింద రాలదూ
ఎదురు తిరగకుండ ఏది
ఎదురేగీరాదూ ॥పోనీ ప్రా॥

అరకగట్టినోడి కడుపు
ఆకలి తీరాలీ
అందుకొరకు అందరమూ
ఒకటై నిలవాలి ॥పోనీ ప్రా॥

నూర్ల నూర్ల ఎకరాలు
మెక్కి బలిసినోళ్లూ
కాడెరగని తాడెరగని
భూస్వాములు వాళ్లూ ॥పోనీ ప్రా॥

యెట్టిజేసి ముష్టెత్తీ
కడుపు నింపుకోమురా
పనియివ్వని కూలివ్వని
వాడిపనీ పడదమురా ॥పోనీ ప్రా॥

భూమిస్తం ఓటెయ్యమని
చెప్పనోడు ఎవ్వడూ
ఇవ్వకుంటె ఆక్రమిస్తే
జైల్లో బెట్టునెవ్వడూ ॥పోనీ ప్రా॥

తెగిస్తేనే జయిస్తాము
చేతులు కలపండి
సంఘబలం వుంది మనకు
భయంగియం వొదలండీ ॥పోనీ ప్రా॥



# దేశ వ్యాపితంగా దళితులపై నానాటికీ పెచ్చుమీరుతున్న అగ్రకుల- భూస్వామ్య, పెత్తందార్ల దాడులు

టి.రఘువీర్

**'ఏ దేశ చరిత్ర చూసినా**
**ఏమున్నది గర్వకారణం?**
**నరజాతి చరిత్ర సమస్తం**
**పరపీడన పరాయణత్వం**
**నరజాతి చరిత్ర సమస్తం**
**పరస్పరాహరణోద్యోగం**
**నరజాతి చరిత్ర సమస్తం**
**రణరక్త ప్రవాహసిక్తం!'**

–అనేది భారతదేశ గత చరిత్రనే కాదు నేటి వర్తమానాన్ని పరిశీలించినా ప్రత్యక్షరం సత్యమని స్పష్టమౌతుంది.

తరతరాలుగా మన దేశంలో వర్ణవ్యవస్థ, కులవ్యవస్థల పీడితులుగా పంచములుగా, అంటరానివారుగా, ఛండాలురుగా వివిధ పేర్లతో పిలువబడుతున్న దళితులు–అగ్రకుల భూస్వామ్య, పెత్తందార్ల దాడులు, దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు, దాష్టీకాలకు, దోపిడీ పీడనలకు, రాజ్య యంత్రాంగ అణచివేతకు గురౌతూ వస్తున్నారు. ఆరు దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత కూడా దళితుల జీవితాల్లో మౌలిక మార్పేమీ లేదు. కులపీడన, వివక్ష కొనసాగుతున్నాయి. అగ్రకుల భూస్వామ్య, పెత్తందార్ల దాడులు, దౌర్జన్యాలు సర్వసాధారణ మయ్యాయి. దళితులపై అత్యాచారాలు, హత్యాకాండ జరగని రోజే లేదంటే అతిశయోక్తి కాదు. రాజ్యయంత్రాంగంలో భాగమైన చట్టాలు, పోలీసులు, కోర్టులు, అన్నీ దోపిడీ వర్గాల కొమ్ముగాస్తూ, దళితుల కనీస ప్రజాస్వామిక హక్కుల్ని సైతం నిరాకరిస్తున్నాయి. కాలరాస్తున్నాయి.

ప్రభుత్వాలు విద్యా, ఉద్యోగరంగాల్లో దళితులకు 'రిజర్వేషన్లు' కల్పించామని చెప్పినా చట్టసభల్లో ప్రవేశానికి 'రిజర్వేషన్లు' కల్పించామని చెప్పినా, దళితుల దుస్థితిలో మార్పేమీ లేదు. పాలకవర్గాలు ఎన్నికల ప్రయోజనాల కోసం, అధికార పీఠాన్ని అధిరోహించటానికి దళితుల ఓట్లను దండుకోవటం కోసమే ఈ విధమైన 'జిమ్మిక్కులన్నీ' తప్ప, చిత్తశుద్ధితో దళితుల ఉద్ధరణ కోసం కాదనేది–ఆచరణలో రుజువైన కఠోర వాస్తవం!

రాజ్యాంగంలోని అధికరణం 16(1), 16(2) ప్రకారం సామాజిక వివక్ష నిషేధించబడిందని చెప్తున్నా, ఆచరణలో దళితులపై అణచివేత మరిన్ని రూపాల్లో సాగుతున్నది. చట్టప్రకారం మరుగుదొడ్ల పరిశుభ్రతకు మనుషులను ఉపయోగించటం నేరం. కానీ ఈనాటికీ ఆ వృత్తిలో 15 లక్షల మంది దళితులు వుంచబడుతున్నారంటే, దళితుల ఉద్ధరణ కోసం చేసిన ఈ చట్టాల బూటకత్వం వెల్లడౌతుంది. అంటరాని కులాల్లో బాలికలకు బలవంతాన దేవదాసీలుగా మార్చి, దైవకార్యం పేరుతో వ్యభిచారం చేయించటాన్ని నేరంగా పరిగణిస్తున్నా, గ్రామీణ ప్రాంతాల్లో బసివిని, జోగిని పేర్లతో ఫ్యూడల్ వర్గాలు ముక్కుపచ్చలారని దళిత బాలికల్ని ప్రతి రోజూ ఈ యుమకూపంలోకి నెట్టూనే వున్నారు.

దళితుల అభివృద్ధిని గురించి అనునిత్యం ఊదరగొడ్తున్న బూర్జువా, భూస్వామ్యవర్గాల పాలనలోని బూటకత్వం–దేశ వ్యాపితంగా దళితులపై మాటల్లో వర్ణించలేని మధ్యయుగాలనాటి హత్యాకాండను, దాడులను గమనిస్తే, తేటతెల్లమవుతుంది. కరుడుగట్టిన అగ్రకుల, భూస్వామ్య వర్గపు దాడుల్లో చిందిన రక్తం మడుగులు ఆరకుండానే నిత్యం ఎన్నెన్నో అమానవీయ ఘటనలు మన ముందుకొస్తున్నాయి.

తమిళనాడు రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన దళిత గ్రామసర్పంచ్‌ను ప్రమాణస్వీకారం కూడా కాకుండానే హతమార్చిన సంఘటన దళిత ప్రజాప్రతినిధులకు ఏ మాత్రం రక్షణ లేదనీ, రాజ్యాంగ యంత్రం అగ్రకుల భూస్వామ్య పక్షం వహిస్తున్నదని తేల్చి చెపుతున్నది. మన రాష్ట్రంలో, గుంటూరుజిల్లా–గుంటూరు రూరల్ మండలం అడవి తక్కెళ్ళపాడు గ్రామపంచాయితీ ఎస్.సికి రిజర్వు అయింది. గ్రామ పెత్తందారు దయాకరరెడ్డి మద్దతుతో రాఘవమ్మ అనే దళిత మహిళ సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచింది. దయాకరరెడ్డి వార్డుమెంబర్‌గా గెలిచాడు. ఎన్నిక అయిన వెంటనే తాను చెప్పినచోటల్లా సంతకం చేయాలంటూ సర్పంచ్‌ను పెత్తందారు వేధింపులకు గురిచేశాడు. పోలీసులకు, అధికారులకు తనపై సర్పంచ్ యొక్క వేధింపుల గురించి రిపోర్టు చేసినా ఫలితం లేక, ఆమె తన నివాసాన్ని గుంటూరు స్వర్ణ భారతి నగర్‌కు మార్చుకోవలసి వచ్చింది. అయినా పెత్తందారు వేధింపులు తప్పటం లేదు. చట్టబద్ధంగా ఎన్నికైన దళిత మహిళకు రాజ్యాంగ యంత్రం ఏ మాత్రం అండగా నిలబడ లేదు.

తూర్పుగోదావరిజిల్లా సామర్లకోట మండలం సవర గ్రామంలో ప్రజాపథం కార్యక్రమంలో భాగంగా, తమ గ్రామం వచ్చిన అగ్రకుల ఎం.ఎల్.ఏ.ను దళితుడైన సర్పంచ్ తన ఇంట్లో భోజనంచేసి వెళ్ళమని కోరగా ఎం.ఎల్.ఏ. నిరాకరించాడు. ఎం.ఎల్.ఏ. వెంట వచ్చిన ఎం.ఎల్.ఏ. అనుచరులు, అగ్రకుల అధికారులు సర్పంచ్‌పట్ల అవమానకరంగా వ్యాఖ్యానించి గ్రామకాంగ్రెస్ నాయకుడు తాడికొండ అచ్చిరాజు ఇంటికి భోజనానికి వెళ్ళారంటే నియోజకవర్గ ప్రజా ప్రతినిధిలోనే అగ్రకుల దురహంకారం ఎంతగా గూడు కట్టుకుని వుందో అర్థమౌతుంది". తూర్పుగోదావరి జిల్లాలోని దివిలి గ్రామ సర్పంచ్‌గా ఎస్.సి. రిజర్వేషన్ కోటాలో గోదాటి లక్ష్మి ఎన్నికైంది. తమ స్వప్రయోజనాలకోసం ఎన్నికల్లో సహకరించిన అగ్రకులానికి చెందిన

భూస్వాములు బెదిరింపులు సాగించారు. సర్పంచ్ స్థానంలో లక్ష్మి కూర్చోవటానికే అంగీకరించలేదు. ఎన్నికలకు ముందే లక్ష్మి నుండి ప్రామిసరీనోట్లపై సంతకాలు తీసుకున్నారు. దీనిని ఆమె ప్రశ్నించినందుకు గాను భూస్వామి అనుచరులు, గూండాలు లక్ష్మిపై దాడిచేసి చీర చించి, బూతులు తిట్టి, అవమానపరిచారు. దీనిపై పోలీసులకు, పై అధికారులకు రిపోర్టు చేసినా 6 నెలల వరకు దాడి చేసినవారి మీద ఎలాంటి చర్య తీసుకోకపోగా 2007లో లక్ష్మిని సర్పంచ్‌గా సస్పెండ్‌చేసి, ఆమె చెక్‌పవర్‌ను రద్దు చేశారు. దళితులు అణిగిమణిగి ఉన్నంత కాలం మీదెక్కి స్వారీ చేయటానికి అలవాటు పడిన అగ్రకుల అహంకారం ప్రశ్నిస్తే మాత్రం నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడు తుందని, అగ్రకుల పెత్తందార్లకి పోలీసు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తారనే దానికి ఇదో ఉదా హరణ మాత్రమే.

హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌జిల్లా బీబీపూర్ గ్రామంలో గ్రామపంచాయితీ అనుమతి పొంది దళితులు 'రవిదాస్' ఆలయాన్ని నిర్మించుకున్నారు. తమ ఆలయంలోకి దళితులను ఎలాగూ రానివ్వని బ్రాహ్మణులు, దళితులు స్వయంగా ఆలయాన్ని నిర్మించుకోవటాన్ని కూడా సహించలేక, దేవాలయం అని కూడా చూడ కుండా దాడిచేసి 'రవిదాస్' విగ్రహాన్ని విర గ్గొట్టారు. పైగా తమకొక దేవాలయాన్ని నిర్మించుకునే 'అకృత్యానికి' పాల్పడి నందుకుగాను దళితులను గ్రామం నుండి వెలివేశారు. నిరంతరం తమను తాము పూజా పునస్కారాలతో పునీతం చేసుకుంటూ పరోపకారం, పాపపుణ్యాల గురించి మాట్లాడే పూజారి వర్గం దాని వికృత నిజ స్వరూపాన్ని ఎలా ప్రదర్శిస్తుందనే దానికి ఈ దాడి ఒక నిదర్శనం. కర్నాటక రాష్ట్రం మాండ్ల జిల్లా కే. షెట్టహళ్ళి గ్రామంలోని లోక పావని నదిలో దిగి ఒక దళిత యువకుడు ఈతకొట్టినందుకు గాను ఆగ్రహించిన అగ్రవర్ణస్తులయిన ఒక్కలింగ కులస్థులు దళితులపై దాడి చేశారు. నది 'అపవిత్రం' అయిందని భీభత్సం సృష్టించారు. దీంతో శాంతిభద్రతల పరిరక్షణకోసమంటూ దళిత వాడకు వచ్చిన పోలీసులు కూడా దళితుల పైనే దాడిచేసి, హింసకు పాల్పడ్డారు (13.4.07). దళిత యువకుడిపై దాడిచేసిన నేరస్తులను వదిలివేసి దాడికి గురైన దళితులపైనే హింసను ప్రయోగించటం పోలీసు యంత్రాంగ స్వభావాన్ని తేటతెల్లం చేస్తున్నది.

పాట్నా శివార్లలోని శివాలయ ప్రాంగణంలోకి వచ్చి దళితుల పిల్లలు ఆట లాడుకోవటాన్ని సహించలేని యాదవ పెత్తం దార్లు ఆ దళిత పిల్లల్ని చావబాదారు. విషయం తెలిసి అక్కడకు చేరుకొని అడ్డు కోబోయిన ఆ పిల్లల తల్లుల్ని కూడా కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా కొట్టారు (2.9.07). దళితులపై దాడులు గ్రామీణ ప్రాంతాలలోనే కాదు, కుల అంతరాలు తొలగిపోయాయని చెప్పుకుంటున్న పట్టణ ప్రాంతాలలో కూడా ఏ విధంగా జరుగు తున్నాయో ఈ సంఘటన చెప్తున్నది.

కాన్పూర్ నగరంలోని కెడిఏ కాలనీలో వున్న మహదేవ ఆలయంలోకి సుధీర్‌నాగ అనే దళిత యువకుడు వెళ్ళబోతే, ఆలయ పూజారి శైలేంద్ర తివారి అంగీకరించలేదు. దీనిని ధిక్కరించి సుధీర్ ఆలయంలోకి వెళ్ళేందుకు ప్రయత్నించగా పూజారి, పూజారివర్గం అసభ్యపదజాలంతో దూషి స్తూనే చితకబాదారు.

మన రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌జిల్లా జడ్జెర్ల మండలం 'ఆలోని' పల్లెలో పీర్ల పండుగ సందర్భంగా డప్పులు వాయించే సందర్భంలో కొందరు డప్పులు కొట్టటం అర్థాంతరంగా ఆపివెళ్ళిపోయారనే సాకుతో పెత్తందార్లు దళితపల్లెపై దాడిచేసి స్త్రీలు, పిల్లలు, వృద్ధులతో సహా వాడ వదిలి పారి పోయే దాకా కొట్టారు (30.1.07). కర్నూలు జిల్లా ప్యాపిలిలో గణేష నిమజ్జనం సందర్భంగా అగ్రవర్ణాలవారు ఏకంగా దళితులను హత్య చేసిన సంచలన సంఘటన కూడా ఇటీవల కాలంలో జరిగిందే. గుడులను కట్టాలి గుళ్ళలో దేవుని



"చిరకాలం జరిగిన మోసం
బలవంతుల దౌర్జన్యాలూ,
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా! ఇకపై చెల్లవు

ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ,
ఒక జాతిని వేరొక జాతీ,
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా? ఇకపై సాగదు".

చెక్కాలి అన్నీ చేశాక, గుడిలోకి రానీయ కుండా ఉండే, దేవుని కొలిచే అర్హత లేదని చెప్పే క్రూరత్వానికి ఉదాహరణలివి.

కర్ణాటకలోని బీజపూర్‌జిల్లా బసవనజాగెవాది సమీపంలోని కడాకూల కుగ్రామం. ఈ గ్రామంలో చలువాది కులానికి చెందిన దళితులను గ్రామానికి చెందిన చెరువులో దిగి నీళ్ళు వాడు కున్నారనే కారణంగా అగ్రకులాల వారు వెలివేశారు. కర్ణాటక రాష్ట్రం మాంద్యా జిల్లా శ్రీరంగపట్నం తాలూకా చిక్కా అంకనహల్లి గ్రామంలోని అగ్రకుల పెత్తందార్లు-దళితుల కాలనీపై దాడి చేశారు. గ్రామాన్ని దిగ్బంధనం చేశారు. పల్లెదాటి బయటకు రాలేక నిత్యావసర సరుకులు కూడా కొనుక్కోలేని స్థితిలో దళితులు గడిపారు. పోలీసులు గ్రామంలోకి వచ్చిన తర్వాత కూడా పల్లెపై దాడి చేసిన ముద్దాయి లందరూ పల్లెలో యధేచ్ఛగా తిరిగారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ అగ్ర కులాల కొమ్ముగాశారు. (24.9.07). తమిళ నాడులోని చాలా గ్రామాల్లో దళితుల్ని మంగలి షాపుల్లోకి రానివ్వటం లేదు. వీధి పంపులో నీరు పట్టుకోనివ్వటం లేదు. కళ్యాణ మండపాలను ఉపయోగించుకో నివ్వటం లేదు.

రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌జిల్లా అమరాపురా అనే గ్రామంలో ఒక దళిత యువకుడు తన పెళ్ళి సందర్భంగా గుర్రంపై ఊరేగే ప్రయత్నాల్లో ఉన్నాడని తెలుసుకున్న అగ్ర వర్ణాల వారు, దళితుడు తమ ఎదురుగా గుర్రంపై ఊరేగటమనేదాన్ని సహించలేక పెళ్ళి ఊరేగింపుపై మూకుమ్మడిగా రాళ్ళతో దాడి చేశారు. దాడి చేయటంతో ఆగలేదు. దళితులను సామాజిక వెలివేశారు. కిరాణా షాపుల్లో దళితులకు సరుకులు అమ్మలేదు. నీటి ట్యాంకర్ల యజమానులు దళితులకు తాగేందుకు నీరు కూడా సరఫరా చేయలేదు. విచిత్రమేమంటే ఈ ప్రాంతం రాష్ట్ర హోం శాఖా మంత్రి గులాబ్‌చంద్ కతారియా స్వంత జిల్లాలోది కావటం!

మన రాష్ట్రంలో ప్రకాశంజిల్లా గుడ్లూరు మండలం అడవిరాజుపల్లె గ్రామంలో పెత్తందార్ల ఎదురుగా దళిత దంపతులు గ్రామంలోని అరుగుపై కూర్చున్నారనే కారణంగా బండబూతులు తిట్టి, ఆ దంపతుల్ని తీవ్రంగా కొట్టారు (9.4.07).

అగ్రకులాల వారు ఉపయోగించుకునే చెరువులోకి దళితులు దిగటానికి వీలులేదు, వీధి పంపుల్లో నీళ్ళు పట్టుకోవటానికి వీల్లేదు. పెళ్ళి వేడుకలు తమకిష్టమైన రీతిలో జరుపుకునేందుకు స్వేచ్ఛ లేదు. అగ్ర కులాలకు ఎదురుగా రోడ్లపైన నడవడానికి లేదు. అరుగులపై కూర్చోడానికి లేదు. కుల వివక్ష పాటించడం నేరమని, అంటరాని తనాన్ని నిర్మూలించామని పాలకులు ఎంత వాగాడంబరాన్ని ప్రదర్శించినా దళితుల జీవితానుభవాలు ఆ మాటల్ని ఏ విధంగా విశ్వసించగల్గుతాయి?

మధ్యప్రదేశ్ రాష్ట్రం- సియోని జిల్లా బంత్వాలా గ్రామంలో అగ్రకులానికి చెందిన యువతి దళిత యువకునితో కలిసి ఇల్లు వదలి వెళ్ళిపోయింది. దీంతో ఆగ్రహించిన అగ్రకులాల వారు, ఆ దళిత యువకుడి తల్లిని గ్రామంలో ఊరేగించి, 30 మంది అత్యాచారం జరిపిన పైశాచిక సంఘటన ఈ మధ్య కాలంలోదే. మహారాష్ట్ర-శలుగావ్ గ్రామానికి చెందిన చంద్రకాంత గైక్వాయిడ్ అనే దళిత యువకుడు ప్రమీలాజాదల్ (15) అనే అగ్రకుల అమ్మాయి ప్రేమించు కొని ఇంట్లో చెప్పకుండా పారిపోయి ఆంధ్రప్రదేశ్‌లోని కామారెడ్డిలోని మిలింద్ జుంథాలే ఇంట్లో ఆశ్రయం పొంది వుండగా అమ్మాయి బంధువులు చుట్టుముట్టి బంధించారు. దళితుడిగా పుట్టి అగ్రకుల అమ్మాయిని ప్రేమించినందుకుగాను చంద్ర కాంత్ కళ్ళు పొడిచేశారు. ప్రేమికులకు ఆశ్రయమిచ్చినందుకుగాను అతని స్నేహి తుడు మిలింద్‌ను తీవ్రంగా కొట్టారు. ఈ కేసు విషయమై పోలీసుల వద్దకు వెళ్ళ కుండా చంద్రకాంత్ తల్లిదండ్రులను హెచ్చ రించారు. కేసును మాఫీ చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు (9.1.08). వేదాలు విన్నందుకు చెవుల్లో సీసంపోసిన, వేదాలు వల్లించినందుకు నాలుక కోసేసిన, విలు విద్య ప్రదర్శించినందుకు బొటనవేలు తెగ నరికిన అమానవీయ హిందూ మను సంస్కృతిలో అగ్రకులాల పిల్లలను ప్రేమిం చిన నేరానికి విధిస్తున్న శిక్షలివి. కోర్టులు, పోలీసులు, చట్టాలూ అన్నీ అగ్రకుల భూస్వాముల చుట్టాలే.

బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాలోని ఒక గ్రామంలో తినటానికి తిండిలేని ఒక దళిత కుటుంబానికి చెందిన బాలిక రైలుపట్టాల వెంబడి ఆకులు, అలములు తెచ్చుకుంటూ, అదే సందర్భంలో అగ్రకులానికి చెందిన వారింట్లో బచ్చలికూర దొంగిలించుకు పోయిందని నేరారోపణచేసి 10 సం॥ ఖుష్బూను అగ్రకుల పెత్తందార్లు కుడిచేతి ఐదువేళ్ళను దారుణంగా నరికించిన ఘోర మైన సంఘటన, (26.12.06) కరుడు కట్టిన కులవ్యవస్థ అమానుషత్వానికి 'మచ్చు తునక'.

మధ్యప్రదేశ్ హోషంగామాబాద్‌జిల్లా 'తిలి ఆంఖ్లి' గ్రామంలో పొలం నూర్పిడి చేయమని గ్రామ పెత్తందార్లు ఆదేశిస్తే ఆరోగ్యం బాగోలేదు కాబట్టి తాను పనిచేయలేనని సుమన్ అనే దళిత మహిళ నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన రాధే శ్యామ్‌గౌర్, శర్వాన్‌గౌర్ అనే పెత్తందార్లు, వారి కొడుకులు- సుమన్‌ను కట్టేసి స్పృహ కోల్పోయే వరకు కొట్టారు. తెలివిలోకి వచ్చిన సుమన్ మంచినీళ్ళివ్వమని మొత్తు కుంటే మూత్రం తాగించిన నీచమైన ఘటన (10.10.07) నాటి బానిస వ్యవస్థను తలపిస్తున్నది. తమ శరీరంపైన, శ్రమపైన, తమ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా యజమాని ఆజ్ఞల ప్రకారం నడుచు కోకుంటే 'స్వతంత్ర భారతం'లో లభించే కానుకలివి! మహారాష్ట్ర బంధరాజిల్లాలో వంచగావ్ గ్రామంలో తాను అప్పు అడిగితే ఇవ్వటానికి నిరాకరించిందనే ఒకే ఒక చిన్న కారణంతో ఇందూబాయి అనే దళిత మహిళను కిరోసిన్‌పోసి, నిప్పంటించి సజీవ దహనం చేశారు (10.4.07).

మన రాష్ట్రంలో కర్నూలుజిల్లా ఆళ్ళగడ్డ మండలం బాచేమల్లి గ్రామంలో దళిత మహిళల మరుగుదొడ్డి ఎదురుగా

అగ్రకులానికి సంబంధించిన వాళ్ళు ఇల్లు కట్టుకోవటం మహిళలకు ఇబ్బందిగా ఉంటుందని దళితులు అభ్యంతరం చెప్పారు. అగ్రకులాలవాళ్ళు నిరాకరించటంతో దళితులు కోర్టు నుండి తమకను కూలంగా ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. దీనితో ఆగ్రహించిన గ్రామ అగ్రకుల పెత్తందార్లు కోర్టు ఉత్తర్వులు తెచ్చిన దళితుడు మచ్చుమర్రి ఛైన్యుని జీపుతో తొక్కించి దారుణంగా హత్య చేశారు (25.12.06). తూర్పుగోదావరిజిల్లా కరప మండలంలోని ఓ గ్రామంలో దళితులు మంచినీటి సమస్య పరిష్కారానికి పంచాయితీ స్థలంలో బావి తవ్వుకోవటానికి పూనుకున్నారు. ఈ విధంగా కూడా దళితులకు నీళ్ళందటం ఇష్టపడని కమ్మ పెత్తందార్లు బావిని ఆనుకున్న స్థలంలో, బావి ప్రక్కనే మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకు నిర్మాణానికి గొయ్యి తవ్వటానికి పూనుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులూ దీనిపై ఏమీ స్పందించలేదు. ఈ గ్రామాల్లో అగ్రవర్ణాలవారు నడిచే రహదారులపై దళితులు నడవకూడదు. వారు వినియోగించే చెరువులు, బావులనీళ్ళు దళితులు ఉపయోగించరాదు (6.11.07). మన రాష్ట్రంలో వికారాబాద్ మండలం దాచారం గ్రామంలో అనారోగ్యం పాలై పనికి వెళ్ళలేనందుకు బలిజ దొరలు ఆగ్రహించి, ఆ దళత పాలేరుని నిర్దాక్షిణ్యంగా చంపివేశారు (21.12.06). కోవెలకుంట్ల నియోజకవర్గం చూగొండ్ల గ్రామంలోని కుంటలో దిగి దళితులు నీరు తెచ్చుకోకూడదు. ఇది తరతరాలుగా జరుగుతూ వస్తున్నది. అగ్రవర్ణాలవారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి కుంట దగ్గర వేచి వుండి వాళ్ళు కుంటలో నుండి ముంచిపోస్తేనే దళితులకు నీళ్ళు! ఎస్.సి. రిజర్వేషన్‌లో ఆ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన దళిత మహిళ క్కూడా ఈ దుస్థితి తప్పలేదు. కృష్ణాజిల్లా గుడివాడ బాపూజీనగర్‌లో దళిత బాలిక ఘంటా శిరీష స్థానిక నవోదయ కాన్వెంట్‌లో 7వ తరగతి చదువుతున్నది. కాన్వెంట్ ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు సాగిస్తూ వచ్చాడు. జనవరి 4, 2006న శిరీషపై అత్యాచారం జరిపి, హత్యచేసి ఆత్మహత్యగా కేసు నమోదు చేయించే ప్రయత్నం చేశారు. కుటుంబసభ్యుల వత్తిడితో కేసు నమోదైనా పోలీసు యంత్రాంగం అండదండలతో కేసు ముందుకు సాగకుండా చేస్తున్నారు. హర్యానా రాష్ట్రం కర్నాల్ జిల్లా శల్వన్ గ్రామంలో పోలీసుల సమక్షంలో రాజపుత్ యువకులు దళితవాడపై దాడిచేసి నిప్పంటించి 24 ఇళ్ళను క్షణాల్లో బూడిద చేశారు (1.3.07). మంచిర్యాల సమీపంలోని భీమిని మండలం కొత్తపల్లి గ్రామంలో మెదక్‌జిల్లా దౌలతాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా దళిత మహిళ వంట వండిందనే కారణంగా స్కూల్‌లోని బి.సి. విద్యార్థులే పది రోజులు అన్నం తినకుండా నిరసన తెలిపారు (6.1.07). దళితేతరులు భోజనాన్ని ముట్టకుండా అవమానకరంగా వ్యవహరించారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో పైమెట్టుపైనున్న కులం క్రింది మెట్టు మీదున్న కులాన్ని అధమంగా చూస్తుంది. ఈ అధమంగా చూడబడిన కులం తనకు దిగువమెట్టునున్న కులాన్ని మరింత తక్కువగా చూస్తుంది. అందుకే కులవ్యవస్థ 'శ్రమవిభజనకే కాదు- శ్రామికుల విభజన కూడా'. అగ్రకులాల నుండి వేధింపులకు, దౌర్జన్యాలకు గురయ్యే శ్రామిక, వెనుకబడిన కులాలు కూడా దళితులపట్ల వివక్ష ప్రదర్శించడం శ్రామికులు ఐక్యం కాకుండా విభజించి పాలించే హిందూ మనుధర్మ కుట్ర.

పంజాబ్ రాష్ట్రం మానసా జిల్లా జబ్బార్ గ్రామానికి చెందిన దళితుడైన బాంత్‌సింగ్ (40) యొక్క పెద్దకుమార్తెపై జాట్ యువకులు నాలుగు సంవత్సరాల క్రితం అత్యాచారం జరిపారు. దీనిపై బాంత్‌సింగ్ కేసు పెట్టడంతో, కేసును ఉపసంహరించుకోమని జాట్ కులస్తులు తీవ్రంగా బెదిరింపులు చేసినా, లొంగక కోర్టులో సాక్ష్యాలు పకడ్బందీగా చెప్పటంతో సెషన్స్ కోర్టులో ముద్దాయిలకు 2006లో శిక్షలు పడ్డాయి. దీనితో కక్ష పెంచుకున్న ముద్దాయిల తరపు జాట్ కులస్థులు కాపుకాసి బాంత్‌సింగ్‌ను చావగొట్టి రోడ్డు ప్రక్కనపడేసిపోయారు. ఎవరూ గమనించక వైద్య సహాయం అందక రెండు రోజులు పడివుండటంతో బాంత్‌సింగ్ గాయపడిన అవయవాలు కుళ్ళిపోయి రెండు చేతులు, ఒక కాలు తీసి వేయాల్సి వచ్చింది. వైద్యానికి పెద్ద ఎత్తున డబ్బు అవసరమైంది. అత్యాచారానికి గురైన బాంత్‌సింగ్ కూతురు ప్రస్తుతం వివాహితగా వుంది. ఆమె వద్దకు ఈ జాట్ కులస్థులు వెళ్ళి, హైకోర్టులో తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పేట్లయితే, వైద్యానికి కావలసిన ఖర్చంతా తాము భరిస్తామని ఒత్తిడి తెచ్చారు. బాంత్‌సింగ్ స్థానిక ప్రజా సంఘాల అండదండలతో, గట్టిగా నిలబడి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాడు. పోలీసులు నేరస్తుల కొమ్ముగాస్తూనే ఉన్నారు.

ఇంతేకాదు. పోలీసులే నేరస్థులై అత్యాచారాలకు పాల్పడు తున్న సంఘటనలనేకం రోజూ బయట కొస్తూనే వున్నాయి. విశాఖజిల్లా- పాడేరు నియోజకవర్గ ఏజన్సీ పరిధిలోని కుగ్రామ మైన వాకపల్లిపై- 2007 ఆగష్టు 20న- గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం జరిపారని 11 మంది గిరిజన మహిళలు నెత్తీనోరూ బాదుకుంటూ పోలీసు ఉన్నతాధికారులకు రిపోర్టు చేశారు. ఈ దారుణానికి వొడిగట్టిన నేరస్థులైన పోలీసులను గుర్తించటంగానీ, అరెస్టులు కానీ ప్రభుత్వ ఉన్నతాధికార యంత్రాంగం చేయలేదు. పైగా గిరిజన మహిళల ఆరోపణ అంతా అబద్ధమని స్వయానా రాష్ట్ర హోంశాఖామంత్రి, రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరలే ఖండన ప్రకటనలు చేస్తూ పోలీసుల 'ఆత్మస్థైర్యాన్ని కాపాడేందుకు' సిద్ధమవటం -ఈ దోపిడీ వ్యవస్థను పరిరక్షించే 'రక్షణ యంత్రాంగం' పై దోపిడీ పాలకులు ఈగను కూడా వాలనివ్వరని విదితమౌతున్నది. వాకపల్లి సంఘటనపై నిరసన, ఆందోళనలు సాగు తుండగానే- 2007 సెప్టెంబరు 13న- విశాఖ జిల్లాలోనే మధురవాడ సమీపంలో ఇద్దరు సాయుధ పోలీసులు మహిళలపై మరో అత్యాచారం జరిపారంటే వీరి చర్మ మెంతగా మొద్దుబారిందో అర్ధమౌతుంది.

మహారాష్ట్ర, బండారజిల్లా, మొహాడీ తాలూకాలోని ఖైర్లాంజి గ్రామంలో భయ్యాలాల్ అనే దళితుడు ఐదు ఎకరాల స్వంత భూమిలో సేద్యం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. భయ్యాలాల్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురు ప్రియాంక ఇంటర్మీడియట్ చదివింది. పెద్ద కొడుకు రోషన్ 'డిగ్రీ' చదువుతున్నాడు. రెండవ కొడుకు సుధీర్ అంధుడు. ఆ గ్రామంలోని దళితుల్లో ఈ కుటుంబ సభ్యులే చదువుకున్నవారుగా వున్నారు.

భయ్యాలాల్‌కు చెందిన ఐదు ఎకరాల భూమిలో 2 ఎకరాల భూమిని అగ్రవర్ణానికి చెందిన ఆ గ్రామ పెత్తందారు ఆక్రమించు కున్నాడు. ఈ దుర్మార్గాన్ని ఆ కుటుంబం ప్రశ్నించటమేగాక, ఈ దురాక్రమణ గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దీనితో ఆగ్రహించిన అగ్రవర్ణ పెత్తందార్లు, 2006 సెప్టెంబరు 29న భయ్యాలాల్ కుటుంబంపై దాడి చేశారు. భయ్యాలాల్ కళ్ళముందే అతడి భార్య సురేఖ, కుమార్తె ప్రియాంకలను వివస్త్రలను చేశారు. వారిద్దరినీ ఒక బండిపై గ్రామ మంతా నగ్నంగానే ఊరేగించారు. వారిద్దరి పై అత్యాచారం జరిపారు. పలు విధాలుగా హింసించారు. ఈ దారుణ హింసలకు తట్టుకోలేక ఆ తల్లీ కూతుళ్ళు ఇద్దరూ మరణించారు. ఆ కీచకులు వారి శవాలను మురికి కాలువలోకి విసిరేశారు.

ఈ దారుణాన్ని అడ్డుకోవటానికి ప్రయత్నించిన భయ్యాలాల్ కొడుకులిద్దరినీ తీవ్రంగా కొట్టి చంపివేశారు. ఈ విధంగా భయ్యాలాల్ కుటుంబ సభ్యులను దారుణంగా హింసించి, చంపివేశారు.

భయ్యాలాల్ తన కుటుంబ సభ్యులపై జరిగిన దారుణ హింసాకాండపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే, అగ్రవర్ణ ఆధిపత్య వ్యవస్థకు సేవకులుగా వున్న పోలీసులు–భయ్యాలాల్ కూతుర్లిద్దరూ బలాత్కరింపబడలేదనే తప్పుడు మెడికల్ రిపోర్టును సృష్టించి, నిందితులను రక్షించే ప్రయత్నం చేశారు–కేసును నీరు గార్చే చర్యలు చేపట్టారు.

దళితుల భూమిపై యజమాన్యాన్ని గుంజుకోవటమేగాకుండా దళితులపై అమానుష హింస, దారుణ హత్యలకు పాల్పడిన అగ్రవర్ణాలవారి దుర్మార్గాన్ని, రాజ్యాంగ యంత్ర సమర్ధనల్ని నేటి మన సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ యొక్క అసలు స్వభావంగానే అర్థం చేసుకోవాలి.

భయ్యాలాల్ కుటుంబంపై దాడికి తక్షణ కారణం–అగ్రకుల పెత్తందారు ఆక్రమించుకున్న తమ భూమి గురించి ప్రశ్నించటం, పోలీసు రిపోర్టు ఇవ్వటం అనేవికాగా; అట్టడుగు దళితులై వుండీ చదువుకోవటం, బౌద్ధమతాన్ని స్వీకరించి వుండటం, తమ అధికారాన్ని ప్రశ్నించట మనేవి మూలకారణాలుగా వున్నాయి.

ఫ్యూడల్ వ్యవస్థలో భాగమైన కుల వ్యవస్థను, దాని రక్షణ యంత్రాంగాన్ని, కూల్చివేయకుండా దళితులకు దోపిడీ పీడనలనుండి విముక్తి లభించటం అసాధ్య మనే విషయం గతంలో జరిగిన, వర్త మానంలో జరుగుతున్న అనేకానేక సంఘటనలు నిరూపిస్తున్నాయి.

దేశంలోని వివిధ ప్రాంతాలలో దళితులపై సాగుతున్న, పెచ్చరిల్లుతున్న ఈ దాడులకు మూలం భూమి సమస్యతో ముడి వడి వుంది. దళితులంతా మెజారిటీగా గ్రామీణ ప్రాంతాల్లో భూములపై ఆధారపడి వ్యవసాయ కూలీలుగా జీవనం సాగి స్తున్నారు. ఈ భూములపై హక్కు, అధికారం కలిగి వున్నవారంతా ప్రధానంగా అగ్రకుల పెత్తందారీ భూస్వామ్య వర్గంగాను, అధికార రాజకీయ పలుకుబడి గలవారుగానూ ఉన్నారు. కనుక, గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య, అగ్రకుల పెత్తందార్ల అధికారానికి, అహంకారానికి మూలమైన, ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమిపై హక్కు (దున్నేవానికే భూమి) సాధించకుండా దళిత సమస్యకు మౌలిక పరిష్కారం లేదు. ప్రభుత్వాలు ప్రవచించే 'భూసంస్కరణలు', 'భూసంతర్పణలు' వంటివేవీ భూసంబంధం లో మార్పును తీసుకురావని, తీసుకురాలేవని రుజువైన వాస్తవం. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి మాటల్లో "గ్రామీణ పేదరికం అనే సాధారణ సమస్యకు సంబంధం లేకుండా, ప్రత్యేకించి విడిగా వీరి (దళితుల) విముక్తి సాధ్యం కానే కాదు. భూస్వామ్య విధానాన్ని బలవంతంగా, హింసాయుతంగా కూలద్రోసి భూములను విప్లవాత్మక పద్ధతుల్లో పున: పంపిణీ చేయకుండా ఈ విముక్తి సాధ్యం కాదు." దున్నేవానికే భూమి నినాదంగా వ్యవ సాయక విప్లవం ఇరుసుగా జనతా ప్రజా తంత్ర విప్లవం ద్వారా ప్రస్తుత అర్ధ భూస్వామ్య, అర్ధవలస వ్యవస్థను సమూ లంగా కూలద్రోయటమే దళితులపై దాడులను, అంటరానితనాన్ని సమూలంగా పరిష్కరించగలుగుతుంది. దళితులపై దాడులకు, అణచివేతకు వ్యతిరేకంగా సాగే ఉద్యమాలు, తక్షణ డిమాండ్స్ సాధనతో పాటు ఈ దాడులకు మూలమైన వ్యవస్థపై ఎక్కుపెట్టే దిశగా సాగాలి.

*"1950 జనవరి 26న వైరుధ్యాలతో కూడిన జీవితంలో మనం ప్రవేశించబోతున్నాం. మనకు రాజకీయాల్లో సమానత్వం, ఆర్థిక జీవితంలో అసమానత్వం ఉంటాయి. రాజకీయాల్లో ఒక్క మనిషికి ఒక ఓటు, ఒక్క ఓటుకు ఒకే విలువ అనే సూత్రాన్ని మనం గుర్తించబోతున్నాం. మనకున్న సామాజిక ఆర్థిక నిర్మాణం కారణంగా మన సామాజిక ఆర్థిక జీవితంలో ఒక మనిషికి ఒకే విలువ అనే సూత్రాన్ని తిరస్కరించడాన్ని కొన సాగిస్తూనే ఉంటాము.... సాధ్య మైనంత వేగిరంగా ఈ వైరుధ్యాన్ని మనం తొలగించాలి. లేనట్లయితే అసమానత్వానికి గురయ్యే వారు–ఈ సభ ఎంతో శ్రమపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక నిర్మాణాన్ని పేల్చివేస్తారు".*

**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్**

# రైతుల భూములను కబళిస్తున్న కోస్తా కారిడార్

జాలయ్య

పారిశ్రామిక అభివృద్ధిపేరుతో ప్రత్యేక ఆర్థికమండళ్ళను మరియు ఇండస్ట్రియల్ పార్కులు, థీమ్ పార్కులు, మెగా కెమికల్స్ కాంప్లెక్స్‌లు, ఫార్మాపార్కుల పేరుతో లక్షలాది ఎకరాల రైతుల సేద్యపు భూములను బలవంతంగా గుంజుకొని బడా పారిశ్రామిక వేత్తలకు, బహుళజాతి కంపెనీలకు కట్ట బెట్టేందుకు పూనుకొన్న ప్రభుత్వం, ఇప్పుడు కోస్తా కారిడార్ ఏర్పాటు కోసం జి.ఓ.నెం. 34ను విడుదల చేయటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రెండేళ్ళ క్రితమే ప్రతిపాదించిన ఈ కోస్టల్ కారిడార్ ఎడల రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైయింది. అయినా ప్రభుత్వం దాన్ని లక్ష్యపెట్టకుండా శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకుగల తొమ్మిది జిల్లాల్లో 1575 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోస్తా కారిడార్‌ను దశల వారీగా ఏర్పాటు చేయ టానికి లక్షలాది ఎకరాల భూసేకరణకు రంగం సిద్ధంచేసింది. రెండువేల కోట్ల రూపాయలతో ఈ కారిడార్ ఏర్పాటు చేసి పరిశ్రమాధిపతులకు అప్పగిస్తారు.

ఇందులో భాగంగా మొదటి ఫేజ్ క్రింద, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లో 603 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ప్రాంతాన్ని ఏర్పాటుచేసి అందులో పెట్రోలియం, కెమికల్, పెట్రోకెమికల్స్, విద్యుత్, రసాయన ఎరువులు, నేచురల్ గ్యాస్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేస్తా మని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ఈ రెండు జిల్లాల్లో లక్షా యాభైవేల ఎకరాల రైతుల సేద్యపు భూములను స్వాధీనం చేసుకొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికీ 51వేల 500 ఎకరాల భూములను సేకరించటం పూర్తియ్యింది. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో 70శాతం ప్రైవేటు పరిశ్రమదారులకు కేటాయిస్తారు. ఇందులో బహుళజాతి సంస్థలకు కూడా అవకాశం కల్పించారు. అందువలన కోస్తా కారిడార్ వారి ఇష్టారాజ్యంగా మారుతుంది.

ఇప్పటికే కాకినాడ, విశాఖపట్నంలో ఉన్న ఓడ రేవులతోపాటు నూతనంగా విశాఖ సమీపంలోని గంగవరం వద్ద మరో పోర్టు సిద్ధమౌతున్నది. ఇవి కాకుండా ఈ కారిడార్ క్రింద తూర్పుగోదావరిజిల్లా తొండంగి మండలంలో కాకినాడ సెజ్‌కోసం మరో ఓడరేవుని నిర్మిస్తారు. ఈ సెజ్ పదివేల ఎకరాల్లో నెల కొల్పేందుకు సిద్ధంచేస్తున్నారు. ఇందులో పెట్రోకెమికల్ కాంప్లెక్సులు ఏర్పాటు కానున్నాయి. దీన్ని తూర్పు గోదావరి జిల్లాలో పెట్రో కారిడార్‌గా పిలవనున్నారు. పిఠాపురం నుండి నాగులాపల్లి మీదుగా తీరప్రాంతాన్ని రైల్వేలైన్‌తో కలుపుతారు. ఉప్పాడ దగ్గర ఎయిర్ పోర్టు, ఎయిర్ కార్గో టెర్మినల్‌ను నిర్మించేందుకు ప్లాన్ రూపొంది స్తారు. మొత్తం మూడుదశల్లో దీన్ని పూర్తి చేస్తారు. మొదటి దశలో కాకినాడ నుండి విశాఖ దగ్గర భీమిలి వరకు పరిశ్రమల కారిడార్ ఏర్పాటు అవుతుంది. ఇందులో రసాయనిక ఎరువుల, పెట్రో కెమికల్స్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తారు. రెండవ దశలో భీమిలి నుండి శ్రీకాకుళం జిల్లా కళింగ పట్నం వరకు తీరప్రాంత కారిడార్‌ను విస్తరింపచేస్తారు. మూడవ దశలో కాకినాడ – ఎస్. యానాం నుంచి కళింగపట్నం వరకు పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేస్తారు. ఇందులో ఇప్పటికే ఉన్న ఆయిల్ డ్రిల్లింగ్, గ్యాస్ ద్రవ్యకాల ప్లాంట్లు, ఇతర భారీ పరిశ్రమలను కూడా కలుపుతారు. కొత్త సెజ్‌ల ద్వారా పరిశ్రమలను విస్తరిస్తారు. థీమ్ పార్కులు, హబ్‌లు ఏర్పాటుచేస్తారు.

గుంటూరు జిల్లా నిజాంపట్నం–ప్రకాశంజిల్లా ఓడరేవుల మధ్య మరో పారిశ్రామిక కారిడార్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. దీనితోపాటు ఈ ప్రాంతంలో రెండు ఓడరేవులు, ఓడరేవు దగ్గరలోని మోటుపల్లి వద్ద నౌకా నిర్మాణ కేంద్రంతో పాటు, 16వేల కోట్ల రూపాయలతో వివిధ పరిశ్రమలు నిర్మిస్తారు. ఇందుకోసం అరబ్బు సంస్థ రస్ అల్‌ఖైమాతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. ఈ కారిడార్‌లో ఏర్పాటు చేసే ఓడరేవులు, నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు బాధ్యతను మ్యాట్రిక్స్ ఎన్‌ఫోర్టు సంస్థకు అప్పగించారు. ఈ నిర్మాణంలో రస్ అల్‌ఖైమా, హైద్రాబాద్‌కి చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ మ్యాట్రిక్స్ ఎన్‌పోర్టు సంస్థలు సమాన భాగస్వాము లుగా ఉంటాయి. ఈ కారిడార్ కోసం 28వేల ఎకరాల సేకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇలా సేకరించే భూములన్నీ రైతుల పట్టాభూములు, పేదలకు యిచ్చిన అసైన్డ్ భూములే. రస్ అల్‌ఖైదా వత్తిడి మూలంగా ప్రభుత్వం భూముల సేకరణకు వెంటనే రంగంలోకి దిగింది.

ఈ కారిడార్ కోసం ఒక్క ప్రకాశం జిల్లాలోనే సుమారుగా 9వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోనుంది. ఇందులో రైతులు పట్టా భూములు 5,101 ఎకరాలు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూమి 1,534, ప్రభుత్వ భూమి 787, అటవీ భూములు 1280, ఉప్పు భూములు 1000 ఎకరాలు ఉన్నాయి. దీనివలన వేటపాలెం, చినగంజాం తీర ప్రాంత గ్రామాలైన మోటు పల్లి, కృష్ణగిరి, పట్టపుపాలెం, సీతారామ పురం, జీడిమెట్ల పాలెం, కుంకుడు చెట్లపాలెం, రామచంద్రపురం, టెంకాయ చెట్లపాలెం గ్రామాల్లో 1056 ఇల్లు ఖాళీ చేయాలి. ఈ భూములే కాకుండా నిజాం పట్నం ఏరియాలో 4 వేలకు పైగా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకో నున్నది. ఇంకా వేలాది ఎకరాల భూముల స్వాధీనానికి చర్యలు ముమ్మరం చేస్తున్నది. దీనివలన వేలాదిమంది రైతులు భూములు

కోల్పోయి వీధినపడతారు. మత్స్యకారులు చేపలవేటకు దూరమౌతారు. ఉప్పు సాగు దెబ్బ తింటుంది మత్స్య సంపద నశించటం తోపాటు, పర్యావరణం కలుషితమౌతుంది.. ఫలితంగా ప్రజల జీవితాలు అల్లకల్లోలం అవుతాయి. ఇంతకల్లోలాన్ని రేపే ఈ కారిడార్ ఏర్పాటును అడ్డుకోవద్దని ఆర్థికమంత్రి రోశయ్య ప్రజలను హెచ్చరించటం చూస్తే రాష్ట్ర పాలకులు విదేశీ పెట్టుబడిదారులకు ఎంతగా దాసోహమంటున్నారో తేటతెల్లమౌతున్నది.

ఈ కారిడార్‌లో పరిశ్రమలు నిర్మించే పరిశ్రమాధిపతులకు పెద్ద ఎత్తున రాయితీలు కల్పించారు. భూముల కొనుగోలుపై స్టాంపు డ్యూటీ రద్దు, నిర్మాణ సామాగ్రిపై పన్నుల రాయితీ, దిగుమతి సుంకాల రాయితీ, పదేళ్ళపాటు పన్ను మినహాయింపు, కంపెనీ –కార్మిక చట్టాల మినహాయింపు, నిర్వహణా స్వేచ్ఛ యిస్తారు.

కోస్తా కారిడార్ ఏర్పాటు వలన వేలాది మందికి ఉద్యోగ అవకాశాలతోపాటు, లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీని ద్వారా లభించే ఉద్యోగాలకన్నా, ఉపాధి కోల్పోయే గ్రామీణ ప్రజలే అత్యధికం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించుటయే ప్రధానమైనప్పుడు ఈ కారిడార్‌లో ఏర్పాటుచేసే పరిశ్రమలను వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తే, ఇందుకు అవసరమైన భూమి సేద్యానికి నష్టం లేకుండా సేకరించవచ్చు. మత్స్యసంపద నష్టం జరుగదు. ఈ ప్రాంతాల్లో సేద్యపు భూములు, మత్స్య సంపద విస్తారంగా ఉన్న విషయం పాలకులకు తెలిసిందే. ఇందువలన వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు నిర్మించటం వలన ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరకుతాయి. అందుకు పాలకులు సిద్ధం కాకపోవటానికి కారణం ఏమిటి? సస్య శ్యామలమైన పంట పొలాలకు, మత్స్య సంపదకు ఎందుకు ఎసరుపెడుతున్నది?

పారిశ్రామికవేత్తలకు ప్రజల ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలకన్నా పరిశ్రమలకు అవసరమయ్యే సహజ వనరులను ఉపయోగించుకొని పెద్దఎత్తున లాభాలు గడించటం వారి ధ్యేయం. వారికి అనుకూలంగా వ్యవ హరించటమే పాలకుల విధానం. ఇక్కడ నీరు, గ్యాస్, రైలు మార్గాలు అందుబాటులో ఉంటాయి. వీటికోసం పరిశ్రమాధిపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోకుండా పాలకులే సప్లయ్ చేస్తారు. ఇవికాక ఇక్కడ ఏర్పాటుచేసే రేవులు, ఎయిర్ కార్గోలు, విమానాశ్రయాలు, రైలు మార్గాలు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చేస్తున్నవి కావు. బడా పరిశ్రమాధిపతులు, బహుళజాతి సంస్థలు త్వరితగతిన సరుకుల రవాణాకోసం, విలాసాలకు ఏర్పాటు చేస్తున్నవే.

కారిడార్ ఏర్పాటు వలన కోస్తా ప్రాంతంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. రాష్ట్ర వ్యాపితంగా కోటి ఏడులక్షల ఎకరాల్లో పలురకాలైన పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఆహార పంటల విస్తీర్ణం 78 లక్షల 83వేల ఎకరాలు. ఆహార పంటల ఉత్పత్తిలో మూడు వంతులు కోస్తా జిల్లాల్లోనే ఉంది. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 18.40 లక్షల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరుగుతున్నది. కారిడార్‌వలన లక్షలాది ఎకరాల్లో పంట నష్టమేకాకుండా రైతుకూలీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

ఈ కారిడార్ ఏర్పాటు వలన నీటి సమస్యకూడా తీవ్రరూపం దాలుస్తుంది. పెట్రో, రసాయనిక పరిశ్రమలకు పెద్దఎత్తున నీటి అవసరం ఉంది. పోలవరం జలాశయం ఎడమ కాలువ ద్వారా రోజుకు 1848 మిలియన్ లీటర్లు, విశాఖనగర వాసుల దాహార్తి తీరుస్తున్న ఏలేరు ఎడమ కాలువద్వారా 385 మిలియన్ లీటర్లు, ధవళేశ్వరం బ్యారేజినుండి సామర్ల కోట కాలువ ద్వారా 220 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయాలని కారిడార్ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం పొందుపర్చింది. దీనివలన విశాఖ ప్రజల మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చుతుంది. సామర్లకోట ప్రాంతంలో సాగునీటి సమస్య ఎదురౌతుంది. పెట్రో పరిశ్రమల వలన త్రాగు–సాగునీరు భూమి కలుషితమై రైతులు, మత్స్యకారులు జీవచ్ఛవాలుగా మారుతారు. ప్రజలకు త్రాగునీరు, రైతులకు సాగు నీరును ఎండగట్టి పరిశ్రమాధిపతులకు నీరు అందించటమే పాలకుల ధ్యేయం. త్రాగు నీరు, సాగు నీరుతోపాటు కారిడార్ ఏర్పాటు వలన మత్స్య పరిశ్రమకు కూడా అపారనష్టం ఏర్పడుతుంది.

అసలు పరిశ్రమల ఏర్పాటులోనే పాలకులకు సరైన విధానం లేదు. దేశంలో, రాష్ట్రంలో ఎలాంటి పరిశ్రమలకు ప్రాధాన్యం యివ్వాలో వారికి పట్టలేదు. మనది వ్యవసాయకదేశం. నూటికి 70మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అందువలన గ్రామీణ ప్రాంతాల్లో పెట్టే పరిశ్రమలు వ్యవసాయ అధారిత పరిశ్రమలుగా ఉండాలి. అప్పుడే రైతు ప్రయోజనాలతోపాటు, దానిపై ఆధారపడే వారికి కూడా ఉపాధి కల్పించబడుతుంది. కోస్తా ప్రాంతంలో వరి, చెరకు, అరటి, కొబ్బరి, పత్తి, మిర్చి, పొగాకు, సుబాబుల్, గోగు పంటలు పండిస్తున్నారు. ఈ పంటలకు అనుగుణమైన జూట్, నూలు, పేపరు, ఆయిల్, కారం మొదలైన పరిశ్రమలు, మిల్లులు ఏర్పాటు చేయవలసివుంది. అందువలన పంటల అమ్మకంతో పాటు, ప్రజలకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. కాని పాలకులు ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావటంలేదు. ఇందుకు కారణం, పాలకులు బడా పరి శ్రమాధిపతుల, సామ్రాజ్యవాదుల ప్రయోజనం కాపాడేవారు కావటమే.

కోస్తా కారిడార్ వంటి పథకాలను వ్యతిరేకించటమంటే పారిశ్రామికీకరణనూ, అభివృద్ధినీ వ్యతిరేకించటమేనంటూ పాలకులు నిందాప్రచారం చేస్తున్నారు. వ్యవసాయరీత్యా ముందున్న ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను చిన్నస్థాయి లో ఏర్పాటు చేసినప్పుడు ప్రత్యామ్నాయ ఉపాధి పెరుగుతుంది. ఈ పరిశ్రమలకు అవసరమైన యంత్ర తయారీ పరిశ్రమనూ, ఇతర భారీ పరిశ్రమలనూ తీరానికి లోతట్టు ప్రాంతాలలో (ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి

తెలంగాణా, రాయల సీమలలో) నెల కొల్పాలి. దీనివల్ల సారవంతమైన వ్యవసాయ భూములు తరిగిపోకుండానే పరిశ్రమలు పెరిగి, ఉపాధి పెరుగుతుంది.

పరిశ్రమల వికేంద్రీకరణ కూడా చాలా కీలకాంశం. వెనుకబడిన జిల్లాలంటూ అనేక రాయితీలను పొంది తెలంగాణాలో పెట్టిన పరిశ్రమలన్నీ హైద్రాబాదు నగరం చుట్టూ 30 కి.మీ. పరిధిలో పెట్టినవే. దీనికి బదులుగా వీటిని జిల్లాల్లో దూరంగా స్థాపించినట్లయితే అక్కడ వారికి ఉపాధి లభ్యమవటంతోపాటు హైద్రాబాదునగరం నేడెదుర్కొంటున్న అధిక జనసాంద్రత సమస్యలు ఏర్పడి వుండేవి కాదు. దీని కనువుగా తెలంగాణా, రాయల సీమల్లో కొత్త రైల్వే మార్గాలను ఏర్పాటుచేసి వుంటే పరిశ్రమలు విస్తరించి వుండేవి. అలాగే కాకినాడలో గోదావరి, నాగార్జునా ఎరువుల కంపెనీలున్నాయి. ఇవి కృష్ణా, గోదావరి డెల్టాల యూరియా అవసరాలను తీరుస్తున్నాయి. ఇప్పుడు ఇక్కడే మరికొన్ని ఎరువుల పరిశ్రమలు పెట్టనవసరంలేదు. నిజామాబాదు దగ్గర, కర్నూలు దగ్గర ఏర్పాటుచేస్తే, రేవులనుండి ఫాస్ఫోరిక్ ఆసిడ్ రవాణా, ఎరువులు రవాణాకంటే చౌక అవుతుంది. అలాగే బందరు రేవు ప్రాజెక్టు నివేదికలో రేవు ఆదాయంలో 90శాతం విటిపిఎస్‌కు బొగ్గు దిగుమతి ద్వారా లభిస్తుందని చెప్పారు. సింగరేణి నుండి బొగ్గు సరఫరా చేసుకోగలిగినా, అధిక ధర పెట్టి విదేశాలనుండి దిగుమతి చేసుకోవటమేమిటి? అంటే బలవంతంగా విటిపిఎస్‌తో బొగ్గు దిగుమతి చేయిస్తారు. ఆ భారం కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై మోపుతారు. పోర్టు కట్టిన ప్రైవేటు కంపెనీకి లాభాలు గ్యారంటి చేస్తారు. ఇలాంటి విధాన పర నిర్ణయాలతో రాష్ట్ర వ్యాపితంగా వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధిలలో సమతుల్య తనూ, ఆ విధంగా ఉపాధి కల్పనలో సమతుల్యతను సాధించవలసి వుండగా, దీనికి పూర్తిగా వ్యతిరేకమైన విధానాలనే పాలకులు అనుసరిస్తూ వచ్చారు. మొత్తం రాష్ట్రం, దేశం ప్రజల ప్రయోజనాలను ఈడేర్చే అభివృద్ధి బదులుగా, పెట్టుబడిదారులు, విదేశీ పెట్టుబడిదారులు లాభాలను పిండుకొనే విధంగా ఎంచుకొన్న ప్రాంతాలలోనే పరిశ్రమలను అనుమతించి, వారికి అన్ని విధాలా సేవ చేస్తున్నారు. కనుక వీరు అభివృద్ధి అంటున్నది. ప్రజల అభివృద్ధి కాదు. రాష్ట్ర అభివృద్ధి కాదు.

కోస్తా ప్రాంతంలో వ్యవసాయం ద్వారా లక్షలాది మందికి ఉపాధి పొందుతున్నారు. రాష్ట్ర, దేశ ప్రజల ఆకలిని తీర్చే ఆహార పంటల ఉత్పత్తి అధికంగా జరుగు తున్నది. ఇలాంటి ప్రాంతంలో కారిడార్ కోసం లక్షలాది ఎకరాలను రైతులనుండి బలవంతంగా లాక్కోవటం వలన ప్రజల ఉపాధితోపాటు, ఆహారపంటల ఉత్పత్తిపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. కారిడార్ ఏర్పాటు వలన వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పేపాలకులు, దానివలన లక్షలాదిమంది ఉపాధిని కోల్పోతారనే వాస్తవాన్ని మరుగుపరుస్తున్నది. అంతే కాకుండా రైతుల జీవితాలు అస్తవ్యస్థమౌతాయి.

ఉద్యోగ - ఉపాధి అవకాశాలు కల్పించాలనే చిత్తశుద్ధి రాష్ట్ర పాలకులకు ఉంటే కోస్తా కారిడార్ నిర్మాణ ఏర్పాటును విరమించుకొని, వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు విధానాలు చేపట్టాలి. ఇందుకై కోస్తా ప్రాంతంలోని రైతాంగంతో పాటు యావన్మంది ప్రజలు ఉద్యమించాలి.

## ఒవుడండి?

- రాచకొండ విశ్వనాథశాస్త్రి



సొమ్ములు పోనాయండి
అదండి! అది ఆరాంబవండి
జెత పోతులండి
జెనం నిలబడి సూసీవోరండి
అలాంటి సొమ్ములండి. పోనాయండి

సొమ్ముల పోనాక
బూదేవత గూడా పోనాదండి
ఆ యెనకనించి సంసారవంతా
సల్లారిపోనాదండి
బూ దేవత పోద్దేటండి?
మనం బోతాంగాని, బూదేవత పోదండి

మరంచేత, యేటైనాదన్న మాటండి?
నా బూదేవత ఉంది గానీ
అందుమీదు నాను లేనండి
ఉంకోడున్నాడండి
ఆడికి నాను అమ్మలేదండి

ఆడు నా బూదేవతని
బలివిని అక్కరమిచ్చీసుకున్నోడు
ఒవుడండి
మరొహడూ మరొహడూ గాదండి
మావూరి పెసిడెంటు గోడేనండి

# రిటైల్ రంగంలోకి, బహుళజాతి, బడా పరిశ్రమలు: తీవ్రమౌతున్న రైతాంగ సంక్షోభం

బి.రఘు

మన దేశంలో చిల్లర (రిటైల్) వర్తకం ప్రధానంగా కిరాణాషాపుల ద్వారా చిన్న, మధ్యతరగతి ప్రజలకందుబాటులో వుంటూ, అనాదిగా సాగుతూ వస్తున్నది. ప్రస్తుతం మన దేశ ఆర్థికవ్యవస్థలో రిటైల్‌వ్యాపార రంగం 14 శాతం ఉంటూ, ప్రముఖంగా ఉంది. దేశంలో, ప్రధాన స్వయంఉపాధి రంగంగా ఉన్న ఈ రంగంలో, కోటీ యాభై లక్షలపైగా చిల్లర దుకాణాల్లో, షుమారు 7 కోట్ల మంది ఉపాధి పొందుతూ, జీవనం సాగిస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక్కోరంగాన్ని కబళించుకుంటూ వస్తున్న సామ్రాజ్యవాదపు డేగ కన్ను సాలీనా 8 లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ కలిగివున్న మనదేశ రిటైల్ రంగం పై పడింది. సామ్రాజ్యవాదులకు దాసోహం చేస్తున్న దళారీ పాలకులు అందుకు అనుగుణంగా పచ్చజెండా ఊపారు. ఫలితంగా తెగబలిసిన విదేశీ మదపు టేనుగులు, మనదేశపు గున్న ఏనుగులతో కూడి, లేడికూనలపై స్వైరవిహారానికి బయలు దేరాయి.

రిటైల్ రంగంలోకి బహుళజాతి కంపెనీల, బడా పెట్టుబడిదారుల చొరబాటు, ఈ రంగంలో పనిచేసే లక్షల కుటుంబాలకు, కోట్లాది మంది జీవనోపాధికి 'గొడ్డలిపెట్టు'గా పరిణమించింది. మరో వైపున రైతాంగం కూడా ఈ చొరబాటు కారణంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటు న్నారు. రైతాంగ సంక్షోభం మరింత తీవ్రం కానున్నది.

రిటైల్ రంగంలో బడా కంపెనీల ప్రవేశానికి కేంద్రంలో ఆమోదముద్ర పడీ పడక ముందే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తులైన ఆహారధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పూలు తదితర ఉత్పత్తుల రంగంలోకి విదేశీ కంపెనీల ప్రవేశానికి వీలుగా తమ చట్టాలను సవరించాయి. ఆహార ఉత్పత్తుల రంగంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవేశం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని, విదేశీ బహుళజాతి సంస్థలు రంగంలో ఉంటే దేశంలో శీతలీకరణ ద్వారా కూరగాయలను, పండ్లను, ఆహార ఉత్పత్తులను నిల్వవుంచటం వలన ప్రస్తుతం వృధా అవుతున్న 40 శాతం కూరగాయలు, పండ్లను నష్టపోకుండా నివారించవచ్చనీ; వ్యవసాయదారులు తమ ఉత్పత్తులను మధ్యదళారులకు కాకుండా నేరుగా బహుళ జాతిసంస్థలతో, బడాకంపెనీలతో కాంట్రాక్టులు కుదుర్చుకొని అమ్ముకొని లాభ పడవచ్చనీ రైతాంగాన్ని ఊరిస్తూ వచ్చారు.

రైతాంగానికి ఈ విధానాన్ని అలవాటు చేసేందుకుగాను మొదట్లో రైతాంగ ఉత్పత్తులకు ప్రోత్సాహకరమైన రేట్లను అందించారు. మధ్యదళారుల వ్యవస్థతో విసిగి వేసారిన రైతులకు కూడా ఈ కంపెనీలు తమ వద్దకే వచ్చి డబ్బు చెల్లించి (ప్రోత్సాహకరమైన రేటు ఇచ్చి) సరుకు తీసు కెళ్ళటమనేది ఉపయోగకరమైన విధానం గానే భావించారు. కానీ, రానురానూ తాము ఎంతగా ఈ బందిఖానాలో చిక్కుకున్నారో అర్థమౌతున్నది.

వాల్‌మార్ట్, స్పెన్సర్, మెట్రో, రిలయెన్స్, భారతి, నీలగిరి, సుభిక్ష, త్రినేత్ర మొదలైన బడాకంపెనీలు రైతులతో నేరుగా 'సాగు కాంట్రాక్టు' (కాంట్రాక్టు వ్యవసాయం) కుదుర్చుకుంటున్నాయి. బడా కంపెనీలు కాంట్రాక్టు సాగులోకి ప్రవేశిస్తే కంపెనీకీ, రైతుకూ లాభమని ప్రభుత్వమే ప్రకటించే స్థితికి దిగజారింది. రైతాంగాన్ని బడా రిటైల్ కంపెనీలకు బంధితులుగా చేసి పెద్ద పాలేర్లుగా దిగజార్చే విధానాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం రైతాంగానికి మంచి రేట్లు వస్తాయని ఆశ పెడుతూ దగా చేస్తున్నది.

కానీ, వాస్తవంలో, ఆహార ఉత్పత్తులు -ప్రధానంగా-కూరగాయలు, పండ్లు, వంటనూనెలు, ఆహారధాన్యాలు, పప్పు ధాన్యాలూ పండించే రైతాంగాన్ని, కాంట్రాక్టు సాగుపేరుతో, బహుళజాతి, బడా రిటైల్ కంపెనీలు తమ గుప్పెట్లోకి తెచ్చుకుంటు న్నాయి. రైతులు ఏ పంట వేయాలో, ఏ విత్తనాలు వాడాలో, ఏ ఎరువులు వాడాలో, పంట ఏ నాణ్యతలో వుండాలో, ఏ రేటుకు తమకు అమ్మాలో-ఈ కంపెనీలే నిర్దేశిస్తాయి. రైతులను- తమకు కావలసిన అరుదైన పంటలనే పండించమని ఈ కంపెనీలు శాసిస్తాయి. ఇప్పటికే పరపతి సౌకర్యం కల్పించే పేరిట రైతులను తమ అదుపులో ఉంచుకొంటున్నాయి. రైతులు కొంత కాలానికి ఈ బడా రిటైలర్ల చేతుల్లో ఇరుక్కోని, తమకు ఇష్టం లేకపోయినా విధిగా వారు కోరిన పంటలు పండించాల్సిన స్థితికి ఈడ్చబడ్డారు. అంతిమంగా రైతులు రుణగ్రస్తులై తమ భూముల్ని ఆ కార్పొరేట్ కంపెనీకో, అప్పులిచ్చిన బ్యాంకుకో అప్పగించే పరిస్థితిని ఈ ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి.

బడా రిటైల్ కంపెనీల వద్ద భారీ పెట్టుబడులుంటాయి. వీరు, పండ్లు, కూరగాయలు, ఆహారధాన్యాల వంటి వాటిని ఎక్కడ చౌకగా దొరికితే అక్కడనుండి కొనుగోలు చేసి తెస్తారు. అలాగే, స్థానిక ఉత్పత్తిదారులనుండి నేరుగా కొనుగోలు చేస్తారు. స్వంత రవాణా సదుపాయం ఉండటం వలన ఆ మేరకు రవాణా ఖర్చు తగ్గించుకోగలుగుతారు. రైతుల నుండి

ఉత్పత్తులను తాము మాత్రమే కొనుగోలు చేసే గుత్తాధిపత్య సంస్థలుగా ఈ బడా రిటైల్ కంపెనీలు మాత్రమే రంగంలో మిగిలి వుంటాయి. అప్పుడవి తమ వాస్తవ రూపంలో ముందుకు వస్తాయి. అప్పటి వరకు రైతులకిచ్చిన రేటును దిగ్గోసి, రైతు ఉత్పత్తులపై అనేక ఆంక్షలు విధిస్తాయి. నాణ్యత లోపించిందనే పేరిట, తాలూ తప్పల పేరిట రైతు పండించిన పంటలో ఎక్కువ భాగాన్ని నిరాకరిస్తాయి.

సన్న, చిన్నకారు రైతులకు ఈ కంపెనీల ప్రవేశం వలన లాభం కలగకపోగా, ఆ కంపెనీలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం అనుసరించే అనేక అక్రమ పద్ధతులకు బలైపోవాల్సి వస్తుందనీ, ఈ కంపెనీలు-వివిధ సాకులతో తిరస్కరించిన ఉత్పత్తుల నష్టాన్ని రైతులే భరించాల్సి వస్తుందనీ, కాంట్రాక్టు వ్యవసాయంలో రైతుకు సంభవించే ఆపదలకు ఇన్స్యూరెన్సు కల్పించటానికి ఈ కంపెనీలు విముఖంగా ఉన్నాయని బెంగుళూరు వ్యవసాయ శాస్త్రాల విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడి చేశారు. ఈ కాంట్రాక్టు వ్యవసాయం రైతుకు నష్ట దాయకంగా ఉంటుందని నిర్ధారించారు. చిల్లర వర్తకంలోకి ప్రవేశించిన ఈ బడా రిటైల్ కంపెనీలు రైతులను తీవ్రంగా దోపిడీకి గురిచేస్తున్నాయి. రైతుల పరిస్థితే 'గాలిలో దీపం'లా మారటంతో రైతుకూలీల జీవనం మరింత దుర్భరంగా మారుతున్నది. బహుళజాతి, బడా రిటైల్ కంపెనీలు చిల్లర కూరగాయల వ్యాపారులతో సహా కోట్లాది మంది చిన్న రకాల వ్యాపారుల పొట్టగొడు తున్నాయి. మరోవైపు-రిటైల్ రంగంలోకి బడా కంపెనీల ప్రవేశంతో మరింత పెరిగిన నిరుద్యోగితను ఆసరా చేసుకొని, ఇవే కంపెనీలు, తమ వద్ద పనిచేసే కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ ఎక్కువ పనిభారం మోపుతూ కార్మికులను దోపిడీ చేస్తున్నాయి. మీదు మిక్కిలి, మొదట్లో వినియోగదారుల్ని మురిపించిన ఈ బడా రిటైల్ కంపెనీలు, చిన్న వర్తకులని దివాళా తీయించిన తర్వాత, వినియోగదారులపై పెనుభారం మోపి, అధికధరలకు అమ్మటం ద్వారా వినియోగదారులనీ దోపిడీ చేస్తున్నాయి.

వివిధ ప్రపంచదేశాల్లో వాల్‌మార్ట్ వంటి బహుళజాతి సంస్థల ఆచరణ దీనినే రుజువు చేస్తున్నది. ఫిలిప్పీన్స్‌లో అరటి పండ్లను కొనుగోలుచేసే బడా కార్పొరేట్ కంపెనీలు అక్కడి రైతుకు, ఆ అరటిపండ్లను జపాన్‌లో అమ్మే వినియోగ దారుడి నుండి వసూలు చేసేదానిలో 17 శాతం మాత్రమే చెల్లిస్తారు. అంటే వినియోగదారుడు చెల్లించిన మొత్తంలో 83 శాతం శీతల గిడ్డంగులు, రవాణా, ప్యాకేజీల ఛార్జీలతో పాటు కార్పొరేట్ కంపెనీ లాభాలకు కూడా కలిసి వున్నాయి. మన దేశంలోని మధ్య దళారీ వ్యవస్థ అనే దాని స్థానంలోకి రవాణా, ప్యాకేజి, నిల్వ గిడ్డంగుల ఛార్జీలు ప్రవేశిస్తాయి తప్ప రైతుకు మాత్రం తక్కువ ధరే గిడుతుందని రుజువౌతున్నది. అందు వలన రైతుపంటలకు లాభదాయక రేటు చెల్లించ బడుతుందనేది అవాస్తవం.

ఇప్పటికే, రిలయన్స్, ఐ.టి.సి., కార్గిల్, వాల్‌మార్ట్ వంటి సంస్థలు రైతుల నుండి తక్కువ ధరకు గోధుములు కొని నిల్వ చేసుకొని పెరిగిన రేట్ల ప్రకారం మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. ఫ్యూచర్ ట్రేడింగ్ ఎత్తుగడలతో ఈ కంపెనీలు హర్యానా, మధ్య ప్రదేశ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని గోధుమ రైతులను తక్కువ ధరలకే తమకు గోధుమలు అమ్మాలనే ఒప్పందాలలో ఇరికించుకున్నాయి. ఇటీవల మన దేశ మార్కెట్లలోనే తక్కువ ధరలకు గోధుమలను కొన్న కార్గిల్ కంపెనీయే తిరిగి ప్రభుత్వరంగ సంస్థ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌కు గ్లోబల్ టెండర్ల ద్వారా అత్యధిక రేటుకు గోధుములను అమ్ముకొని లాభాలను గడిచింది.

రిటైల్ రంగంలోకి బడా కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థలు ప్రవేశించి, కాంట్రాక్టు వ్యవసాయం, ఫ్యూచర్ ట్రేడింగ్ (భవిష్య వాణిజ్యం) ద్వారా రైతాంగాన్ని తీవ్ర సంక్షోభానికి గురిచేస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు ముందుకొస్తున్నాయి. దేశీయ చిల్లర దుకాణ వ్యాపారాన్ని ధ్వంసం చేసే, ఉపాధిని హరించే, కార్మికుల వేతనాలను తగ్గించే, రైతుల పంటను కారుచౌకగా కొల్లగొట్టుకుపోయే, అధిక ధరలతో వినియోగదారులను దోడిపీ చేసే-రిటైల్ రంగంలో బడా పరిశ్రమలకు, బహుళజాతి పరిశ్రమల చొరబాటుకు వ్యతిరేకంగా ఆందోళనలు మరింత సంఘటిత రూపం తీసుకోవాలి. రైతుల, రైతుకూలీల, కార్మికుల, వినియోగదారుల ప్రయోజనాల్ని పణంగా పెడ్తున్న, కోట్లాది రూపాయల లాభాలు తరలించుకెళ్ళటానికి గేట్లు బార్లా తెరుస్తున్న, సామ్రాజ్యవాదానికి దాసోహం చేస్తున్న ప్రభుత్వ, పాలకుల లొంగుబాటు విధానాలకు వ్యతిరేకంగా- ఈ పోరాటాలు ఎక్కుపెట్టి సాగాలి.



# చెరువుల మరమ్మత్తులు: ప్రపంచ బ్యాంక్ షరతులు, రైతుల వెతలు

బి.సాంబశివరావు

చెరువుల మరమ్మత్తులు, క్రిష్ణాడెల్టా ఆధునీకరణ ఎడల ఎప్పుడూ లేని ప్రేమ పాలకులకు అకస్మాత్తుగా ఏర్పడింది. వీటి మరమ్మత్తులకోసం ప్రపంచబ్యాంక్ ఆర్థిక సహాయం తీసుకొంటామని, చెరువులను, కాల్వలను పటిష్టపర్చి సాగునీరు, త్రాగునీరు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది రైతులపై ప్రేమతోనా, ప్రపంచ బ్యాంక్ ఆదేశించటంతోనా అన్నది పరిశీలించాల్సిన అంశం. ఇందుకు ప్రపంచ బ్యాంక్ షరతులే కారణం.

మనది నేటికీ వ్యవసాయక దేశమే. నూటికి 70 మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి గ్రామాల్లో నివసిస్తున్నారు. సేద్యానికి భూమితోపాటు సాగునీరు ప్రధానమైయింది. సామ్రాజ్యవాదుల నుండి అధికారాన్ని పాలకులు బదలాయించుకొని 61 సంవత్సరాలు గడిచినా సాగునీరు అందించటంలో పూర్తిగా విఫలమైనారు. చెరువుల సేద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా రాష్ట్రం, దేశంలో కరువు, వరదలు సంభవిస్తూనే వున్నాయి.

ప్రపంచంలో అత్యధిక వర్షపాతం గల దేశాలలో భారత్ ఒకటి. సాలీనా 1170 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదౌతుంది. ప్రపంచానికే ధాన్యాగారంగా పిలిచే పశ్చిమ, మధ్యఅమెరికా సంయుక్త రాష్ట్రాల్లో సాలీనా 200 మిల్లీమీటర్ల వర్షపాతమే ఉంది. దీన్ని గమనిస్తే మన దేశంలో నీటి వనరులు ఎంత సంమృద్ధిగా ఉన్నదీ, ఎంత పుష్కలంగా సాగు నీరు అందించవచ్చుననేది స్పష్టమౌతున్నది.

దేశంలో ఏడాది మొత్తంలో కురిసే వర్షపాతం 40 కోట్ల హెక్టా మీటర్లు. చిన్న, పెద్ద జలాశయాల ద్వారా ఈ నీటిలో ఉపయోగించుకొంటున్నది 2.5 కోట్ల హెక్టా మీటర్లు మాత్రమే. దీన్ని గమనిస్తే మొత్తం వర్షపాతంలో 10వ వంతు కూడా నిల్వ చేసు కోలేకపోతున్నాము. ఫలితంగా అత్యధిక భాగం సముద్రం పాలౌతున్నది.

వ్యవసాయానికి సాగునీటి సరఫరా కీలకం అనే అంశాన్ని నేటి పాలకులు విస్మరించినా, ప్రాచీన భారత పాలకులు ఈ అంశాన్ని గుర్తించారు. నీటిని నిల్వ చేయటం, పంపిణీ చేయటం ఆనాటి పాలకులు బాధ్యతగా స్వీకరించారు. విస్తృతంగా కాల్వలు, చెరువులు త్రవ్వి నదీ జలాల మళ్లింపు చేపట్టారు. వ్యవసాయానికి నీటి వనరులు ఏర్పడటంలో ఆనాటి సమాజం అభివృద్ధి చెందింది. అప్పటి సమాజ, నాగరికత అభివృద్ధి నీటివనరుల చుట్టూనే పెరిగింది. తెలంగాణ, రాయల సీమల వ్యవసాయమే సంపదలను అధికంగా సృష్టించింది. తరచు వరదలకు, తుఫాన్‌లకు గురయ్యే కోస్తా ప్రాంతం వ్యవసాయంలో వెనుకబడింది. అందుకు కారణం నీటిని నిల్వచేసే చెరువులు తక్కువగా ఉండటమే.

మద్రాసు ప్రెసిడెన్సీ చెరువుల సాగు క్రింద ఉన్న విస్తీర్ణం అసాధారణంగా ఉంది. అసమగ్రంగా ఉన్న ప్రభుత్వ రికార్డుల ప్రకారమే 14 జిల్లాల్లో 53 వేల చెరువులు ఉన్నాయి. వలస పాలకుల విధానాల ఫలితంగా చెరువులు నిర్లక్ష్యం చేయబడి 43 వేల చెరువులు మరమ్మత్తులు చేయవలసిన స్థితిలో ఉండగా, 10 వేల చెరువులు మరమ్మత్తులకు కూడా పనికి రాకుండా పోయాయి.

ఇందుకు భిన్నంగా నైజాం పాలన లోని హైద్రాబాద్ సంస్థానంలో చెరువుల క్రింద సాగు బాగా విస్తరించింది. 1896లో 4 వేల హెక్టార్లు చెరువుల క్రింద సాగు కాగా, 1906 నాటికి 55 వేల హెక్టార్లు, 1936లో 3 లక్షల హెక్టార్లకు సాగు పెరిగింది. ఇది గమనంలోకి తీసుకొంటే సాగునీరు అందించటంలో చెరువులు ఎంతటి ప్రాధాన్యత సంతరించుకొన్నాయో అర్థమౌతుంది.

భారత వ్యవసాయాన్ని అభివృద్ధి పర్చే లక్ష్యంలేని వలస పాలకులు గ్రామసమిష్టి నిర్వహణలో ఉన్న చెరువులను ప్రభుత్వం అధీనంలోకి మార్చారు. చెరువులను నిర్లక్ష్యం చేసి తమ పాలనకు అవసరమైన ఆహార ఉత్పత్తిని, ఎగుమతి పంటల ఉత్పత్తి మేరకే నీటివనరుల అభివృద్ధిని చేపట్టారు. కావేరీ, క్రిష్ణా, గోదావరి, ధవళేశ్వరం బ్యారేజీలు నిర్మించి కాల్వల ద్వారా సాగు నీరు సరఫరా చేశారు. ఫలితంగా మన రాష్ట్రంలో విస్తారంగా ఉన్న చెరువుల సేద్యం గణనీయంగా తగ్గిపోయింది. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో సాగు సమస్యగా మారింది.

**వలస పాలకుల విధానాల కొనసాగింపు:**

బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుండి 'అధికార మార్పిడి' తర్వాత దేశ దళారీ పాలకులు, సాగునీటి విధానం ఎడల వలసవాదుల విధానాలనే కొనసాగించారు. చెరువుల సేద్యాన్ని గుర్తెరిగి వాటి మర మ్మత్తులు చేపట్టి సాగునీరు అందించే ప్రయత్నాలు చేయలేదు. ఫలితంగా 1958 నాటికి 48 లక్షల హెక్టార్లు (సాగు భూమిలో 21 శాతం) చెరువుల క్రింద సాగు కాగా, 1979 నాటికి 39 లక్షల హెక్టార్లకు, 1990 నాటికి 28 లక్షల హెక్టార్లకు భూమి సాగు పడిపోయింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనంతపురం జిల్లాల్లోని మూడు వేల చెరువులు సరైన నిర్వహణ లేక పనికి రాకుండా పోయాయని రెండవ ఇరిగేషన్ కమీషన్ పేర్కొంది.

చెరువులను నిర్లక్ష్యం చేసిన పాలకులు, నదీజలాల వినియోగంలో కూడా విఫల మైనారు. బచావత్ కమీషన్ మనకు కేటాయించిన క్రిష్ణా, గోదావరి నదుల నీటిని, సాగునీటికి మళ్లించేందుకు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించటంలో విఫలమైనారు. ఫలితంగా వందలాది టి.ఎం.సి.ల నీరు ప్రతి సంవత్సరం సముద్రం పాలౌతున్నది. తెలంగాణ, రాయలసీమ, కోస్తా జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలు కరువు పీడిత ప్రాంతాలుగా మారాయి. ఈ ప్రాంతాలను ఇలా ఉంచటం పాలకులు ఒక విధానంగా చేపట్టారు. బడాపరిశ్రమాధిపతులకు, బహుళజాతి సంస్థలకు ఈ ప్రాంతాల నుండి చౌకగా కూలీలను తరలించటాన్ని పాలకులు ధ్యేయంగా పెట్టుకొన్నారు.

సాగునీటి సౌకర్యం నామమాత్రంగా ఉన్న తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో రైతులు, సేద్యపు నీటికోసం బోరుబావులు చేపట్టారు. క్రమంగా ఈ సేద్యమే ఈ ప్రాంతాల్లో ప్రధానంగా మారింది. ఇందుకు భూగర్భ జలాలు కీలకమయ్యాయి. బోరు బావుల సేద్యం పెరగటం, అనావృష్టి పరిస్థితులు ఏర్పడటంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పైరుకు నీరు అందక ఎండి పోవటం, అసలు సేద్యం చేయలేక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్ర సంక్షోభంలోకి నెట్ట బడ్డారు

ఇలాంటి పరిస్థితుల్లోనే, తెలంగాణ, రాయలసీమ రైతులు, ప్రజలు, ప్రాజెక్టులు నిర్మించి సాగు, త్రాగునీరు అందించాలని అనేక రూపాల్లో ఆందోళనలు చేశారు, చేస్తున్నారు.

సాగు, త్రాగునీటికోసం రాష్ట్రంలోను, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాపితంగా మానవాళికి నీటి కరువు ఏర్పడబోతుందని, నీటిని పొదుపుగా వాడాలని, అందుకు నీటి వినియోగ మార్కెట్ ప్రవేశపెట్టాలని, దీని వలన నీటికి ధర చెల్లించవలసి వస్తుంది గాబట్టి పొదుపుగా వాడి నీటిని సద్వినియోగ పరుస్తారని సామ్రాజ్యవాదం ప్రచారాన్ని ఎక్కుపెట్టింది. 2001లో అంతర్జాతీయ సదస్సు జరిపి నీటిని వాణిజ్య సరుకుగా తీర్మానం చేయించింది. దీంతో ప్రజలందరి ఉమ్మడి సంపదగా ఉన్న నీరుని ప్రైవేటు ఆస్తిగా మార్చివేశారు.

## మన దేశంలో, రాష్ట్రంలో ప్రపంచ బ్యాంక్ రంగప్రవేశం

నీటిపై ప్రైవేటు యాజమాన్యం హక్కును అమలుపర్చేందుకు సామ్రాజ్య వాదులు ప్రపంచబ్యాంక్‌ను రంగంలోకి ప్రవేశపెట్టారు. ప్రపంచబ్యాంక్ రుణం పొందాలంటే సాగునీటి సంస్కరణలు ప్రవేశ పెట్టాలని, నిర్మాణ, నిర్వహణ ఖర్చులు వచ్చే విధంగా నీటి తీరువా రేట్లు పెంచాలని, తక్కువ నీటి వినియోగంతో ఆరుతడి పంటలు పండించాలని ఒత్తిడి ప్రారంభించింది. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటుచేసి, నిర్వహణ, నీటితీరువా వసూలు బాధ్యతను అప్పగించాలని, సాగు నీరు అందించే బాధ్యత నుండి పాలకులు తప్పుకోవాలని సూచించింది. ఆ సూచన మేరకే 2006లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త జల విధానం కోసం నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించింది. దీని ద్వారా కాల్వలకు సాగునీటి మీటర్లు బిగించి నీటి వాడకాన్ని బట్టి నీటితీరువాను నిర్ణయిస్తారు. ఈ విధానం రైతులపై పెనుభారం మోపు తుంది.

సామ్రాజ్యవాదులు, వారి కనుసన్నలలో నడిచే ప్రపంచబ్యాంక్-మన వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి, ఆహార ధాన్యాల కోసం తనపై ఆధారపడేటట్లు చేసుకోవ టానికి మన సాగునీటి వ్యవస్థను కకావికలు చేయటానికి పూనుకొన్నారు. కాల్వల సాగుతోపాటు చెరువు సేద్యాన్ని దెబ్బతీసే విధంగా పాలకులపై వత్తిడి ప్రారంభించారు.

ఇంత కాలం చెరువు సేద్యాన్ని గాలికి వదిలిన రాష్ట్ర పాలకులు అకస్మాత్తుగా రాష్ట్రంలోని 13 వేల చెరువులకు మరమ్మత్తులు చేపడుతున్నట్లు, ఈ సంవత్సరం మూడు వేల చెరువులకు టెండర్లు పిలుస్తున్నట్లు, ఇందుకోసం ప్రపంచబ్యాంక్ నుండి రుణం తీసుకోనున్నట్లు ప్రకటించారు.

మన రాష్ట్రంలో నేడు 79 వేల చెరువులు ఉన్నాయి. వీటి ద్వారా 16 లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చు. ప్రస్తుతం మూడున్నర లక్షల ఎకరాలకు మించి చెరువుల ద్వారా సాగునీరు అందటం లేదు. ఇందుకు కారణం చెరువుల, కాల్వల, చిన్న నీటి పారుదల వ్యవస్థను పాలకులు నిర్లక్ష్యం చేయటమే. ఫలితంగా మరమ్మత్తులకు నిధులు లేక పూడికలు వేసి భారీ వర్షాలకు కట్టలు తెగిపోయి, నీరు వృధాతోపాటు గ్రామాలకు ముంపు ప్రమాదం ఏర్పడు తున్నది.

రాష్ట్రంలో భారీ, మధ్యతరహా, చిన్న నీటి పారుదల శాఖలకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం 10 వేల కోట్ల రూపాయలను కేటా యిస్తున్నది. 2006-07 సంవత్సరం బడ్జెట్ లో మాత్రం 13 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో చిన్న నీటి పారుదల వ్యవస్థకు నాలుగు వందల కోట్లు మాత్రమే కేటాయింపు జరిగింది. ఇందులో సిబ్బంది జీతభత్యాలకు పోను మిగిలేది చాలా తక్కువ. పాలకులకు భారీ ప్రాజెక్టు లంటేనే మక్కువ ఎక్కువ. వాటికి పెద్ద కాంట్రాక్టర్లు ఉంటారు. మంత్రులకు వారి నుండి పెద్దఎత్తున ముడుపులు అందు తాయి. ముడుపులు అందితే చాలు అను కొంటున్న మంత్రులు ప్రాజెక్టులు పూర్తికావ టానికి దశాబ్దాలు పట్టినా, లక్షలాది కుటుంబాలు నిర్వాసితులైనా పట్టించుకోరు. అందుకే తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనంగా ఉండే చెరువులు, కుంటల నిర్వహణ అంటే అంత నిర్లక్ష్యం.

రైతుల ప్రయోజనం, సంక్షేమం తమ ప్రభుత్వ ధ్యేయమని సాగునీటి ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం చేసుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకులలాగానే చిన్ననీటిపారుదల వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నది. రైతాంగానికి ప్రయోజనకరం కాని పోలవరం ప్రాజెక్టుకు వేల కోట్లు కేటాయిస్తున్నది.

పాలకుల విధానాలను గమనిస్తే చెరువుల మరమ్మత్తులు చేస్తానంటున్నది రైతులపై ప్రేమతోకాదని, ఇందులో సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు ఇమిడి వుండటంతో పాటు మన రైతులను సాగు నుండి దూరం చేయటం, ఆహార ధాన్యాల కోసం సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులపై ఆధారపడక తప్పని పరిస్థితి కల్పించటం జరుగుతందని స్పష్టమౌతున్నది.

రాష్ట్రంలో 89 వేల చెరువులు ఉంటే ఐదేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం మరమ్మత్తులు చేపట్టే చెరువులు 13 వేలు మాత్రమే. మరమ్మత్తులు చేపట్టే చెరువుల్లో 5 వందల కోట్లతో ఇందిరమ్మ పథకం క్రింద 14 వందలు, 1831 కోట్లతో గ్రామీణ ఉపాధి పథకం క్రింద 8,500లు, ప్రపంచబ్యాంక్ రుణం 793 కోట్లతో మూడు వేల చెరువులు ఉన్నాయి. దీన్ని గమనిస్తే మరమ్మత్తులు చేసే మొత్తం చెరువుల్లో ప్రపంచబ్యాంక్ రుణంతో చేపట్టేవి మూడువేల చెరువులు మాత్రమే. కాని ప్రభుత్వం మాత్రం ప్రపంచ బ్యాంక్ రుణంతో చెరువులు మరమ్మత్తులు చేస్తున్నట్లు ప్రచారం చేయటం, సామ్రాజ్య వాదులకు, ప్రపంచబ్యాంక్‌కి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగా దాసోహమయిందో స్పష్టమౌతున్నది.

రుణం పేరుతో ప్రపంచబ్యాంక్ విధిస్తున్న షరతులు రైతుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రపంచబ్యాంక్ షరతులను ఆమోదించిన రాష్ట్ర పాలకులు నీటిపారుదల వ్యవస్థను రెండు భాగాలుగా విభజించారు. ఒకటి ప్రాజెక్టు పనుల ప్రత్యేక విభాగం, రెండవది కాల్వల మరమ్మత్తుల నిర్వహణ, నీటి నియంత్రణ, యాజమాన్యం. ఇవి రెండు ఒక దానితో ఒకటి సంబంధం లేకుండా పనిచేస్తాయి. అందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ జల రంగ మెరుగుదల ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నది. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధి కారులు పరిశీలించిన తరువాత దీని నమూనా పత్రాన్ని ప్రపంచబ్యాంక్ అనుమతి కోసం పంపింది. ఈ ముసాయిదాలో రాష్ట్రంలోని నీటివనరులు, ప్రాజెక్టులు, ప్రాజెక్టుల పరిధిలో వినియోగమౌతున్న నీటి వివరాలు, భవిష్యత్తు నీటి వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంది. చెరువుల మరమ్మత్తులతోపాటు, నాగార్జున సాగర్ ఆధునీకరణకు సంబంధించిన ప్రతిపాదన కూడా ప్రపంచబ్యాంక్ ఆమోదించింది.

రాష్ట్రంలో చెరువుల మరమ్మత్తులు ప్రపంచబ్యాంక్ సూచన మేరకు నాలుగు దశల్లో జరుగుతాయి. మొదటి దశలో నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటుచేసి, బలోపేతం చేయటం, చెరువుల నిర్మాణంపై విదేశీ పర్యటనలకు వెళ్ళి శిక్షణ పొందటం. (ఇందుకోసం 76.6 కోట్లు ఖర్చు చేస్తారు.) రెండవ దశలో చెరువులను పటిష్టం చేయటం, భూగర్భ జలాల అభివృద్ధి, పంట కాల్వల మరమ్మత్తులు, చెట్లు తొలగించటం, నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగించటం. (ఇందుకు గాను 665.6 కోట్లు ఖర్చు చేస్తారు.) మూడవ దశలో చెరువుల ఆయకట్టు పెంచేందుకు, పంటలు, మార్కెట్ వ్యవహారాల గురించి వినియోగ దారుల సంఘాలకు అవగాహన కలిగించటం (ఇందుకోసం 113.3 కోట్లు,) నాలుగవ దశలో సిబ్బంది కన్సల్‌టెంట్లను నియమించటం, అధ్యయనాలు, వర్క్‌షాపులు, వసతుల కల్పన ఏర్పాటు చేయటం (ఇందు కోసం 54.2 కోట్లు ఖర్చు చేస్తారు) జరుగు తుందని ప్రకటించారు.

మొదటి దశ మరమ్మత్తులు చేసే చెరువులు పరిశీలించేందుకు ప్రపంచబ్యాంక్ బృందం 2007 అక్టోబరు 8న రాష్ట్రంలో పర్యటించింది.

ఈ దశలను పరిశీలించినప్పుడు మన రైతులు, ఇంజనీర్లు చెరువుల నిర్మాణం, మరమ్మత్తులు చేయటం చేతగానివారుగా ప్రపంచబ్యాంక్ వ్యక్తం చేయటం, అందు కోసం విదేశాల్లో శిక్షణ యిప్పిస్తానని చెప్పటం, దానికి పాలకులు ఆమోదించటం సిగ్గుచేటు. ఎటువంటి సాంకేతిక విజ్ఞానం అందుబాటులో లేనప్పుడే గ్రామసంఘాలు ఎంతో పగడ్బందీగా చెరువుల నిర్మాణం చేపట్టి విస్తారంగా భూములు సేద్యం చేశారు. ఎంతో పటిష్టంగా చెరువులు

"వర్ధిల్లు ఓ పేదరైతా నీవు
వర్ధిల్లవలె తెలుగు జాతి వెన్నెముకా ॥వ॥

తూరుపు దిక్కునా తొలకరించిందిరా
తొలికోడి కూతలో తృళ్ళిపడి లేవరా
దుక్కిటెద్దదె కాలుదువ్వి రంకేసెరా
పదునయ్యి భూమాత ఎదురెదురు చూచెరా ॥వ॥

సత్తువెంతో పెట్టి విత్తనా లెదజెట్టి
కంటిరెప్పగ పంట కాపాడు ఆసామి
రంగారు బంగారు రాసులే రాలాలి
మనజాతి యిక్కట్లు మటుమాయమవ్వాలి ॥వ॥

గోదావరి కృష్ణ తుంగభద్రా పెన్న
మధుర మధుర జలాలు మన జీవ నాళాలు
వంపు సొంపులుదీరి వయ్యారముగ పారి
నేల నలుచెరగులా నిండి హసియించాలి ॥వ॥

– తిరునగరి రామాంజనేయులు
'జాతి వెన్నెముకా' పాట నుండి

ఉన్నాయి. చెరువుల నిర్మాణంకోసం మన ఇంజినీర్లు విదేశాల్లో శిక్షణ పొందవలసిన దుస్థితిలో లేరు. అసలు చెరువుల నిర్మాణం గురించి విదేశాలకు ఉన్న అనుభవం మనతో పోల్చుకుంటే చాలా తక్కువ. ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. శిక్షణ పేరుతో మన ఇంజనీర్లను విదేశాలకు పంపి, అక్కడ వారిని ప్రలోభపర్చి, వారిని సామ్రాజ్య వాదుల ప్రయోజనాలకు అనుగుణంగా తయారుచేయటం ఈ శిక్షణ వెనుక ఉన్న ఉద్దేశం.

ప్రపంచబ్యాంక్ షరతులలో ముఖ్యమైనది, రైతులు (వినియోగదారులు) నీటి పారుదలశాఖతో తప్పనిసరిగా ఒప్పందం చేసుకోవాలి. ఆ ఒప్పందం ప్రకారం రైతులు నీటి వినియోగ యాజమాన్య చట్ట పరిధిలోకి వస్తారు. నీటిపారుదలశాఖ, రైతులకు యిచ్చే నీటి తీరువా వసూలుచేసి చెరువుల నిర్వహణా బాధ్యతతోపాటు జీతభత్యాలు కూడా చెల్లించాలి. నీటి హక్కును ప్రభుత్వం వదులుకోవాలి. నీటి పారుదలశాఖకు ఎటువంటి నిధులు కేటాయించకూడదు. ఈ విధానం వలన రైతులపై పెనుభారం పడుతుంది. ఆచరణలో సాగునీరు కార్పోరేట్ సంస్థలకు, భూస్వాములకు, సంపన్న వర్గాలకు మాత్రమే అన్న విధంగా మారుతుంది.

నీటిపారుదలశాఖతో కుదుర్చుకున్న ఒప్పందం ఆధారంగా నీటి దుర్వినియోగం పేరుతో రైతులపై కేసులు పెట్టి జైలుకు పంపుతారు. నీటి దుర్వినియోగానికి ఈ అంశాలను పేర్కొంది. కేటాయింపుల కన్నా అధికంగా నీటిని ఉపయోగించటం, పొలంలోకి నీటిని మళ్లించి అవసరం తీరిన తర్వాత తూములు మూయకపోవటం, నీటిని మళ్లించేటప్పుడు టైం పాటించకపోవటం, అధిక వినియోగం వలన చివరి భూములకు నీరు అందకపోవటం.

ఈ షరతులు ఆమోదించటమంటే మన నీటిని మనం వాడుకొనే హక్కును వదులుకోవటమే. నీటి వినియోగంలో మన రైతును ప్రపంచబ్యాంక్ శాసించటమే.

నీటి విలువ ప్రపంచబ్యాంక్ కన్నా మన రైతులకే ఎక్కువ తెలుసు. ప్రపంచ బ్యాంక్‌కి తెలిసింది నీటి వ్యాపారం చేయటం, మన నీటి వనరులను బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టటమే. సేద్యం ద్వారా ఆహార పంటలను పండిస్తున్న మన రైతుకు నీటి విలువ గురించి ప్రపంచబ్యాంక్ చెప్పే అర్హత లేదు. పైరుకు ఎంత నీరు అవసరమో రైతుకు తెలుసు. అంతకుమించి నీరు ఉపయోగించరు. వృధాగా నీరు కాల్వల పాలౌతుంటే రైతు అల్లాడిపోతాడు. నీరు సరిపోగానే తూములు, గండ్లు కట్టి వేస్తాడు. అలాంటి రైతు నీటి దుర్వినియోగానికి పాల్పడ్డాడని జైళ్ళలో పెట్టి శిక్షిస్తామనే పాలకులను, ప్రపంచబ్యాంక్‌ను బోనులో పెట్టి శిక్షించాలి. వరిలాంటి ఆహారధాన్యాల సాగునుండి ఆరుతడి పంటలవైపు సేద్యాన్ని మళ్లించి, అభివృద్ధి చెందిన దేశాల సంపన్న వర్గాలకు పండ్లు, కూరగాయలు లాంటి బలవర్ధక ఆహారాన్నిచ్చే పంటలను పండించి అతిచౌకగా ఎగుమతి చేయటం కోసమే ఈ విధమైన నిబంధనలను విధిస్తున్నారు.

ప్రపంచబ్యాంక్ యిచ్చే 850 కోట్ల రూపాయల రుణం కోసం, దాని అవమానకరమైన షరతులను ఆమోదించి, రైతులను బలిపెట్టనవసరం లేకుండా మనం చెరువుల మరమ్మత్తులను చేసుకోగలం. వివిధ పథకాల క్రింద రాష్ట్రానికి లభిస్తున్న నిధులను ఖర్చుచేస్తే 13 వేల చెరువులే కాకుండా మొత్తం చెరువులను మరమ్మత్తులు చేసి లక్షలాది ఎకరాలకు నీరు అందించవచ్చు. గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మన రాష్ట్రానికి ప్రతి సంవత్సరం వేయి కోట్లు కేంద్రం నిధులు వస్తాయి. నిధుల వాడక మార్గదర్శకాల ప్రకారం 70 శాతం (700 కోట్లు) నీటి సంరక్షణకు, చెరువుల మరమ్మత్తులకు వాడాలి. కాని రాష్ట్ర పాలకులు ఆవిధంగా నిధులు ఖర్చుచేయటం లేదు. గత రెండు సంవత్సరాలుగా ఈ పథకం క్రింద విడుదలైన నిధులలో చాలా భాగం ఖర్చు కాకుండా మిగిలిపోయాయి. ఇందిరమ్మ పథకం క్రింద వచ్చే నిధులు పూర్తిగా ఖర్చుచేస్తే ప్రపంచబ్యాంక్‌ని యాచించాల్సిన అవసరంలేదు. రైతులు నీటి తీరువా, తదితర పన్నుల ద్వారా తిరిగి చెల్లించే ఆదాయం ప్రభుత్వానికి చాలా ఎక్కువగా వస్తుంది. చెరువుల మరమ్మత్తులు ఈ విధంగా ఎందుకు చేపట్టరని పాలకులను నిలదీయాలి. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రపంచబ్యాంక్ షరతులకు దాసోహమవటాన్ని తీవ్రంగా విమర్శించిన ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రపంచబ్యాంక్ షరతులను ఆమోదించటాన్ని నిలదీయాలి.

మన దేశ, రాష్ట్ర రైతు ప్రయోజనాలను ప్రపంచబ్యాంక్ కోరుకోదు. అందుకు భిన్నంగా మన వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల దోపిడీ, పెత్తనాలకు నిలయంగా మార్చటమే దాని ప్రధాన ధ్యేయం. రుణ సహాయం పేరుతో ఆంక్షలు విధించి రైతులను సేద్యం నుండి దూరం చేయటం, నీటివనరులను బహుళజాతి సంస్థల వ్యాపారానికి కట్టబెట్టటం, ఆహారధాన్యాల కోసం అమెరికాపై ఆధారపడేటట్లుచేసి, మన దేశంపై దాని ఆధిపత్యాన్ని మరింతగా పెంచటమే ప్రపంచ బ్యాంక్ ధ్యేయం.

ఇలాంటి రైతు వ్యతిరేకమైన ప్రపంచబ్యాంక్ షరతులను ఆమోదించరాదు. దాని జోక్యం, రుణం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే చెరువుల, కాల్వల మరమ్మత్తులు చేపట్టి సాగునీరు, త్రాగునీరు అందించే బాధ్యతను కొనసాగించాలి.

'ఈ మట్టి నాకు
పట్టెడన్నం పెట్టి పాలు
తాపింది
రాక్షస భూస్వామ్య
రంపపుకోతల్నుండి
తనను విముక్తిచేసి
రుణం తీర్చుకొంటాను.'

- చెరబండరాజు

# రైతాంగ రుణభారం, ఆత్మహత్యలు: 'సెజ్'లపై పంజాబ్‌లో రైతు,కూలీ సంఘాల జాతీయ సదస్సు

పంజాబ్ రాష్ట్రం–పాటియాలాలో– 2007 ఆగష్టు 24,25 తేదీలలో అమర్ ఆశ్రమ్ (షహీద్ భగత్‌సింగ్ హాల్)లో వ్యవసాయ రంగంలో కృషి సాగిస్తున్న పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిడిఎఫ్ఐ) మరియు దాని వ్యవస్థాపక సంఘాల ఆధ్వర్యంలో రైతాంగ సదస్సు జరిగింది. భారతదేశంలో–రైతాంగం ఎదుర్కొంటున్న రైతాంగ రుణభార సమస్య, ఆత్మహత్యలు, 'సెజ్'లు మరియు వివిధ ప్రాజెక్టుల పేరుతో భూసేకరణ ప్రమాదం, తదితర తీవ్రమైన సమస్యలను సదస్సు చర్చించింది. ఈ సమస్యలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా సాగుతున్న ఉద్యమాలను, ఈ ఉద్యమాలన్నింటినీ సమన్వయంచేసే మార్గాలను సదస్సు చర్చించింది.

ఆగస్టు 24న జరిగిన ప్రారంభ సెషన్‌కు పిడిఎఫ్ఐ కన్వీనర్ మరియు భారత ప్రభుత్వ ఎస్‌సి, ఎస్‌టి మాజీ కమీషనర్ డాక్టర్ బి.డి.శర్మ అధ్యక్షత వహించారు.

ప్రఖ్యాత నటుడు మరియు కళాకారుడు గురుశరణ్‌సింగ్ ప్రారంభోపన్యాసం చేశారు. బి.కె.యు(ఏకతా), పంజాబ్–అధ్యక్షులు బల్‌కార్‌సింగ్ డకుండా స్వాగతోపన్యాసం చేశారు. డాక్టర్ దర్శన్‌పాల్(పిడిఎఫ్ఐ) సదస్సు నేపధ్యాన్ని, అవసరాన్ని రేఖా మాత్రంగా దృష్టికి తెచ్చారు. ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్(ఎఎఫ్‌డిఆర్, పంజాబ్ ప్రధాన కార్యదర్శి) ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

'రైతాంగరుణగ్రస్తత–ఆత్మహత్యలు' అంశంపై జరిగిన రెండవ సెషన్‌కు మాధురి(జాగరూక్ ఆదివాసి దళిత సంఘటన, మధ్యప్రదేశ్) అధ్యక్షత వహించారు. 'రైతాంగ రుణగ్రస్తత కారణాలు, పరిష్కార మార్గాలు' అంశంపై డా॥బి.డి.శర్మ; 'వ్యవసాయ సంక్షోభం–పంజాబ్‌లో రైతాంగ రుణగ్రస్తత, ఆత్మహత్యలు' అంశంపై ప్రొఫెసర్ సుఖ్‌పాల్ సింగ్ (లూథియానా వ్యవసాయ విశ్వవిద్యాలయం); 'రైతాంగం, గ్రామీణప్రాంత సమస్యలు–పరిష్కారాలు' అంశంపై ప్రొఫెసర్ రంజిత్‌సింగ్ ఘుమ్మన్(పాటియాలా, పంజాబి యూనివర్శిటి); 'రైతాంగ రుణగ్రస్తత–రైతాంగ సంఘర్షణలు' అంశంపై బుటాసింగ్ బుర్జిల్(ప్రధాన కార్యదర్శి, బి.కె.యు.(ఏకతా), పంజాబ్; పత్రాలను సమర్పించి ప్రసంగించారు.

'ప్రత్యేక ఆర్థిక మండళ్ళతో సహా వివిధ ప్రాజెక్టుల కోసం భూసేకరణ – నిర్వాసితుల సమస్య–ప్రజా ఉద్యమాల సమన్వయం' అనే అంశంపై ఆగస్టు 25న జరిగిన మూడవ సెషన్‌కు రామాచంద్రా సింగ్(భూమిహీన కిసాన్ సంఘర్ష సమితి, ఉత్తరప్రదేశ్) అధ్యక్షత వహించారు. 'ప్రత్యేక ఆర్థికమండళ్ళ'పై ప్రొఫెసర్ సుఖాసింగ్ గిల్(పంజాబి యనివర్శిటీ, పాటియాలా); నిర్వాసితుల సమస్యపై అర్జున ప్రసాద్‌సింగ్ (పిడిఎఫ్ఐ), నూతన ఆర్థిక విధానాలు, నిర్వాసితులు, రైతాంగ ఆందోళన'పై బి.కె.యు(ఏకతా) ప్రతినిధి పత్రాలను సమర్పించి ప్రసంగించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం పంజాబ్‌లో జరిగిన రెండురోజుల రైతాంగ సదస్సులో పాల్గొని–'ప్రత్యేక ఆర్థిక మండళ్ళు' అంశంపై పత్రాన్ని సమర్పించారు.

ఆ పత్రంలో ఈ క్రింది అంశాలను వివరించారు. నిరుపేదలైన ప్రజలకు పంచిపెట్టటానికి భూమి కానరాని పాలకులకు ప్రత్యేక ఆర్థికమండళ్ళ పేరుతో వేల, లక్షల ఎకరాల భూములను బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు రైతుల నుండి బలవంతంగా గుంజుకొని కట్టబెడుతున్నది. రైతుల జీవితాలు ఛిన్నాభిన్నం చేస్తున్నది. కేవలం భూములు మాత్రమే కాకుండా బడా పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు కల్పిస్తున్నారు. ఉదారంగా లైసెన్సులు ఇవ్వటం, ఎక్సైజ్ పన్నులోను, ఎగుమతి దిగుమతి పన్ను, అమ్మకం పన్ను, ఆదాయపు పన్నులో అనేక రాయితీలు కల్పిస్తున్నారు. ప్రత్యేక ఆర్థికమండళ్ళలో కార్మిక చట్టాలు ఏవి వర్తించకుండా మినహాయింపులు ఇస్తున్నారు. ఆ రకంగా కార్మికులను ఇష్టానుసారంగా దోచుకోవటానికి అవకాశం కల్పిస్తున్నారు. కరెంటు, నీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని హామీయిస్తున్నారు.

ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళ వలన దేశాభివృద్ధి, ప్రజాభివృద్ధి జరుగుతుందా అంటే అదీ లేదు. ఒక దశాబ్దంపాటు ఈ మండళ్ళలోకి 3,60,000 కోట్ల రూపాయల పెట్టుబడి వస్తుందనుకొంటే అందులో సగం మినహాయింపులు, రాయితీలు, ప్రభుత్వానికి రావాల్సిన పన్నుల రూపంలో ఆదాయం నష్టపోవాలని కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ గగ్గోలు పెడుతున్నది. పాలకులు చెబుతున్నట్లుగా ఉద్యోగ అవకాశాలు కన్పించటం లేదు. పైగా ఈ ఆర్థిక మండళ్ళ వలన చిన్న పరిశ్రమలు మూలపడి వేలాదిమంది నిరుద్యోగులు అవుతున్నారు.

బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే భూమిలో 25 శాతం మాత్రమే ఉత్పత్తి కార్యక్రమాలకు వాడతారు. మిగిలిన భూమిలో మౌలిక సదుపాయాలకు వాడేది చాలా తక్కువ కావటంతో, మిగిలిన భూమిని రియల్ ఎస్టేట్‌కి వాడుకొని లాభాలు గడించేందుకు బడా కంపెనీలు తహతహలాడుతున్నాయి.

ఇప్పటికే 90వేల ఎకరాలపైగా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. ఇంకా లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవటానికి రంగం సిద్ధమైయింది. దీనివలన ఆహార ఉత్పత్తులు తగ్గిపోయి, వాటి కొరత ఏర్పడి దిగుమతులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంతేకాకుండా భూమిని కోల్పోవటం వలన ఉపాధి కోల్పోయి రైతు కుటుంబాలు మరింతగా సంక్షోభంలో చిక్కుకొని ఆత్మహత్యలు పెరుగుతాయి. తమ భూములు గుంజుకోవటానికి వ్యతిరేకంగా రైతాంగం అనేక రాష్ట్రాల్లో మిలిటెంట్ ఆందోళనలు చేస్తున్నారు.

మన వ్యవసాయరంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి బడా, బహుళ జాతి సంస్థల దోపిడీకి నిలయంగా మార్చే ప్రత్యేక ఆర్థికమండళ్ళకు వ్యతిరేకంగా రైతాంగం, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని కామ్రేడ్ ఝూన్సి పిలుపుయిచ్చారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) తో పాటుగా బి.కె.యు (ఏక్తా), పంజాబ్; భూమిహీన్ కిసాన్ సంఘర్ష సమితి, ఉత్తరప్రదేశ్; ముక్తి వాహిని, మణిపురి, ఉత్తరప్రదేశ్; జనముక్తి మోర్చా, బస్తి–గరఖ్‌పూర్, ఉత్తర పదేశ్; జనవాది మజ్దూర్ కిసాన్‌సభ, బీహార్; జాగరూక్ ఆదివాసి దళిత సంఘటన, మధ్య ప్రదేశ్; ఆల్ ఇండియా ప్రజాపోరాట సమితి, ఆంధ్రప్రదేశ్; మిల్క్‌మెన్ అండ్ డెయిరీ యూనియన్, పంజాబ్; కిసాన్ సంఘర్ష సమితి, మొరాదాబాద్, ఉత్తరప్రదేశ్; జన ముక్తి మోర్చా, అజాంగర్, ఉత్తరప్రదేశ్; బీహార్ కిసాన్ సమితి; ఛత్తీస్‌ఘడ్ కిసాన్ యూనియన్, ఆదివాసి ముక్తిమోర్చా, మధ్య ప్రదేశ్; భారత జన ఆందోళన్– వివిధ ప్రాంతాల్లో రైతు,కూలీల మధ్య పనిచేస్తున్న వివిధ సంఘాలు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేశాయి.

**'మేం మట్టిచాళ్ల మీద**
**జీవనాడుల్ని నాటుకున్నవాళ్లం**
**గింజలో బతుకుపొలాన్ని**
**దాచుకున్నవాళ్లం**
**తరం నించి తరానికి**
**మట్టిగా ప్రవహిస్తున్నవాళ్లం**
**నీళ్లకే కాదు, మట్టికీ ఉప్పెనలొస్తాయి**
**నీటి ఉప్పెన నేల మీంచి వస్తే**
**మట్టి ఉప్పెన మనస్సులోని**
**పాతాళాల అలల మీంచి వస్తుంది**
**ఉప్పెన ముగిసిన తర్వాత**
**మొలిచే మొక్కల్లోని జీవధార**
**నీ నిర్జీవ ప్రయోగాల నాళికల్ని**
**పగులగొట్టి**
**మా మట్టిచాళ్లలో**
**మా జీవితమై చిమ్ముకొస్తుంది.'**

– అద్దేపల్లి రామమోహనరావు
'మట్టిఉప్పెన' కవిత నుండి

# జనం నడవాలి

*ఎన్నాళ్ళీ కాపురాలు*
*ఏ చెరోగిరో పడిచేద్దామన్నా*
*ఎట్లాగీ కాపురాలు //ఎన్నాళ్ళీ//*

*కాపురమంతా కరువుల సంతా*
*జీవితమంతా చిరుగులబొంతా*
*ఖాళీ కొంపలు ఖాళీ కుండలు*
*చాలీచాలని కూలిగింజలు //ఎన్నాళ్ళీ//*

*చేలన్నీ మా చెమటను తడిసీ*
*నేలా, బురదా నాటులు నాటి*
*కళ్ళ ప్రాణముతో ఇల్లు జేరితే*
*పిల్లలు తింటే తల్లులు పస్తు //ఎన్నాళ్ళీ//*

*ఉప్పంటే పప్పుండదు అంటా*
*ఎప్పుడు అప్పెవరిస్తారంటా*
*పూట పూటకూ చేటపట్టుకొని*
*గడపగడప గాలించేదెట్లా //ఎన్నాళ్ళీ//*

*పార పనులతో తారకలాడీ*
*సత్తువకొద్దీ కత్తువ తొక్కి*
*సతమతమై మేం మెతుకులకొస్తే*
*కుండడుగున కూడుండదురన్న //ఎన్నాళ్ళీ//*

# పంచాయితీ ఎన్నికల్లో ప్రజల మధ్య చిచ్చుపెట్టే భూస్వామ్య, పెత్తందారీ శక్తుల కుట్రలకు బలికావద్దు! రైతుకూలీ-గ్రామీణ కష్టజీవుల మధ్య ఐక్యతను పెంపొందించండి!!

**(2006 పంచాయితీ ఎన్నికల సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ధ్రప్రదేశ్) ప్రచురించిన కరపత్రం)**

**రైతుకూలీ పేదలారా!**

ఈ నెల 29 నుండి పంచాయితీ ఎన్నికలకు రంగం సిద్ధమైయింది. అధికారం కోసం భూస్వామ్య, పెత్తందారీ శక్తుల కుమ్ములాటలు ప్రారంభమైనాయి.

రామరాజ్యంలో గ్రామరాజ్యం స్థాపిస్తామనే కాంగ్రెస్ నాయకుల నినాదాలు, నినాదాలుగానే మిగిలాయి. బ్రిటిష్‌వాడే రూపొందించిన రాజ్యాంగం, భారత రాజ్యాంగముగా చలామణి అవుతున్నది. అధికార మార్పిడి జరిగి నల్ల దొరల పాలన కొనసాగుతున్నా గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదు. వాటి కోసం గ్రామీణ పేదలను సంఘటిత పడనీయకుండా భారత పాలకులు కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టి చట్టాలు చేశారు. అందులో భాగమే పంచాయితీరాజ్ చట్టం. ఈచట్టం ద్వారా పంచాయితీ, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లకు ప్రజలే పాలకులని అందుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకోవటం, రకరకాల భ్రమలు కల్పించటం గత యాభై సంవత్సరాలుగా అమలు జరుగుతున్నది. ఫలితంగా వారిని వర్గ ఉద్యమాలకు దూరం చేయటం, విభజించి-పాలించడం కక్షలు, కార్పణ్యాలు సృష్టించి ప్రజలను ముఠాలుగా చీల్చి తమ ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నారు. అంతేగాక ప్రధానంగా ఇటువంటి ఎన్నికల్లో గ్రామ భూస్వామ్య-పెత్తందారీ శక్తులు అధికారాన్ని నిలబెట్టుకోవటానికి పడరాని పాట్లు పడుతున్నాయన్నది నగ్నసత్యం. ఇటీవల జరిగిన మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పాలక పార్టీలు, వాటికి కొమ్ముకాస్తున్న సి.పి.ఐ, సి.పి.యం పార్టీల వైఖరులు, నిస్సిగ్గుగా వ్యవహరించిన తీరు, వేసిన పిల్లిమొగ్గలు, ప్రత్యేకంగా చెప్పన వసరం లేదు.

పంచాయితీ ఎన్నికల ద్వారా, భూస్వామ్య, పెత్తందారీ శక్తులను తన ప్రయోజనాలకు సాధనంగా ఉపయోగించు కొంటున్న పాలకులు ఆ పంచాయితీలకు ఎటువంటి అధికారాలు యింతవరకు యివ్వలేదు. పంచాయితీల హక్కుల కోసం సుదీర్ఘ పోరాటం తర్వాత 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1994 చట్టానికి సవరణ చేసి 29 అధికారాలను బదలాయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 1995లో రాష్ట్ర శాసనసభ దాన్ని చర్చించి, 17 అధికారాలను మాత్రమే బదలాయిస్తున్నట్లు ప్రకటించింది. అయినా వాటిని కూడా పంచాయితీలకు యిప్పటి వరకు బదలా యించలేదు. రాష్ట్ర పాలకులకు పంచాయితీ వ్యవస్థ తమ గుప్పెట నుండి జారిపోవటం యిష్టం లేకపోవడమే ఇందుకు కారణం. స్వయం పాలన, పోషకత్వం, మూడవ ప్రభుత్వంగా పంచాయితీ వ్యవస్థను రాజ్యాంగ చట్టం పేర్కొంది. కాని అది అమలు జరగటంలేదు. ఏజన్సీ ప్రాంతాల్లోను, మైదాన ప్రాంతాల్లోను గ్రామసభలకు ఎటువంటి ప్రాధాన్యత యివ్వటం లేదు. పంచాయితీ అధికారాల గురించి నిరసన గళం తిరిగి ప్రారంభం కావటంతో, 10 అధికారాలను మాత్రమే బదలాయిస్తామని చెప్పటమంటే రాష్ట్ర పాలకులకు పంచాయితీలకుఅధికారాలు బదలా యించటం యిష్టం లేదని స్పష్టమౌతుంది. 72 శాతంగా ఉన్న గ్రామీణ పేదల నుండి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ఆదాయంలో గ్రామ పంచాయితీలకు కేటాయిస్తున్నది చాలా స్వల్పం. ఫలితంగా కనీస సదుపాయాలు కూడా మృగ్యమైనాయి.

పాలకులు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల మౌలిక సమస్యలైన కూడు, గూడు, గుడ్డ పరిష్కరించకుండానే వారిని ఈ ఎన్నికల బరిలోకి దించు తున్నారు. బలిపశువులను చేయపూను కొంటున్నారు.

## భూమి సమస్య:

గ్రామీణ ప్రాంతంలోని వ్యవ సాయ కూలీ పేదలకు చారెడు భూమిలేక పనులు దొరకక, ఉపాధి కరువై బ్రతుకుతెరువు కోసం వలసలు పోయే దుస్థితి కల్పిస్తున్నారు. గ్రామీణ ఉపాధి చట్టంలాంటి పథకాలు కూడా ఆచరణలో సక్రమంగా అమలు జరగక ఈ వలసలను నివారించ లేకపోతున్నది. పాలకులు తెచ్చిన భూ సంస్కరణల చట్టాలుగాని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వ భూపంపిణీ ద్వారాకాని భూస్వాముల మిగులు భూములు, బంజరు, దేవాలయ భూములు పేదలకు పంపిణీ జరగ లేదు. భూస్వామ్య విధానం రద్దుకాలేదు. పైగా చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోయి వ్యవసాయకూలీలుగా మారు తున్నారు. కొత్త భూస్వామ్య వర్గం ఏర్పడింది. కార్పోరేట్ సంస్థలకు తమ భూములు అమ్ముకోమని పాలకులు రైతులను ప్రలోభపెడుతున్నారు. నాలెడ్జి పార్కులు, టెక్స్‌టైల్ పార్కుల పేరుతో ఎంతో సారవంతమైన రైతుల భూములను వ్యాపార వర్గాలకు కట్టబెడుతున్నారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూలును, 1/70 చట్టాన్ని ధిక్కరించి అటవీ భూములను బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నారు. బాక్సైట్ త్రవ్వకాల పేరుతో గిరిజనుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు.

## రైతుకూలీలపై రుణభారం:

అతివృష్టి, అనావృష్టి, కరువు కాటకాలతో అప్పులపాలైన రైతులను ఆదు కోవటంలో పాలకులు విఫలమయ్యారు.

చిన్న, సన్నకారు రైతుల అప్పులు రద్దుచేయ లేదు. పంట ఖర్చులకు బ్యాంకు రుణాలు అందించటంలోను మొండిచేయి చూపిస్తు న్నారు. రైతులకు 20 వేలకోట్ల పంట రుణాలు అవసరం కాగా గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం విన్నపం మేరకు 13,300 కోట్లు రుణాలు యివ్వటానికి బ్యాంక్‌లు అంగీకరించి, అందులో 80 శాతం మాత్రమే యిచ్చాయి. ఈ సంవత్సరం 15,700 కోట్లు యివ్వటానికి ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో బ్యాంక్‌లు అంగీకరించాయి. ఇది ఎంత మేరకు అమలుజరుగుతుందో వేచి చూడాల్సిందే. ఈ రుణాలు పూర్తిగా అందినా ఇంకా 40 శాతం కౌలు రైతులకు రుణాలు యివ్వటానికి అన్ని సమస్యలు పరిష్కరించానని ముఖ్యమంత్రి ప్రకటించారు. వారికి రుణాలు అందు తాయని చెప్పారు. కాని భూమి గుర్తింపు పత్రాలు ఉంటేనే రుణాలు యిస్తామని బ్యాంక్ అధికారులు అంటున్నారు. అవి కౌలు రైతుల వద్ద ఉండవు. బ్యాంక్‌లు వారికి రుణాలు ఇవ్వవు.

గ్రామీణ సహకార బ్యాంక్‌లు అనేకం మూలబడ్డాయి. అందుకు కారణం భూస్వాములు, బడాబాబులు ఉద్దేశ పూర్వకంగా 15 వందల కోట్ల సహకార బ్యాంక్ అప్పులను ఎగ్గొట్టారు. ఇవిగాక వ్యవసాయేతర బాకీలు 500 కోట్లు ఉన్నాయి. వీటిని వసూలు చేసే ధైర్యం పాలకులకు లేదు. దీన్ని నష్టంగా చూపెట్టి ప్రభుత్వం అనేక గ్రామీణ సహకార బ్యాంక్‌లను మూసివేసింది. ఫలితంగా ఈ బ్యాంక్‌ల నుండి అత్యధికంగా రుణాలు పొందిన రైతులు, అందుకు దూరమయ్యారు.

రైతులకు యిచ్చే రుణాలపై 4 శాతం మించి వడ్డీ వసూలు చేయరాదనే బ్రిటీష్ కాలం నాటి చట్టం అయినా దాన్ని బ్యాంక్‌లు అమలుజరపటంలేదు. అసలకు వడ్డీ మించ రాదని, చక్రవడ్డీ వసూలు చేయ రాదనే నిబంధనల అమలుకు పాలకులు చర్యలు తీసుకోవటంలేదు. బారువడ్డీ, చక్రవడ్డీల వసూలు, అసలుకు మించిపోతున్నది. అప్పుల వసూళ్ళకు కూడా బ్యాంక్ అధికారులు వడ్డీవ్యాపారులు లాగానే పీడిస్తున్నారు. అప్పు చెల్లించకపోతే పంట ఇంటికి తరలకుండాచేయటం, ఇంట్లో వస్తువులను, పశువులను వేలం వేయటం, మోటార్లు ఎత్తుకుపోవటం, ఇంట్లో పొయ్యి వెలగకుండా సిలెండర్లు తీసుకు పోవటం లాంటి కర్కశ పద్ధతులతో రైతులను అవమానభారంతో తలెత్తుకు తిరగని స్థితి కల్పిస్తున్నారు. బ్యాంక్ అధికారులు ఊళ్ళోకి వస్తున్నారంటేనే యమదూతలు వస్తున్నట్లు రైతులు వణికిపోతున్నారు.

ఈ పరిస్థితుల్లో రైతులు తమ రక్తం పీల్చే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పటం లేదు. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనై జేషన్ అప్పుల భారంతో రాష్ట్ర రైతాంగం అగ్రభాగంలో ఉందని సర్వే ఫలితాన్ని వెల్లడించింది. ప్రతిరైతుపై 23,965 రూపాయలు అప్పు ఉన్నట్లు తెలిపింది. ప్రతి వెయ్యి రూపాయల్లోను 534 రూపాయలు వడ్డీ వ్యాపారుల నుండే తెస్తున్నారు. ఫలితంగా రైతులు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకొని ఉన్న ఆస్తులు అమ్మినా అప్పులు తీరక ఆత్మహత్యలు చేసు కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతులు మరీ దారుణ స్థితిలో ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు తీసుకొంటున్నారు.

### సాగునీటి సమస్య:

48 వేల కోట్లతో జలయజ్ఞం చేపట్టి నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్తున్న ప్రభుత్వం, ఆచరణలో సాగునీరు అందించే బాధ్యత నుండి తప్పుకొంటున్నది. కార్పోరేట్ సంస్థలకు నీటి వంపిణీ బాధ్యత అప్పగించటానికి పూనుకొంది. రైతుల నుండి నీటితీరువా వసూలు చేసే బాధ్యత వారిదే. నిర్ణయించిన నీటి తీరువా రేటుని ఈ సంస్థ పెంచుకొనే అవకాశం కల్పించింది. దీనర్ధం రైతులను తోడేళ్ళ బారిన పడవేసి పీక్కుతినమనడమే.

### విత్తనాల సమస్య:

బహుళజాతి సంస్థల వద్ద మాత్రమే విత్తనాలను అధికరేటు పెట్టి కొనుగోలు చేయవలసిన పరిస్థితిలోకి రైతాంగాన్ని నెట్టింది. మోన్‌శాంటో బి.టి. పత్తి విత్తనాల ద్వారా రైతులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నది. మరొకవైపు కల్తీ విత్తనాలు, పురుగు మందులు రాజ్యమేలుతున్నా వాటిని అదుపు చేయటానికి పాలకులు చర్యలు తీసుకోవటం లేదు.

ప్రత్తి, పొగాకు, ధాన్యం, జొన్న, మిర్చి పంటలకు గిట్టుబాటు ధరలేక, నిల్వ చేసుకొనే సౌకర్యం లేక రైతులు మార్కెట్ దోపిడీకి గురౌతున్నారు.

పై సమస్యలకు తోడు గ్రామ సమస్యలు ప్రజలను తీవ్ర యిబ్బందులకు గురిచేస్తున్నాయి. సరైన రోడ్లు లేక ఇంకా ఎన్నో గ్రామాలలోని ప్రజలు వర్షాకాలంలో అనేక యిబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి కాలంలో మంచినీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. గొంతు తడుపుకో వటానికి కుండ నెత్తిన పెట్టుకొని మైళ్ళ తరబడి మండుటెండలో నీళ్ళకోసం వెళ్తున్నారు. గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ప్రజల దాహాన్ని తీర్చలేకపోయింది. కరెంటు సౌకర్యం లేక, ఉన్నా సక్రమంగా లేక ప్రజలు యిబ్బందులు పడుతున్నారు.

గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించని పాలకులు వారిని మభ్యపెట్టి, మోసపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీకే రుణాలు, గ్రామీణ ఉపాధి చట్టంతో పనులు కల్పించి పేదల జీవితాల్లో వెలుగు నింపుతామన్నారు. ఇవేవి ఆచరణలో అమలు జరగలేదు. టీ.వి.ల ద్వారా కుళ్ళు సంస్కృతిని గ్రామీణ ప్రజల మెదళ్ళలో చొప్పిస్తూ, ప్రజల ఆగ్రహాన్ని ప్రక్కదారి పట్టిస్తున్నారు.

పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పడిన దగ్గర నుండి పాలకులు భూస్వామ్య, పెత్తందారీ శక్తులను, పేదలను ఐక్యం కాకుండా బంధుత్వం, కులం, మతం, డబ్బు, సారా, దౌర్జన్యాలను ప్రయోగిస్తున్నారు. అధికార యంత్రాంగం వీరికి అండగా నిలుస్తున్నది.

ఈ పరిస్థితుల్లో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండవలసివుంది. తమ సంఘటితశక్తిని, ఐక్యతను మెలుకువతో కాపాడుకోవాలి.

ప్రస్తుత ఎన్నికల సందర్భంగా కష్టజీవులైన పేదలను పీల్చే భూస్వామ్య-పెత్తందార్ల శక్తుల కుట్రలకు, కుతంత్రాలకు పేదలు బలికాగూడదు. పేదలందరూ ఐక్యమై తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి. ఈ ఉద్యమాలకు బాసటగా నిలచే అభ్యర్ధులను ఈ ఎన్నికల్లో గెలిపించాలి.

**రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)**



'కరువు
సీమ ముంగిట పెరిగిన వింత తరువు
దాని లీలలు అనంతం
బిడ్డలాంటి పశువును అడ్డంగా అమ్మిస్తుంది
గుట్టంత చెట్టును నిలువుగా నరికిస్తుంది
మనసైన మనిషిని మృగంగా మలుస్తుంది
ఎండముఖం ఎరగని కన్నెనైనా
నీళ్లకడవ చేతికిచ్చి మైళ్లకొలదీ నడిపిస్తుంది
చిరునవ్వులు చిందిస్తూ మీసాలు మెలేసే
రైతన్న గర్భసముద్రంలో బడబాగ్నిని రగిలిస్తుంది
చెమటనదులు పారిస్తూ భూమిని పులకరింపజేసే
కూలన్న కుంపటిని ఆర్పేస్తుంది
కొత్త పెళ్లికూతుర్ని మెత్తగా కాటికి పంపిస్తుంది
అప్పడే పుట్టిన బిడ్డకు కుప్పతొట్టిని సైడు కాల్వను
ఇల్లువాకిలి చేస్తుంది
ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయించి
మనుషులను వలసపక్షులుగా మారుస్తుంది.'

– రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
'కరువుగడ్డ ' నుండి

'తొలి కోడితో నేలకి కరకరా చేతులు మొలుస్తాయి
గొర్రు గుంటకా మోసే చేతులు కొండ్రేసే చేతులు
ఎదబెట్టే చేతులు మునుంబట్టి కలుపు తీసే చేతులు
గొడ్లు మలేసే చేతులు
బురదలో బండి చక్రం కోపేసే చేతులు
గట్టు మీద నడెండలో
కారం మెతుకులు గొంతుక జేర్చే చేతులు
నానీ నానీ పగిలీ పగిలీ కాయలు గాసే
గరుకుదేలిన మోటు చేతులే చేతులు
చేతుల నాజూకుతనం గురించి నేను మాట్లాడటం
లేదు
వాటిపైన గిరికీలు కొట్టే
నెత్తురుగోళ్ళ డేగల్ని గురించే మాట్లాడుతున్నా
చేతికీ నోటికీ మధ్య ఉక్కురెక్కలు విసిరే డేగ
చేతుల్ని మాయజేసే గాయంజేసే
కడుపుపంట తన్నుకు పోయే డేగ

.........................................

దృశ్యం మారాల్సిందే
గుండె నెర్రగొట్టిన నేలతల్లిని చూసి
నేనైనా గుప్పెడు కన్నీళ్ళు రాల్చాల్సిందే
చేతుల గాయాలు లేని స్వేచ్ఛాక్షేత్రం కోసం
పదే పదే దేవులాడాల్సిందే
చేవదేలిన చేతులు డేగల్ని ఒడిసిపట్టే కార్తె
కోసం
కళ్ళు పత్తికాయలు చేయాల్సిందే
మట్టిగుండె చప్పుళ్ళతో హింసా సింహాసనాల్ని
బీటలు గొట్టాల్సిందే
ఎన్నటికైనా ఒక దుక్కి దున్నిన చెయ్యి
ఎర్రకోటపై జెండా ఎగరేయాల్సిందే'

– పాపినేని శివశంకర్
'చేట్టు' కవిత నుండి

# గల్ఫ్ బాధితులను అన్నివిధాల ఆదుకోవాలి!
# ఆత్మహత్యలు కావు! పాలకుల విధాన దుష్ఫలితాలు!

(గల్ఫ్ బాధితుల సమస్యలపై రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) ప్రచురించిన కరపత్రం)

గల్ఫ్ దేశాల నుంచి అర్థాంతరంగా పంపించబడి, అష్టకష్టాలూ పడి తిరిగి వచ్చిన వారిలో అనేక మంది ఆత్మహత్యలకి పాల్పడుతుండటంతో మన ఉత్తర తెలంగాణా జిల్లాలలో, రాయల సీమలో ప్రధానంగా కడపజిల్లాలో ఒక ఆందోళనకర పరిస్థితి ఏర్పడింది. దీనిని చూసి వివిధ రాజకీయ పార్టీలు కాంగ్రెస్, టి.ఆర్.ఎస్., తెలుగుదేశంలు ఓట్ల రాజకీయాల వెలుగులో చేయాల్సిన హల్ చల్‌లు చేసి ఇపుడు చప్పుడు కాకుండా వున్నారు. కానీ సమస్య ఎంత లోతైనదో దానికోసం చేయాల్సిన సమగ్ర చర్యలు ఏమిటో వాటిని తీసుకొనేందుకు పాలక, ప్రతిపక్ష పార్టీలు ఏవీ ముందుకు రావడంలేదు.

## కల్లిబిల్లి (అనధికార) కార్మికులు ఎవరు?

మన రాష్ట్రం నుండి ఉత్తరతెలంగాణా జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌ల నుంచి రాయలసీమలోని కడపజిల్లా నుంచి ఎక్కువ మంది గల్ఫ్ దేశాలలో పనులు చేసుకొనేందుకు వలస కార్మికులు వెళుతుంటారు. కోస్తాలో ఉభయగోదావరి జిల్లాల నుంచి ఎక్కువగా దళిత, వెనుకబడిన వర్గాల మహిళలు అక్కడి ఇళ్ళల్లో పనులు చేయడానికి వెళుతుంటారు. తెలంగాణా జిల్లాలలో ఒకప్పటి చెరువుల కింది వ్యవసాయాన్ని పాలకులు కావాలని ధ్వంసంచేసి సామ్రాజ్యవాదుల, ప్రపంచ బ్యాంకు ఆదేశం మేరకు ఆయిలు ఇంజన్లు మీద కరెంటు బోర్ల మీద ఆధారపడే వ్యవసాయ విధానంను రుద్దారు. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోవడం బోర్లు మీద బోర్లు వేస్తూ రైతులు అప్పులు పాలు కావడం ఉంది. మరోపక్క అగ్గిపెట్టెలో ఏడు గజాల చీరలు నేసిన నేత కార్మికులు, చేతివృత్తులు అన్ని ధ్వంసం అయి, గ్రామాలలో పనులులేక, వ్యవసాయాలు లేక అలో లక్ష్మణా అనుకొంటూ వలసలు పోవాల్సిన పరిస్థితి దాపురించింది. దీనితో నెత్తిమీద ఉన్న అప్పులను తీర్చుకొనేందుకు మళ్లీ అప్పు చేసి గల్ఫ్ దేశాలకి వలస కూలీలుగా పోతున్నారు. ఇక్కడ ఊళ్ళలోని పెళ్ళాం బిడ్డలు, తల్లిదండ్రులు కళ్ళల్లో కదలాడుతుండగా మండుటెండలో బానిసలులాగా బతుకుతున్నారు. కడుపు కట్టుకొని ఇళ్ళకు పంపేందుకు దుబాయి లాంటి చోట్ల పార్కులలో మర్రిచెట్ల మీదే పడుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. గోదావరిజిల్లా నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వెళ్ళిన మహిళలలో అనేక మంది అక్కడ జరిగే లైంగిక వేధింపులు, అత్యాచారాలు భరిస్తూ ఇళ్ళ దగ్గర ఉన్న భర్త, పిల్లలకోసం సముద్రం అంత దు:ఖాన్ని గుండెల్లో దాచుకొని పనులు చేస్తున్నారు. వీరిలో అనేక మంది తీవ్రమైన చాకిరి, వంటరితనంలు తెచ్చిన మానసిక బలహీనతలకిలోనై ఎయిడ్స్ వ్యాధి బారినపడి అక్కడా, ఇక్కడా తీవ్రమైన సమస్యలను కొని తెచ్చుకొంటున్నారు. లక్షలాది మంది గల్ఫ్ దేశాలలో ఇలా బండచాకిరీ చేస్తూ చిన్న చిన్న తేనెటీగలు పెద్ద తేనెపట్టును పెట్టినట్లు, గల్ఫ్ దేశాల కార్మికులు పంపిన చిన్న చిన్న మొత్తాలే వేలకోట్ల రూపాయలై మనదేశ ఆర్థిక వ్యవస్థకి అండగా వున్నాయి. చంద్రశేఖర్ ప్రధానిగా ఉన్న కాలంలో రిజర్వు బ్యాంకు బంగారం తాకట్టు పెట్టిన పరిస్థితులలోనూ, ఆ తర్వాత ఈ దేశ ఆర్థికవ్యవస్థ కుప్ప కూలకుండా కాపాడింది గల్ఫ్ దేశాల సోదర కార్మిక ప్రజల కష్టార్జితమన్నది ఎవరూ మరచిపోలేని వాస్తవం.

## ప్రభుత్వాల దుర్మార్గం ఎక్కడ ఉంది?

గల్ఫ్ దేశాలకు వెళ్ళే కార్మికులను ఏజెంట్లు ఎక్కువగా కంపెనీ వీసాలపైన, టూరిస్టు వీసాలపైన పంపుతున్నారు. వీసాపై వెళ్ళిన వారి కాగితాలు వారి వద్దనే ఉండటం న్యాయమైన హక్కు. కానీ గల్ఫ్ కంపెనీలు అక్కడి ఏజెంట్లు వలస వెళ్ళే కార్మికుల పాస్ పోర్టులను, వీసాలను స్వాధీనం చేసుకొంటాయి. గల్ఫ్ వెళ్ళే వలస కార్మికులను కట్టుబానిసలుగా చూసే ప్రక్రియలో ఇది మొదటిది, ప్రధాన మైంది. కరీంనగర్, నిజామాబాద్ నుండి వలసవెళ్ళే కార్మికుల నుంచి ఏజెంట్లు ఇప్పటి వరకూ లక్ష నుండి లక్షా 20 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. లక్ష రూపాయలకి 3000 రూపాయలు నెలకి వడ్డీ ఇక్కడ చెల్లించాలి. గల్ఫ్‌లోని వీసా ఇచ్చిన కంపెనీలు 500 రియాలుకానీ, దెర్హామ్‌లు కానీ ఆయా దేశాలను బట్టి ఇస్తాయి. వీటిలో కనీసం బతకడానికి కార్మికులకి 200–300 రియాలు లేదా దెర్హములు ఖర్చు అయితే తిరిగి పంపే డబ్బులు ఇక్కడి వారి అప్పుకి వడ్డీ కట్టడానికి కూడా చాలవు. అందువలన కార్మికులు కంపెనీలలో మానేసి రోజుకి 50 రూ.లు సంపాదించే రోజు కూలీలుగా, కల్లిబిల్లి కార్మికులు అయి పోతారు. అంటే అనధికార కార్మికులు అవుతారు. కంపెనీల ద్వారా లేక నేరుగానే కల్లిబిల్లి (టూరిస్టు వీసాలపై) వెళ్ళిన కార్మికులను ఏజెంట్లు అనేక మోసాలకి పాల్పడి పంపుతుంటారు. ఈ విధంగా మొత్తం గల్ఫ్ దేశాలలో భారత, బంగ్లా, పాకిస్తాన్ తదితర దేశాల నుంచి వచ్చిన గుర్తింపు పత్రాలులేని అనధికార కార్మికులు 13 లక్షల మంది ఉంటే, వారిలో 3 లక్షల 50 వేల మంది మన దేశీయులే. వీరిలో 70–80 వేల మంది మన రాష్ట్రానికి చెందిన వారు. వీరిలో అత్యధికులు నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ వారే. గత సంవత్సరం జనవరి నుండి నవంబరు వరకు గల్ఫ్ దేశాలలోని దుర్భర పరిస్థితుల

వల్ల మరణించినవారు 830 అయితే ఆత్మహత్యలు చేసుకొన్నవారు 79 అని ఇటీవల మన రాష్ట్ర హైకోర్టులో వేయబడిన ఒక రిట్ పిటీషన్ బట్టి అర్థం అవుతుంది. ఇన్ని లక్షల మంది అనధికార కార్మికులు న్నారని అక్కడి ప్రభుత్వాలకి, ఇక్కడి ప్రభుత్వాలకి తెలుసు. ఇలాంటి గుర్తింపులేని అనధికార (కల్లిబిల్లి) కార్మికులు ఉంటేనే అక్కడ చెప్పినట్లు పడి ఉంటారనే అక్కడి ప్రభుత్వం చూసీ చూడనట్లు ఇప్పటి వరకూ వ్యవహరించాయి. 10 సంవత్సరాలకొక సారి అనధికార కార్మికులను గెంటివేసే పని చేపడుతున్నాయి. 1997లో కూడా ఇలానే- అయితే ఇంత పెద్ద ఎత్తున కాకుండా కార్మికులను పంపించేందుకు పూను కున్నాయి. ఇపుడూ అలాగే జరుగు తందనీ నేటికీ వేల మంది కార్మికులు తమ మకా ములలో కాకుండా ఎడారులలో, తోటలలో తప్పించుకొని తిరుగుతున్నారు. కనుక ప్రభుత్వం కానీ, ప్రతిపక్షాలుకానీ గల్ఫ్‌లోని కంపెనీల, ఇక్కడ ఏజెంట్లపై ఆధారపడి ఉండని వీసా పద్ధతికోసం కృషి చేయాలని కానీ, వీసాలు, పాస్‌పోర్టులు, పత్రాలు వెళ్ళిన కార్మికులవద్దే ఉండాలని కానీ, కాలపరిమితి ముగిసిన కార్మికులు తమ వీసాలు పొడిగించుకునేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు భారత రాయబార కార్యాలయంలో ప్రత్యేక విభాగాలను ఏర్పరచాలని కానీ కోరడం లేదు. అనుకోవడం లేదు. ఎందుకంటే వలస కార్మికుల ఎగుమతిలో వీరందరికీ వాటాలు ఉన్నాయి కనుక. ఏజెంట్ల నుంచి అందే నిధులతో వీరి ఎన్నికల ఖర్చులు నడుస్తాయి కనుక.

## ప్రస్తుత సంక్షోభం:

విదేశీ మారకద్రవ్యం విలువల్లో రూపాయి బలపడినందున ఈ దేశపు సామాన్యులకి వచ్చిన లాభం ఏమిటి కనపడటంలేదు. కానీ, రూపాయి బల పడటం గల్ఫ్ దేశాల మన కార్మికుల చావుకి మాత్రం వచ్చింది. మారిన మారకం విలువ రీత్యా ఏ పైసలు ఇళ్ళకు పంపకంకోసమైతే అక్కడ కార్మికులు అన్ని కష్టాలు పడుతున్నారో ఆ పైసలే తగ్గి పోతున్నపుడు, సహజంగానే తీవ్రంగా ఆందోళన చెందు తున్నారు. అక్కడి కంపెనీలు సాగిస్తున్న నికృష్ట దోపిడీకి వ్యతిరేకంగా నిరసనలు, సమ్మెలు సాగిస్తున్నారు. గతంలో ఎప్పుడూ సమ్మెలే జరగని ప్రాంతంలో అక్కడ సమ్మెలు జరుగు తున్నాయి. గత అక్టోబరులో దుబాయిలోని జెజెబ్‌ఆలీ స్వేచ్ఛా మండలి లోని, ఆలీ, అల్‌హబ్రిత్ కంపెనీ నిర్మాణ రంగ కార్మికులు వేలాది మంది సమ్మె చేశారు. సమ్మె సందర్భంగా అక్కడి ప్రభుత్వం జరిపిన కాల్పులలో నలుగురు కార్మికులు, వారు తెలుగువారే మరణించారు. 4 వేల మందిని నిర్బంధించారు. ఈ విధమైన వేధింపుల మధ్య కార్మికులను భయపెట్టి లొంగదీసే పనిలో అక్కడి కంపెనీలకి తోడుగా భారత ప్రభుత్వ రాయబార కార్యాలయంకూడా తలమునకలు అయి ఉంది.

ఎవరైనా విదేశాల నుండి మాతృ దేశానికి రావాలని ఉవ్విళ్ళూరుతారు. కానీ అనధికార కార్మికుల పేరు మీద కార్మికులను తిరిగి పంపుతున్నపుడు ఆ గల్ఫ్ కార్మికులు ఆనందపడకపోగా అక్కడి మండుటెండల్లో కట్టుబానిస లాంటి చాకిరీ కావాలని ఎందుకు కోరుతున్నారు? అర్థాంతరంగా తిరిగి పంపబడిన కార్మికులు పదుల సంఖ్యలో ఎందుకు ఇక్కడికి వచ్చాక ఆత్మహత్యలు చేసుకొంటున్నారు? (మంత్రి షబ్బీర్ ఆలీ ప్రాతినిధ్యం వహిస్తున్న కామారెడ్డిలోనే ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని ఇక్కడ గమనించాలి.) దీని మూలాలు నేటి గ్రామాల వ్యవసాయ సంక్షోభంలో ఉన్నాయి.

పండిన పంటకి గిట్టుబాటుధర ఇవ్వకుండా రైతులను కొల్లగొట్టడం మీదే దేశ దోపిడీ విధానం ఆధారపడి ఉంది. చేనేత, చేతి వృత్తులను ధ్వంసం చేయడం మీదే బడా బట్టల మిల్లుల లాభాలు ఆధారపడి ఉంది. భూములకు నీరులేక, పంటలులేక, వ్యవసాయ కూలీలకి ఉపాధి లేక పండిన పంటకు, పెట్టిన పెట్టుబడికి తగ్గరేటు లేక, చేసుకొనేందుకు పనిలేక మన గ్రామాలు కునారిల్లుతున్నాయి. ఈ సంక్షోభం ఒకరు, ఇద్దరు ముఖ్యమంత్రుల వల్లనో, ఒకటి రెండు పార్టీల పాలన వల్లనో ఏర్పడలేదు. పాలక ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రపంచబ్యాంకు సేవలో సంవత్సరాల తరబడి సమిష్టిగా కృషి చేసిన దాని ఫలితమే ఈ సంక్షోభం. గ్రామాలను కొట్టి పట్టణాలకి వేసి, కార్మికులను, రైతులను కొట్టి సంపన్నులకి వేస్తేనే భారతదేశం "వెలిగిపోతున్నది". సెన్సెక్స్ 20 వేలు సూచిక దాటుతున్నది. కనుక రైతులు, కార్మికులు, కష్టజీవులు తమ శ్రమ ఫలితాలను దక్కించుకొనేవరకూ, గ్రామాలు తాము సృష్టిస్తున్న సంపదలకి తగ్గ విలువ దక్కాలని పోరాడి దక్కించు కొనేవరకూ ఈ సంక్షోభం సమసిపోదని, దీనికి మరే దగ్గర మార్గంలేదని సవినయంగా యావత్తు రైతాంగానికి, కార్మిక ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఏ సంక్షోభం ఫలితంగా ఇక్కడ నుండి వలసలు పోయారో, ఏ అప్పులు తీర్చు కొనేందుకు అక్కడ అన్ని కష్టానష్టాలు పడుతున్నారో అలాంటి మన సోదరులను అర్థాంతరంగా కల్లిబిల్లి కార్మికులంటూ పంపించివేస్తున్నారు. తిరిగి ఇక్కడికి వచ్చాక ఇక్కడ బతకడం ఎలాగో, అప్పులు తీర్చటం ఎలాగో. అన్న భయాలతోనే సగం చచ్చివాళ్ళు విమానాలు ఎక్కుతున్నారు. ఇక్కడకు వచ్చినవారిలో ఇజ్జత్ పోయినాక బతకటం ఎందుకనే విరక్తితో ఆత్మ హత్యలకి పాల్పడు తున్నారు. గ్రామాల్లో ఇప్పుడు నెలకొనివున్న వ్యవసాయక సంక్షోభం ఫలితంగా ఎవరి బతుకువారిది, ఎవరి చావువారిదనే వాతావరణం ఏర్పడింది. గతంలో ఉండే సంబంధ బాంధవ్యాలను, ఓదార్పులను, అండదండలను నేటి సామ్రాజ్యవాద సంస్కృతి, ఈ సంక్షోభం తెచ్చిన వాతావరణం కలుషితం చేస్తున్నది. అందువల్ల గల్ఫ్ నుంచి వచ్చిన కార్మిక సోదరులారా! నిరుత్సాహపడవద్దు. మీరు ఎంతో ప్రపంచాన్ని చూసారు. మీ అనుభవంతో ఇక్కడ మన ప్రజలతో ఐక్యం అవండి! మన వ్యవసాయాలు, మనం సృష్టిస్తున్న సంపదలకి న్యాయమైన విలువ

కోసం మన శ్రమకి సరైన ఫలితం కోసం గ్రామాలను ఐక్యం చేయండి. మీరు మీ కోసం, మీ కుటుంబం కోసమే కాదు. ఈ దేశం కోసం రక్తం, చెమటను చిందించారు. మీరు పంపిన డబ్బులలోనే గ్రామాల్లో వ్యవసాయాలు, వ్యాపారాలు ఎంతో కొంత నిలబడ్డాయి. కనుక ఎవరికి వారం వంటరి వాళ్ళం అనే భావన రానివ్వద్దు. మొత్తం దేశ కష్టజీవుల కష్టాలలో మనవీ ఒక భాగం. ఎద్దు పుందు కాకికి ముద్దు. మన కష్టాల మీదే మేడలు కదుతున్న వారికి మన కన్నీళ్ళు అర్థంకావు. కనుక నిబ్బరంగా ప్రజలంతా ఐక్యం కావడం, గ్రామాలు ఐక్యం కావడం, వ్యవసాయ సంక్షోభానికి వ్యతిరేకంగా రైతు కూలీలు, చేతివృత్తులు ప్రజలు ఐక్యం కావడమే మన ముందున్న మార్గం.

గల్ఫ్ దేశాలలో ఎన్నో కష్టాల మధ్య పనిచేస్తూ, జీతాల పెంపుకోసం పోరాడుతూ మరణించిన మన సోదర కార్మికులకి ఇక్కడి వ్యవసాయ సంక్షోభం ఫలితంగా ఆత్మహత్యలు చేసుకొంటున్న రైతులకీ జోహార్లు చెపుదాం. ఆత్మహత్యలు పరిష్కారం కాదని అసలు ఇవి ఆత్మహత్యలు కావని, నేటి సామాజిక సంక్షోభ పరిస్థితులను సృష్టిస్తున్న ప్రభుత్వాలు చేస్తున్న హత్యలే అని ప్రకటిద్దాం. అక్కడ గోదావరిజిల్లాలో గానీ, ఇక్కడ తెలంగాణా జిల్లాలలో గానీ దశాబ్దాలక్రితం సాగిన ప్రజాతంత్ర, కమ్యూనిస్టు ఉద్యమ చైతన్యంతో ముందుకు వచ్చిన భూమి, భుక్తి, ఆత్మగౌరవ పోరాటాలు తెచ్చిన సాంఘిక చైతన్యమే మనవారికి ఎక్కడికైనా వెళ్ళి బతికే ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కల్గించింది. వివిధ దేశాలలో ఎదురైన అవమానాలను తట్టుకొని నిలబడ గలిగే ఆత్మధైర్యాన్ని కలిగించింది. నాటి వారసత్వంను మదిలో నిలుపుకొంటే అక్కడి వారికిగానీ, ఇక్కడివారికిగానీ ఆత్మహత్యల తలంపే రాదు. కనుక గత పోరాటాల స్ఫూర్తిని గుర్తుంచుకొని భవిష్యత్తులో యావత్తు కష్టజీవి ప్రజలు ఐక్యం కావాలని పిలుపునిస్తున్నాం.

- కంపెనీ వీసాలు, టూరిస్టు వీసాలు, అజ్ఞాత వీసాలలో ఏజెంట్లు, దళారీల ప్రమేయంలేని విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలి.
- వీసా, పాసుపోర్టు, ఇతరపత్రాలు వలసవెళ్ళిన కార్మికుల వద్దే ఉండే హక్కును గుర్తించాలి.
- వర్కు వీసాలు ఇచ్చేలా ఏజెంట్ల మోసాలు అరికట్టే చర్యలను అక్కడి, ఇక్కడి ప్రభుత్వాలు చేపట్టాలి.
- నిజామాబాద్‌జిల్లా దేగం గ్రామానికి చెందిన కార్మికులకు విధించబడ్డ ఉరి శిక్ష రద్దుకై ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలి.
- ఇప్పటికీ గల్ఫ్ దేశాలలో దాక్కొంటూ తిరుగుతున్న కార్మికులకి తగిన పత్రాలతో వారిని రక్షించాలి.
- తిరిగి వచ్చిన కార్మికులకి సరైన ఉపాధికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి.
- పంటలకి గిట్టుబాటుధరలు కల్పించాలి. నీటి ప్రాజెక్టుల నిర్మాణం సత్వరం పూర్తిచేయాలి.
- పొట్టచేతపట్టుకొని వలసలు పోవల్సిన దుస్థితిని తొలగించాలి.
- ఆత్మహత్యలు చేసుకొన్న కుటుంబాలకి అన్ని రకాల అండదండలు ఇవ్వాలి.

విప్లవాభివందనాలతో

**రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)**

# ఆగునా జీవాలు

- శెట్టిపల్లి వెంకటరత్నం



ఆగునా జీవాలు సాగునా లోకాలు
రాజుగా మనమెంచి రైతు జూడకపోతె
దేశాలు తలలెత్తునా-దాస్యపున్
పాశాలు తా వీడునా?
ఆవు లంబాయంచు అరచు రైతుల యిండ్ల
కళ్యాణదేవతన్ కనులజూడనినాడు
సౌభాగ్యమేతెంచునా-దేశపున్
సిరిసంపదలు నిల్చునా?
పిల్లపైరుల మీద చల్ల తెమ్మెర వీవ
గాంచి యానందించు ఘనుని గాంచకపోతె
సృష్టి నైజము గాంచునా-ప్రకృతిని
సౌందర్యమిక నిల్చునా?
పగలు రాతిరి లేక పాటుపడు నా రైతు
కడగండులన్ గాంచి యాదరించకపోతె
రాజ్యమే యిల నిల్చునా- భూదేవి
భగ్నమైపోకుండునా?
పొలములో రైతుండి పొలికేక బెట్టగన్
జయభేరి మ్రోతలై జగతి నిండకపోతె
వీరరక్తము పారిదా- ఎల్లెడల
ధీరత్వమడుగంటదా?

(1933లో ఏలూరులో ఆంధ్ర రాష్ట్ర జమీందారీ రైతుల సభలో చదివిన గేయం)
'రైతు భజనావళి' కవితా సంకలనం, 1934

# విశాఖ ఏజన్సీలో బాక్సైట్ తవ్వకాలు ఎందుకోసం? ఎవరి ప్రయోజనాల కోసం?

విశాఖజిల్లా చింతపల్లి ఏజెన్సీ ఏరియాలో ఉన్న బాక్సైట్ నిల్వల త్రవ్వకానికి, అల్యూమినియం ఉత్పత్తికి దుబాయ్‌కి చెందిన ఒక కంపెనీకి అప్పగించేందుకు 2000 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేసింది. 1/70 చట్టాన్ని సవరించటానికి కూడా ప్రయత్నాలు చేసింది. ట్రైబల్ ఎడ్వయిజరీ కౌన్సిల్‌లో ప్రాజెక్టుకు అనుకూలంగా తీర్మానాలు చేయించింది. అడవుల్లో ఖనిజాలను వెలికి తీయకుండా అడ్డుకోవడమంటే రాష్ట్రాభివృద్ధిని వ్యతిరేకించడమే అవుతుందని, అలా అడ్డుకోవడానికి అభివృద్ధి నిరోధకులు కుట్రపన్నుతున్నారని ఆక్రోశించింది.

ఏజెన్సీ ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడం, ఏజెన్సీ భూములను గిరిజనేతరులకు బదిలీ చేయడం, ప్రభుత్వ సంస్థలకు కూడా బదిలీ చేయరాదని, అలా చేస్తే అది రాజ్యాంగంలోని 5వ షెడ్యూలుకు వ్యతిరేకమని, ఆర్టికల్ 244కు వ్యతిరేకమని సుప్రీంకోర్టు సమత కేసులో ఇచ్చిన తీర్పు వుంది. రాజ్యాంగానికి సవరణ చేసైనా, తమ ప్రయత్నాలను నెరవేర్చుకోడానికి నాటినుండి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు(అధికారంలో ఎవరు వున్నా) తీవ్రంగా ప్రయత్నిస్తూనే వున్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం దుబాయ్ కంపెనీతో చేసుకొన్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ 2000 సం॥. అక్టోబరులో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాల ఆదివాసీ గిరిజనులు ఐదువేలమందితో విశాఖపట్టణంలో బ్రహ్మాండమైన ప్రదర్శన, బహిరంగసభ ఆదివాసీ హక్కుల వేదిక" ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. వేదిక కన్వీనర్ ఎం.ఓంకార్ గారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో భారత్ జన్ ఆందోళన్ చైర్మన్ డా.బి.డి.శర్మ గిరిజన, గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ కా॥ఇల్లా రామిరెడ్డి, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు అమరుడు కా॥మండ్ల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని, బాక్సైట్ త్రవ్వకాలను అనుమతిస్తే గిరిజనులు చూస్తూ ఊరుకోరని, ప్రతిఘటిస్తారని, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే దళారీ విధానాలను మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాక్సైట్ త్రవ్వకాలపై పోరాటం చేస్తామని చెబుతున్న నేటి ప్రతిపక్ష పార్టీలు ఆనాడు మౌనం వహించాయన్న విషయం గమనంలో వుంచుకోవాలి. ప్రజల ప్రతిఘటన రోజు రోజుకూ పెరగడంతో నేడు తాము కూడా పోరాడుతామంటున్నాయి.

గిరిజన, గిరిజనేతర ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను చూసిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తన ప్రయత్నాన్ని విరమించుకుంది. ఇప్పుడు వై.ఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం తిరిగి బాక్సైట్ త్రవ్వకాలకు నడుం బిగించింది. జిందాల్ కంపెనీకి అరకు, అనంతగిరి ఏరియాలలోని బాక్సైట్ త్రవ్వకాలకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్సుకు చెందిన "రస్ ఆల్ ఖైమా' కంపెనీకి చింతపల్లి, సప్పర్ల గాలికొండ ఏరియాలోని బాక్సైట్ నిక్షేపాలను అప్పగించడానికి ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ బాక్సైట్ నుండి అల్యుమినా తయారీ ఫ్యాక్టరీల నిర్మాణం కోసం సబ్బవరం, మాకవరపాలెం పరిసర ఏరియాల్లో భూముల సేకరణ పనిలో రెవెన్యూ యంత్రాంగాన్ని దించింది. దీనిపై ప్రజలు, ప్రజాసంఘాలతో పాటు నాడు వెనక్కి తగ్గిన టి.డి.పి కూడా నేడు తమ వ్యతిరేకతను తెలియజేస్తున్నాయి. ఆందోళనలు చేస్తున్నాయి. బాక్సైట్ త్రవ్వకాలకు బ్రేకుపడడానికి అడ్డంకిగా వున్న 1/70 చట్టాన్ని రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు సుప్రీంకోర్టు తీర్పులను దృష్టిలో పెట్టుకొని తాము అనుకున్నది సాధించ డానికి ప్రభుత్వరంగ సంస్థ 'నాల్కో'ను రంగంలోకి దించేందుకు పూనుకున్నది.

**నేషనల్ మైనింగ్ పాలసీ:** మరో ప్రక్క ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా జాతీయ "మైనింగ్ పాలసీ"ని రూపొందించి, చట్టబద్ధంగా రాజ్యాంగపరంగా వున్న అడ్డంకులను, ఆంక్షలను ఎదుర్కొనడానికి కేంద్ర పాలకులు పూనుకున్నారు. గత నెలలో హైదరాబాదులో జరిగిన అంతర్జాతీయ అల్యూమినా సదస్సులో కేంద్ర గనులశాఖా మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ, ప్రజల మనోభావాలను గౌరవించి వారి అభీష్టంతోనే గనులు తవ్వాలని, త్రవ్వకాలు చేస్తే అందులో 20 శాతం లాభాలు గిరిజనులకు చెందేలా జాతీయ మైనింగ్ పాలసీని రూపొందిస్తున్నామని రాష్ట్రాల్లో మైనింగ్ లీజులకు దరఖాస్తులు పెట్టుకున్న వారివి 12 నెలల్లో ఆమోదించాలని, అలా జరగకపోతే ట్రిబ్యునళ్ళకు వెళ్ళే అధికారం వారికి ఇస్తున్నామని, ట్రిబ్యునల్‌ను కేంద్రం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. మైనింగ్ హక్కులు పొందిన వ్యక్తి వేరొకరికి బదలాయించుకునే హక్కు కల్పిస్తున్నట్లుగా ఈ సమావేశంలో ప్రకటించారు. ఈ విధంగా ప్రభుత్వరంగ సంస్థ నాల్కోకు మైనింగ్ త్రవ్వకాలకు హక్కులు కల్పించి, ఆ ముసుగులో జిందాల్‌కు, ఆల్ ఖైమాకు అవసరమైన బాక్సైట్‌ను సరఫరా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులు పథకాలు రూపొందించినట్లుగా జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**బాక్సైట్ త్రవ్వకాలను ఎందుకు వ్యతిరేకించాలి?** తూర్పు కనుమల్లో 1400 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 600 మిలియన్ టన్నులున్న ఈ బాక్సైట్–నిక్షేపాలు కురిసే వర్షాలను స్పాంజ్‌లాగా పీల్చుకొని, ఏడాది పొడవునా ఊట గెడ్డలుగా, జీవనదుల్లా పారి ప్రకృతిని, పర్యావరణాన్ని ప్రాణికోటిని ఈ మేరకైనా బ్రతికిస్తున్నాయి. ఈ తవ్వకాలు మొదలు పెడితే గిరిజనుల జీవితాలే కాదు, మైదాన ప్రాంతాలతో సహా ఉత్తర కోస్తాజిల్లాల ప్రజల జీవితాలు పర్యావరణం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేస్తుంది.

మూడువేల టన్నుల ఎర్ర మట్టిని(ముడి బాక్సైట్) శుద్ధిచేస్తేగాని ఒక టన్ను అల్యూమినా లభ్యం కాదు. అంటే వందల కిలోమీటర్ల వరకు గాలి, నీరు కలుషితమై ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడతారు.

బాక్సైట్ త్రవ్వకాలు ప్రభుత్వ రంగ ఆధ్వర్యాన జరిగితే గిరిజనులకు ఉపాధి గ్యారెంటీ అనే ప్రచారం ఒట్టి బూటకం. ఎందుకంటే ఇప్పటికే ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బాక్సైట్ త్రవ్వకాల కోసం బాల్కో కంపెనీకి కేటాయించారు. కాని నిర్వాసితులైన గిరిజనులకు పునరా వాసం కల్పించ కుండా, ఏ విధమైన నష్టపరిహారం చెల్లించకపోవడంతో బికారు లుగా మారిపోయారు.

మైనింగ్ రంగంలోని లక్ష కోట్ల రూపాయల పెట్టుబడుల్ని రాబట్టేందుకు ప్రయత్నంచేస్తుంటే, సంస్కరణల వ్యతిరేకులు బాక్సైట్ వ్యతిరేకఉద్యమం ద్వారా ప్రగతిని అడ్డుకుంటున్నారని, పారిశ్రామికాభివృద్ధిని ఆటంకపరుస్తు న్నారని ప్రభుత్వం, వారి వంధిమాగధులు ప్రచారం చేస్తున్నారు. కీలకమైన కొన్ని పారిశ్రామిక ఉత్పత్తులలో అవసరమైన అల్యూమినా ఉత్పత్తులు సాగించే "బాల్కో"లో మెజారిటీ వాటాలను "స్టెరిలైట్" కంపెనీకి అమ్మేసారు. ఆ విధంగా ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్, రాష్ట్రాలలోనున్న బాక్సైట్ గనులను స్టెరిలైట్ (బహుళజాతి కంపెనీ) పరం చేసాయి. 5వేల కోట్ల బాల్కో ఆస్తుల్ని 500 కోట్లకే స్టెరిలైట్ చేజిక్కించు కుంది. బాల్కోలోని విద్యుత్ ప్లాంటు నిర్మాణానికే 7వందల కోట్ల ఖర్చయింది. మరొక ప్రభుత్వ రంగ సంస్థ 'నాల్కో'లో 10 శాతం వాటాను అమ్మడానికి సిద్ధపడితే దీనిపై తీవ్రమైన వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఏటా కోట్లాది రూపాయలు లాభాలార్జించే పరిశ్రమలు వాటాలను డిజిన్‌వెస్ట్‌మెంటు పేరుతో బహుళజాతి కంపెనీలకు తెగనమ్మి సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడే విధానాలు నాటి బి.జె.పి పాలన నుండి నేటి కాంగ్రెసు వరకు అమలు జరుగుతూనే వున్నాయి. ఇవి ప్రపంచ బ్యాంకు ఆదేశాలు. కావున యీ సమస్యను విడిగా చూడకుండా ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల విధానాలలో భాగంగా అమలు చేస్తున్న విషయాన్ని మరువకూడదు.

**బాక్సైట్ త్రవ్వకాలను ఐక్యంగా ప్రతిఘటిద్దాం:** ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికన్ సామ్రాజ్యవాదులు తమ ఆర్థిక, సైనిక, మిలటరీ యుద్ధ పరిశ్రమల అవసరాల కోసం ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లోని విలువైన ఖనిజ వనరులను కొల్ల గొట్టాయి. కోట్లాది ప్రజలను నిర్వాసితుల్ని చేసి, వారి వనరులను, జీవితాలను, పర్యావరణాన్ని, ప్రకృతిని ఛిన్నాభిన్నం చేసింది. ఇప్పుడు తన యుద్ధ పరిశ్రమల అవసరాల కోసమే మన దేశంలోని బాక్సైట్ నిక్షేపాలను తరలించుకెళ్ళేందుకు భారత పాలకులపై, రాష్ట్ర పాలకులపై తీవ్రమైన ఒత్తిడి పెంచు తున్నది. జాతీయ ప్రయోజనాల పట్ల అణు మాత్రమైనా అశక్తిలేని మన దళారీ పాలకులు ఆఘమేఘాల మీద భూమి సేకరణ చేసి ఎం.ఒ.యులు చేసుకుంటున్నది. జాతీయ మైనింగ్ పాలసీ రూపంలో చట్టబద్ధ దోపిడీకి పూనుకుంది. గిరిజనులు పోరాడి సాధించుకున్న 1/70 చట్టాన్ని కాలరాయ డానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నది. గిరిజనులను, దేశ సహజ వనరులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం ఈ దేశ ప్రజలందరి బాధ్యత. అందుకోసం బాక్సైట్ త్రవ్వకాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. ప్రతిఘటించాలి.

బాక్సైట్ త్రవ్వకాలను వ్యతిరేకించే శక్తులు విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. బాక్సైట్ త్రవ్వకాలకు వ్యతిరేకంగా చేసే పోరాటం తమ రాజకీయ పలుకుబడుల కోసం, ఓట్లు రాబట్టుకోవ డానికీ వాడుకొనే శక్తుల పట్ల తగిన మెలుకవతో ఉండాలి.

బాక్సైట్ త్రవ్వకాలను, సామ్రాజ్యవాదుల పరం చేయడానికి నాడు చంద్రబాబు, నేడు రాజశేఖరరెడ్డి ప్రభుత్వాలు సుముఖంగా వున్నాయన్న విషయం గమనంలో వుంచు కోవాలి.

కేంద్రంలో నాడు అధికారంలోనున్న ఎన్.డి.ఎ, నేటి యు.పి.ఎ పాలకులు సామ్రాజ్యవాదుల వ్యూహాత్మక ప్రయోజ నాలను కాపాడేవారేనని అర్ధంచేసు కోవాలి.

దేశ పారిశ్రామిక అభివృద్ధితో సంబంధంలేని ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను తక్షణమే విరమించాలని కార్మికవర్గ నాయకత్వ శక్తులు, దేశభక్తియుత ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఐక్యంగా సంఘటిత ఆందోళనలకు సిద్ధం కావాలి.

## రానున్నది

-దాశరథి

రానున్నది ఏది నిజం?
అది ఒకటే, సోషలిజం

కలపండోయ్ భుజం భుజం
కదలండోయ్ గజం గజం

అడుగడుగున ఎత నెత్తురు
మడుగులుగా విడవండోయ్

పడిపోయిన గుడి గోడలు
విడిచిపెట్టి నడువండోయ్

ఉదయాకాశ పతాకం
యెదలో కదలాడి నేడు

హృదయావేశ తటాకం
నదిలా పొరలాడె నేడు

రానున్నది ఏది నిజం?
అది ఒకటే, సోషలిజం

రచనాకాలం: 1950

# గంగవరం మత్స్యకారులపై పోలీసు కాల్పులను ఖండించండి. వారికి న్యాయమైన-గౌరవప్రదమైన పునరావాసం కల్పించాలి.

ప్రత్యేక ఆర్థికమండళ్ళ పేరుతో, పోర్టుల నిర్మాణం పేరుతో బడా బూర్జువా, సామ్రాజ్యవాదుల ప్రయోజనం కోసం రైతుల భూములను స్వాధీనం చేసుకోవటం, మత్స్యకారుల గ్రామాలను ఖాళీ చేయించటంతో పాటు వారి జీవనోపాధిని దెబ్బ తీస్తున్నది. అందుకు అనుగుణంగా నిర్మించ బడుతున్నదే విశాఖపట్నం దగ్గరలోని గంగవరం పోర్టు నిర్మాణం.

ఈ పోర్టు నిర్మాణం వలన గంగవరం, చినపల్లెపాలెం, పెద్దపల్లెవారిపాలెం, జులారి పల్లెపాలెం గ్రామాలనుఖాళీ చేయించాలి. ఇందువలన ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోయే కుటుంబాలు 8 వేలు. ఈ పోర్టు నిర్మాణం కోసం తమ గ్రామాలను ఖాళీ చేయటానికి మత్స్యకారులు వ్యతిరేకించారు. పోర్టు నిర్మాణం వలన వేట సాధ్యం కాదని అందు వలన జీవనోపాధి కరువై బ్రతుకే భార మౌతుందని చెప్పారు. తమకు న్యాయమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే విధంగా గంగవరం ప్రాంత గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. చేపలవేటకు తగిన చోట, తగిన ఏర్పాట్లతో పునరావాసం, జీవనోపాధిని కల్పించాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. అప్పటిదాకా గ్రామాలను ఖాళీ చేయమని పేర్కొన్నారు.

విశాఖజిల్లాలోని నర్సీపట్నం వద్ద బాక్సైట్ గనులను జిందాల్ కంపెనీ పరం చేసింది. దీని నుండి సాలీనా 40 లక్షల టన్నుల అల్యూమినా తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తుంది. మనదేశ సహజవనరులను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేయపూనుకుంటున్న పాలకులు అల్యూమినా ఎగుమతి కోసమే గంగవరం పోర్టు నిర్మాణం! పోర్టు నిర్మాణ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చిన క్రమం దీన్నే రుజువు చేస్తున్నది.

25 సంవత్సరాల క్రితం స్టీలు ప్లాంటు అవసరాల కోసం గంగవరం పోర్టుని నిర్మిస్తామని విశాఖ పోర్టు ముందుకు వచ్చింది. అప్పటి పోర్టు ఖర్చు 200 కోట్లు. తర్వాత దాని ఖర్చు 400 కోట్లకు పెరిగింది. లాభసాటి కాదని ఆపివేశారు. 2002 టి.డి.పి ప్రభుత్వం బూజుదులిపి బయటకు తీసింది. వెయ్యి కోట్లతో గంగవరం పోర్టుని నిర్మిస్తామని మరలా విశాఖ పోర్టు ముందుకు వచ్చినా చంద్రబాబు ప్రభుత్వం తిరస్కరించి డి.వి.యస్.రాజు కంపెనీకి 1850 కోట్లకు అప్పగించింది. దీనితో 1160 కోట్లు ఒక విదేశీ కన్సార్టియం రుణంగా యిచ్చింది. ఈ పోర్టు నిర్మాణంలో విదేశీ ప్రాబల్యమును ఇది తెలియచేస్తున్నది.

పోర్టు నిర్మాణం వలన విశాఖ ఏరియా అభివృద్ధి చెందుతుందని చెప్పటం బూటకమే. అసలు ప్రాజెక్టు నిర్మాణం అభివృద్ధి కోసమేనా అన్న ప్రశ్న ముందుకు వచ్చింది. దేశ సహజ వనరులను వినియో గించుకొని ప్రజల అవసరాలను తీర్చగల సాంకేతిక పరిజ్ఞానం, మానవశక్తి దేశంలో లభ్యమౌతుండగా, అల్యూమినియం ఎగుమతికి, బొగ్గు దిగుమతికి పోర్టు నిర్మాణం సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు, బడా బూర్జువాల లాబాల కోసమే. అల్యూమినియం ఎగుమతి ఎక్కువగా అమెరికా ప్రయోజనాల కోసమే. అందువలన పోర్టు నిర్మాణం వలన అభివృద్ధి జరగదు.

తమ గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఐక్యవేదికను మత్స్యకారులు ఏర్పాటు చేసుకొన్నారు. ముందుగానే సరైన పునరావాసం కల్పించాలని వివిధ రూపాల్లో ఆందోళన సాగించారు. అయినా ప్రభుత్వం బలవంతంగా గ్రామాలను ఖాళీ చేయించేందుకు పూను కొని పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. ముందు చెక్కులు యిస్తామని, తర్వాత బోట్లు తరలిస్తేనే ఇస్తామని చెప్పారు. మత్స్యకారులు పునరావాసం, నష్టపరిహారం గురించి తేల్చాలని డిమాండ్ చేశారు. దీనికి సమాధానంగా పోలీసులు లాఠీఛార్జీ చేయగా ప్రజలు ప్రతిఘటించారు. కాల్పులు జరిపి పోలీసులు ప్రజలను చెదరగొట్టారు.

ప్రభుత్వ నిర్బంధకాండకు వ్యతిరేకంగా మత్స్యకారుల ఐక్యవేదిక 2006 మార్చి 25న బంద్‌కు పిలుపు యిచ్చింది. ఆ రోజు ఉదయం 5 గం॥లకే గంగవరాన్ని పోలీసులు చుట్టుముట్టారు. దారులన్నీ మూసివేశారు. నాయకులను అరెస్టు చేశారు. మరి కొందరిని అరెస్టు చేయబోగా ప్రజలు అడ్డుకొని పోలీసులు వెళ్ళిపోవాలని నినాదాలు చేశారు. పోలీసులు లాఠీఛార్జీ జరిపి, అడ్డువచ్చిన వారిని చితకబాదారు. ఇళ్లల్లో దూరి చితకబాదారు. దీంతో ప్రజలు ఆత్మరక్షణ కోసం అందుబాటులో ఉన్న రాళ్ళతో ప్రతిఘటించారు. ఈ సాకుతో పోలీసులు కాల్పులు సాగించారు. 40 సంవత్సరాల నూకరాజు అక్కడికక్కడే మరణించగా, 40 మందికిపైగా గాయ పడ్డారు.

గంగవరంలో జరిగిన పోలీసు కాల్పులను రైతుకూలీసంఘం(ఆం.ప్ర) తీవ్రంగా ఖండించింది. గంగవరం, తదితర గ్రామాలను సందర్శించి వారి పోరాటానికి సంఘీభావం తెలిపింది. మృతి చెందిన గంగరాజు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి, సంతాపాన్ని తెలియచేసింది. మత్స్యకారులకు సరైన పునరావాసం, జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేసింది.

# నిన్నెవ్వరాపగలరోయ్

– దాశరధి

గుంపు గుంపులుగాను
కూలీలతోగూడి
దోపిడీలను రూపు
మాపగ వస్తుంటె
    నిన్నెవ్వరాపగలరోయ్
    రైతన్నా!
    నిన్నెవ్వరడ్డగలరోయ్
వెట్టిచాకిరి బాధ
బుట్టలో పెట్టేయ
కొడవళ్ళు చేబూని
గుంపుగా వస్తుంటే
    నిన్నెవ్వరాపగలరోయ్
    కూలన్నా
    నిన్నెవ్వరడ్డగలరోయ్
అక్రమపు పన్నులను
అణగద్రొక్కగనీవు
ఐక్యమై కోపాన
అరుదెంచుతుంటేను ॥నిన్నెవ్వ॥
    వొకిరికొకరికి కక్ష
    లెక్కించి భూముల్లు
    లాగుకొంటున్నట్టి
    దుండగీన్నెదిరించ
పోతున్న దోపిళ్ళు
పునరుద్ధరించుటకు
పోటి సంఘము పెట్టు
బూటకుల నెదిరించ ॥నిన్నెవ్వ॥
    ఘనముగా పండించి
    కరువుల్లు పోగొట్టి
    దేశమ్ము కాపాడి
    ధీమాగ పోతుంటే ॥నిన్నెవ్వ॥
స్వాతంత్ర్య సాధమ్ము
సూటిగా చేరుకొన
ఎన్ని త్యాగాలైన
ఏకమై చేస్తుంటే ॥నిన్నెవ్వ॥
    అఖిల మానవ సౌఖ్య
    మార్జించుటకు నీవు
    స్వేచ్ఛార్థులందరితో
    కలిసిపోతుంటేను ॥నిన్నెవ్వ॥

(ప్రజా ప్రచురణాలయం, హైదరాబాదు (1945) వారు ప్రచురించిన 'ప్రబోధ గేయాలు' నుండి)

---

'మెదడు పుట్టింది,
మేధస్సు వికసించడం కుట్రకాదు.
నిప్పు పుట్టింది,
ఆహారాన్ని పచనం చెయ్యడం కుట్రకాదు.
నాగలి తయారయ్యింది,
వ్యవసాయం చెయ్యడం కుట్రకాదు.
ప్రకృతిలో పరిణామం కుట్రకాదు.
ఉత్పత్తి శక్తులు, సాధనాలు,
    చైతన్యం కుట్రపన్నేందుకేనా!
అన్నంకోసం ఆలోచించడం
    అందుకోసం ప్రయత్నించడం అందుకేనా!
జీవించడం కోసం అన్యాయాన్ని ప్రశ్నించడం కుట్ర!
శ్రమించడానికి స్వేచ్ఛకావాలనడం కుట్ర!
భుక్తికోసం భూమిని కోరడం కుట్ర!
బుగతోడిని కూలి అడుక్కోవడం కుట్ర!
సావుకారిని లెక్కలడగడం కుట్ర!
నిరసించడం కుట్ర! నినదించడం కుట్ర!
ఎవరికుట్ర, శ్రమజీవులను రెచ్చగొట్టింది?!
ఏ వర్గం కుట్ర, అభాగ్యుల కళ్ళల్లో నిప్పులు పుట్టించింది?!
ఎలాంటి ప్రజాస్వామ్యాన్ని,
ఎలాంటి దుర్బలులు కుట్రతో
కూలదోయాలని ప్రయత్నించారు!?"

– ఛాయరాజ్

'శ్రీకాకుళం' ఉద్యమ కథా కావ్యం నుండి




# KUMAR GROUP OF INDUSTRIES

CHENNAI : 336/3, Thambuchetty Street, ☎ 044 - 25357697, Cell : 98407 77340

SECUNDERABAD : Shop No. 4 & 5, Hyderbasti, R.P. Road, Behind S.B.I.
☎ 040 - 27534811, Cell : 94907 59500, Complaint : 94907 59501

VISAKHAPATNAM : Opp. Hotel Prince, Ranga Street, Daba Gardens
☎ 0891 - 2738273, Cell : 94907 59511, Complaint : 94907 59512

NELLORE : Shop No. 14, J.V.R. Buildings, Subedarpet Road,
☎ 0861 - 2304109, Cell : 94409 20001

TENALI : Kumar Building, Wahab Road.
☎ 08644 - 226471, Cell : 94907 59522

**Our Educational Institutions**
**AT KOMATIPALLI (v) BOBBILI(M) Vizm Dist.**

# THANDRA PAPARAYA

**INSTUTE OF SCIENCE & TECHNOLOGY**
**COURSES:(1) E.C.E.,(2) E.E.E.,(3)C.S.E.,(4) I.T.,(5) MECHANICAL**
**PRINCIPAL: Sri G. BALAJI, M.Tech.,**

# THANDRA PAPARAYA POLYTECHNIC

**COURSES:(1) D.E.C.E.,(2) D.E.E.E.,(3)D.M.E.,(4) D.CH.E.,(5) D.C.E.,**
**PRINCIPAL: Sri C.S.RAO, B.E., Ph.D., M.I.E**

# THANDRA PAPARAYA COLLEGE OF EDUCATION

**PRINCIPAL: Sri V.SURYANARAYANA, M.A., M.A,(Edn).,M.Sc.,)Psy.).,**

# THANDRA PAPARAYA DEGREE COLLEGE

**COURSES:(1) M.P.C.,(E.M) (2) M.P.C.,(T.M)**
**PRINCIPAL: Sri, G. GOPALA KRISHNA, M.A.,**

# BHASKARA POLYTECHNIC

**COURSES:(1) D.E.C.E.,(2) D.E.E.E.,(3)D.M.E.,(4)D.Cm.E**

# BHASKARA INSTITUTE OF PHARMACY
# BHASKARA INSTITUTE OF M.C.A

**Dr.K.A.RAO,**
**B.Tech.,(Hons.) D.I.I.T., Ph.D., F.I.E.,**
**Academic Director**

**T.BHASKARA RAO, M.COM.,**
**CORRESPONDENT**

**With Best Compliments from..........**

# AVANTHI

## ENGINEERING & PHARMACY COLLEGES

VISAKHAPATNAM & HYDERABAD

**Administrative Office:**

**AVANTHI DEGREE & PG COLLEGES**

Kochuri Complex, Beside PEN School
Dabagardens,Visakhapatnam-530 020.
Ph:0891-2748231/6667320, Fax: 0891-6667321,
Cell: 9849428827

**AVANTHI INSTITUTE OF ENGG. & TECHNOLOGY**

Tamaram, Makavarapalem, Narsipatnam, (R.D.),
Visakhapatnam-531 113.
Ph:08932-222382, Fax: 08932-222453, Cell: 9866664636

**St. THERESSA INSTITUTE OF ENGG. & TECHNOLOGY**

Chepurupally, Garividi, Vizianagaram Dist, A.P.
Ph.:08952-281061, Fax: 08952-281062, Cell: 9866664634

**AVANTHI INSTITUTE OF ENGG . & TECHNOLOGY**

Gunthapally, Hayathnagar, Near Ramoji Film city,
R.R.Dist, Hyderabad, A.P.,
Ph:08415-329455, 329993, Fax: 08415-273122,
Cell: 9866664631

**AVANTHI INSTITUTE OF ENGG . & TECHNOLOGY**

Cherukupally(V), Bhogapuram(M), Near Tagarapuvalasa Bridge,
Vizianagaram Dist, Vizag, A.P.,
Telefax: 08933-226739, Cell: 9866664637

**AVANTHI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES**

Cherukupally(V), Bhogapuram(M), Near Tagarapuvalasa Bridge,
Vizianagaram Dist, Vizag, A.P.,
Telefax: 08933-226262 Cell: 9866664637

ఆంధ్రప్రదేశ్

# ఆగ్రోస్

**ప్రధాన కార్యాలయము**

504, హెర్మిటేజ్ కాంప్లెక్స్, హిల్‌ఫోర్సు రోడ్
హైద్రాబాద్-500 004, ఫోన్: 040-28891331
ఫ్యాక్స్-040-2339420

పూర్తి వివరాలకు మా ప్రాంతీయ
కార్యాలయాలను సంప్రదించండి

# రైతు సేవలో ఆగ్రోస్

**ఆగ్రో సంస్థ లక్ష్యాలు**

1. బంజరు భూములను సేద్యానికి అనువుగా మార్చేందుకు సంస్థ బుల్‌డోజర్లను సరసమైన ధరలకు, అద్దె ప్రాతిపదికన సమకూర్చటం.
2. ఆధునిక వ్యవసాయ పనిముట్లను 50 శాతం ప్రభుత్వ సబ్సిడీపై రైతులకు సరఫరా చేయటం.
3. ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు సరసమైన ధరలకు సరఫరా చేయటం
4. భూసారాన్ని పెంపొందించేందుకు 75 శాతం సబ్సిడీపై రైతులకు జిప్సమ్ సరఫరా చేయటం.

అభినందనలతో,

# ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ కమిటి

**కార్యదర్శి మరియు సిబ్బంది**
**రేపల్లె**

# Lepakshi

## Artistic Splendour of Andhra Pradesh

**Andhra Pradesh Handicrafts Development Corporation Ltd.**

**(A State Govt. Undertaking)**

**Hyderabad-India**

www.lepakshi handicrafts. gov.in    Ph: 040-2761 9560, 2761 6461

అభివృద్ధి పథంలో ఎం.నిడమానూరు (ప్రకాశంజిల్లా) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం.
లిమిటెడ్ నెం.జె-864
అధ్యక్షులు: బొమ్మిరెడ్డి లక్ష్మీనారాయణద ఉపాధ్యక్షులు: పాపినేని వెంకటనారాయణ

ది విజయ ఈదుమూడి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారా సంఘం
అధ్యక్షులు: శ్రీ బాచిన నాగేశ్వరరావు
గత 32 సంవత్సరముల నుండి అధ్యక్షులుగా సంఘమును ప్రగతి పథంలో నడిపిస్తున్నారు.

# జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం-ఆంధ్రప్రదేశ్

## అడిగిన 15 రోజుల్లో పని - పనిచేసిన 15 రోజుల్లో కూలీ చెల్లింపు

### పని పొందడం హక్కు

ఉపాధిహామీ పథకం కింద ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 100 రోజుల పని గ్యారంటీ. ఈ పథకం కింద అడిగిన 15 రోజుల్లోపే తప్పకుండా పని కల్పించబడుతుంది. పనులు మొదలయ్యే వరకు వేచి చూడకుండా, ఎప్పటి నుంచి పని కావాలో తెలియజేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ లేదా గ్రామ పంచాయతీకి కూలీలు వ్యక్తగతంగా లేదా బృందంగా దరఖాస్తు చేసుకోవాలి.

### ఉపాధి కార్డు

గ్రామపంచాయతీలో నివాసముంటూ, దరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబానికి ఉపాధికార్డు ఇవ్వబడుతుంది. ఉపాధి కార్డు ఉన్నవారికే పని కల్పించబడుతుంది. కుటుంబంలోని వయోజనులందరి పేర్లు కార్డులో నమోదై ఉండాలి.

### పనులు జరిగే చోట సౌకర్యాలు

పనులు జరిగేచోట శుభ్రమైన తాగునీరు, నీడ, ప్రాథమిక చికిత్స, చిన్నపిల్లల సంరక్షణ కోసం ఆయా మొదలైన సౌకర్యాలను పొందడం చట్టబద్ధమైన హక్కు.

### మస్టర్ రోల్

మస్టర్‌రోల్ అంటే హాజరు పట్టిక. దీన్ని వారం రోజులకొకసారి పూర్తి చేస్తారు. దీనిలో నమోదు చేసిన కూలీల హాజరు, పని కొలతల ఆధారంగా వేతనాలు చెల్లిస్తారు. కూలీలు మస్టర్‌రోల్‌ను ప్రతీరోజు తప్పకుండా చూసుకోవాలి.

### కూలీ చెల్లింపులు

కూలీలందరూ తప్పకుండా పోస్టాఫీసు/బ్యాంకులో పొదుపు ఖాతాలను తెరవాలి. కూలీలు పోస్టాఫీసు/బ్యాంకుకు తామే నేరుగా వెళ్లి వేతనాలు తీసుకోవాలి. ఖాతా పుస్తకాలు, ఉపాధికార్డులను తమ వద్దే ఉంచుకోవాలి. మధ్యవర్తులకు ఇవ్వకూడదు.

### పనుల ఎంపిక

ఉపాధిహామీ పథకం కింద గ్రామ సభ ఎంపిక చేసిన పనులనే చేపడతారు. పేద ప్రజలకు, గ్రామాభివృద్ధికి ఉపయోగ పడే పనులనే ఎంపిక చేయాలి.

**కమీషనర్**

**గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

**ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి కనీసం వంద రోజుల పని**

# Stop breeding of mosquitoes

## Keep Malaria, Dengue and Chikungunya away

## Stay healthy





- Don't let water accumulate anywhere in and around your home.
- Fill up the potholes, ditches which have accumulated water.

- Keep all water-containing vessels, tanks, tightly covered with lids.
- Release Gambusia fish into wells, ponds, large pools of water. They eat the larvae of mosquitoes.

- Remove/Destroy junk, unused materials.
- Empty and dry air coolers, drums, flower vases, plant pots, bird baths etc. every week.

- Use mosquito nets treated with insecticide while sleeping.
- Wear clothes which covers your body fully.





In case of symptoms like high fever accompanied with shivering, headache, bodyache, sweating, contact your nearest health worker/health centre immediately.

DMHO
Prakasam Dist

NATIONAL RURAL HEALTH MISSION

**Let us fight Malaria, Dengue and Chikungunya.**

Issued in public interest by National Vector Borne Disease Control Programme, Directorate General of Health Services, Ministry of Health & Family Welfare, Government of India

NVBDCP


with best compliments from
Manager and Staff
MIC ELECTRONICS
Kushaiguda, Industrial Area
Hyderabad


with best complements from
focus rock bits
Charlapalli, Industrial area
Hyderabad.

# 'పోరుదారి', ప్రజా కళా ప్రదర్శనలు













RYTHU COOLEE SANGHAM (A.P)   ANNUAL ISSUE- 2007   Rs. 30/-




"ఎవరు వేసిన ముందడుగు భాగమున
ముందుకాలము పుట్టునో
వారె ధీరులు! వారె వీరులు! వారె నిర్మాతలు

ఏరు పూసి, నారు పోసి, దమ్ముపట్టి నాట్లు వేసి
పంట భూములు పట్టుకొండన్నో
రాబోవు కాలము రైతుదేనన్నో

ఎవరి నుదిటి ముచ్చెమట ఊటన
రానున్న 'స్వర్గము' ఎగజిమ్మి పూనునో
వారె శూరులు! వారె వీరులు!
వారె ఉద్యమకారులు!"

-ఛాయరాజ్

# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)